శ్రీ శంకరభగవత్పాదుల

# ఆత్మజ్ఞానోపదేశవిధి

మాయా వివరణము * అద్దంలో నగరము

అనుకృతి

**కుప్పా వేంకట కృష్ణమూర్తి**

ఎమెస్కో

**SRI ADISANKARA'S**
**Aatmajnaanopadesavidhi, Maayaavivaranamu, Addamloo Nagaramu**
**Tr: Kuppa Venkata Krishnamurthy**

**శ్రీ శంకరభగవత్పాదుల**
**ఆత్మజ్ఞానోపదేశవిధి, మాయావివరణము, అద్దంలో నగరము**

అనుకృతి: **కుప్పా వేంకట కృష్ణమూర్తి**

సంపాదకులు: **డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ: **జూన్, 2018**

మూల్యం: రూ. **100/-**

ISBN: 978-93-86763-81-5

టైటిల్ డిజైన్ : **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్-500029, తెలంగాణ.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
**ఎమెస్కో బుక్స్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టగుంట
విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com

# రచయిత మనవి

అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రపంచపరిధిలో విస్తరింపజేసిన మహనీయులలో శ్రీశంకర భగవత్పాదుల స్థానం అద్వితీయం. వారి రచనలు ప్రాథమికంగా రెండు రకాలు. ఒకటి – పరమత ఖండన పురస్సరంగా స్వసిద్ధాంత స్థాపనపరములైన శాస్త్రగ్రంథాలు. రెండు – గురువిశ్వాససంపన్నులైన సాధకులను ఉద్దేశించి వారికి ఆచరణయోగ్యమైన సాధనమార్గాలను ఉపదేశించే ప్రబోధగ్రంథాలు. వీటికే ప్రకరణగ్రంథాలని ప్రసిద్ధి.

ఇలాంటి ప్రకరణగ్రంథాలలో "ఆత్మజ్ఞానోపదేశవిధి", "మాయా వివరణము" అనేవి గద్యాత్మకమైన అద్భుతరచనలు. వీటిలో "ఆత్మజ్ఞానోపదేశ విధి" అద్వైత సిద్ధాంతం మొత్తాన్ని మెట్లుమెట్లుగా వింగడించి, అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లుగా, వాదాడంబర రహితంగా, మనకు అందిస్తుంది. రెండవదైన మాయావివరణం, ఈ విషయాలనే ఒకింత లోతుగా చర్చిస్తుంది.

అద్వైత సిద్ధాంతంలో "మాయ" అనే అంశం చాలా కీలకమైనది. దీని మీదనే ప్రతిపక్షుల వాదావేశాలు ఎక్కువగా కేంద్రీకృతమైవుంటాయి. అలాంటి వాదార్భాటాల ప్రసక్తి లేకుండా మాయాతత్త్వాన్ని యీ గ్రంథం సాధకులకు చక్కగా వివరిస్తుంది.

ఈ రెండు గ్రంథాలనూ తెనాలి సాధనగ్రంథమండలివారు శ్రీవేటూరి శివరామశాస్త్రిగారి పాండితీభరితమైన రమ్యవివరణసమేతంగా ప్రకటించి వున్నారు. నేనిప్పుడు సమర్పిస్తున్న యీ శంకరానుకృతికి పై ప్రచురణ బాగా ఉపయోగపడింది. వారికి నేను కృతజ్ఞుడను.

ఇక శంకరుల ప్రకరణ గ్రంథాలలోని పద్య రచనలలో సర్వోన్నత స్థానాన్ని పొందినది శ్రీదక్షిణమూర్తి స్తోత్రము. దీనిమీద వందలగొద్దీ వివరణ గ్రంథాలున్నాయి. సాక్షాత్తుగా వార్తికకారులైన సురేశ్వరాచార్యులవారే దీని మీద "మానసోల్లాసము" అనే పేరుతో ఒక వార్తికగ్రంథాన్ని (శ్లోకరూప వ్యాఖ్యానాన్ని) రచించారంటే, యీ స్తోత్రమహిమకు ఇంతకన్నా వేరే కిరీటం ఏమి కావాలి?

ఈ మహనీయస్తోత్రంలోని మొదటి శ్లోకం (విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం) ఒక్కదానికి, మానసోల్లాసానుసంధాన పూర్వకమైన వివరణమే యీ సంపుటిలో మూడవదైన "అద్దంలో నగరమ"నే వ్యాసంగా రూపొందింది.

సద్గురువులయొక్క అనుగ్రహబలంచేత ఈ ప్రకరణ గ్రంథాలను గురూక్తమైన రీతిలో నాలో నేనే మననం చేసుకునే ప్రక్రియలో భాగంగా రూపొందినవే యీ చిన్ని రచనలు. కొందరు సహసాధకులు వీటిని గమనించి, ఇవి ఇతర సాధకులకు గూడా ఉపయోగపడగలవని ప్రోత్సహించటంవల్ల యీ సంకలనాన్ని ప్రకటించటానికి సాహసిస్తున్నాను.

ఈ సంకలనంలో వున్న వివరణలన్నీ గురువుల అనుగ్రహంవల్ల వికసించిన భావనాపుష్పాలు మాత్రమే. గురువుల వాక్యాలను యథాతథంగా ప్రతిబింబించగలిగానని నేను విశ్వసిస్తున్నాను. ఎక్కడైనా దోషాలు కనిపిస్తే, వాటిని పాఠకశ్రేష్ఠులు నా దృష్టికి తెస్తే, సవరించుకోగలనని మనవి.

ఓం నమో గురుభ్యో బ్రహ్మ విద్యాసంప్రదాయకర్తృభ్యః

హైద్రాబాదు — ఇట్లు

05.11.2016 — **కుప్పా వేంకట కృష్ణమూర్తి**

# విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | ఆత్మజ్ఞానోపదేశ విధి | 7 |
| 2. | మాయా వివరణము | 33 |
| 3. | అద్దంలో నగరము | 121 |
| | శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్ | 172 |
| | తోటకాష్టకమ్ | 175 |

శ్రీ శంకర భగవత్పాదుల

# ఆత్మ జ్ఞానోపదేశ విధి

## ప్రథమ ఖండము

### 1. పీఠిక

మోక్షం కావాలని కోరే వారికోసం ఆత్మజ్ఞానోపదేశాన్ని ఎలా పొందాలో ఆ విధానాన్ని వివరించబోతున్నాము.

ఐతే, ఈ జ్ఞానోపదేశం అందాలంటే, ఆ శ్రోతకు తీవ్రమైన మోక్షకాంక్ష వుండాలి, వేదంమీద, గురువుమీద అంచంచలమైన విశ్వాసం వుండాలి, వైరాగ్యం వుండాలి, ఇంద్రియ నిగ్రహం వుండాలి.

అలాంటి శ్రోత గురువుల దగ్గర ఎలాంటి ఉపదేశాన్ని పొందాలో– దాన్ని వివరిస్తున్నాము. ఆత్మలాభాన్ని మించిన (తనంటే ఏమిటో తనకు తెలియటాన్ని మించిన) లాభం వేరొకటి లేదు గనుక ముముక్షువులు దీనిని శ్రద్ధగా స్వీకరించాలి.

### 2. దేహము

ఎవరినైనా నువ్వెవ్వరివని అడిగి చూడు. నేను వెంకయ్యనీ, సుబ్బయ్యనీ అంటాడు. వెంకయ్య, సుబ్బయ్య అనేవి దేహానికి పెట్టిన పేర్లు. కాగా ప్రతివాడు నేను దేహాన్ని అనుకుంటున్నాడన్న మాట. అది నిజమా? ఆలోచిద్దాం.

1. లోకంలో చూచేవాడు, చూడబడేదానికంటే ఎప్పుడూ భిన్నంగా వుంటాడు. నువ్వొక గోడను చూస్తున్నావు. గోడ దృశ్యం, నీవు ద్రష్ట. నువ్వు గోడవు కాదు కదా! అలాగే నువ్వు దేన్ని దేన్ని చూస్తున్నావో, అదల్లా నువ్వు కాదు.

   నీవొక శబ్దం వింటున్నావు. ఆ శబ్దం నువ్వా? కాదు. నీవొక వాసన చూస్తున్నావు. ఆ వాసన నువ్వా? కాదు. ఇలాగే పంచేంద్రియాలతో ఏ వస్తువును గ్రహించినా, అది నువ్వు కాదని ఖాయంగా చెప్పవచ్చు.

ఇక నీ దేహంవంక చూసుకో, గోడలాగా చెట్టులాగా నీకది కనిపిస్తూనే వుంది గదా! నీకు కనిపించేది నువ్వు కాదు గదా! కనుక, ఈ దేహం నువ్వు కాదు.

2. మరోరకంగా కూడా చూద్దాం.

రాత్రిపూట గదిలో దీపం పెడితే వస్తువులు కనిపించాయి. అంటే ఆ దీపం ప్రకాశం. ఆ వస్తువులు ప్రకాశ్యాలు (ప్రకాశింప చేయబడేవి). దీపం వేరు, వస్తువు వేరు. అంటే ఏది ప్రకాశింప చేస్తుందో, అది ప్రకాశింప చేయబడే దానికంటే తప్పకుండా భిన్నంగా వుంటుంది.

అలాగే ఒక కట్టెకు నిప్పంటించావు. నిప్పు కట్టెను కాలుస్తోంది. ఇక్కడ నిప్పు దాహకం (కాల్చేది), కట్టె దాహ్యం(కాల్చబడేది). ఎప్పుడూ కూడా కాల్చేది వేరు, కాల్చబడేది వేరు.

ఈ సూత్రాలను నీ దేహానికి అన్వయించుకో!

నేననేవాడు జీవించి వుంటే దేహం కనిపిస్తోంది. అంటే నేననేవాడు దీపం లాగా, శరీరం వస్తువులు లాగా వున్నాయన్న మాట. అంటే నేననేది ప్రకాశం, దేహం ప్రకాశ్యం. దీపం వస్తువుకన్న వేరని చెప్పుకున్నాం కదా! అలాగే నేను అనేది దేహం కంటే వేరై తీరాలి.

3. కట్టెకు, నిప్పంటించినప్పుడు, కట్టె, నిప్పు కలిసిపోయే వున్నాయి. అయినా, కట్టె వేరు, నిప్పు వేరు అనడంలో సందేహం లేదు. అలాగే నేననేదీ, దేహము కలిసిపోయే వున్నాయి. అయినా సరే దేహం వేరు, నేను వేరు, నేననేది దేహాన్ని విడిచిపోయినపుడు ఈ దేహం కట్టె లాగా పడిపోతుంది. నేను అనేది కలిసిపోయినప్పుడు మండుతున్న కట్టె లాగా పని చేస్తోంది. అందువల్ల కూడా నేను దేహం కానేరను.

4. నేను దేహం కాదనటానికి మరో కారణం కూడా వున్నది. గాఢంగా నిద్ర పట్టింది. దాని పేరు సుషుప్తి. అప్పుడు నిన్ను పిలిస్తే పలకటం లేదు. దేహం అక్కడే వుంది. అయినా నీవక్కడ లేవు. లేవు కనుకే పలకటం లేదు. దేహం వుండి నీవక్కడలేవు గనుక, దేహం వేరు నీవు వేరు అని ఖాయం కావటం లేదా?

అలాగే మరణించినవారిని చూస్తున్నాం. శరీరం అక్కడే వుంది. దానిలోని నేను మాత్రం పోయింది. ఇక ఆ శరీరం వులకదు, పలకదు. దీన్ని బట్టి కూడా, దేహం వేరు, నేను వేరని ఖాయం అవుతోంది కదా!

పై నాల్గు అంశాలవల్ల తేలిందేమంటే, కట్టెకు నిప్పంటించినట్టుగా, ఈ దేహానికి 'నేను'ను అంటించినట్లైతే ఈ దేహం వ్యవహారాలు చేస్తుంది. నిప్పును ఆర్పివేసినట్టుగా ఈ 'నేను'ను దేహంనుంచి తొలగించివేస్తే ఈ దేహం కేవలం కట్టె లాగా స్తబ్ధుగా వుంటుంది. కనుక, ఏ విధంగా చూసినా దేహం నేను కావటానికి వీలు లేదు. అయితే, నేనెవరు?

## 3. పంచేంద్రియాలు

పై ఖండికలో దేహం నేను కాదని తెలుసుకున్నాం. అయితే నేనెవరు? దేహంకన్నా సూక్ష్మంగా పంచేంద్రియాలున్నాయి కదా! అవి నేనౌతానా? కొంచెం ఆలోచించాలి.

ఇంద్రియాలు వున్నప్పుడే మనం విషయాలను గ్రహిస్తున్నాం. ఇంద్రియాలు లేకపోతే మనకు ఏ గ్రహింపూ లేదు. అందువల్ల ఇంద్రియాలే నేను అయ్యేందుకు అవకాశం వుందనిపించవచ్చు.

కానీ, సూక్ష్మంగా చూస్తే నీవు ఇంద్రియాల ద్వారా విషయాలను గ్రహిస్తున్నావు. అంతే గాని నువ్వే ఇంద్రియానివి కాదు. ఈ విషయం బాగా తెలిసేందుకు కంటిని ఉదాహరణంగా తీసుకుందాం.

ఒక కుండ వుంది. అది నీకు కనిపించాలి అంటే ముఖ్యంగా రెండు సాధనాలుండాలి. ఒకటి వెలుతురు వుండాలి. రెండు నీకు కన్ను వుండాలి. ఈ రెండింటిలో ఏది లేకపోయినా నీకు కుండ కనిపించదు. వీటిలో వెలుతురు ఎటువంటిదో, కన్ను అటువంటిదే. నీకు సాధనమైన వస్తువు నువ్వెలా అవుతావు? కనుక కన్ను నీవు కావు. ఇలాగే చెవి, ముక్కు, నాలుక, చర్మము వీటిలో ఏదీ 'నేను' కానేరదు.

అలా అయితే మనస్సే 'నేను' అనుకోవటం బాగుంటుంది అనిపించవచ్చు. ఎందుకంటే, నిజానికి అన్ని ఇంద్రియాలను పని చేయించే ఇంద్రియం మనసే. ఈ మనస్సు ఇతర ఇంద్రియాలు పని చేస్తున్నదీ, లేనిదీ కూడా గమనిస్తూ వుంటుంది. మనస్సు దగ్గర లేకపోతే కళ్ళు తెరచివున్నా కూడా ఏదీ కనిపించదు. ఉదాహరణకు తన ప్రియురాలిని తలచుకొంటూ, ఒళ్ళు మరచిన కుర్రవాడికి, ఎదురుగా పెళ్ళి ఊరేగింపు వెళ్ళినా తెలియనే తెలియదు. కళ్ళు తెరచి వుంటాయి. మనస్సు మరో చోట లగ్నమై వున్నది. కనుక, ఇది సాధ్యమవుతోంది.

ఈ కారణాలవల్ల మనస్సు నేను కావచ్చు.

కానీ, మనస్సు పని చేస్తోందో లేదో గూడా నీకు అర్థం అవుతోంది. ఇవాళ నా మనస్సు చురుగ్గా వుందండీ, ఇవాళ నా మనస్సు సరీగా లేదండీ అని చెపుతున్నావు గదా! కనుక నీవు మనస్సును గమనిస్తున్నావు. అంటే, మనస్సు – దృశ్యం, నీవు– ద్రష్ట. దృశ్యమూ, ద్రష్ట ఒకటి కాలేరు కదా!

మరో అంశం కూడా వుంది. నీవు కుండను చూచేటప్పుడు, రెండు సాధనాలున్నాయని చెప్పుకున్నాం – వెలుతురు, కన్ను అని. ఆ రెండూ వున్నాయి. కానీ మనస్సు మరో చోట లగ్నమై వుంది. కుండ కనిపిస్తుందా? కనిపించదు. కనుక, కుండ కనిపించడంలో మనస్సు కూడా ఒక సాధనమేనన్న మాట. అలాగే శబ్దం వినటానికి వాసన చూడటానికి, వగైరాలన్నిటికీ కూడా మనస్సు ఒక సాధనమే అవుతుంది. నీకు సాధనమైనది నువ్వెలా అవుతావు?

కనుక, మనస్సు నీకు దృశ్యం. కనుక, సాధనం. కనుక, మనస్సు 'నేను' కానేరదు. పోనీ, నిశ్చయాత్మకమైన ఆలోచనలను కలిగించే బుద్ధి 'నేను' కాగలదా?

మనస్సుకీ, బుద్ధికీ వున్న భేదం స్వల్పం. అక్కడ వున్నది ఒకే ఇంద్రియం. దాని పేరు అంతఃకరణము. అది పనిచేసే విధానాన్ని బట్టి దాన్ని 4 రకాలుగా విభజించారు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అని. వీటిలో అవునని, కాదని సంకల్ప, వికల్పాలు చేసేది మనస్సు. నిశ్చయాత్మకమయిన ఆలోచనలు చేసేది బుద్ధి.

బుద్ధి కూడా నిశ్చయాలు చేస్తోందో లేదో నువ్వు గమనిస్తూనే వున్నావు. కనుక అది నీకు దృశ్యం అవుతోంది. అలాగే నిర్ణయాలు చేయటంలో బుద్ధి నీకు సాధనంగా పని చేస్తోంది. కనుక, వెలుతురు లాగానే, మనస్సు లాగానే బుద్ధి కూడా నీకు దృశ్యము, సాధనమూ కూడా అవుతోంది. అందువల్ల, బుద్ధి నేను కానేరదు. అయితే నేనెవరు?

### 4. ప్రాణము

వెనుకటి ఖండికలో దేహము, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనేవి నేను కానేరవని తెలిసింది.

అలా అయితే ప్రాణమే నేనేమో?

ప్రాణం వుంటేనే నేననే వ్యవహారం వుంది. ప్రాణం లేకపోతే లేదు. ప్రాణం వుంటేనే ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి పని చేస్తాయి. ప్రాణం లేకపోతే ఇవేవీ పనిచేయవు. కనుక, ప్రాణమే నేను కావచ్చు.

అది సరి కాదు. ఎందుకంటే గాఢనిద్ర అనగా, సుషుప్తి అవస్థను పరిశీలించి చూడు. అప్పుడు ప్రాణం వుంది. ఇంద్రియ జ్ఞానం లేదు. నేననే వ్యవహారం లేదు, ప్రాణం వుంటే ఇంద్రియాలు పనిచేస్తాయని, ఇందాక అనుకున్నాం. ఇది దానికి వ్యతిరేకం.

ప్రాణమూ, నేను ఈ రెండూ ఒక విధంగా దగ్గరవి. ఒక రాజు తన పరివారంతో కలిసి ఒక పల్లెటూరికి వెళ్ళాడనుకోండి. ఆ పల్లెవాసులకు అందరి అలంకారాలు మహారాజు అలంకారాల లాగానే కనిపిస్తాయి. వారికి రాజెవరో? మంత్రెవరో? గుర్తించడం సాధ్యం కాదు. ప్రాణమూ, నేనూల పరిస్థితి కూడా యింతే. అయితే సుషుప్తి అవస్థలో మాత్రం ప్రాణాన్ని మనం గుర్తించవచ్చు. ఎందుకంటే, మామూలప్పుడు చైతన్యము ప్రాణానిదే అని మనం పొరబడవచ్చు. కానీ, సుషుప్తిలో చైతన్యం ఏ మాత్రమూ లేని ప్రాణం మనకు దర్శనమిస్తుంది. అంటే ఈ చైతన్యం ప్రాణానికి చెందినది కాదన్న మాట.

ఇక్కడ ఒకసందేహం కలుగవచ్చు. ప్రాణంవున్నాకూడా ఇంద్రియాలు పనిచేయడం లేదు కనుక, తెలివి కలగటం లేదు. ప్రాణం చైతన్యం లేనిదాని లాగా కనిపిస్తోంది. అని అనుకోరాదా?

ఇంద్రియాలు, ప్రాణానికి చెందినవే అయితే తమ ప్రభువైన ప్రాణం ఎదురుగా వుండగా ఇంద్రియాలు పని ఎలా ఆపగలవు? రాజు పని చేస్తూ వుంటే, బంటులు విశ్రాంతి తీసుకోగలరా? కనుక ఇంద్రియాలు ప్రాణానికి సంబంధించినవే కావు. ఎవడు నిద్రతో విశ్రమించాడో వాడికి సంబంధించినవే ఇంద్రియాలు.

అలా అయితే నిద్ర యెలా కలుగుతోంది? మెలకువ యెలా వస్తోంది?

## 5. నిద్ర

ఎవడు నిద్రతో విశ్రమిస్తున్నాడో వాడే మెలకువలో, ఇంద్రియాలతో పని చేస్తున్నాడు. అంటే నిద్రపోయేవాడు, పని చేసేవాడు వేరు వేరు వ్యక్తులు కాదు. ఇది ప్రతివారికీ అనుభవంలో వున్న విషయమే. ఈ వ్యక్తిపేరే జీవాత్మ.

పూర్వకర్మ అనుభవించవలసిన కాలం వచ్చినప్పుడు మెలకువ వస్తుంది. అప్పుడు జీవాత్మకు నిద్ర తొలగి పోతుంది. అప్పుడు జీవాత్మ గుహలోనుంచి బయటకు వచ్చినట్టు అజ్ఞానంలోంచి బయటకు వచ్చి ఇంద్రియాలను అధిష్ఠిస్తాడు. అప్పుడు ఇంద్రియాలు తమ తమ విషయాలలో ప్రవర్తిస్తాయి.

కొంత సేపయ్యాక, మెలకువలో (జాగ్రత్ అవస్థలో) అనుభవించవలసిన కర్మ పూర్తి అవుతుంది. అపుడు బుద్ధియొక్క సంపర్కంవల్ల పుట్టిన విషయ విజ్ఞానాన్ని వెంటబెట్టుకొని, జీవాత్మ స్వప్నంలోకి ప్రవేశిస్తుంది. అపుడు బుద్ధి ఒకటే వుండి తనయొక్క సంస్కార బలంచేత, ఇంద్రియముల సంపర్కం లేకుండానే అది ఒక నూతన ప్రపంచాన్ని సృష్టి చేసి, సుఖదుఃఖాల ననుభవిస్తుంది.

కొంత సేపటికి స్వప్నావస్థకు కావలసిన పూర్వ కర్మ కూడా అంతరించి పోతుంది. అదీ గాక జాగ్రత్, స్వప్నాలు రెంటిలోనూ, సుఖదుఃఖాలను అనుభవించి, అనుభవించి, జీవాత్మ అలసిపోతాడు. ఈ శ్రమను పోగొట్టుకొనేందుకు జీవాత్మ సుషుప్తిలో ప్రవేశిస్తాడు. జాగ్రత్‌లో వుండగా బుద్ధి, యింద్రియాలు రెండూ పని చేస్తాయి. స్వప్నంలో వెళ్ళినప్పుడు ఇంద్రియాలు ఉపసంహారమై బుద్ధి ఒకటే పని చేస్తుంది. ఈ రెండు దశలలోనూ, జీవాత్మ బుద్ధిని ఆశ్రయించుకొని వుంటాడు గనుక, బుద్ధి పని చేస్తుంది. కనుక, నేనున్నాను అనే జ్ఞానం వుంటుంది.

సుషుప్తిలోకి వెళ్ళే సరికి ఇంద్రియాలెలాగూ వుండవు. బుద్ధి అజ్ఞానంలో మునిగిపోతుంది. బుద్ధిని అంటిపెట్టుకొని వున్న జీవాత్మ కూడా అజ్ఞానంలో తాత్కాలికంగా మునిగిపోతాడు. అందువల్ల సుషుప్తిలో వున్నప్పుడు నేను అనే స్ఫురణ వుండదు.

ఇలా కొంతసేపయ్యేసరికి మళ్ళీ జాగ్రత్ స్థితిని అనుభవింపచేసే పూర్వకర్మ తలెత్తుతుంది. దానితో అజ్ఞానంలో కూరుకుపోయి వున్న జీవాత్మ, బుద్ధితో కలిసి గుహలోంచి వచ్చినట్లు బయటకు వస్తాడు. వచ్చి ఎదురుగుండా వున్న కర్మను బట్టి స్వప్నంలోకో, మెలకువలోకో ప్రవేశిస్తాడు.

ఈ విధంగా పూర్వకర్మవల్ల, యీ మూడు అవస్థల చక్రం అంతూ పొంతూ లేకుండా, అదుపూ ఆపూ లేకుండా, తిరుగుతూనే వుంటుంది.

మొత్తంమీద యీ మూడు అవస్థల రాకపోకలు, కర్మమీద ఆధారడి వున్నాయని తేలిందన్నమాట. అయితే ప్రాణంయొక్క పాత్ర ఒకే రీతిగా వుంటుంది.

జాగ్రదవస్థలో బుద్ధి, ఇంద్రియాలు పని చేస్తాయి. స్వప్నావస్థలో బుద్ధి ఒకటే పని చేస్తుంది. సుషుప్తి అవస్థలో బుద్ధి కూడా మునిగిపోతుంది. కానీ, యీ మూడు అవస్థలలోనూ, ప్రాణం మాత్రం సమంగా పని చేస్తూనే వుంటుంది. ఎందువల్ల?

ఈ మూడు అవస్థలు కర్మవల్ల కలుగుతున్నాయని చెప్పుకొన్నాం. జాగ్రదవస్థలోని యీ శరీరం కూడా కర్మవల్లే కలిగింది. అంటే, జీవుడు కర్మఫలాన్ని అనుభవించటానికి

యీ శరీరం పుట్టింది. ఈ శరీరం నిలబడాలంటే ఊపిరి ఆడాలి. అంటే ప్రాణం పనిచేయాలి. కనుక ప్రాణం పని చేస్తుంటేనే జీవాత్మకు కర్మ ఫలానుభవం జరుగుతుంది. అందుకే ప్రాణం సుషుప్తి అవస్థలో కూడా పనిచేస్తూ వుంటుంది.

అలా ప్రాణం పని చేయకపోతే యీ శరీరం చనిపోతుంది. నిజానికి చనిపోవడ మనేది ఒక భ్రాంతే. ఆ భ్రాంతి కలుగకుండా వుండేందుకోసంగాను, ప్రాణం మూడు అవస్థలలోనూ పనిచేస్తూ వుంటుంది. ఆ విధంగా శరీరాన్ని రక్షిస్తూ వుంటుంది. ఇది ప్రాణం యొక్క ప్రభావం.

ఈ విధంగా ఇంద్రియాలతో సంబంధం లేకుండా ప్రాణం తన పని తను చేసుకుపోతోంది. కనుక ఇంద్రియాలు ప్రాణానికి సంబంధించినవి కావు. ఇంద్రియాలు నేను అనబడే జీవాత్మకు చెందినవి. అందువల్లే ప్రాణం నేను కావటానికి వీలు లేదు.

## 6. అహం స్ఫురణ

ఇక మిగిలింది 'నేను' 'నేను' అనే స్ఫురణ. దీని పేరే అహం. అదే నేనౌతానేమో?

చర్చ సూక్ష్మస్థితిలోకి వస్తోంది. ఇక్కడ రెండు నేనులు వున్నాయి. వీటిలో 'నేను' 'నేను' అని స్ఫురించే అహం పేరు అహంకారం. ఇదే అహం వృత్తి. దీనిలో ప్రతిబింబించి వున్నవాడే జీవాత్మ.

మరొక నేను వుంది. అది మొదటి నేనుకు అంతర్గతంగా వుండి, ఆ మొదటి నేనుయొక్క రాకపోకలను గమనిస్తూ వుంటుంది. అందుకే దీని పేరు సాక్షి, లేక అంతరాత్మ, లేక ప్రత్యగాత్మ.

మొదటి నేనును గమనించడ మేమిటి?

జాగ్రత్తులోనూ స్వప్నంలోనూ, నేను అనే స్ఫురణ వున్నది. సుషుప్తిలో ఆ స్ఫురణ లేదు. లేదని నీకెప్పుడు తెలిసింది? మెలకువ వచ్చాక తెలిసింది. అంటే నేను అనే స్ఫురణ వుండటాన్ని, లేకపోవటాన్ని కూడా ఎవరో ఒకరు గమనిస్తున్నారు. వారెవరు?

నిన్ను నీవే అడిగి చూడు, ఎవరు గమనిస్తున్నారు అని. ప్రతివాడు "నేను" అంటాడు. కనుక, నేను అని స్ఫురించే అహంకారంయొక్క కలిమి లేములు రెండింటినీ గమనించే నేను వేరొకటి వుందన్నమాటే గదా! దీని పేరే సాక్షి.

ఇపుడు మన చర్చంతా మొదటి నేను గురించే. అంటే అహంకారంలో వుండే నేను గురించే. అంటే నేను, నేను అని స్ఫురించే "నేను" గురించే. ఈ అహంకారం నేనౌతానా? అనేది ఇప్పటి మన ప్రశ్న.

అయ్యేందుకు అవకాశం వుంది. ఎలాగంటే యిది ప్రాణం కంటే సూక్ష్మంగా కనిపిస్తోంది. ప్రాణానికి గూడా ఆధారంగా వుంది. ప్రతివాడూ నేనని వ్యవహరిస్తున్నాడు. ఈ వ్యవహారమే అహంకారం నేనటానికి మంచి నిదర్శనం.

కానీ, దీనికి కొన్ని ప్రతిబంధకాలున్నాయి. ఈ నేనుకు రాకపోకలు వున్నాయి. జాగ్రత్ స్వప్నాలలో రాక, సుషుప్తిలో పోక వున్నాయి. రాక పోకలు గలది నువ్వు కాగలవా?

ఇంతకంటే పెద్దచిక్కు మరొకటుంది. చెట్టును, పుట్టను చూసినట్టే రాకపోకలున్న యీ నేనును నువ్వే గమనిస్తున్నావు. అంటే నీకిది దృశ్యం అయిందన్నమాట. నీకు దృశ్యం అయినది నీవు కావటానికి వీలులేదని రెండవ శీర్షికలోనే చెప్పుకున్నాం కదా!

మరో కారణంగూడా వుంది. ఈ నేనుకే సుఖ, దుఃఖాలన్నీ వున్నాయి. అంటే సుఖం వచ్చినప్పుడు నేను సుఖంగా వున్నాననీ, దుఃఖం వచ్చినప్పుడు నేను దుఃఖంగా వున్నాననీ యీ అహంకారమే భావిస్తూ వుంటుంది. ఇవన్నీ సంసార ధర్మాలు. సంసార ధర్మాలు గల యీ అహంకారం చరమమైన నేను ఎలా కాగలదు?

ఇదేమిటయ్యా? నేనని స్పష్టంగా స్ఫురిస్తుంటే దాన్ని కాదని ఇంకొక నేనుని కల్పిస్తున్నావేమిటి? – అని సందేహం కలగవచ్చు.

మొదట్లో ఈ దేహమే నేననిపించింది. తరువాత ఇంద్రియాలు నేననిపించింది. ఆ తరువాత మనస్సు, బుద్ధి నేననిపించాయి. లోక వ్యవహారంలో కూడా ఒక్కొక్క సారి దేహాన్ని నేనని వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు నేను తెల్లగా వున్నాను. ఒక్కొక్క సారి మనస్సును నేనని వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు నేను పండితుడ్ని. ఒక్కొక్క సారి ఇంద్రియాలను నేనని వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు నేను చూస్తున్నాను. ఇలా అజ్ఞులైన మనుష్యులు ఒక్కొక్క సారి ఒక్కొక్కదాన్ని నేనని వ్యవహరిస్తున్నారు. వారికలా స్ఫురిస్తున్నంత మాత్రంచేత దేహమే ఆత్మ అని గానీ, ఇంద్రియాలే ఆత్మ అని గానీ, మనస్సే ఆత్మ అని గానీ చెప్పగలమా? అవన్నీ దృశ్యాలు. కనుక అవి ఆత్మ కాలేవు అని నిర్ణయించాము.

అలాగే నేను అని స్ఫురించే అహంకారం కూడా చిట్టచివరి నేను కావటానికి వీలు లేనే లేదు.

అలాగైతే చిట్టచివరి నేను ఎవరు?

# ద్వితీయ ఖండము

## 7. పరమాత్మ

మనం చెప్పుకున్న చిట్టచివరి నేనుకు ఆత్మ అనీ, పరమాత్మ అనీ, పరబ్రహ్మము అనీ పేర్లు పెట్టుకొందాం.(పేర్లు పెట్టేపని 6వ శీర్షికలోనే చేశాం గమనించండి.)

ఇంతకూ, ఈ ఆత్మ దేహం దగ్గరనుంచీ అహంకారం దాకా, ఏదీ కావటానికి వీలులేదని తేల్చుకొన్నాం. కనుక, ఆత్మ వీటన్నింటికన్నా లోపలిదై వుండాలి. సూక్ష్మమై వుండాలి. ఆత్మ నిత్యము, నిరవయవము అయి వుండాలి. దానిలో విడదీయదగిన అవయవాలు వుండటానికి వీలు లేదు. అది నిర్గుణమూ, నిరంజనమూ కావాలి. అంటే దానికి సత్వరజస్తమో గుణాలలో ఏ గుణమూ వుండటానికి వీలులేదు. దానికి ఏదీ అంటటానికి వీలు లేదు. ఏ దోషమూ లేదన్నమాట!

శరీరాదులకు రాకపోకలున్నాయి. కదలికలున్నాయి. ఆత్మ అత్యంత సూక్ష్మమూ, సర్వవ్యాపీ కనుక, గమనాగమనాది క్రియలు (రాకపోకల వంటి క్రియలు) వుండటానికి వీలులేదు.

మనోబుద్ధులకు అహంకారము, మమకారము, కోరికలు, ద్వేషాలు, ప్రయత్నాలు వున్నాయి. ఆత్మకు ఇవేవీ వుండటానికి వీలులేదు.

మనస్సు వుండబట్టి శరీరాన్ని గుర్తిస్తున్నాం. కనుక, శరీరం స్వయంప్రకాశం కాదు. ఆత్మ వుండబట్టి మనోబుద్ధులను గుర్తిస్తున్నాం. కనుక, మనోబుద్ధులు స్వయం ప్రకాశాలు కావు. అహంకారమూ అంతే. ఇక ఆత్మయొక్క ఉనికిని దేనితో గుర్తిస్తున్నాం? ఆత్మను ప్రకాశింపచేసే మరోవస్తువు వుండే అవకాశం లేదు. కనుక ఆత్మ స్వయంప్రకాశం. అగ్నికి వేడి ఎలా స్వభావమో, సూర్యుడికి వెలుగుతో వుండటం ఎలా స్వభావమో, అలాగే ప్రకాశిస్తూ వుండటం ఆత్మకు స్వభావం.

దేహంలో పంచభూతాలు వున్నాయి. (పంచభూతాలు అంటే భూమి, నీరు, నిప్పు, వాయువు, ఆకాశం) ఆత్మలో ఇవేవీ వుండటానికి వీలు లేదు. (ఇవన్నీ దృశ్యకోటిలోకి చేరుతాయి. ఇవి వుంటే ఆత్మ కూడా దృశ్యమే అయిపోతుంది.)

శరీరానికి కాళ్ళూ చేతులూ మొదలైనవి పనిముట్లు (కరణాలు). జీవాత్మకు ఇంద్రియాలు, మనోబుద్ధులు పనిముట్లు. ఈ పనిముట్లు వుంటేనే అవి పని చేస్తాయి. కనుక అవి స్వయంప్రకాశాలు కావు. ఆత్మ స్వయంప్రకాశం (స్వయంప్రకాశం =

స్వయంగా ప్రకాశించేది) అని చెప్పుకొన్నాం కనుక, ఆత్మకు పనిముట్లు (కరణాలు) వుండే అవకాశం లేదు. అలాగే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలనే పంచప్రాణాలు కూడా ఆత్మకుండవు. వుంటే ఆత్మ స్వతంత్రం కానేరదు. పైగా ఈ ప్రాణాదులన్నీ వాయువులే. ఇవి వుంటే ఆత్మకు పంచభూతాలలో ఒకదాని సంపర్కం వున్నట్లే అవుతుంది. అది లేదని చెప్పుకున్నాం గదా.

ఇవేవీ లేవు గనుక ఆత్మకు ఆకలిదప్పులు గానీ, శోకమోహాలు గానీ, జరామరణాలు గానీ వుండవు. ఇవన్నీ ప్రాణానికో, బుద్ధికో, శరీరానికో ధర్మాలు. ఇవేవీ ఆత్మకు వుండవు.

అంతే గాక, ఆ ఆత్మ ప్రాణధారులందరి హృదయాలలోనూ వుండి, ఆ హృదయాలన్నింటినీ చూస్తూ వుండే ద్రష్టయై వుండాలి.

## 8. ఆత్మకుబుద్ధి ఆధారమా?

ఇదెలా కుదురుతుంది?

ఆత్మకు బుద్ధి ఆధారమయ్యేటట్లైతే కొన్ని చిక్కులున్నాయి. ప్రపంచంలో ఏదయినా ఒక వస్తువు మరో వస్తువుకి ఆధారమైందీ అంటే, ఆధారం పొందిన వస్తువుకి తప్పకుండా ఆద్యంతాలు వుండాలి. అంటే, అది పరిమితమూ, అవయవాలు కలదీ, కావాలి.

ఉదాహరణగా ఆకాశం తీసుకొందాం. ఆకాశానికి వేరే ఆధారం ఏదయినా వుండగలదా? ఆకాశం అనంతం. దానిలో అవయవాలు లేవు. అందుకే దానికి వేరే ఆధారం లేదు, కాలేదు. మరైతే ఆత్మ సర్వప్రాణి హృదయాలలో వుంటుందని యెలా చెప్పారు?

దానిభావం అదికాదు. ఆత్మ అనేది ప్రతిజీవికీ, బుద్ధిలో విశేషంగా ప్రతిభాసిస్తుంది. ఆ విధంగా దానికి ప్రాణుల బుద్ధులతో సంబంధం వున్నట్లు, ప్రారంభదశలో కనిపిస్తూ వుంటుంది. దాన్ని బట్టి ఆత్మ అందరి బుద్ధులలో వుంటుందని చెప్పారే తప్ప, బుద్ధి ఆత్మకు ఆధారమని భావం కాదు.

బాగుంది. మరైతే ఆత్మ బుద్ధులన్నింటినీ దర్శిస్తూ వుంటుంది, అన్నారు గదా! ఇదెలా కుదురుతుంది.?

లోకంలో ఎవడయినా ఒక పని చేస్తున్నాడంటే, ఆ పని చేసేవాడికి ఏదో ఒక రకమైన ప్రయత్నం వుండాలి. ప్రయత్నం వుండాలంటే రాగం గానీ, ద్వేషం గానీ,

వుండాలి. అవి వుండాలంటే అహంకార, మమకారాలు వుండాలి. ఆత్మకు ఇవేవీ లేవని చెప్పుకొన్నాం గదా! ఇక ఆత్మ దర్శిస్తోందని యెలా చెప్పగలరు?

మరో ప్రశ్న కూడా వుంది. చూస్తాడు అంటే ఏమిటి? చూడటం అనే క్రియకు అతడు కర్త అనే గదా! ఆత్మ గనుక అలాంటి కర్త అయ్యేటట్లైతే అన్ని బుద్ధులనూ ఒకే సారి ఎలా చూడగలుగుతాడు? ప్రపంచంలో ఏ కర్తయినా అన్ని వస్తువులనూ ఒకే సారి చూడగలగటం సంభవమా?

మరో ప్రశ్న గూడా వుంది. ఎవరైనా ఒక పని చెయ్యాలంటే, వాడికి ఆ పని చెయ్యాలనే అపేక్ష వుండాలి. ఆ పైన పని చేసేందుకు పనిముట్లు వుండాలి. ఆ పనిముట్లు రెండు రకాలు. కర్త కంటే పూర్తిగా వేరయిన పనిముట్లు కొన్ని – గొడ్డలి, కత్తి, ఇలాంటివి. వీటికి **యుతసిద్ధకరణములు** అని పేరు. కర్తలో అంతర్భాగంగా వుండే పనిముట్లు కొన్ని – చేతులు, కాళ్ళు, గోళ్ళు ఇలాంటివి. వీటికి **అయుతసిద్ధ కరణములు** అని పేరు. ఆత్మ చూచుట అనే పని చేస్తోందంటే అతనికి అపేక్ష, ఏదో ఒక రకపు పనిముట్లు వున్నాయన్న మాటే గదా! మరి ఆత్మకు అలాంటివేవీ వుండే వీలుపడదని నిర్వచనం చెప్పారు గదా! ఇదెలా కుదురుతుంది?

వేరొక ప్రశ్న గూడా వుంది. ఆత్మకు ఏదో ఒక రకమైన పనిముట్టు వుందనీ, దాని సాయంతో ఆత్మ బుద్ధులను దర్శిస్తోందనీ అనుకొందాం. ప్రపంచంలో ఎవడైనా ఒక పనిముట్టుతో పని చేస్తున్నాడంటే, వాడి పని ఆ పనిముట్టుయొక్క శక్తి ఎంతో అంతే వుంటుంది. అంటే వాడి పని పరిమితంగా వుంటుంది. కనుక, ఆత్మయొక్క దర్శనం కూడా పరిమితమే కావాలి కానీ, అన్ని బుద్ధులనూ చూడటం ఎలా సాధ్యమవుతుంది? ఒక బుద్ధి తరువాత మరో బుద్ధిని చూస్తే చూడవచ్చు. కొన్ని బుద్ధులను చూడనే లేకపోవచ్చు. కొన్ని బుద్ధులను పొరబాటుగా చూడవచ్చు. అంటే ఒకదానికి బదులు మరొకదాన్ని చూడవచ్చు. ఎందుకంటే, కరణాల (పనిముట్ల) సాయంతో చూసేవాడెవడైనా సరే, వాడి ద్రష్టృత్వం (చూసేతనం) బుద్ధితో చూడటం లాంటిదే అవుతుంది.

లేదా దీపంతో చూడటం వంటిదే అవుతుంది. దీపం రంగు బట్టి వస్తువుల రంగులు మారిపోతూ వుంటాయి. బుద్ధియొక్క స్థితిని బట్టి గ్రహించే విషయాలపై రుచులు మారిపోతూ వుంటాయి. ఆత్మయొక్క ద్రష్టృత్వం గూడా అలాంటిదే కావలసి వస్తుంది.

అంతే గాదు, ఒకడికి ఒక పనిముట్టు వుండి దాన్ని ఉపయోగిస్తున్నాడు అంటే, వాడు ఎంతో కొంత పరిణామం చెందుతున్నాడన్నమాట. ఇక్కడ ఆత్మకు గూడా ఏదో పరిణామం వుందన్న మాట. ఇది కుదురుతుందా?

ఆత్మ కొంతవరకే చూడగలదు, క్రమంగా చూడగలదు, ఒకదాని కొకటి చూడగలదు, పరిణామం పొందగలదు అనటం ఎంతమాత్రం కుదరదు. ఎందుకంటే, ఆత్మ అంటే చెప్పిన నిర్వచనంలోనే ఆత్మకు ఏ రకమైన మార్పు గానీ, సాధనాలు (పనిముట్లు) గానీ, లేవని చెప్పుకొన్నాం. ఆత్మ దీపం వంటిదీ, బుద్ధి వంటిదీ కాదని చెప్పుకొన్నాం.

## 9. అధ్యాస

ఐతే, బుద్ధికీ ఆత్మకూ చాలా పోలిక వుంది. రెండూ ఇంద్రియాల కన్నా సూక్ష్మమైనవే. రెండూ స్వచ్ఛమైనవే. (ఆత్మకు అజ్ఞానం లేదు. కనుక స్వచ్ఛమైనది. బుద్ధి ఆ ఆత్మను ప్రతిఫలించగలదు కనుక, ఇదీ స్వచ్ఛమైనదే.) రెండూ అవయవాలు లేనివే. అందుచేత ఈ రెండింటికీ చాలా పోలిక వుంది – అని భావించే అవకాశం వుంది.

కానీ భేదం కూడా వుంది.

ఆత్మ శుద్ధ స్వయంప్రకాశము. బుద్ధికి స్వయం ప్రకాశత్వం లేదు. అది స్ఫటికశిల లాగా శుద్ధమైనది. అందుచేత దీని ప్రక్కన స్వయంప్రకాశమైన ఆత్మ చేరే సరికి, ఇది తాను కూడా ప్రకాశించటం మొదలు పెడుతుంది.

దీపం ప్రక్కన స్ఫటికశిల చేరిందనుకోండి. అది మిలమిల మెరుస్తుంది. అది అలా మెరవటం కోసం దీపం ప్రత్యేకమైన కృషి చేయదు. దీప సాన్నిధ్యం మాత్రంచేత స్ఫటికం మెరుస్తుంది.

అదే విధంగా ఆత్మ తన దారిన తాను ప్రకాశిస్తూ వుంటే, దాని ప్రక్కన చేరిన బుద్ధి తానూ ప్రకాశిస్తూ వుంటుంది. దాన్ని గమనించిన అజ్ఞులు ఆత్మ, బుద్ధీ కలిశాయి అని వ్యవహరిస్తూ వుంటారు. ఇలాంటి కలయికను **ఆధ్యాసిక సంయోగము** అంటారు.

అంతే గానీ, లక్కకు చెక్కకూ సంయోగం కలిగినట్లు వీటికి కలగదు. ఎందుకంటే, లక్క చెక్క అన్నవి మూర్త ద్రవ్యాలు. అవి అంటుకొనేందుకు వీలుంది. అంటుకొంటే ఏది ఎంతవరకూ వుందో స్పష్టంగా తెలుస్తుంది. కానీ, అమూర్త ద్రవ్యాలకు ఇలాంటి కలయిక సాధ్యం కాదు.

బుద్ధి ఆత్మల విషయంలో వుండేది ఆధ్యాసిక సంయోగం. అంటే అధ్యాసవల్ల కలిగిన సంయోగమన్నమాట. అధ్యాస అంటే ఏమిటి? ఒకదాని ధర్మాన్ని మరో దానియందు వున్నట్టు భావించినట్లైతే, దాని పేరు అధ్యాస. ఇక్కడ ఆత్మ ప్రక్కన చేరి ప్రకాశిస్తున్నట్లు కనిపిస్తున్న బుద్ధి విషయంలో, ఆత్మలోని ప్రకాశ ధర్మాన్ని బుద్ధిలోనూ, బుద్ధిలోని ద్రష్టృత్వధర్మాన్ని (చూసేతనాన్ని) ఆత్మలోనూ, ఆరోపించి ఆ రెండూ సంయోగం చెందాయని అజ్ఞులు వ్యవహరిస్తున్నారు. అందుచేత దీన్ని **ఆధ్యాసిక సంయోగమని** పిలుస్తారు.

అంటే దీనివల్ల తేలిందేమంటే, ఆత్మకు సర్వబుద్ధులను చూస్తుందనే ద్రష్టృత్వం, అధ్యాసవల్ల మాత్రమే కలుగుతుంది. అంతే గాని అది సత్యం కాదు.

## 10. ఆత్మ ద్రష్ట కాగలదా?

ఈ విషయం బాగా అర్థమయ్యేటందుకు మరో కోణంనుంచీ చూద్దాము.

ఎవడైనా ఒకడు ద్రష్ట (చూసేవాడు) కావాలంటే చూడబడేది ఒకటి వుండాలి. సూర్యుడున్నాడు. ఆయన తన దోవన తాను ప్రకాశిస్తున్నాడు. ఆయన ఎదురుగా ఒక వస్తువు పెట్టాం. అప్పుడది మనకు కనిపిస్తుంది. దాంతో మన మేమంటాం? సూర్యుడు ఈ వస్తువును ప్రకాశింప చేస్తున్నాడు అంటాము. సూర్యుడికి ప్రకాశకత్వం వచ్చింది అంటాము.

ఇక్కడ ఆలోచిద్దాం. వస్తువును ప్రకాశింప చేయటంలో సూర్యుడికేదైనా ప్రయత్నం వుందా? పోని దీన్ని ప్రకాశింప చెయ్యాలనే కోరిక వుందా? ఈ వస్తువున్నది, దీన్ని ప్రకాశింప చేసే వాడిని నేను అనే అహంకారం వుందా? ఈ వస్తువున్నది. దీన్ని ప్రకాశింప చెయ్యాలి. అనే మమకారం వుందా? ఇవేవీ లేవు. ఈ అహంకార, మమకార, ఇచ్ఛా, ప్రయత్నాలేవీ లేని సూర్యుడు ఆ వస్తువును ప్రకాశింప చేయటంలో కర్త యెలా అవుతాడు?

సూర్యుడు తన దోవన తను వున్నాడు. ప్రక్కన వస్తువు చేరింది. వెంటనే అజ్ఞులు కొందరు సూర్యుడు ప్రకాశకుడయ్యాడని వ్యవహరిస్తున్నారు. అంటే ప్రక్కన వుండి ప్రకాశిస్తున్న వస్తువుని బట్టి వారు సూర్యుడికి ప్రకాశకత్వాన్ని ఆరోపిస్తున్నారన్న మాట.

సరిగా అదే విధంగా ఆత్మ విషయంలో గూడా జరుగుతోంది. ఆత్మ స్వయంప్రకాశం. గమనికే దాని స్వరూపం. (దీన్నే దృగ్రూపం అంటారు.) దానికి ఏ రకమైన మార్పులూ లేవు. అది సమస్త బుద్ధులకూ సాక్షిగా వుంటుంది. అయినా సరే ప్రక్కన బుద్ధివంటి ఒక దృశ్యం చేరే సరికి ఆత్మ ద్రష్ట అయింది అని వ్యవహరిస్తారు

అజ్ఞులు. అంటే యిది గుణ అధ్యాసవల్ల కలిగిన వ్యవహారమే అన్నమాట. అంటే, ఆత్మకు పరమార్థతః ద్రష్టృత్వం లేనే లేదన్నమాట.

మరో ఉదాహరణ గూడా తీసుకొందాము. ఒక సూదంటు రాయి వుంది. దాని ప్రక్కన పెట్టేసరికి జడమైన ఇనుపముక్క కదులుతోంది. దీన్ని కదిలించే కర్త యెవరు? సూదంటురాయే, అని అంటాము మామూలుగా. అది కర్త అయ్యేటట్లైతే, ఇనుప ముక్కను కదల్చటానికి అది ఏ ప్రయత్నం చేస్తోంది? ఏ మార్పులకు లోనవుతోంది? ఏమీ లేదే! ఏమీ లేకపోయినా సరే, దానికి కర్తృత్వాన్ని అంటగడుతున్నాం మనం.

సరీగా అలాగే ఏ రకమైన మార్పులు గానీ, విశేషణములు గానీ లేని ఆత్మకు కర్తృత్వాన్ని అంటగడుతున్నాం మనం. బుద్ధి మొదలైన సాధనాలు (కరణాలు) ఆత్మ చైతన్య సాన్నిధ్యంవల్ల తమ తమ విషయాలలో ప్రవర్తిస్తూ వుంటాయి. అది చూసి ఆత్మే ఈ కరణాలను ప్రకాశింప చేస్తోందని, ఏ వికారాలూ లేని ఆత్మకు కర్తృత్వాన్ని ఆరోపణ చేస్తున్నారు అజ్ఞులు.

అలా అయితే ఆత్మను తెలుసుకునేదెలా? లోకంలో ఏ విషయాన్నయినా బుద్ధితో తెలుసుకొంటున్నాము. కానీ, యిక్కడ ఆత్మే బుద్ధిని ప్రకాశింప చేస్తోంది. సూర్యుడివల్ల వస్తువు ప్రకాశిస్తుంది కానీ, వస్తువువల్ల సూర్యుడు ప్రకాశించడు. అలాగే బుద్ధివల్ల ఆత్మను తెలిసికోవటం సాధ్యం కాదు.

మరో కారణంచేత గూడా బుద్ధితో ఆత్మను తెలుసుకోవటం సాధ్యం కాదు.

బుద్ధి జీవాత్మకు దృశ్యమని చెప్పుకున్నాం గదా! దృశ్యమయినది ద్రష్ట కాగలదా? బుద్ధిగూడా ద్రష్టేనండీ అంటే ఆత్మ, బుద్ధీ రెండూ ద్రష్టలే అవుతాయన్నమాట. అప్పుడవి రెండుదీపాల వంటివవుతాయి. రెండుదీపాలలో ఒకటి మరొక దానికి ప్రకాశకం అవుతుందా? కాదు కదా! అందువల్ల, బుద్ధి ఆత్మకు ప్రకాశకం కానేరదు.

# తృతీయ ఖండము

## 11. జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు

8, 9,10 శీర్షికలలో మనం మన అజ్ఞానంవల్ల ఆత్మను, బుద్ధినీ కలగా పులగంగా కలిపి పారవేసుకొన్నామని తేలింది. అందువల్లనే ఆత్మనూ, బుద్ధినీ, వింగడించి, ఆత్మను స్వచ్ఛంగా దర్శించలేక పోతున్నామని అర్థమైంది.

అందుచేత ఆత్మతత్త్వాన్ని పరిశుద్ధంగా తెలుసుకొనేందుకు గాను, జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థల గురించి మరింత లోతుగా విచారించాలి. ఎందుకంటే ప్రతివాడూ నాకు నిద్రవచ్చింది, నాకు కలవచ్చింది, నాకు మెలకువవచ్చింది, అని వ్యవహరిస్తున్నాడు. దీన్ని బట్టి ఈ అవస్థలు మూడూ ఆత్మకు చెందినవేమో అనిపిస్తుంది.

అవి నిజంగా ఆత్మవే అయితే, అంటే ఆత్మకు అవి సహజం అయ్యేటట్లైతే, వాటిని ఆత్మనుండి విడదీయటం సాధ్యం కాదు. అగ్నికి వేడిమి సహజగుణం. దాన్ని అగ్నినుంచి విడదీయలేం గదా! అప్పుడు ఆత్మ శుద్ధం కాదనీ, దానికి వికారాలు వున్నాయనీ చెప్పుకోవలసి వస్తుంది.

నిజానికి ఈ మూడు అవస్థలూ బుద్ధికి చెందినవి. ఈ విషయం నిరూపణ అయితే బుద్ధితో పాటు వాటిని ప్రక్కకు తీసివేయవచ్చు. అప్పుడు ఆత్మ పరిశుద్ధమని తేలుతుంది. అందుకోసం ఆ మూడు అవస్థల గురించి మరింత లోతుగా పరిశీలిద్దాం.

ఈ అవస్థల గురించిన చర్చ కొంత వెనుకటి శీర్షికలలో వచ్చింది. అయినా అక్కడ అవస్థలను నిర్వచించి చర్చించలేదు. ఇప్పుడాపని చేద్దాము.

జాగ్రదవస్థ అంటే ఏమిటంటే కన్ను మొదలైన ఇంద్రియాలు సూర్యుడు, దీపము మొదలైనవాటి సాయంతో, తమ తమ విషయాలను గ్రహిస్తాయి. అంటే, కన్ను సూర్యుడి సహాయంతో చెట్టును, పుట్టను చూస్తుంది. ముక్కు వాయువు సహాయంతో వాసన చూస్తుంది. చెవి ఆకాశం సహాయంతో శబ్దాన్ని వింటుంది. ఇలా ఒక్కొక్క ఇంద్రియం ఏదో ఒక సహాయాన్ని పెట్టుకొని దాని విషయాన్ని గ్రహిస్తుంది. కన్ను వాసన చూడదు. శబ్దం వినదు. ఇంకేమీ చేయదు. ఒక్క రూపాన్ని చూస్తుందంతే. ఇలా ఏ ఇంద్రియమైనా తన విషయాన్ని మాత్రమే గ్రహిస్తుంది.

ఈ అవస్థలో మరో విశేషమేమంటే బుద్ధి కూడా మరో ఇంద్రియం లాగానే పనిచేస్తుంది. కన్ను రూపాన్ని గ్రహిస్తే, బుద్ధి కన్ను ద్వారా ఈ రూపాన్ని అందుకొంటుంది. ముక్కు వాసన చూస్తే, బుద్ధి ముక్కు ద్వారా ఆ వాసనను అందుకొంటుంది. ఇలాగే జ్ఞానేంద్రియాలు గ్రహించిన విషయాలను బుద్ధి తాను అందుకొంటూ వుంటుంది. నిజానికి ఈ బుద్ధి పని చేయకపోతే ఇతర ఇంద్రియాలు పనిచేసినా ప్రయోజనం వుండదు. అందువల్ల, బుద్ధి కూడా ఒక ఇంద్రియం లాగా పనిచేస్తుందని చెప్పడం జరిగింది.

కన్ను రూపాన్ని గ్రహించగలుగుతోందంటే ఒక దీపమో సూర్యుడో ఏదో ఒకటి సహాయం చేస్తుంది. ఇలాగే ఏ ఇంద్రియం పనిచేయాలన్నా ఏదో ఒక బహిరంగ

సాధనం వుంటుంది. మరి బుద్ధి ఇంద్రియం లాగా ఎలా పని చేయగలుగుతోంది? దాని విధానమేమిటి?

వెనుకటి శీర్షికలలో బుద్ధిని స్ఫటికశిలగాను, ప్రత్యగాత్మను దీపశిఖగాను పోల్చి దీపంయొక్క సన్నిధిలో స్ఫటికశిల మిలమిలలాడుతూ మెరుస్తుంది అని చెప్పుకొన్నాం. దీనినే ఆధ్యాసిక సంయోగం అంటారని కూడా చెప్పుకొన్నాం. (చూ. 9వ శీర్షిక)

1. ప్రత్యగాత్మ ప్రక్కలో వుండటంవల్ల, ఈ బుద్ధి తనే ప్రత్యగాత్మ చైతన్యం లాగా ప్రకాశిస్తుంది. అందువల్ల, ఈ బుద్ధి ద్రష్ట లాగా వ్యవహారిస్తుంది.

2. ఇంద్రియాలతో సంబంధం వుండటంవల్ల, ఈ బుద్ధి ఇంద్రియాలు తెచ్చినటువంటి విషయాలను గ్రహించి, ఆ విషయాల ఆకారాన్ని పొందుతుంది. అంటే ఒక ప్రక్క ద్రష్టగా వ్యవహరిస్తున్న బుద్ధి మరో ప్రక్క దృశ్యంగా కూడా వ్యవహరిస్తోందన్నమాట.

నిజానికి బుద్ధి జడమైనది. దానికి స్వతంత్రంగా ఇంద్రియ విషయాలను గ్రహించి, వాటి ఆకారం పొందే శక్తి లేదు. ఐనప్పటికీ దానిలో ప్రత్యగాత్మయొక్క చైతన్యం ప్రతిబింబిస్తోంది కనుక, దానికా శక్తి వచ్చింది.

ఇక్కడ మనకో సందేహం కలుగవచ్చు. బుద్ధిలో "ఆత్మ" ప్రతిఫలిస్తోంది అనక "ప్రత్యగాత్మ" అని ప్రత్యేకంగా ఎందుకు అంటున్నారు? – అని.

ఏమీ లేదు. "ఆత్మ" అంటే ఒకప్పుడు భ్రాంతివల్ల ఇంద్రియాలనో, మనస్సునో, బుద్ధినో, ప్రాణాన్నో, అహంకారాన్నో ఆత్మగా భ్రమించే అవకాశముంది. నిజానికివేవీ ఆత్మలు గావు. ఆత్మ వీటన్నిటికీ లోపల వుంటూ, వీటన్నిటికన్నా సూక్ష్మమైనది. ఆ విషయం స్పష్టంగా వుండేందుకోసమే, "ప్రత్యగాత్మ" అని ప్రత్యేకంగా చెబుతున్నాం. "ప్రత్యక్" అంటే లోలోపల వుండేది.

అనాత్మలైన బుద్ధ్యాదులయందు ఆత్మ అనే భ్రాంతి ఎందుకు కలుగుతుంది? ఈ విషయం నిజానికి వెనుకటి శీర్షికలలోనే కొంత చర్చ చేసుకొన్నాం. అయినా మరో సారి మరో రకంగా గుర్తుచేసుకొందాం.

దేహం సరిగ్గా లేకపోతే సామాన్య మానవుడు "నేను బాగాలేను" అంటాడు. "ఈ దేహం దృశ్యం కనుక, దేహాన్ని నేను అని వ్యవహరించడం యుక్తం" కాదని మనం బోధిస్తాం. దేహం కంటే సూక్ష్మమైనవి ఇంద్రియాలు. వీటి విషయంలోనూ

అతడు "ఇంద్రియాలే నేన"ని భ్రమపడతాడు. మళ్ళీ సవరణ చేస్తాం. ఇంద్రియాలకన్నా బుద్ధి, బుద్ధికన్నా అహంకారము సూక్ష్మమైనవి. ఇవన్నీ వేటికవి దృశ్యాలే అయినప్పటికీ, ఒక దానికన్నా ఒకటి సూక్ష్మమైనవి. అందుచేత ఏ స్థాయికా స్థాయిలో అవి ఆత్మలేమో అనిపిస్తాయి. ఇలా అనిపించడానికి కారణమేమిటి? అన్ని స్థాయిల్లోను ప్రత్యగాత్మతో అవి సంయోగం చెందివుండటమే కారణం. నీరు సహజంగా చల్లనిదే అయినప్పటికీ అగ్నితో సంయోగం జరిగేటప్పటికి నీటికి వెచ్చదనం వస్తుంది. అలాగే ప్రత్యగాత్మ సంయోగంవల్ల దేహేంద్రియాదులకు ఆత్మత్వం వున్నట్టు కనిపిస్తూ వుంటుంది.

నీటిపాత్ర క్రింద మంట పెడితే నీరు వెచ్చబడుతుంది. ఇది ఒక రకమైన సంయోగం. మంట మీద సరాసరి నీళ్ళు పోసేస్తే ఇదీ సంయోగమే. కానీ, యిప్పుడు మంట చల్లారి వూర్కుంటుంది. అలాగే ప్రత్యగాత్మకు ఇంద్రియాలతో సంయోగం వల్ల ప్రత్యగాత్మే జడపదార్థమైపోయే అవకాశం వుందా? ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ప్రత్యగాత్మకు, బుద్ధ్యాదులకు గల సంయోగం ఆధ్యాసిక సంయోగమని ఇదివరకే చెప్పుకున్నాం. (చూ. 9వ శీర్షిక)

ఇంతకూ చెప్ప వచ్చేదేమంటే, విషయములకంటే (శబ్ద,స్పర్శ, రూపాదుల కంటే) శరీరం లోపలిది. దానికన్నా ఇంద్రియాలు, వాటికంటే బుద్ధి, దానికంటే అహంకారము, లోపలివి. లోపలివి కనుక, ఏ స్థాయికా స్థాయిలో ఇవే ఆత్మల్లాగా కనిపిస్తూ వుంటాయి. ఇలా కనిపిస్తూ వుండటానికి కారణమేమిటంటే వీటన్నిటి లోపలా అన్నింటికన్నా సూక్ష్మమైన ప్రత్యగాత్మ వుంది. ఈ ప్రత్యగాత్మే అసలైన ఆత్మ. దానికన్నా లోపలి వస్తువు యింకేదీ లేదు. అందుచేత దీనియొక్క ఆత్మత్వం భ్రాంతి కావడానికి వీల్లేదు. అందుచేత అది పోయే అవకాశం లేదు. అంటే దాని ఆత్మత్వం నిత్యమన్న మాట. అందుకనే ఆ అసలైన ఆత్మను ప్రత్యేకంగా ప్రత్యగాత్మ అని వ్యవహరిస్తున్నాం. ఆ అర్హత దానికే వుంది.

ఇంతకూ మనమెక్కడున్నామంటే ప్రత్యగాత్మచైతన్యంయొక్క సంయోగం చేత, బుద్ధి తనే ప్రత్యగాత్మచైతన్యం లాగా ప్రకాశిస్తుంది. అలా ప్రకాశించిన బుద్ధి యిటు ద్రష్టగాను, అటు దృశ్యాకారంగాను కూడా పరిణామం చెందుతుందని చెప్పుకొన్నాం.

బుద్ధి ద్రష్ట ఎలా అవుతుందనేది స్ఫటికశిల ఉదాహరణవల్ల మనకు అర్థమయింది. మరి బుద్ధి దృశ్యాకారంగా ఎలా మారుతుంది? కన్ను మొదలైన ఇంద్రియాలు రూపము మొదలైన విషయాలను బుద్ధి దగ్గరకు తెస్తాయి. సహజంగా సూక్ష్మ స్వరూపంగల బుద్ధి ఈ విషయాల సంపర్కంలోకి వచ్చేసరికి, కరిగించిన లోహాలను మూసలో పోస్తే

ఆ లోహాలకు మూస ఆకారం ఎలా వస్తుందో అలాగే ఈ బుద్ధికి కాడా ఆ విషయాల ఆకారం వస్తుంది.

ఈ విధంగా ద్రష్టయొక్క ఆకారంగాను, దృశ్యంయొక్క ఆకారంగాను, బుద్ధి పరిణామం చెందటమే జాగ్రదవస్థ. దీనినే ఇంద్రియాలచేత విషయాలను గ్రహించడం జాగ్రదవస్థ అని ఈ శీర్షిక మొదట్లో మనం చెప్పుకున్నాం. పై చర్చవల్ల ఈ అవస్థ బుద్ధికి చెందినది అని మనకు స్పష్టంగా తెలుస్తోంది.

కానీ, బుద్ధికి వెనకాల సాక్షి ఒకటుంది. అదే ప్రత్యగాత్మ. అది బుద్ధియొక్క రెండు రకాల పరిణామాలను గమనిస్తోంది. అది కాలంవలె, ఆకాశంవలె సర్వవ్యాపియైనది. దానికి అవయవాలు లేవు. మార్పులు కూడాలేవు. అది సాక్షాత్ దృక్ స్వరూపం (చిత్ స్వరూపం). ఈ కారణాలచేత దీనికి ఏ వికారాలూ వుండే అవకాశం లేదు. కాని, అధ్యాసవల్ల బుద్ధికి వున్న జాగ్రదవస్థను ఆత్మకు ఆరోపించగా, ఆత్మకే జాగ్రదవస్థ కలిగినట్లుగా అవుతుంది. అందువల్లే మానవుడు నేను మేల్కొన్నాను, అని వ్యవహరిస్తూ వుంటాడు. (అధ్యాస అంటే ఒకదాని ధర్మాన్ని మరో దానిలో ఆరోపించడం అని 9వ శీర్షికలో చెప్పుకొన్నాం.)

## 12. స్వప్న విమర్శ

ఇప్పటి వరకు మనం బుద్ధికి జాగ్రదవస్థ కలిగే విధానాన్ని, అది ఆత్మ మీద ఆరోపణ చేయబడే విధానాన్ని కూడా పరిశీలించాం. ఈ జాగ్రదవస్థ ఎంత కాలం వుంటుంది. ఈ ప్రశ్నకు సమాధానాన్ని ఐదవ శీర్షికలోనే చెప్పుకొన్నాం. ఏమని చెప్పుకొన్నామంటే, మూడు అవస్థలు కూడా మన పూర్వకర్మకు ఫలితంగానే వస్తాయని చెప్పుకొన్నాం. అంటే జాగ్రదవస్థను పొందటానికి కావలసిన కర్మ వున్నంతవరకూ ఆ అవస్థ వుంటుంది. ఆ కర్మ తీరిపోగానే బుద్ధి వేరొక అవస్థలోకి వెళ్ళిపోతుంది.

జాగ్రదవస్థకు కారణమైన కర్మ ముగింపుకు వచ్చి, ఇక స్వప్నావస్థకు కారణమైన కర్మ తన ఫలితాలను అందించే సమయం వచ్చేసరికి, బుద్ధి జాగ్రదవస్థలో తాను చూసిన వివిధ రూపాలు గల బాహ్యవస్తువుల సంస్కారాన్ని పొంది, ఆ సంస్కార బలంవల్ల ఆయా వస్తువులు ఎదురుగుండా లేకుండానే ఆ వస్తువులు చూసే ద్రష్టగాను, అట్టి ద్రష్టచే చూడబడే వస్తువులు గాను, రెండు రకాలుగా కూడా తనే మారిపోతుంది.

ఇది సాధ్యమా?

ఒక పూలబుట్ట వుందనుకోండి. దాంట్లో ఎప్పుడూ పూలనే పెడతాము. ఈ అలవాటు సంస్కారంగా మనలో నాటుకుపోతుంది. అందుచేత ఆ బుట్టలో పూలు లేని సమయంలో కూడా పూలబుట్ట మనకు వెనువెంటనే పూలను గుర్తుచేస్తుంది. అంటే పూలు లేకపోయినా పూల సంస్కారాన్ని మనలో కల్గిస్తోందన్నమాట. ఇదే విధంగా మన బుద్ధి కూడా ఆత్మయొక్క సాన్నిధ్యంలో అవిద్యచేత, కాలంచేత, పూర్వకర్మచేత, ప్రేరేపింపబడుతుంది. అందువల్ల కేవల సంస్కార బలంవల్లే తానే వస్తువుగా (విషయంగా) భాసిస్తుంది. అంటే బుద్ధే దృశ్యంగా మారిపోతుందన్న మాట. ఇదే స్వప్నావస్థ. అంటే, ఈ అవస్థలో ఇంద్రియాలు పనిచేయకుండానే మనకు దృశ్యాలు కనిపిస్తాయన్నమాట.

ఈ బుద్ధి ప్రక్కనే ఆత్మ వుంది. ఆత్మయొక్క వెలుగు బుద్ధిలో ప్రతిఫలిస్తోంది. ఈ సన్నివేశం నిశ్చలంగా వున్న చెరువులో చంద్రుడు ప్రతిఫలించినట్లు వుంటుంది. కొంత సేపయ్యాక గాలి వచ్చి నీరు కదలి, అలలు ఏర్పడితే చూచేవారికి చెరువులో వున్న చంద్రుడే చలించి పోతున్నాడనిపిస్తుంది. అదే విధంగా ఆత్మ ప్రతిబింబించి వున్న బుద్ధిలో స్వప్నావస్థ అనే కదలిక వచ్చేసరికి ఈ అవస్థ ఆత్మకే కలిగినట్లు భ్రాంతి కల్గుతుంది. నిజానికి చంద్రునికి ఏ విధమైన కదలికలూ లేనట్లే ఆత్మకు ఏ రకమైన అవస్థలూ లేవు. బుద్ధికి కలిగిన స్వప్నావస్థను ఆత్మకే కలిగినట్లుగా మనం భ్రమిస్తున్నామన్నమాట.

ఇలా స్వప్నావస్థ ఎంతసేపు వుంటుంది? ఈ ప్రశ్నకు సమాధానం ఈ శీర్షికలోనే మనం చెప్పుకున్నాం. స్వప్నావస్థకు కావలసిన కర్మ వున్నంతవరకూ వుంటుంది. ఆ కర్మ ఐపోయేసరికి వేరొక అవస్థలోకి వెళ్ళిపోతుంది.

## 13. సుషుప్తి విమర్శ

ఇక సుషుప్తి అవస్థ రావటానికి కావలసిన కర్మ సమకూరేటప్పటికి బుద్ధి పరిస్థితి మరో రకంగా మారిపోతుంది. ఆ బుద్ధి అప్పటికే జాగ్రదవస్థలో దృశ్యాల అనుభవంవల్లా, స్వప్నావస్థలోని సంస్కారాల అనుభవంవల్లా అలిసిపోయి, ఆ రెండింటినీ వదిలిపెట్టి, అజ్ఞానంలో లయించిపోయి, తనకు వేరే రూపమే లేనట్లు అయిపోతుంది. ఇదే సుషుప్తి అవస్థ.

గమనించవలసిన విషయ మేమంటే, సుషుప్తి అవస్థలో బుద్ధి తనకు వేరే రూపమే లేనిదాని లాగా అయిపోతుందే తప్ప, నిజంగా దాని రూపం అంతరించిపోదు. అప్పుడు బుద్ధియొక్క పరిస్థితి ఎలా వుంటుందంటే, మఱ్ఱివిత్తులో మఱ్ఱిచెట్టు లాగా

అణిగిపోయివుండి, బయటకు ప్రకటన కాకుండా వుంటుంది. అలా విత్తులా అణిగి వుంటుంది కనుకే మళ్లీ కొంత సేపయినాక స్వప్నాన్ని తెచ్చే కర్మ గానీ, జాగ్రత్తును తెచ్చే కర్మగానీ, మొలకెత్తినప్పుడు ఆ బుద్ధి నిద్రనుంచి లేచి స్వప్నాన్ని గానీ, జాగ్రత్తును గానీ, పొందుతోంది.

సుషుప్తి అవస్థలో బుద్ధి అజ్ఞానంలో మునిగిపోయింది కనుక, దానిలో ప్రతిబింబించే ఆత్మ చైతన్యం కూడా అజ్ఞానంలోనే మునిగిపోతుంది, గమనించండి. ప్రతిబింబం మునిగిపోతుందే కానీ, అసలైన ప్రత్యగాత్మ మునగదు. ఐనప్పటికీ ఆత్మ ప్రతిబింబం మునిగిపోవటంవల్ల, బుద్ధికి చెందిన సుషుప్తి అవస్థను ఆత్మకే అంటగట్టి, ఆత్మకే సుషుప్తి అవస్థ కలిగిందని లోకులు వ్యవహరిస్తూ వుంటారు. ఇదే అధ్యాస.

ఈ విధంగా 11,12,13 శీర్షికలలో చేసిన చర్చలవల్ల జాగ్రత్, స్వప్న, సుషుప్తులు అనే మూడు అవస్థలూ బుద్ధికే సంబంధించినవి అని స్పష్టంగా తెలుతోంది.

## చతుర్ధ ఖండము

### 14. తురీయవిమర్శ

దీన్ని బట్టి ఆత్మ అనే పదార్థానికి, ఈ మూడు అవస్థలూ ఏ మాత్రం అంటవనీ, అందువల్లే ఈ అవస్థలకు కారణమైన కర్మ గానీ, దానికి కారణమైన కామం గానీ, దానికి కారణమైన అవిద్య గానీ, ఆత్మకు ఏ మాత్రం అంటవనీ, ఖాయంగా చెప్పవచ్చు. కాగా, ఆత్మ నీటివలె స్వచ్ఛమైనవాడు. తనలో తానే వుండేవాడు – అని మనం గ్రహించవచ్చు. అంతే కాక అతడు జ్ఞానమే స్వరూపంగా గలవాడని కూడా చెప్పవచ్చు.

అంటే ఆత్మకు ఏ రకమైన వికారాలు (మార్పులు) వుండే అవకాశం లేదన్నమాట. సరీగా ఈ కారణంవల్లే అవస్థాత్రయం ఆత్మను అంటలేక పోతోంది.

అయితే మన అనుభవంలో మనం ఎల్లప్పుడూ ఈ మూడు అవస్థల్లోనూ ఏదో ఒక అవస్థలో వున్నట్టే మనకు కనిపిస్తోంది. ఈ కనిపించటం భ్రాంతివల్ల అని మనకు నిరూపణ అయింది. కనుక సాధకుడైనవాడు యీ మూడు అవస్థలనూ వదిలిపెట్టి, ఆత్మ నాలుగవది (తురీయము) అని గ్రహించాలి.

వదలిపెట్టడం అంటే ఏమిటి?

తాడును చూసి కనుచీకటిలో పామని భ్రాంతి పడతాం. అంటే తాడులో పాముని ఆరోపించామన్నమాట. ఈ ఆరోపణ ఎప్పుడు పోతుంది? వెలుగులో తాడును చూస్తే

ఆరోపించిన పాము దానంతటదే పోతుంది. అలాగే బుద్ధికి చెందిన అవస్థాత్రయాన్ని ఆత్మలో ఆరోపించాం మనం. తాను సాక్షిగా జాగ్రత్, స్వప్న, సుషుప్తులను మూడిటినీ చూస్తున్నానని గ్రహిస్తే ఆత్మలో ఆ మూడిటి ఆరోపణ దానంతటదే పోతుంది. అలా సాక్షిగా చూడటమే వాటిని వదిలిపెట్టటం. అలా వదిలేసిన పరిస్థితిలో ఆత్మ స్వచ్ఛంగా వుంటుంది. కనుక, ఆ స్థితిని నాలుగవ స్థితియని (తురీయమని) వ్యవహరిస్తున్నారు.

ఇది వ్యవహారమే తప్ప ప్రత్యేక అవస్థ కాదు. ఆ స్థితిలో బంగారుముద్ద మొత్తంలో బంగారమే వున్నట్టు, ఆత్మ మొత్తంలో ఆత్మే (అంటే ఎరుకే) వుంటుంది. ఈ స్థితిని **విజ్ఞాన ఘనత్వం** అంటారు.

ముద్దబంగారంలో బయటా బంగారమే, లోపలా బంగారమే, అంతటా బంగారమే. అలాగే పరిశుద్ధ చైతన్యస్వరూపియైన ఆత్మలో లోపలా చైతన్యమే, బయటా చైతన్యమే, అంతటా చైతన్యమే. అలాంటి చైతన్యం ప్రక్కన వుండేసరికి, బుద్ధిలో మూడు అవస్థలు కలుగుతున్నాయి. అవి కలుగుతున్నాయి కనుక, మార్పు లేకుండా వున్న ఆత్మ వాటికి సాక్షిగా వుంది అని మనం వ్యవహరిస్తున్నాం. అంతే గాని వాటికి సాక్షిగా వుండటం కోసం ఆత్మ ఏ మార్పునూ పొందటం లేదు. ఏ పనీ చేయటం లేదు. అందుచేత నాలుగవది అనబడే ఈ సాక్షిత్వావస్థ ప్రత్యేకావస్థ కాదు.

ఒక వేళ సాక్షిత్వం అనేది వేరొక అవస్థ అని ఎవరైనా అనేటట్లైతే దానివల్ల పెద్ద చిక్కు వచ్చిపడుతుంది. ఏమంటే, మూడు అవస్థల తరువాత నాలుగో అవస్థ వుందనే సరికి, ఆత్మయొక్క స్వరూపమేమిటో, తెలుసుకోవటం సాధ్యం కాదు అని చెప్పినట్లవుతుంది. ఎందుకంటే, ఈ నాలుగవస్థలకీ సాక్షిగా వేరొక ఆత్మ వుందని అంగీకరించవలసి వస్తుంది. అప్పుడు అలా ఒప్పుకుంటే దాని వెనకాల అయిదో అవస్థ, ఆరో అవస్థ, ఇలా అనంతంగా వచ్చిపడతాయి. చివరికి దీనివల్ల ఆత్మ అనేది శూన్యమే అని చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇందాకటినుంచి మనం చేసిన చర్చలో, బుద్ధికి చెందిన అవస్థలను ఆత్మమీద ఆరోపణ చేస్తున్నామని చెప్పుకున్నాం. అసలు ఆత్మే శూన్యమైనప్పుడు దాని మీద ఆరోపణ ఎలా కుదురుతుంది?

ఎందుకంటే, అసలు తాడనేది ఒకటి వుంటే ఒక దాని మీద పామునో, పూలమాలనో, జలధారనో ఏదో ఒక దానిని ఆరోపించటం కుదురుతుంది. అసలు తాడే లేకపోతే ఆరోపణే సాధ్యం కాదు కదా! కాగా ఆత్మ శూన్యం అనుకుంటే, దానిమీద చేసే ఆరోపణలన్నీ శూన్యమే కావలసి వస్తాయి. అలా అనటం సహేతుకం కాదు.

ఈ చిక్కంతా తురీయమనేది వేరొక అవస్థ అనుకోవటం బట్టి వచ్చింది. కనుక అది వేరొక అవస్థ అనుకోవటం పొరపాటు. కాగా తేలిందేమంటే జాగ్రత్, స్వప్న, సుషుప్తులు గాక నాల్గవ అవస్థ అనేది లేదు. ఈ మూడు అవస్థలలోనూ ఎడతెరిపి లేకుండా (అనుగతంగా, అనుస్యూతంగా) వుండేది ఆత్మ. అదే సాక్షి. వ్యవహారంలో తేడా తెలియటం కోసం, దీనినే తురీయమని (నాల్గవది అని) వ్యవహరిస్తూ వుంటారు, అంతే.

## 15. ఆత్మకు మార్పులు లేవు

11వ శీర్షిక ప్రారంభించేటప్పుడు ఆత్మతత్త్వాన్ని పరిశుద్ధంగా తెలుసుకొనేందుకు గాను జాగ్రత్, స్వప్న, సుషుప్తుల గురించి లోతుగా విచారించాలి అని మొదలు పెట్టాం. 11 నుంచీ 14 దాకా శీర్షికలలో ఆ విచారణ చేశాం. ఇంతకూ వీటికీ ఆత్మతత్త్వానికీ గల సంబంధం ఏమిటి?

ఏమిటా? ఈ మూడు అవస్థలనేవి వుండబట్టి, మనకు ఆత్మ పరిశుద్ధం అని తెలుసుకొనే అవకాశం ఏర్పడుతోంది.

ఎలాగంటే,

జాగ్రదవస్థ వున్నప్పుడు స్వప్న సుషుప్తులు లేవు. స్వప్నావస్థ వున్నప్పుడు జాగ్రత్ సుషుప్తులు లేవు. సుషుప్తి అవస్థ వున్నప్పుడు జాగ్రత్ స్వప్నాలు లేవు. కనుక యీ అవస్థలు మూడిటిలోనూ ఏదీ నిత్యమైనది కాదు.

కానీ, ఈ మూడు అవస్థలనూ ఆత్మ (నేను) చూస్తూ వుంటుంది. అంటే, జాగ్రదవస్థలోనూ ఆత్మ వుంది. స్వప్నావస్థలోనూ ఆత్మ వుంది. సుషుప్త్యవస్థలోనూ ఆత్మ వుంది. దీనిని బట్టి ఆత్మకు ఏ మార్పూ లేదనీ (అనగా ఆత్మ నిర్వికారమనీ), ఆత్మ నిత్యమనీ, నిశ్చయమవుతోంది.

ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు.

జాగ్రత్తులో నేనున్నానని తెలుస్తూనే వుంది. స్వప్నావస్థలోనూ నేనున్నానని తెలుస్తూనే వుంది. కాని సుషుప్తి అవస్థలో అలా తెలియటం లేదు. కనుక ఆ గాఢనిద్రలో నేను లేనని నిశ్చయం అవుతోంది గదా! అలాంటప్పుడు ఆత్మ మూడవస్థల్లోనూ మార్పు లేకుండా వుంది– అని చెప్పటం ఎలా కుదురుతుంది? – అని.

ఇక్కడ చాలా జాగ్రత్తగా పరిశీలించాలి.

కలలు లేని గాఢనిద్ర పోయి లేచిన ప్రతివాడూ, "నేను సుఖంగా నిద్రపోయాను. నాకేమీ తెలియలేదు", అని అంటున్నాడు. అంటే "ఆ సుషుప్తి సమయంలో దృశ్యపదార్థాల జ్ఞానం ఏదీ నాకు లేదు" అని చెపుతున్నాడు.

గమనించండి, దృశ్యపదార్థాల జ్ఞానం లేదంటున్నాడే గానీ, అసలు జ్ఞానమే లేదనటం లేదు. "నాకేమీ తెలియలేదు". అనే తెలియకపోవటాన్ని వాడు గ్రహిస్తున్నాడు. వాడా సమయంలో అక్కడ వుంటే గదా అలా గ్రహించగలిగేది! అంటే ఏ తెలివి జాగ్రత్ స్వప్నాలలో వుందో, అదే తెలివి సుషుప్తిలో గూడా వుందన్నమాట! వుండి ఏమీ తెలియకపోవటాన్ని గ్రహిస్తున్నదన్న మాట!

కాబట్టి ఒకే తెలివి (అదే ఆత్మ) ఏ మార్పులూ లేకుండా, మూడు అవస్థలలోనూ అంటిపెట్టుకొని వున్నది అని నిశ్చయంగా చెప్పవచ్చు. కనుక, ఆత్మ నిత్యమనీ, నిర్వికారమనీ ఖాయం!

ఈ విధంగా ఈ మూడు అవస్థలవల్ల ఆత్మ పరిశుద్ధమనీ, నిర్వికారమనీ, నిత్యమనీ, మనకు అర్థం అవుతోంది. ఈ జ్ఞానం కలిగేందుకోసమే పరమేశ్వరుడు మనకు యీ మూడు అవస్థలను యేర్పరచాడు.

## 16. ముక్తి

జాగ్రత్ స్వప్న సుషుప్తులనే మూడు అవస్థలను పరమేశ్వరుడు మనకు యేర్పాటు చేయటంవల్ల మనకు రెండు విషయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి.

1. ఆ మూడవస్థలలో యే ఒకటీ నిత్యమైనది కాదు.
2. ఏ నేను నిద్రించానో, ఆ నేనే కల కన్నాను. ఆ నేనే మేల్కొన్నాను. ఆ మూడవస్థలలోనూ అంటిపెట్టుకొని వున్నవాణ్ణి నేనొక్కడినే – అని.

ఇక్కడ ఒక ప్రశ్న పుడుతుంది–

నేనొక్కడినే అనే విషయం ఎవరు చెబితే తెలుస్తోంది?– అని.

"ఎవరూ చెప్పనక్కర లేదు. ఆ కలగన్నవాడినీ నేనే. ఆ నిద్రించినవాడినీ నేనే. ఆ మెలకువ పొందినవాడినీ నేనే, అనే స్మృతి నా అంతట నాకే కలుగుతోంది"– అని దీనికి సమాధానం.

"సామాన్యంగా ఏదయినా విషయం తెలియాలంటే ఒక ప్రమాణం వుండాలి కదా!" అని మళ్ళీ ప్రశ్న.

ఇక్కడ ప్రమాణం గురించి జాగ్రత్తగా చర్చించుకోవాలి మనం.

ఏ వస్తువు నిత్యం కాదో, ఏ వస్తువు సర్వవ్యాపి కాదో, అలాంటి వస్తువును తెలిసికోవటానికి ఏదైనా ప్రమాణం కావాలి. ఉదాహరణకు, ఒక కొండ వుందనుకోండి. అది నిత్యం కాదు. సర్వవ్యాపి కాదు. దాన్ని తెలుసుకోవాలంటే కన్ను అనే ప్రమాణం వుండాలి. ఇది ప్రత్యక్ష ప్రమాణం. ఆ కొండమీద పొగ వస్తోంది. ఎందుకు పొగ వస్తోందో తెలియాలంటే, ఊహాశక్తి కావాలి. అక్కడ నిప్పు వుండి వుంటుంది. అందుకే పొగ వస్తోంది. అని వూహిస్తాం. ఇది అనుమాన ప్రమాణం. స్వర్గాన్ని గురించో, నరకాన్ని గురించో తెలియాలంటే వేదప్రమాణం కావాలి. ఇలా ప్రమాణాపేక్ష వున్న వస్తువులన్నీ అనిత్యాలే. పరిచ్ఛిన్నాలే (పరిమితాలే).

కానీ, నేను (ఆత్మ) అలాంటిది కాదు. అది మూడవస్థల్లోనూ సమంగా వ్యాపించి వుంది కనుక, అది నిత్యమూ, సర్వవ్యాపీ కూడా. అందుచేతనే అది స్వతస్సిద్ధము. స్వతస్సిద్ధంగా వున్నదానికి ఇక వేరే ప్రమాణం కావాలా? అక్కర లేదు.

ఆత్మను తెలుసుకోవటానికి వేరే ప్రమాణం కావాలని పట్టుబడితే మరో చిక్కు కూడా వచ్చిపడుతుంది. ఏమంటారా? వినండి–

కొండను కన్ను అనే ప్రమాణం ద్వారా గ్రహిస్తున్నాడు. అంటే కన్నును సాధనంగా ఉపయోగించి లోపలున్న వాడొకడు ఈ కొండను గ్రహిస్తున్నాడు. అలాగే ఊహను ప్రమాణంగా ఉపయోగించి లోపల వున్నవాడు నిప్పును గ్రహిస్తున్నాడు. అలాగే వేదాన్ని ప్రమాణంగా ఉపయోగించి స్వర్గాదుల్ని గ్రహిస్తున్నాడు. అంటే ఒక ప్రమాణం వుందంటే, దాన్ని ఉపయోగించే కర్త ఒకడు వుండాలన్న మాటే కదా! ఆ కర్త గ్రహింపబడే విషయం కంటే భిన్నుడని గూడా ఖాయమే కదా! (ఎందుకంటే కన్నును ఉపయోగించుకొనే కర్త కొండ అయ్యే అవకాశం లేదు కదా!) కొండ గ్రహింపబడే విషయం. దాన్ని కన్ను ద్వారా గ్రహించేది నేను. నేను కొండకన్నా భిన్నుడిననటంలో సందేహం లేదు కదా.

ఇప్పుడు ఆత్మను గ్రహించటానికి వేరే ప్రమాణం ఒకటి వుందను కుంటున్నాం. అంటే ఆ ప్రమాణాన్ని ఉపయోగించే కర్త ఒకడు వుండాలి. వాడు ఆత్మకన్న భిన్నుడయి వుండాలి. ఇదెలా కుదురుతుంది? అన్ని ప్రమాణాలనూ ఎవడు ఉపయోగించు కుంటాడో వాడే ఆత్మ! వాడికంటే భిన్నంగా మరో కర్త ఎక్కడినుంచి వస్తాడు? ఇది అసంభవం. కనుక ఆత్మను గ్రహింటానికి వేరే ప్రమాణం అవసరమయ్యే అవకాశం లేనే లేదు.

ఇక్కడ సాంప్రదాయికులైనవారు మరో ప్రశ్న లేవనెత్తవచ్చు.

“అయ్యా! తక్కిన ప్రమాణాలను కొట్టివేస్తే కొట్టివేశారు. వేదం ఆత్మజ్ఞానం విషయంలో ప్రమాణం కాదంటే ఎలా కుదురుతుంది? వేదంవల్లా, వేదంలోని ఉపనిషత్తులవల్ల గదా మనకి ఆత్మ అనేదాన్ని గురించి తెలుస్తోంది”- అని.

ఇలా ప్రశ్నించేవారు ఒక విషయాన్ని మరిచిపోతున్నారు. నేనున్నాననీ, నేను మూడు అవస్థలలోనూ సమంగా అంటి పెట్టుకొని వున్నాననీ, పామరుడికి కూడా తెలుస్తోంది. అంతే కాని, వేదం చదువుకొన్నవారికి మాత్రమే తెలియటం లేదు. అందుచేత నేను వున్నానని తెలియటంలో వేదం ప్రమాణం కాదు.

మరయితే వేదం ఏమి చేస్తున్నది? - అంటే, ప్రతివాడూ శుద్ధమైన ఆత్మనూ, బుద్ధినీ కలగాపులగం చేసికొని ఆయా అవస్థలలో వున్న సుఖదుఃఖాలకు ఆత్మను ముడి పెట్టుకొని అగచాట్లు పడుతున్నాడు. అలాంటి సమయంలో వేదం పరబ్రహ్మను గురించి వర్ణించి చెప్పి, ఆత్మ లక్షణాలను అనాత్మ లక్షణాలనూ వివరించి చెప్పి, మూడవస్థలలోనూ అంటి పెట్టుకొని వున్న నేను (ఆత్మ), ఆ పరబ్రహ్మమే అని బోధిస్తోంది. ఈ నీవునే సంస్కృతంలో “త్వం” అంటారు. ఆ పరబ్రహ్మను వేదం “తత్” అని వ్యవహరించింది. ఆ రెండూ ఒకటే “తత్+త్వం+అసి = తత్త్వమసి” అని వేదం బోధిస్తోంది. ఈ బోధ కలిగించటంలో వేదం ప్రమాణం. అంతే గాని, మూడు అవస్థలలోనూ వున్న ఆత్మ స్వయంసాక్షి, స్వతస్సిద్ధము, అని తెలపటంలో వేదం ప్రమాణం కానేరదు.

కనుక తేలిందేమంటే, మూడవస్థలలోనూ అంటిపెట్టుకొని వున్నది నేనొక్కడినే అనే విషయం ప్రతివాడికీ తనంతట తనుగానే తెలుస్తోంది. (ఏ ప్రమాణమూ అక్కర లేదు).

మూడవస్థల్లోనూ నేనున్నాను గనుక, ఈ అవస్థలు వస్తూ పోతూ వున్నాయి గనుక, నేను ఈ అవస్థలకంటే భిన్నుడిని. వాటి రాకపోకలను నేను తెలుసుకొంటున్నాను గనుక నేను నిత్యుణ్ణి. ఈ అవస్థలు మూడూ పూర్వకర్మవల్ల, (అనగా పూర్వం చేసిన పుణ్యపాపాలవల్ల) వస్తాయి అని చెప్పుకొన్నాం. కాగా నేనా అవస్థల కంటే భిన్నుణ్ని. కనుక, ఈ పుణ్యపాపాలు నాకెంత మాత్రమూ అంటవు. కనుక నేను శుద్ధుణ్ణి. నేను నిరంతరం మూడవస్థల రాకపోకలను తెలుసుకుంటూ వున్నాను గనుక, నేను జడాన్ని కాదు. అంటే నేను బుద్ధుణ్ణి. నాకు, పుణ్యపాపాలకు, సంబంధం లేదు. కనుక, నాకు అవిద్యగాని, కామము గాని, కర్మ గాని, వుండే

అవకాశం లేదు. కనుక, నేను ముక్తుణ్ణి. మూడు అవస్థలూ వస్తూపోతూ వున్నా, నేను ఒకే ప్రకాశంగా వుండిపోతున్నాను. కనుక, నేను అవిక్రియుణ్ణి. మూడవస్థల్లోనూ ఏ సమయంలోనూ కూడా నాయొక్క చూపు (జ్ఞాన స్వభావం) లోపించటం లేదు. కనుక నేను అపరిలుప్త దృక్కును. మూడవస్థల్లోనూ వున్నవాణ్ణి నేనొక్కడినే కనుక, నేను అద్వితీయుణ్ణి.

మూడు అవస్థలనూ విశ్లేషించడంవల్ల మనకు పై విషయాలు ఒకదాని వెంబడి ఒకటి అవగాహనకు వస్తాయి. ఈ విషయాన్నే మరో రూపంలో పెడితే ఆత్మయొక్క నిత్యత్వము, శుద్ధత్వము, బుద్ధత్వము, ముక్తత్వము, అవిక్రియత్వము, అపరిలుప్త దృక్ స్వరూపత్వము, ఏకత్వము మనకు అవగతమైనాయన్న మాట.

ఇది ఈ విశ్లేషణవల్ల కలిగిన జ్ఞానం.

ఇది అనుభవానికి రావాలి. రావాలంటే సద్గురువు అనుగ్రహం వుండాలి. అది వుంటే అజ్ఞానమనే నిద్ర దానంతటదే తొలగిపోయి, ఇంతవరకూ మనం చెప్పుకున్న విధంగా మన మనస్సు విశ్లేషణ మార్గంలో ప్రవర్తించి, శ్రుతి సమ్మతమైన తర్కాన్ని అనుసరించి ముందుకు సాగి, మనలో స్వయంగా ప్రతిభాసిస్తున్న ఆత్మ తత్త్వాన్ని స్వానుభవంలో అందుకో గలుగుతాము.

ఈ స్థితి వచ్చినవాడే ముక్తుడు. ఈ స్థితి వచ్చిందనటానికి ఎవడి అనుభవం వాడికి ప్రమాణం. అంతే కాని నీకు ముక్తి వచ్చిందని మరొకరు చెబితే అది ప్రమాణం కాదు.

గురువు అనుగ్రహంవల్ల అజ్ఞానం తొలగి, ఆత్మానుభవం కలిగినవాడు ఇక జననమరణ చక్రంలో పడడు.

మన ఈ చర్చంతా "నేనెవరు?" అనే ప్రశ్నతో ప్రారంభమైంది. ఇన్ని శీర్షికలలో ఆ ప్రశ్నకు విపులమైన సమాధానం లభించింది. ఈ సమాధానం అనుభవంలోకి రావటమే ముక్తి అని కూడా మనకు ఇప్పుడు అర్థమైంది.

## శ్రీ శంకర భగవత్పాదుల

# మాయావివరణము

## ప్రథమ వర్ణకము

### 1. పీఠిక

మనం ఇప్పటివరకూ అధ్యయనం చేసిన 'ఆత్మజ్ఞానోపదేశ విధి"లో 'నేనెవరు' అనే ప్రశ్నకు సమాధానం కోసం అన్వేషణ జరిగింది. పారిభాషిక పదాలను వీలైనంతవరకు పరిహరిస్తూ, కేవలం తార్కికమైన మెట్లమీద జరిగిన ఆ అన్వేషణలో, ఆ ప్రశ్నకు తృప్తికరమైన సమాధానం దొరకటం మాత్రమే కాక, ఆ సమాధానంవల్ల సాధకుడికి కలిగే మహత్తర ఫలితం గురించి కూడా మనకు అవగాహన లభించింది.

నిజానికి సమస్త వేదాంతశాస్త్ర గ్రంథాలకు యిదే సారం. సారం ఇదే అయినా, విషయం మనకు తెలిసినట్లే వున్నా, యిది మనసుకు పట్టటం మాత్రం అంత సులభం కాదు. అందుకు దీర్ఘకాల నిరంతర మననం అనే అభ్యాసం జరగాలి. దీనికి తోడు గురుదైవతకృప చిత్తశుద్ధిని కలిగించాలి.

ఇందులో మనన భాగానికి ఉపకరించేందుకే, వివిధ వేదాంత గ్రంథాలు విభిన్న విభిన్న దృక్కోణాలనుంచీ, యిదే విషయాన్ని మరింత పటిష్ఠంగా మనకు అందించినాయి. ఏ మూలనుంచీ కూడా ఏ సందేహమూ దగ్గరకు రావటానికి తావు లేని విధంగా, విషయాన్ని బిగించి మనకు అందించాయి. ఈ గ్రంథాలు అర్థం కావాలీ అంటే, మనకు ఎంతో కొంత వేదాంత పారిభాషిక పదజ్ఞానం కూడా వుండాలి. తప్పదు.

ఇపుడీ మాయా వివరణ గ్రంథంద్వారా అలాంటి పారిభాషిక పరిజ్ఞానంతోపాటు తత్త్వ చర్చను పునర్మననం చేసుకొనే ప్రయత్నం చేద్దాము.

పురుషార్థాలు నాలుగు. అవే ధర్మ– అర్థ– కామ– మోక్షాలు. వీటిలో మొదటి మూడూ అనిత్యాలే. మోక్షం ఒక్కటే నిత్యం. ఈ విషయాన్ని శ్రుతేస్వయంగా చెపుతోంది.

మోక్షం విషయంలో శ్రుతి **"న చ పునరావర్తతే"** (మోక్షాన్ని పొందిన వాడు మళ్ళీ వెనక్కి తిరిగిరాడు) అని చెప్పి, మిగిలిన మూడు పురుషార్థాల విషయంలో– **"తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే ఏవమేవాముత్ర పుణ్యచితో లోకః క్షీయతే"** (వ్యవసాయం వంటి కర్మలు చేసి సంపాదించుకున్న ధాన్యాది సంపదలు ఎలా తరిగిపోతాయో, అలాగే యజ్ఞయాగాది పుణ్యకర్మల ద్వారా సంపాదించుకున్న స్వర్గాది లోకాలుగూడా తరిగిపోతాయి.) – అని చెప్పింది. మరి మోక్షమంటే ఏమిటి?

వెనుకటి గ్రంథంలో 'నేను' అనే పదానికి సారంగా పిండిన అర్థం ఏది వుందో దానినే 'ఆత్మ' అనీ, 'పరమాత్మ' అనీ, 'బ్రహ్మ' అనీ, 'పరబ్రహ్మ' అనీ, శాస్త్రాలలో వ్యవహరిస్తారు. నేనెవరో స్పష్టంగా తెలుసుకొని, నేను కానిదానిని సంపూర్ణంగా వదిలిపెట్టి, నేనుకానివాటివల్ల (అనాత్మ పదార్థాలవల్ల) కలిగే బంధాలను పూర్తిగా తొలగించుకోవటం పేరే మోక్షం. కాగా, మోక్షమనేది నేనెవరో తెలుసుకోవటమనే జ్ఞానం మీదే ఆధారపడి వుంటుందని వేరుగా చెప్పనక్కర లేదు. కనుకనే, బ్రహ్మజ్ఞానంవల్లనే మోక్షం సిద్ధిస్తుంది అని శాస్త్రాలు చెపుతున్నాయి. వేదాలలో కూడా యీ విషయం అనేక చోట్ల వుంది. ఉదాహరణకు **'బ్రహ్మవిదాప్నోతిపరం'** అని, తైత్తిరీయోపనిషత్తు చెపుతోంది. అనగా, బ్రహ్మను తెలుసుకొన్నవాడే ఉత్తమమైన మోక్షాన్ని పొందుతాడు అని భావం. అలాగే మరొక శ్రుతి **"తమేవ విదిత్వా అతి మృత్యుమేతి నాన్యః పంథా విద్యతే ఉయనాయ"** (ఆ పరమాత్మను తెలుసుకున్నవాడు మాత్రమే మృత్యువును దాటి మోక్షాన్ని పొందుతున్నాడు. మోక్షానికి దాన్ని మించి మరో మార్గం లేదు) అని చెప్పింది.

ఈ బ్రహ్మజ్ఞానం గురించే ఆత్మ జ్ఞానోపదేశవిధి గ్రంథంలో మనం చర్చించుకున్నాం. కానీ, ఇది మనసుకు పట్టాలి కదా! దానికి ఉపాయమేమిటి? **'అధ్యారోప అపవాదాభ్యాం జ్ఞాతవ్యః తత్త్వ నిర్ణయః'** అని పెద్దల నిశ్చయం. అంటే అధ్యారోప అపవాదములు అనే విధానంలో తత్త్వనిర్ణయాన్ని బాగా తెలుసుకోవచ్చు అని. శ్రుతిగూడా **"న కర్మణా న ప్రజయా న త్యాగేన ధనేన వా"** (యజ్ఞయాగాది కర్మలవల్లగాని, ఉత్తమ సంతానంవల్లగానీ, దానాలవల్లగానీ, ధన సంపాదనవల్లగానీ, మోక్షం లభించదు) అని స్పష్టంగా చెప్పివుంది. కనుక అధ్యారోప అపవాదములంటే ఏమిటో, తెలుసుకొందాం.

## 2. అధ్యారోపము

ఎండలో దూరంగా ధగధగలాడిపోతున్న ఆలిచిప్పను చూచి వెండి అని భ్రమపడతాము. అలాగే మసక చీకటిలో తాడు ముక్కను చూచి పాము అని వణికిపోతాము. ఎడారులలో ఎండమావులను చూచి, దాహంతో బాటసారులు వాటికోసం పరుగులు తీయటం మనకు తెలుసు. చీకటిలో మోడై వున్న చెట్టును చూచి ఎవడో దొంగ అనుకొని కేకలు వేస్తారు కొందరు. ఇలా ఎందుకు జరుగుతోంది? అక్కడ వున్నది ఆలిచిప్ప అని తెలియక భ్రాంతికి లోనై మనం దానిమీద వెండిని ఆరోపిస్తున్నాం. అలాగే వున్నది తాడుముక్క అని గ్రహించలేక దానిమీద పామును ఆరోపిస్తున్నాం. ఎడారులలో గాలిపొరల మీద నీటిని ఆరోపిస్తున్నాం. మోడు చెట్టు మీద మనిషిని ఆరోపిస్తున్నాం. అసలు వస్తువు ఏదో తెలియక పోవటంవల్ల ఈ ఆరోపణం జరుగుతోంది. అంతే గాని, వెండికీ ఆలిచిప్పకు గానీ, పాముకూ తాడుకు గానీ, నీటికీ గాలికి గానీ, మనిషికీ మొద్దుకు గానీ, నిజమైన సంబంధమేమీ లేదు.

ఇదే విధంగా ప్రపంచంతో ఏ రకమైన సంబంధమూ లేని శుద్ధమైన ఆత్మ మీద, మనం ఈ ప్రపంచాన్ని ఆరోపిస్తున్నాం. వెనుకటి ఉదాహరణలలో ఆరోపానికి కారణం అజ్ఞానమే అని చెప్పుకొన్నాం కదా! ఇక్కడ కూడా ప్రపంచ ఆరోపానికి కారణం అసలు వస్తువు ఏమిటో తెలియక పోవటమే. సామాన్యభాషలో చెప్పుకోవాలంటే, అజ్ఞానం. దీనినే శాస్త్రాలలో అవిద్య, తమస్సు, మోహము, మూలప్రకృతి, ప్రధానము, గుణసామ్యము, అవ్యక్తము, మాయ, బీజశక్తి, మొదలైన ఇంకా ఎన్నో పేర్లతో వ్యవహరిస్తారు. ఒక్కొక్క పేరుకీ ఒక్కొక్క ప్రయోజనం వుంది. అదేమిటో క్రమంగా మన శీర్షికలలో వస్తుంది.

తాడును చూచి పామని భ్రమించినప్పుడు, తాడు పాముకు అధిష్ఠానమని, వ్యవహరిస్తారు. అధిష్ఠానమంటే ఆధారము అని తాత్పర్యమన్న మాట. అంటే అధిష్ఠానమైన తాడుయొక్క సరియైన స్వరూపము తెలియక పోవటమువల్ల, దానిమీద పామును ఆరోపణ చేశామన్న మాట. ఏదో కారణంచేత అధిష్ఠానమైన తాడుయొక్క, అధిష్ఠానమైన ఆలిచిప్పయొక్క, అధిష్ఠానమైన తుమ్మ మొద్దుయొక్క, సత్య జ్ఞానము మనకు కలిగినప్పుడు భ్రాంతివల్ల వాటి మీద వచ్చిన ఆరోపాలు వాటంతటవే ఎగిరిపోతాయి. అంటే, యిది తాడని తెలిస్తే ఇక దాన్ని పాము అనుకోము. ఇది ఆలిచిప్ప అని తెలిస్తే, ఇక దాన్ని వెండి అనుకోము. అంటే ఆ జ్ఞానం కలిగాక తాడుకు భిన్నంగా వేరే పాము, ఆలిచిప్పకు భిన్నంగా వేరే వెండి, లేవన్నమాట.

అలాగే ఈ ప్రపంచానికి అధిష్ఠానం బ్రహ్మ. వెనుకటి ఉదాహరణలలో తాడు, మొదలైనవి కంటికి కనిపిస్తాయి. ఈ బ్రహ్మ అలా కనపడదు. అయినా కూడా అధిష్ఠానమైన ఈ బ్రహ్మయొక్క జ్ఞానము మనకు కలిగినప్పుడు, దీని మీద ఆరోపింపబడిన ప్రపంచం దానంతటదే ఎగిరిపోతుంది. అంటే, బ్రహ్మ కంటే భిన్నంగా ప్రపంచం లేదని తెలుస్తుంది.

ఇంతకూ ఈ అధ్యారోపానికి మూలకారణం అజ్ఞానమే అని చెప్పుకున్నాం. కదా! దీన్ని గురించి మరింత వివేచన చేసుకొందాం.

## 3. మూల ప్రకృతి

అధ్యారోపానికి మూలకారణం అజ్ఞానమని చెప్పుకొన్నాం. ఈ అజ్ఞానానికే చాలా పేర్లు వున్నాయని కూడా చెప్పుకొన్నాం. దీనికి మూలప్రకృతి అనే పేరు ఎందుకు వచ్చిందంటే సృష్టికి మూలభూతమైన గుణాలు మూడు వున్నాయి. అవే సత్త్వము, రజస్సు, తమస్సు.

వీటిలో సత్త్వగుణము స్ఫటికము వలె స్వచ్ఛమైనది. సుఖము, శాంతి, జ్ఞానము దీని లక్షణాలు.

రంజింప జేయటం రజోగుణానికి ప్రధాన లక్షణం. ఈ లక్షణంవల్ల ఇది కామ, క్రోధ, తృష్ణా, ఆసంగాలను కలిగిస్తుంది. ఈ గుణం విషయాభిలాషను పెంచి, ఫలాపేక్ష కలిగించి, దానికొరకై నానా కర్మలను చేయిస్తుంది.

మనసును ఆవరించటం తమోగుణానికి ప్రధాన లక్షణం. ఇది వివేకాన్ని కప్పివేసి, సమయానికి అవివేకాన్ని కలిగించి, చేయవలసిన పని చేయకుండా చేస్తుంది. (దీనినే **ప్రమాదము** అంటారు). అలాగే అశ్రద్ధను గానీ, నిరుత్సాహాన్ని గానీ, కలిగించి పనులను వాయిదా వేయిస్తుంది. (దీనినే ఆలస్యము అంటారు). ఒకప్పుడు చేయవలసిన పనులను పూర్తిగా మరపున పడవేస్తుంది. (దీనినే నిద్ర అంటారు).

సత్త్వగుణం ప్రబలంగా వుంటే దుఃఖించటానికి కావలసిన కారణాలు వున్నా సుఖంగానే వుంటాడు మనిషి. రజోగుణం ప్రబలంగా వుంటే సుఖంగా విశ్రాంతిగా కూర్చునే అవకాశం వున్నా, ఏదో పని పెట్టుకుని పరుగులు తీస్తాడు మనిషి. తమోగుణం ప్రబలంగా వుంటే కర్తవ్యాన్ని పూర్తిగా విస్మరించి యుక్తాయుక్త వివేకం నశించి స్తబ్ధంగా పడి వుంటాడు.

సామాన్యంగా మానవులకు ఈ గుణాలు ఎప్పుడూ సమస్థితిలో వుండవు. వీటియొక్క పాళ్లలో తేడావల్లే మనుష్యుల స్వభావాలలో అనంతానంత భేదాలు ఏర్పడుతున్నాయి. రజస్తమోగుణాలను మించి సత్త్వగుణం ప్రబలంగా వుంటే, ఆ మనిషికి సుఖం ఎక్కువగా వుంటుంది. సత్త్వ తమోగుణాలకు మించి రజోగుణం ప్రబలంగా వుంటే, ఆ మనిషి నిరంతర క్రియాశీలిగా వుంటాడు. సత్త్వరజోగుణాలను మించి తమోగుణం ప్రబలంగా వుంటే, ఆ మనిషి కర్తవ్యాలను విస్మరిస్తాడు.

ఒకే మనిషిలో గూడా ఎల్లవేళలా ఒకే గుణం ప్రబలంగా వుండదు. ఏ గుణం ఏ సమయంలో ప్రబలంగా వుంటే ఆ సమయానికి ఆ గుణం ప్రకారంగా మనిషి ప్రవర్తిస్తాడు.

మనిషిలోని పంచజ్ఞానేంద్రియాలు, మనసు స్పష్టంగా వున్నట్లైతే, అతడిలో ఆ సమయంలో సత్త్వగుణం బాగా పని చేస్తోందని గ్రహించాలి.

కలిగిన లాభాలతో తృప్తిపడక ఇంకా కావాలని కోరుకుంటూ (దీని పేరే లోభము), ఎప్పుడు చూసినా ఏదో ప్రయత్నం చేస్తూ, ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రణాళికలను ప్రారంభిస్తూ, ఒకదాని మీద మరొకటిగా పనులను పెంచుకొంటూ, కనిపించినవన్నీ తమకే కావాలని కోరుకొంటూ, శాంతి లేకుండా వుండే గుణం రజోగుణం ప్రబలంగా వున్నప్పుడు కలుగుతుంది.

తన కర్తవ్యం ఏమిటా అని నిర్ణయించుకోవలసిన సమయానికి, వున్న వివేకము కూడా అడుగంటడం, ఒక వేళ వివేకంతో సరియైన నిర్ణయం చేసినా దానిని అమలులో పెట్టకపోవటం, అమలు పెడదామనుకుంటూనే మరచిపోవటం (దీని పేరు ప్రమాదం), తమ కర్తవ్యమేమిటో ఎంత సేపటికీ తెలుసుకోలేక పోవటం, ఇలాంటివన్నీ తమోగుణము ప్రబలంగా వున్నప్పుడు మనిషికి సంభవిస్తాయి.

మానవులే గాక సృష్టిలోని ప్రతి అణువు, ఈ త్రిగుణాల విషమమేళనం వల్లనే (అంటే ఎగుడు దిగుడుగా కలవడంవల్లనే) ఏర్పడుతోంది. కాగా, మనం అజ్ఞానం అని చెప్పుకొన్న దానిలో ఈ సత్త్వ రజ స్తమో గుణాలు మూడూ మూడు పేటలుగా పెనవేసుకొని వున్నాయన్నమాట. ప్రకృతికి మూలమైన మూడు గుణాలూ కలిసి దీనిలో వున్నాయి గనుకనే, దీనికి **మూలప్రకృతి** అని పేరు వచ్చింది.

శాస్త్ర సంప్రదాయంలో సత్త్వగుణానిది తెలుపురంగని, రజోగుణానిది ఎరుపురంగని, తమోగుణానిది నలుపురంగని వ్యవహారముంది. అందుచేత మూడు రంగుల దారాలు కలిపి పేనిన తాడు వంటిదే మూలప్రకృతి అని శాస్త్రాలు వర్ణించినాయి.

## 4. ప్రళయము – మహాసుషుప్తి

ఈ మూల ప్రకృతికే ప్రళయమని, మహాసుషుప్తి అని పేర్లు వున్నాయి. ఈ పేర్లు ఏలా వచ్చాయో తెలియాలంటే సృష్టి ఏర్పడిన విధానం తెలియాలి.

సృష్టి, స్థితి, లయము అనేవి బండిచక్రపు పళ్ళు లాగా నిరంతరం పైకి క్రిందికి తిరుగుతూ వుంటాయి. ఇప్పుడు మనమంతా స్థితిలో వున్నాము. కొంత కాలం ఈ స్థితి జరిగినాక ఈ జీవులందరూ, ప్రళయంలోకి వెళ్ళిపోతారు. అప్పుడు వారితో పాటు వారి కర్మ వాసనలు కూడా ప్రళయంలోకి వెళ్ళిపోతాయి. కంసాలివాడు నగిషీపని చేసేటపుడు క్రింద ఒక పెద్దకాగితము పరుచుకొని, ఆకురాయి పట్టుకొని నగిషీ చేస్తాడు. అప్పుడు చుట్టూతా చాలా రజను రాలుతుంది. క్రింద కాగితం మీద బంగారురజను అక్కడక్కడా తళతళా మెరుస్తూనే వుంటుంది. కానీ, ఏ ఒక్కదాన్ని పట్టుకుందామన్నా చేతికి దొరకదు. అపుడు కంసాలి ఒక మైనపు ముద్ద తెచ్చి ఆ కాగితంమీద దొర్లిస్తాడు. అపుడు రజనంతా మైనపు ముద్దలోకి వెళ్ళిపోయి ఎక్కడా తళుక్కున మెరుపే కనిపించదు. కానీ, ఆ ముద్దలో బంగారు రజనంతా చేరనే చేరింది. దానిని జాగ్రత్తగా కరగబెడితే బంగారమంతా ఒక చోటికి చేరి కంసాలికి దక్కుతుంది. అలాగే నానావిధాలైన కర్మవాసనలతోను, కర్మ ఫలాలతోను చిత్రవిచిత్రంగా వ్యవహరిస్తూ వున్న జీవులందరినీ, మూలప్రకృతి అనే మైనపు ముద్దలోకి ఆకర్షించివేసినపుడు ప్రళయం ఏర్పడుతుంది. అపుడు జీవులు గానీ, వారియొక్క కర్మవాసనలుగానీ, ఎవరికీ స్పష్టంగా కనిపించవు. కానీ, మళ్ళీ సృష్టి కాలం వచ్చేసరికి ఈ మూలప్రకృతి అనే మైనపు ముద్ద కరిగిపోయి, దానిలోంచి బైటపడ్డ బంగారు రేణువులు లాగా, జీవులందరూ తమ తమ కర్మవాసనలతో మళ్ళీ మిలమిల మెరుస్తారు. ఇలా ప్రళయాన్ని కలిగించేందుకు హేతువౌతోంది కనుక, ఈ మూలప్రకృతికి ప్రళయమనే పేరు వచ్చింది.

మైనపు ముద్దలో బంగారు రేణువులు లాగా జీవులు అణిగిపోయి వున్న స్థితికి, అనునిత్యము మనము అనుభవించే సుషుప్తి స్థితికి, మంచి పోలిక వున్నది. జాగ్రత్ స్వప్నావస్థలలో ప్రతివాడికి వాడియొక్క కర్మఫల అనుభవం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా జాగ్రత్‌లో కొంతకాలం, స్వప్నంలో కొంతకాలం గడిచినాక సుషుప్తి అనే స్థితి వస్తోంది. ఈ స్థితిలో జీవుడికి తనను గురించిన ఏ రకమైన జ్ఞానమూ వుండటం లేదు. ప్రపంచంయొక్క జ్ఞానం గూడా వుండటం లేదు. సుషుప్తినుంచి బయటకు వచ్చినాక మాత్రం, సుషుప్తి సమయంలో తాను వున్నా, సుఖంగా వున్నానని, స్మృతి

కలుగుతోంది. ప్రపంచముయొక్క స్మృతి మాత్రం ఏమీ కలగటం లేదు. కాగా, మన సుషుప్తి సమయంలో మనము, మన ప్రపంచము కూడా మైనపుముద్దలోని బంగారు రేణువు లాగా, అవ్యక్తంగా అణిగిపోయి వున్నామన్నమాట. కాగా మన సుషుప్తి ఒక చిన్న సైజు ప్రళయమని చెప్పవచ్చు. కాగా, పెద్ద ప్రళయాన్ని ఒక మహాసుషుప్తి అని చెప్పవచ్చు. ఇట్టి మహాసుషుప్తిని మూలప్రకృతి కలిగిస్తోంది కనుక, ఆ మూల ప్రకృతినే మహాసుషుప్తి అని కూడా పిలుస్తారు.

ఈ విధంగా లయకాలంలో మూలప్రకృతి చేసే పనిని బట్టి మూలప్రకృతికి ప్రళయమని, మహాసుషుప్తి అనీ పేర్లు వచ్చినాయి.

## 5. ఈశ్వరుడు

ఇక సృష్టికాలం వచ్చేసరికి ఈ మూలప్రకృతి మూడు రకాలుగా మారిపోతుంది. సృష్టికాలం వచ్చేసరికి జీవుల కర్మలు పరిపక్వమై కర్మ ఫలాలను జీవులకు అందించేందుకు ఉద్యుక్తం అవుతాయి. ఈ దశలో శుద్ధసత్త్వప్రధానమైన మూలప్రకృతికి మాయ అనీ, రజోగుణ ప్రధానమైన మూలప్రకృతికి అవిద్య అనీ, తమోగుణ ప్రధానమైన మూలప్రకృతికి తామసి అనీ, వ్యవహారమేర్పడుతుంది.

వీటిలో శుద్ధసత్త్వ ప్రధానమైన మాయలో సృష్టికి పూర్వమున్న బ్రహ్మ చైతన్యం ప్రతిఫలించి, ఈశ్వరుడనే జీవుడు ఏర్పడతాడు. ఈ ఈశ్వరుడికే అవ్యాకృతుడనీ, అంతర్యామి అనీ, శబల బ్రహ్మ అనీ, సగుణబ్రహ్మ అనీ, మాయా శబల బ్రహ్మ అనీ, హిరణ్యగర్భుడనీ, ఇంకా చాలా పేర్లు వున్నాయి. ఇతడే జగత్ సృష్టికర్త.

తనే ఒక జీవుడైన ఈ మాయా శబల బ్రహ్మ (ఈశ్వరుడు), సృష్టి ఏలా చేయగలుగుతున్నాడు? ఈతడు తాను శుద్ధసత్త్వ స్వరూపుడు కనుక, తనయొక్క పరిపూర్ణ బ్రహ్మ స్వరూపంతో తామసి అనే పేరు గలిగిన తమోగుణ ప్రధానమైన మూలప్రకృతితో సంబంధం పొంది, దానికి ఫలితంగా, ఈ ప్రపంచానికి తనే ఉపాదాన కారణము, నిమిత్త కారణము కూడా అవుతున్నాడు.

ఉపాదాన కారణమంటే ఏమిటి? నిమిత్త కారణమంటే ఏమిటి? ఒక కుండ తయారయిందంటే ముందు మట్టి కావాలి. తరువాత మట్టి ముద్దను కుండగా మార్చే కుమ్మరి కావాలి. కనుక, మట్టిముద్ద, కుమ్మరివాడు రెండూ కుండకు కారణాలే. మట్టిముద్ద కుండగా మారినాక, కుండలో ఏ మూల చూచినా మట్టి కనిపిస్తుంది. అంటే మట్టికంటే భిన్నంగా కుండలో వేరే అంశం లేనే లేదు. ఇలాంటి కారణాన్ని

ఉపాదాన కారణమంటారు. మట్టిముద్దకు ఆకార విశేషంచేత కుండ అనే వ్యవహారాన్ని కల్పించిన కుమ్మరిని నిమిత్త కారణమంటారు.

జగత్ సృష్టి విషయంలో మాత్రం ఈశ్వరుడు తానే ఉపాదాన కారణము, తానే నిమిత్త కారణము కూడా అవుతున్నాడు. ఇదెలా కుదురుతుంది?

ఒక సాలీడు పెద్ద సాలెగూడు అల్లింది. మరి కుమ్మరివాడు మట్టి తెచ్చినట్లుగా సాలీడు వేరే ఎక్కడినుంచైనా దారాలు తెచ్చి గూడు అల్లిందా? అల్లలేదు కదా! అందుచేత సాలెగూడుకు సాలీడే ఉపాదాన కారణం. కానీ, సాలెగూడులో ప్రతిమూలా తన స్వరూపంతో సాలీడు కనిపిస్తోందా? కనిపించటం లేదు. కనుక అది సాలెగూడుకు నిమిత్త కారణం. అంటే, సాలీడులో వుండే ఉపాధికి (అనగా శరీర భాగానికి) ప్రాధాన్యమిస్తే, సాలీడు ఉపాదాన కారణమవుతుంది. అలా గాక, సాలీడును ఒక వ్యక్తిగా తీసుకొని సాలెగూడుకు ఈ వ్యక్తి కర్త అని భావించేట్లైతే స్వప్రాధాన్యంచేత సాలీడే నిమిత్త కారణం అవుతుంది.

ఇదే విధంగా ప్రపంచానికి ఈశ్వరుడు ఉపాధి ప్రాధాన్యంచేత ఉపాదాన కారణము, స్వప్రాధాన్యంచేత నిమిత్తకారణము కూడా అవుతున్నాడు. ఎందుకంటే, మనం ఇది వరలో చెప్పుకున్నట్టుగా త్రాడు మీద పామనే భ్రాంతి కలిగినట్టుగా బ్రహ్మ మీద ప్రపంచమనే భ్రాంతి ఏర్పడగా, జగత్ సృష్టి ఏర్పడుతోంది. దీనినే సాంకేతికంగా చెప్పాలంటే, జగత్తుకు బ్రహ్మ అధిష్ఠానం కనుక, ఇంకా బాగా చెప్పాలంటే, ప్రపంచాకారంగా కనిపించే మాయకు బ్రహ్మ అధిష్ఠానం కనుక, మాయాశబలబ్రహ్మ జగత్తుకు ఉపాధి ప్రాధాన్యంచేత ఉపాదాన కారణ మవుతున్నాడు. మాయా శబలబ్రహ్మను వ్యక్తిగా స్వీకరించి జగత్ సృష్టికి కర్తగా భావించినప్పుడు, అతడు స్వప్రాధాన్యంచేత నిమిత్త కారణమవుతున్నాడు.

కాగా, మాయ అని, అవిద్య అని, తామసి అని, వేరు వేరు వస్తువులు కావు. మూలప్రకృతికే సత్త్వ గుణ ప్రధానంగా వున్నప్పుడు మాయ అని పేరు. రజోగుణ ప్రధానంగా వున్నపుడు అవిద్య అని పేరు. తమోగుణ ప్రధానంగా వున్నప్పుడు తామసి అని పేరు. అలాగే శుద్ధబ్రహ్మకే అతడు మాయలో ప్రతిబింబించినపుడు ఈశ్వరుడని పేరు. తామసిలో ప్రతిబింబించినపుడు జగత్ అని పేరు. అవిద్యలో ప్రతిబింబించినపుడు జీవుడని పేరు. ప్రతిబింబరూపుడైన ఈశ్వరుడు జగత్తును ఏ విధానంతో సృష్టించాడు? ఈ అంశాన్ని ఇక గమనిద్దాం.

## 6. కారణ ప్రపంచ సృష్టి

స్థూల సృష్టి, సూక్ష్మ సృష్టి, కారణ సృష్టి అని సృష్టి మూడు రకాలు. ప్రత్యక్షంగా కనిపించేది స్థూలసృష్టి, దానికి కారణమైనది సూక్ష్మ సృష్టి. దానికి కారణమైనది కారణసృష్టి. కనుక సృష్టిక్రమంలో ముందుగా కారణ సృష్టిని పరిచయం చేసికొందాము.

రజోగుణ ప్రధానంగా వున్న మూలప్రకృతికి అవిద్య అని పేరు అని చెప్పుకున్నాం కదా! ఈ అవిద్య అనంత విధాలుగా వుంటుంది. అందుచేత దీనిలో ప్రతిబింబించిన చైతన్య రూపాలు కూడా అనంత విధాలుగా వుంటాయి. వీరే జీవులు. కాగా, శుద్ధసత్త్వ ప్రధానమైన మూలప్రకృతిలో ప్రతిబింబించిన చైతన్యం ఈశ్వరుడవుతున్నాడు. రజోగుణ ప్రధానమైన మూలప్రకృతిలో ప్రతిబింబించిన చైతన్యం జీవుడవుతున్నాడన్నమాట. కాగా, ఈ జీవులకు వ్యష్టి రూపమైన అవిద్య కారణ శరీరమవుతుంది. అందుకే, జీవులు తమ కారణశరీరమైన వ్యష్టి అవిద్యలో వుంటే, అది వారికి సుషుప్తి అవస్థ అవుతున్నది. అలాగే, ఈశ్వరుడు తన కారణ శరీరమైన మూలప్రకృతిలో (సమష్టి అవిద్యలో) వుంటే, అది ఆయనకు సుషుప్తి అవస్థ అవుతుంది. జీవులకు గాని, ఈశ్వరునకు గాని, తమ తమ కారణ శరీరములకే ఆనందమయ కోశములని వ్యవహారము. వీటికే కారణ ప్రపంచసృష్టి అని వ్యవహారము. ఇక సూక్ష్మ సృష్టిని పరిశీలిద్దాం.

## 7. సూక్ష్మ ప్రపంచ సృష్టి:

ఈశ్వరునియొక్క సంకల్ప బలంచేత తమోగుణ ప్రధానమైన మూలప్రకృతి ఆవరణ శక్తిగానూ, విక్షేప శక్తిగానూ ఏర్పడింది. వున్న వస్తువును ఆవరించివేసి కనిపించకుండా చేసేది ఆవరణశక్తి. అలా ఆవరించిన తరువాత దాని స్థానంలో లేని మరొక వస్తువుని ఆరోపించి, వున్నట్టుగా భాసింపజేసేది విక్షేపశక్తి. ఒక ఉదాహరణ చెప్పుకుందాం. మసకచీకటిలో తాడును చూసి పామను కొన్నప్పుడు, తాడును తాడుగా చూడనీయకుండా చేసేది ఆవరణ శక్తి. తాడు స్థానంలో పామును కనిపింపచేసేది విక్షేపశక్తి.

ఈ విక్షేప శక్తియే మొదట సూక్ష్మాకాశంగా మారింది. సూక్ష్మాకాశంనుంచి సూక్ష్మవాయువు, సూక్ష్మవాయువునుండి సూక్ష్మఅగ్ని, సూక్ష్మఅగ్నినుండి సూక్ష్మజలము, సూక్ష్మజలమునుండి సూక్ష్మభూమి, ఉద్భవించాయి. వీటికే సూక్ష్మభూతములనీ, అపంచీకృత భూతములనీ, తన్మాత్రలనీ, భూతతన్మాత్రలనీ, పేర్లు. ఇవన్నీ కూడా

మూలప్రకృతినుంచే వచ్చాయి. కనుక, ఆ మూలప్రకృతిలో వున్న త్రిగుణాలు వీటిలో గూడా సంక్రమించి వుండనే వుంటాయి.

ఈ సూక్ష్మ పంచభూతాలయొక్క సత్త్వగుణాంశాలవల్ల పంచేంద్రియాలు ఉద్భవించినాయి.

| | | |
|---|---|---|
| ఆకాశం | నుంచి | చెవులు (శ్రోతము) |
| వాయువు | నుంచి | చర్మం (త్వక్) |
| అగ్ని | నుంచి | కన్ను (చక్షుః) |
| జలము | నుంచి | నాలుక (జిహ్వ) |
| భూమి | నుంచి | ముక్కు (ఘ్రాణము) |

ఇక్కడ ఇంద్రియము, అవయవము అనేవి ఒకటి కాదని మనం గమనించాలి. ఉదాహరణకు, కనుగుడ్డు అనేది అవయవము. అందులో సూక్ష్మంగా నేత్రమనే ఇంద్రియమున్నది. ఆ ఇంద్రియం లోపిస్తే గుడ్డు వున్నా పనిచెయ్యదు. మనిషికి ప్రాణమెటువంటిది అవయవానికి ఇంద్రియం అటువంటిదన్నమాట. భూతసూక్ష్మాల నుంచి పుట్టినవి ఇంద్రియములే కాని, అవయవములు కావు.

ఈ సూక్ష్మ ఆకాశాది సూక్ష్మ పంచభూతాల సత్త్వాంశాలన్నీ సమష్టిగా చేరి అంతఃకరణమనే ఇంద్రియం పుట్టింది. దీనిలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అని నాలుగు అంశాలున్నాయి.

సంకల్ప వికల్పాలు చేసేది మనస్సు. నిశ్చయాలు చేసేది బుద్ధి. వెనుకటి సంఘటనలను స్మరించేది చిత్తం. నేననే స్ఫురణను ఇచ్చేది అహంకారం. వీటిలో అహంకారాన్ని బుద్ధిలోను, చిత్తాన్ని మనస్సులోను కలిపివేసి కేవలం మనోబుద్ధులని వ్యవహరించటం కూడా వుంది.

ఇక సూక్ష్మభూతాల రజోగుణాంశలవల్ల పంచకర్మేంద్రియాలు ఉద్భవించాయి.

| | | |
|---|---|---|
| ఆకాశం | నుంచి | వాక్కు(వాక్) |
| వాయువు | నుంచి | చేతులు(పాణి) |
| అగ్ని | నుంచి | పాదము |
| జలము | నుంచి | విసర్జనేంద్రియము(పాయువు) |
| భూమి | నుంచి | జననేంద్రియము(ఉపస్థ) |

ఆకాశాది సూక్ష్మభూతాల రజోగుణాంశలన్నీ సమష్టిగా చేరి ప్రాణంగా ఏర్పడింది. ఈ ప్రాణం– ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అని అయిదు విధాలుగా ఏర్పడింది.

నిజానికి వున్న ప్రాణము ఒక్కటే. కానీ, జీవి శరీరంలో అది వుండే స్థానాన్నిబట్టి, చేసే పనినిబట్టి, పంచప్రాణాలు అనే వ్యవహారం ఏర్పడుతుంది.

హృదయంలో వుంటే ప్రాణం. ఇది శ్వాసాదులను పైకి కదిలిస్తుంది. గుదస్థానంలో వుంటే అది అపానము. ఇది మలాలను అధోముఖముగా నడిపిస్తుంది. నాభి స్థానంలో వుంటే సమానము. ఇది రక్త ప్రవాహాదులను శరీరంలో సమంగా నడిపిస్తుంది. కంఠంలో ఉంటే ఉదానము. దీనివలన కంఠాది ప్రదేశాలలో శబ్దోత్పత్తి జరుగుతుంది. శరీరంలో అంతటా వ్యాపించి వుండేది వ్యానము. ఇది శరీరంలోని ఆయా నాడుల ప్రకంపనాల ద్వారా ఇంద్రియ క్రియలను నడిపిస్తుంది. ఈ పంచవిధ ప్రాణాత్మకమైన ప్రాణం ఆకాశాది పంచభూతాల రజోగుణ సమష్టి చేత ఉద్భవించిందని మనం గ్రహించాలి.

ఈ జ్ఞానేంద్రియాలు అయిదు, కర్మేంద్రియాలు అయిదు, ప్రాణాలు అయిదు మనోబుద్ధులు, మొత్తం ఈ 17 కలిపితే సూక్ష్మ శరీరం అవుతుంది. దీనికే లింగశరీరమని మరొక పేరు. ఈ సూక్ష్మ శరీరమే జీవులయొక్క సుఖదుఃఖ భోగానికి సాధనం. ఈ లింగ శరీరం రెండు రకాలు.

1. పరలింగ శరీరము

2. అపరలింగ శరీరము

పరలింగ శరీరమంటే హిరణ్యగర్భునియొక్క లింగశరీరము. దీనికే మహత్తత్త్వమని మరొక పేరు. అపరలింగ శరీరమంటే లోకంలోని సామాన్య జీవుల లింగ శరీరము. ఈ అపరలింగ శరీరానికి అహంకారమని కూడా వ్యవహారముంది. ఈ అహంకారం మనోబుద్ధి చిత్తాహంకారాలలోని అహంకారం కాదని గ్రహించాలి.

జీవుడు గానీ, ఈశ్వరుడు గానీ ఈ సూక్ష్మశరీరంలో వుంటే అది వారికి స్వప్నావస్థ అవుతుంది. ఈ సూక్ష్మ శరీరంలో జ్ఞానమయకోశ, మనోమయకోశ, ప్రాణమయ కోశాలున్నాయి. సూక్ష్మ సృష్టి జరిగే విధానమిది.

## 8. స్థూలప్రపంచ సృష్టి

ఇక స్థూల ప్రపంచ సృష్టి ఎలా జరుగుతుందో పరిశీలిద్దాము.

7వ శీర్షికలో తమోగుణ ప్రధానమయిన మూలప్రకృతి ఆవరణ శక్తిగానూ విక్షేపశక్తిగానూ ఏర్పడిందనీ, యీ విక్షేపశక్తివల్లనే అపంచీకృత సూక్ష్మ పంచ మహాభూతాలు ఉత్పన్నమయినాయనీ చెప్పుకొన్నాము. ఈ సూక్ష్మభూతాలు మూల ప్రకృతినుంచి వచ్చాయి గనుక, ఆ మూలప్రకృతిలో త్రిగుణాలూ వున్నాయి. గనుక, యీ పంచభూతాలలోకి త్రిగుణాలు సంక్రమిస్తాయి అని గూడా చెప్పుకొన్నాం. అంతే గాక, సూక్ష్మభూతాల సత్త్వగుణాంశలవల్ల పంచ జ్ఞానేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయము, రజోగుణాంశలవల్ల పంచ కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, యేర్పడినాయని గూడా చెప్పుకొన్నాము.

## 9. పంచీకరణము

ఇక సూక్ష్మ పంచభూతాల తమోగుణాంశలు మిగిలి వున్నాయి గదా!

1. వీటిలో ఒక్కొక్క భూతాన్నీ మొదట రెండు సమభాగాలు చెయ్యాలి.
2. ఈ భాగాలలో ఒక అర్ధభాగాన్ని అలాగే వుంచేసి, రెండవ అర్ధభాగాన్ని నాలుగు భాగాలుగా చెయ్యాలి. అనగా ఎనిమిదవ వంతు ముక్కలు నాలుగు ఏర్పడతాయి అన్నమాట.
3. ఇపుడు ప్రతిభూతంలోనూ మొదటి అర్ధభాగాన్ని అలాగే వుంచేసి, రెండవ అర్ధభాగం స్థానంలో మిగిలిన నాలుగు భాగాలలోనుంచీ ఒక్కొక్క ఎనిమిదవ వంతు ముక్కను తెచ్చి దీనికి అతకాలి.
4. ఉదాహరణకు భూమిని తీసుకొందాం. భూమి సగం, మిగతావి నాలుగు




ఎనిమిదవ భాగాలు. మొత్తం కలపగా ఒకటి పూర్ణమయిపోతుంది.

5. భూమిలో మిగిలిన అర్ధభాగం నాలుగు ముక్కలయిపోయి, జల, అగ్ని, వాయు, ఆకాశాలలో కలిసి పోతుంది.

6. ఈ విధంగా అన్ని భూతాలకు చేస్తే ప్రతి భూతంలోనూ ఒక భూతం ప్రధాన భాగంగా వుండి, మిగిలిన నాలుగు భూతాల అంశలు అందులో చేరి వుంటాయి. కనుక వీటిని పంచీకృత పంచభూతాలు అంటారు.

7. ఈ ప్రక్రియను పంచీకరణము అంటారు.

8. అయిదు భూతాలూ కలిసే వున్నప్పటికీ, ఏ భూతంయొక్క అంశ ప్రధానంగా వుంటుందో, దాన్ని ఆ పేరుతోనే పిలుస్తారు. ఉదాహరణకు ఇందాకటి బొమ్మలో భూమి అంశ ప్రధానంగా వుంది గనుక, ఆ మొత్తాన్ని భూమి అనే పిలుస్తారు.

9. ఇదే మన కంటికి కనిపించే భూమి, పంచీకృతభూమి, స్థూలభూమి.–

10. మనం చూసే జల, అగ్ని, వాయు, ఆకాశాలు గూడా ఇలాంటి పంచీకృత భూతాలే, స్థూలభూతాలే.

## 10. స్థూలశరీరము

ఈ పంచీకృత పంచభూతాలవల్లే (స్థూలభూతాలవల్లే) ఈ బ్రహ్మాండసృష్టి జరుగుతోంది. ఈ బ్రహ్మాండంలోనివే 14 లోకాలు (క్రింది లోకాలు 7, మధ్యలోకం (భూమి) ఒకటి, పై లోకాలు 6, కలిసి 14 లోకాలు). ఈ లోకాలలో వుండే జీవుల శరీరాలు 4 రకాలు.

1. ఉద్భిజ్జములు
2. స్వేదజములు
3. అండజములు
4. జరాయుజములు – అని.

(ఉద్భిజ్జ స్వేదజాండజ జరాయుజములు)

1. ఉద్భిజ్జములంటే భూమిలోంచి మొలచి పుట్టే శరీరాలు. వృక్షములు వగైరా.

2. స్వేదజములంటే చెమటవంటి జల సంబంధంవల్ల జన్మించే శరీరాలు. పురుగులు వగైరా

3. అండజములంటే గ్రుడ్డులోంచి జన్మించే శరీరాలు. పక్షులు వగైరా.

4. జరాయుజములంటే మాతృగర్భంలో నివసించి జన్మించే శరీరాలు. మానవులు వగైరా.

ఈ శరీరాలు గల జీవులకు భోగ్యవస్తువులు కొన్ని వున్నాయి. అవే అన్నం, పానీయం, శయనీయం వగైరా. ఇవన్నీ స్థూలభూతాలలోంచి వస్తాయి.

ఇలా పంచీకృత పంచభూతాలలోంచీ వచ్చేదంతా కలిపితే స్థూలసృష్టి అనబడుతుంది.

ఈ మొత్తం అంతా కలిపితే ఈశ్వరుడికి స్థూలశరీరం. జీవులకు ఎవరి స్థూలశరీరం వారికే వుంటుంది గదా!

జీవుడు గానీ, ఈశ్వరుడు గానీ యీ స్థూలశరీరంలో వుంటే, అది వారికి జాగ్రదవస్థ. ఈ స్థూలశరీరమే అన్నమయకోశము.

## 11. వ్యష్టి – సమష్టి

ఇప్పటికి కారణ, సూక్ష్మ, స్థూల సృష్టులను, కారణ, సూక్ష్మ, స్థూల శరీరాలను వివరించుకొన్నాం.

దీనిలో కారణ, సూక్ష్మ, స్థూల శరీరాలు ఒక్కొక్కటీ రెండేసి రకాలు– సమష్టి శరీరము, వ్యష్టి శరీరము అని. కాగా

1. సమష్టి కారణ శరీరము, వ్యష్టి కారణ శరీరము,
2. సమష్టి సూక్ష్మ శరీరము, వ్యష్టి సూక్ష్మ శరీరము,
3. సమష్టి స్థూల శరీరము, వ్యష్టి స్థూల శరీరము అని మొత్తం 6 రకాలన్నమాట.

చెట్టు అంటే వ్యష్టి, అడవి అంటే సమష్టి.

ఇల్లు అంటే వ్యష్టి, ఊరు అంటే సమష్టి.

నది అంటే వ్యష్టి, సముద్రమంటే సమష్టి.

అలాగే, ఏ శరీరానికా శరీరం వ్యష్టి. అన్ని శరీరాలు కలిస్తే సమష్టి.

ఈ సమష్టి ఉపాధిగా గలవాడు ఈశ్వరుడు. వ్యష్టి ఉపాధిగా గలవాడు జీవుడు.

## 12. జీవ ఈశ్వరులలో మరిన్ని రకాలు

అయితే, మనకు మూడు రకాల సమష్టులు, మూడు రకాల వ్యష్టులు వున్నాయని చెప్పుకొన్నాం కదా! మొత్తం మూడు రకాల సమష్టులలోనూ వుండే వాడికి ఈశ్వరుడని సామాన్య నామం. అలాగే మూడు రకాల వ్యష్టులలోనూ వుండేవాడికి జీవుడని సామాన్య నామం. కాని, 6 రకాల శరీరాలలోనూ జీవేశ్వరులకు వేరు వేరు పేర్లు గూడా శాస్త్రాలు నిర్దేశించినాయి.

1. కారణ సమష్టిలో వుండేవాడు ఈశ్వరుడు.
2. కారణ వ్యష్టిలో వుండేవాడు ప్రాజ్ఞుడు.
3. సూక్ష్మ సమష్టిలో వుండేవాడు హిరణ్యగర్భుడు.
4. సూక్ష్మ వ్యష్టిలో వుండేవాడు తైజసుడు.
5. స్థూల సమష్టిలో వుండేవాడు వైశ్వానరుడు (ఇతడే విరాట్).
6. స్థూల వ్యష్టిలో వుండేవాడు విశ్వుడు.

దీనినే పట్టిక రూపంలో గూడా గమనిద్దాం

| | కారణ | సూక్ష్మ | స్థూల | సామాన్యనామం |
|---|---|---|---|---|
| సమష్టి | ఈశ్వర | హిరణ్యగర్భ | వైశ్వానర | ఈశ్వర |
| వ్యష్టి | ప్రాజ్ఞ | తైజస | విశ్వ | జీవ |

ఈ పట్టికలో ఈశ్వర పదం రెండుసార్లు వచ్చిందని గమనించండి. అంటే ఈ పదాన్ని రెండు భిన్నార్థాలలో ఉపయోగిస్తూ వుంటారన్నమాట. కనుక ఈశ్వరపదం వచ్చినప్పుడు ఆ ప్రకరణాన్ని బట్టి దాని అర్థాన్ని గ్రహించటం నేర్చుకోవాలి.

## 13. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు

జీవ ఈశ్వరులలో గల ఆరు రకాలను గమనించాం గదా! ఇక సమష్టి సామాన్య అధిష్ఠాత అయిన ఈశ్వరుడు సత్త్వ రజస్తమోగుణాలను ఆశ్రయించినప్పుడు బ్రహ్మ విష్ణు రుద్రులని వ్యవహరింపబడుతూ వుంటాడు. రజోగుణ ప్రధానుడై బ్రహ్మగా సృష్టి చేస్తూ వుంటాడు. సత్త్వప్రధానుడై విష్ణువుగా స్థితి చేస్తూ వుంటాడు. తమోగుణ ప్రధానుడై రుద్రుడుగా సంహారం చేస్తూ వుంటాడు.

వీరిలో బ్రహ్మ విరాట్‌రూపుడైన వైశ్వానరుడిలో అంతర్భాగమవుతాడు. విష్ణువు హిరణ్యగర్భుడిలో అంతర్భాగమవుతాడు. రుద్రుడు కారణ సమష్టి అధిష్ఠాత అయిన ఈశ్వరుడిలో అంతర్భాగమవుతాడు.

(**గమనిక:–** హిరణ్యగర్భ పదం గూడా రెండర్థాలలో వాడబడుతూ వుంటుంది. సూక్ష్మ సమష్టి అధిష్ఠాత ఒక హిరణ్యగర్భుడు. ఇతనిలోనే విష్ణువు అంతర్భాగం. ప్రథమ జీవుడు మరొక హిరణ్యగర్భుడు. అతడు త్రిమూర్తుల కంటే భిన్నము.)

ఇంతకూ మన చర్చ ఎక్కడ మొదలయిందంటే అధ్యారోపం అంటే ఏమిటని మనం విచారిస్తున్నాం.

అద్వితీయంగా వున్న పరిపూర్ణ వస్తువునుంచి, అతివిచిత్రమైన రీతిలో, ఒకదానినుంచి మరొకటిగా కారణ, సూక్ష్మ, స్థూల సృష్టులు బయలుదేరాయి. ఇదే ప్రపంచోత్పత్తి విధానం. దీని పేరే అధ్యారోపం. అంటే ఒకదాని మీద ఒకటి ఆరోపం చేసుకొంటూ వచ్చామన్నమాట.

ఈ అధ్యారోప విధానం వివరంగా తెలిసినందువల్ల, మనమనుకొనే బ్రహ్మాండాలన్నీ ఒకే ఒక మూలవస్తువులోంచి వచ్చాయని నిశ్చయం అవుతుంది.

ఇది సంభవమా? అని ఒకో సారి మనసు మనల్ని సందేహంలో పడవేస్తుంది. అప్పుడు మసక వెలుతుర్లో పడివున్న తాడు పాము లాగా, పూలదండ లాగా, నీటి చాలు లాగా సన్న గొలుసు లాగా, నేలలో నెరియ లాగా, ఇంకా ఎన్నో రీతులుగా కనిపిస్తూ వుండటాన్ని గుర్తు చేసుకోవాలి. ఉన్న ఒకే ఒక తాడులో మన మనస్సు ఇన్ని రకాల కల్పనలు చేస్తోందని గుర్తించాలి. దీనివల్ల అధ్యారోప విధానంలో యీ సృష్టిని విశ్లేషించి, దీనికి మూలభూతమైన సత్యపదార్థం ఒకే ఒకటి అని మనకు నిశ్చయం కలుగుతుంది.

7వ శీర్షికలో సూక్ష్మసృష్టిని వివరించే సందర్భంలో తమోగుణ ప్రధానమైన మూలప్రకృతికి ఆవరణశక్తి అనీ, విక్షేపశక్తి అనీ, రెండు శక్తులు వున్నాయని చెప్పుకొన్నాం. ఇప్పటివరకు చెప్పుకొన్న సృష్టి విధానమంతా ఈ విక్షేపశక్తియొక్క పనే (కార్యమే) అని మనం గుర్తించాలి.

## 14. ఆవరణశక్తి పని

వెనుకటి శీర్షికలలో విక్షేపశక్తి కార్యాలను వివరించు కొన్నాం. సృష్టి మొత్తం విక్షేపశక్తి పనే అయితే, ఇక ఆవరణశక్తి చేసే పనేమిటి?

విక్షేపశక్తి కన్నా ముందు కార్యరంగంలోకి దూకేది ఆవరణశక్తే. ఈ శక్తి చీకటివలె మనను ఆవరిస్తుంది. ఇది ఆవరించినందువల్లే వున్న సత్యవస్తువు మనకు తెలియకుండా పోతుంది. అపుడు విక్షేపశక్తి "నాకేమీ తెలియటం లేదు" అనే జ్ఞానాన్ని రానీయకుండా, "ఈ శరీరం నేనే" అనే తప్పుడు జ్ఞానాన్ని కలిగిస్తుంది.

నిజానికి ఈ దేహమూ, దీనిలోని పంచకోశాలు వగైరా ఇదంతా ఆత్మ పదార్థం మీద మన మనస్సు చేసిన అధ్యారోపంవల్ల వచ్చినవే. కనుక, యీ పంచకోశాదులకు ఆ పరబ్రహ్మకూ ఏమీ సంబంధం లేదు (త్రాడుమీద పామును అధ్యారోపణ చేసినప్పుడు భ్రాంతివల్ల కనిపించే పాముకూ, వాస్తవంగా వున్న త్రాడుకు, నిజమైన సంబంధమేమీ లేనట్లు). కానీ, ఆవరణశక్తి ఈ భేదాన్ని చీకటి లాగా కప్పివేస్తుంది. అప్పుడు "ఈ దేహం నేనే" అనే భ్రాంతిజ్ఞానం దర్శనమిస్తూ వుంటుంది.

అలాగే, ఏ రకమయిన భేదాలకు తావు లేకుండా, ఏకరూపంగా, పరబ్రహ్మ పదార్థం వుండగా, వున్నది అది ఒక్కటే అయివుండగా, నానా గోళాది రూపంగా వున్న ఈ బ్రహ్మాండ సృష్టి అంతా భ్రాంతి జనితమైనదై వుండగా, ఆవరణశక్తి యీ తారతమ్యాన్ని కమ్మివేయటంవల్ల ఈ జగత్తే సత్యమనిపిస్తూ వుంటుంది.

ఈ ఆవరణశక్తి ఆటలు సాగని చోట్లు రెండు వున్నాయి. 1. ఈశ్వరుడు (సమష్టిసామాన్య అధిష్ఠాత), 2. ఆత్మజ్ఞాని. ఈ రెండు చోటులా ఆవరణశక్తి పని చెయ్యలేక పోవటానికి కారణమేమిటి? సత్త్వగుణం అధికంగా వున్న చోట ఆవరణశక్తి పనిచేయలేదు. ఈశ్వరుడిలో సత్త్వగుణం అత్యధికంగా వుంది. అందువల్ల అక్కడ ఆవరణశక్తి పనిచేయదు. కనుక ఈశ్వరునియొక్క స్వస్వరూపాన్ని మాయ క్రమ్మివేయలేదు. అందువల్ల ఈశ్వరునకు ఉపాధి అయిన మాయ ఆయన అదుపులో వుంటుంది. ఆయన తన అధీనంలో వున్న మాయనే ఉపయోగించుకొని ఈ ప్రపంచాన్ని సృష్టి చేస్తాడు.

కాగా ఈశ్వరుడికి ఉపాధి కారణమైన మాయ వున్నప్పటికీ, అది ఆయన చేతిలో, అదుపులో వుంటుంది. కనుక, అది అందరికీ వున్న మాయ వంటిది కాదు. కాగా, దీన్ని మనం పరిగణనలోకి తీసుకొనక పోయినట్లయితే, ఈశ్వరునియొక్క చైతన్యం బ్రహ్మ చైతన్యమే అవుతుంది. అందువల్లే ఈశ్వరుడు పరబ్రహ్మకన్నా వేరు కాదని చెపుతూ వుంటారు.

జ్ఞాని విషయంలో అతడు ఇతర గుణాలను అతిక్రమించి సత్త్వగుణ స్వరూపుడవుతాడు గనుక, అతని దగ్గర కూడా ఆవరణశక్తి ఆటలు సాగవు.

మామూలు జీవుల విషయంలో మాత్రం సంపూర్ణంగా పనిచేస్తూనే వుంటుంది. అయితే, ఆవరణశక్తి రెండు రకాలుగా వుంటుంది–

1. అసత్త్వావరణము

2. అభానావరణము – అని

అసత్త్వావరణమంటే ఉన్న వస్తువు అసలే లేదని అనిపించేటట్లు చేసేది. "అంటే దేవుడు లేడు. ఆత్మ లేదు" అనిపింప చేసేది అసత్త్వావరణమన్నమాట.

అభానావరణమంటే "వస్తువు వున్నదో లేదో తెలియటం లేదు" అనిపింప చేసేది. అంటే "దేవుడు వున్నాడో లేడో నాకు తెలియటం లేదు" అనిపింప చేసేది అభానావరణ మన్నమాట.

ఈ రెండూ ఆవరణశక్తి విలాసాలే.

ఆవరణశక్తి, విక్షేపశక్తి అనేవాటిలో సంసారమనే వృక్షానికి నిజమైన బీజం ఆవరణశక్తే. (ఈ విత్తు నాటుకొన్నాక విక్షేపశక్తి పని మొదలవుతుంది.) అందువల్ల మోక్షానికి గూడా నిజమైన హేతువు ఆవరణశక్తి తొలగిపోవటమే.

ఆవరణలు పోయే దెలా?

వెనుకటి శీర్షికలో రెండు రకాల ఆవరణలను చెప్పుకొన్నాం కదా! ఆ రెండూ గూడా తత్త్వజ్ఞానంవల్లే పోతాయి. సరియైన విచారణ వల్ల సత్య వస్తువేదో నిర్ణయించటమే తత్త్వజ్ఞానం. ఇది రెండు రకాలు. అవి –

1. పరోక్షజ్ఞానము

2. అపరోక్షజ్ఞానము

## 15. పరోక్షజ్ఞానము

గ్రంథాలవల్ల, గురువుల బోధలవల్ల, కలిగే జ్ఞానం పరోక్షజ్ఞానము. దీనినే శ్రవణమంటారు. దీనివల్ల జీవుడూ బ్రహ్మ ఒకటే అన్న నిశ్చయం మేధాస్థాయిలో కలుగుతుంది. అంటే అనుభవం కలగకపోయినా, తార్కికంగా ఆ నిశ్చయానికి వస్తామన్నమాట.

వేదాంతాన్ని శాస్త్రంగా అధ్యయనం చేసినందువల్ల కలిగే లాభం ఇదే. అంటే వేదాంత శాస్త్రాధ్యయనాది రూపమయిన శ్రవణంవల్ల అసత్త్వావరణం తొలగిపోయి "పరబ్రహ్మ వస్తువు వుంది (దేవుడు ఉన్నాడు), అతడెవరో నేను స్పష్టంగా చూడకపోయినా, అతడు వుండటం మాత్రం ఖాయం" అనే నిశ్చయం కలుగుతుంది.

ఒక పిల్లవాడు ఒక పెద్ద చెరువును చూసి "అబ్బా! ఎన్ని నీళ్ళో" అని ఆశ్చర్యపోతున్నాడు. వాడి తండ్రి వచ్చి "ఇది లెక్కేమిటి? సముద్రంలో ఇంకా ఎక్కువ నీళ్ళు వుంటాయి. దాని ఆవలిగట్టు కనిపించనే కనిపించదు" అని చెప్పాడు. మొదట్లో ఆ పిల్లవాడు నమ్మకపోయినా, క్రమంగా వివరించగా, సముద్రం అనేది వుండటం సాధ్యమే అని అంగీకరిస్తాడు. చెప్పినవాడు తండ్రి కనుక, సముద్రం వుండటం సత్యమే అని నమ్ముతాడు కూడా! పరోక్షజ్ఞానంవల్ల అసత్త్వావరణం నశించటమంటే ఇదే!

అసత్త్వావరణం ఎప్పుడైతే నశించిందో అప్పుడు వస్తువు లేదనే భ్రమ తొలిగింది కనుక, ఇక వస్తువు (అనగా పరబ్రహ్మ పదార్థము) వున్నది అనేస్తాడు మనిషి.

## 16. శ్రవణ మనన నిదిధ్యాసలు

ఈ పదాలను వేదాంత సందర్భాలలో తరచు వింటూ వుంటాం. వీటిలో శ్రవణమంటే యేమిటో ఇపుడు చర్చించుకొన్నాం.

శ్రవణంవల్ల ఆత్మవస్తువు వుందా లేదా అనే సంశయం తొలగిపోతుందని చెప్పుకొన్నాం.

ఇక మననమంటే విచారం. శ్రవణంవల్ల కొంత జ్ఞానం కలుగుతుంది. దీనిని యుక్తి ప్రతియుక్తులతో నిరంతరం తిరగదిప్పుకుంటూ వుండాలి. దీనికి షడ్విధలింగములు అనే పేరుతో ఆరు రకాల చర్చావిధానాలను శాస్త్రాలు ఏర్పరచి వుంచాయి. (వీటి గురించి ముందు తెలుసుకొందాం.) ఇలా షడ్విధలింగాలనే యుక్తి ప్రతియుక్తులతో, శ్రవణజన్యజ్ఞానాన్ని మళ్ళీ మళ్ళీ చింతన చేస్తూ పోవటమే వేదాంత విచారణ. ఇదే మననం.

మననంవల్ల అసంభావన పోతుంది. అసంభావన అంటే సత్యం ఎదురుగా వుండగానే, ఇది సత్యం కాదనుకోవటం. అక్కడితో ఆగక, అసత్యమైన దానిని దేనినో తెచ్చి, ఇదే సత్యమని ప్రకటించటం విపరీతభావన. కనుచీకటిలో తాడును సరిగా

చూడక, “ఇది త్రాడు కాదు” అనటం అసంభావన. “ఇది పాము మొర్రో” అనటం విపరీత భావన.

మన ప్రస్తుత సందర్భంలో ఉన్న సత్యం “తనే పరమాత్మ” అయివుండగా, “ఆ పరమాత్మెవరో నాకు తెలియ”దనటం అసంభావన. అక్కడితో ఆగక, “ఈ దేహమే నేను” అనటం (నేను రామయ్యను, భీమయ్యను అనటం) విపరీతభావన.

మననంవల్ల అసంభావన తొలిగిపోతుంది.

నిదిధ్యాసంవల్ల విపరీతభావన తొలగిపోతుంది.

శ్రవణంవల్ల మననంవల్లా కలిగిన జ్ఞానాన్ని ధ్యానంతో మేళనం చేయటమే నిదిధ్యాసం(లేక నిదిధ్యాసనం) అని తాత్పర్యంగా చెప్పుకోవచ్చు.

ఈ నిదిధ్యాసం ఎప్పుడు పరిపక్వమవుతోందో అప్పుడు, దేహమే నేననే దేహాత్మ జ్ఞానం తొలగిపోయి, బ్రహ్మమే నేననే బ్రహ్మాత్మ జ్ఞానం ఉదయిస్తుంది. ఇదే అపరోక్ష జ్ఞానము. ఇదే ఆత్మానుభవము. ఇదే ఆత్మ సమాధి.

ఇది కలిగినప్పుడు ఆ “బ్రహ్మమేమిటో నాకు తెలియదు” అనే అభానావరణం నశిస్తుంది.

ఈ విధంగా పరోక్షజ్ఞానంవల్ల అసత్వావరణము, అపరోక్షజ్ఞానంవల్ల అభానావరణము నశించగా, దేహాత్మ జ్ఞానంవల్ల కలిగిన సంసార దుఃఖం పూర్తిగా తొలగిపోయి, అదే సమయంలో ఆత్మానందం సిద్ధిస్తుంది.

మనం ఆధ్యారోప విధానాన్ని పరిశీలిస్తున్నాము. ఈ పరిశీలనలో ఇప్పటివరకు మనం చెప్పుకొన్నవి 7 అవస్థలు, లేక 7 సోపానాలు అనవచ్చు.

1. అజ్ఞానము
2. ఆవరణ ద్వయం (అసత్వావరణం, అభానావరణం)
3. విక్షేపం
4. పరోక్షజ్ఞానం
5. అపరోక్షజ్ఞానము
6. దుఃఖనివృత్తి
7. ఆనందప్రాప్తి

## 17. దశమన్యాయము

ఈ 7అవస్థలూ బాగా అర్థమయ్యేందుకు పెద్దలు పరమానందయ్య శిష్యుల కథ నొకదానిని ఉదాహరణగా స్వీకరిస్తూ వుంటారు. దీనినే దశమన్యాయమని వ్యవహరిస్తూ వుంటారు.

పరమానందయ్య శిష్యులు పది మంది ఒక సారి ఒక యేరు దాటారట. దాటినాక, వారి నాయకుడు అందరూ వచ్చారా లేదా అని లెక్కపెట్టాడు. లెక్క పెట్టటంలో తనను వదలిపెట్టాడు కనుక, ఎన్ని సార్లు లెక్క పెట్టినా తొమ్మిది మందే లెక్కకు వచ్చారు. దాంతో పదోవాడు ఏటిలో మునిగిపోయాడని బిగ్గరగా ఏడవసాగాడు.

ఇక్కడ, లెక్క పెట్టేవాడు తనను మరచి పోవటమే అజ్ఞానం.

ఆ పదోవాడు లేడు, కనిపించటంలేదు అనుకోవటమే ఆవరణద్వయం.

వాడు మునిగిపోయాడని ఏడవటం విక్షేపం.(ఇప్పటికి మూడవస్థ లయినాయి)

ఇంతలో దారే పోయేవాడొకడు వీరెందుకేడుస్తున్నారా అని విచారించాడు. వాడు విషయం తెలుసుకొని, "పదిమంది ఇక్కడే వున్నారు గదయ్యా!" అన్నాడు. అది విని నాయకుడు, ఆ పదోవాడు చుట్టు ప్రక్కలలో ఎక్కడో వున్నాడనుకొని, ఏడుపాపాడు.

ఇదే పరోక్షజ్ఞానం.

ఆ వచ్చిన పెద్ద మనిషి నాయకుడి తెలివికి సంతోషించి, "ఆ పదోవాడవు నువ్వేరా బాబూ" అని వాడి వేలితో, వాడి గుండెమీదే పొడిచి మరీ చూపించాడు. దానితో నాయకుడికి పదోవాడిని తనే అనీ, పదోవాడు బ్రతికే వున్నాడనీ, ప్రత్యక్షంగా తెలిసింది.

ఇదే అపరోక్షజ్ఞానం.

దీనివల్ల వాడికి దుఃఖం పూర్తిగా పోయింది.

ఇదే దుఃఖనివృత్తి.

వెనువెంటనే, "అబ్బా! హాయిగా అందరం బ్రతికే ఉన్నాం. ఒడ్డు చేరాం" అని ఉప్పొంగిపోయాడు.

ఇదే ఆనందప్రాప్తి. ఇది ఏడవ అవస్థ.

ఇప్పటిదాకా మనం చెప్పుకొన్న దాన్ని దృష్టాంతం అంటారు. అంటే, ఉదాహరణ. ఈ ఉదాహరణను ఏ సందర్భంలో చెప్పుకొన్నామోదానిని దార్ష్టాంతికము అంటారు. మనం చెప్పుకొన్న ఉదాహరణ మన సందర్భానికి సరిగా అతికిందా లేదా అని పరిశీలించాలి. దీన్ని దృష్టాంతాన్ని దార్ష్టాంతికంతో సమన్వయించడమంటారు. ఇపుడా పని చేద్దాం.

మన సందర్భంలో (దార్ష్టాంతికంలో)

1. ఆత్మ నాకు తెలియదు అనుకోవటం అజ్ఞానం.

2. ఏదో పిచ్చి ఆలోచనలు, వాదాలు, చేసి "పరమాత్మ అనేది లేనే లేదు, వుంటే, కనబడాలి గదా" అనటం ఆవరణద్వయం.

3. స్థూల సూక్ష్మ దేహాలతో జీవుడు వుండటం, వాడికర్తృత్వ భోక్తృత్వాలు, ఇదంతా విక్షేపం. (స్థూల సూక్ష్మ దేహాలు గల జీవుడిని చిదాభాసుడని వ్యవహరిస్తారు. అతడి కార్యమే (పనే) ఈ సుఖదుఃఖాది రూపాలలో వున్న సంసారమంతా. ఇదే విక్షేపం)

4. గురువుల దగ్గర (లేదా పుస్తకాల ద్వారా) విన్న మంచి మాటలే పరోక్షజ్ఞానం.

5. వీటిని బాగా మననం చేస్తే, ఆ పైన దాన్నే ధ్యానంచేస్తే (నిదిధ్యాసచేస్తే) కలిగేది అపరోక్షజ్ఞానం.

6. ఈ పరోక్ష అపరోక్షజ్ఞానాలవల్ల రెండు రకాల ఆవరణా నశిస్తుంది. దానివల్ల పరమాత్మ పైగల జీవత్వారోపం (నేను జీవుడిని అనే భ్రాంతి) నశిస్తుంది. అంటే విక్షేపం మొత్తం ఎగిరిపోతుందన్నమాట. ఇదే దుఃఖనివృత్తి.

7. ఎప్పుడైతే విక్షేపం పోయిందో, అపుడు తనయొక్క అసలు స్వరూపం (స్వస్వరూపం) దర్శనమిస్తుంది. తన అసలు స్వరూపం ఆనందమే గనుక తనే ఆనందమయి పోతాడు. (6,7 అవస్థలు ఏకకాలంలో జరిగిపోతాయి.) ఇది దార్ష్టాంతిక సమన్వయం.

ఈ 7 అవస్థల పరిశీలన వల్ల ఆకాశం లాగా నిర్మలంగా వున్న శుద్ధ చైతన్యంలో (ఆత్మలో) మిథ్య అయిన ప్రపంచం కల్పింపబడుతోందని మనకు అర్థమయింది. ఈ మిథ్యాకల్పన పేరే అధ్యారోపం.

## 18. అపవాదము

ఈ గ్రంథపీఠికా భాగంలోనే

**అధ్యారోపాపవాదాభ్యాం జ్ఞాతవ్యః తత్త్వనిర్ణయః –** అధ్యారోపము, అపవాదము అనే విధానాలతో తత్త్వనిర్ణయాన్ని బాగా తెలుసుకోవాలి– అని చెప్పుకొన్నాం. అందులో అధ్యారోపమంటే యేమిటి అనేదాన్ని ఇప్పటి దాకా వివరించుకొన్నాము. ఈ అధ్యారోపంవల్లనే జీవులకు సంసార బంధం ఏర్పడుతుందని గ్రహించాము. ఈ అధ్యారోపాన్ని ఏదో ఒక ఉపాయంతో తొలగించుకొంటే, ఇక దుఃఖంతో సంపర్కం కలిగే అవకాశం వుండదని గూడా అర్థం చేసుకొన్నాం. (దీనినే ఆత్యన్తిక దుఃఖనివృత్తి అని వ్యవహరిస్తూ వుంటారు.)

ఏదో ఉపాయం అన్నామే, ఆ ఉపాయం తెలియాలంటే ఇక మనం "అపవాదము" అంటే ఏమిటని పరిశీలించాలి.

కారణంకంటే వేరుగా కార్యం వుండదు అనే జ్ఞానం కలగాలి ముందు. ఈ జ్ఞానంవల్ల ఎక్కడ కార్యాన్ని చూచినా, దాని వెనుకగల కారణాన్ని గుర్తించటం నేర్చుకోవాలి. పైకి కనిపించే యీ కార్యం, దాని వెనుకగల కారణానికి రూపాంతరమే తప్ప, కొత్త వస్తువు కాదని అర్థం చేసికోవాలి. అపుడు వికారం మీద (అనగా మార్పు మీద) దృష్టిపోయి మూల భూతమైన కారణవస్తువు మీద దృష్టి నిలుస్తుంది. అది దృఢమైనపుడు పైకి కనిపించే యీ వికారం (అనగా మార్పు) సత్యం గాదనీ, యీ పైపై మార్పులను చూచి పొంగిపోవటమో క్రుంగిపోవటమో వ్యర్థమనీ తెలుస్తుంది.

కొన్ని ఉదాహరణలు గమనిద్దాం.

దూరాన ఎండలో వెండి మెరుస్తూ కనిపిస్తుంది. కానీ ఆ స్థలం వెండి వుండేందుకు వీలు లేని చోటు. పైగా ముత్యపు చిప్ప వుండే అవకాశం గల చోటది. తెలివిగలవాడు వెంటనే ఆ మిలమిలా మెరిసేది వెండి కాదనీ, అక్కడ గల ఆలిచిప్ప మీద వెండిని అధ్యారోపణ చేస్తున్నాననీ వెంటనే గ్రహిస్తాడు. కనుక, యీ కంటికి కనుపించే వెండికి మూలకారణం ముత్యపు చిప్పే అని గ్రహిస్తాడు. కనుక, కారణమైన ముత్యపు చిప్పకన్నా భిన్నంగా అక్కడ వెండి వేరే లేదని గ్రహిస్తాడు.

ఇలా తెలియటం పేరే "అపవాదము".

అలాగే రజ్జు సర్ప భ్రాంతిలో, తాడుకన్న భిన్నంగా వేరే పాము లేదని గ్రహించటం "అపవాదం".

ఇవి దృష్టాంతాలు. మన దార్ష్టాంతికంలో బ్రహ్మ పదార్థం మీద ప్రపంచం అధ్యారోపణ చేయబడింది, కనుక, కార్యరూపంగా కనిపించే యీ ప్రపంచం వాస్తవం కాదని, ప్రపంచాన్ని నిషేధిస్తాడు (నిషేధించటమంటే, సత్యం కాదని తిరస్కరించటం).

ఈ ప్రపంచ నిషేధమే "అపవాదము".

ఈ నిషేధవిధానం బాగా అర్థం కావాలంటే కార్య కారణాల సంబంధం బాగా మనసుకు పట్టాలి. అందుకోసం మరో ఉదాహరణను పరిశీలిద్దాం.

5వ శీర్షికలో ఉపాదాన కారణము, నిమిత్తకారణము అనే అంశాలను వివరించుకొన్నాము. అక్కడ కుండను ఉదాహరణగా తీసుకున్నాం.

ఎక్కడయినా సరే కార్యమనేదానియొక్క అసలు స్వరూపం ఉపాదాన కారణమే. అనగా ఉపాదానకారణమే అక్కడ వుంటుంది. దానికి రూపమూ, నామమూ కొత్తవి వస్తాయి. కుండ అనేది కార్యం. కుండ అనగానే మనకు ఒక ఆకారం గుర్తువస్తుంది. ఆ పేరుకి ఆకారానికీ లంకె వుంది. ఆ కుండను పగులగొట్టి వచ్చిన ముక్కలను బాగా చూర్ణం చేశామనుకోండి. ఏమి మిగులుతుంది? కుండయొక్క ఆకారమూ, దాన్ని ఆశ్రయించుకొనివున్న కుండ అనే నామమూ పోయి కేవలం మట్టి మిగులుతుంది. ఇదేగా కుండకు ఉపాదాన కారణం! కనుక వచ్చిన మార్పుని (వికారాన్ని) నాశనం చేస్తే కార్యం నశించి ఉపాదానం మిగులుతుందన్నమాట. దీన్నే "కార్యం కారణంలో లయిస్తుంది" – అని వ్యవహరిస్తూ వుంటారు. అంటే, కుండ మట్టిలో లయించిందన్న మాట. ఈ దృష్టాంతాన్ని మన దార్ష్టాంతికంలోకి సమన్వయించి చూద్దాం.

అంతులేని పేర్లతో రూపాలతో జీవరాశుల శరీరాలు, బ్రహ్మాండాలు, కనిపిస్తున్నాయి కదా! వీటికి ఉపాదాన కారణం పంచభూతాలు కదా! కనుక బ్రహ్మాండాలు పంచభూతాల కన్నా వేరు కాదు.

పంచభూతాలకు కారణం పంచతన్మాత్రలు. కనుక పంచభూతాలు పంచతన్మాత్రలకన్నా వేరు కావు.

వీటిలో ఆకాశతత్త్వం మాయలోంచి వచ్చింది. కనుక ఆకాశతత్త్వం మాయకన్న వేరు కాదు.

మాయాధిష్ఠానమైన శుద్ధ చైతన్యంయొక్క జ్ఞానంవల్ల ఈ మాయ నశించి పోయి శుద్ధచైతన్యం మిగులుతుంది.

ఇలా మెట్లు మెట్లుగా అభేదం చెప్పుకొంటూ వచ్చాం కనుక, వెనక్కు తిరిగి చూస్తే, యీ బ్రహ్మాండ జాలమంతా శుద్ధచైతన్యంకన్నా (పరబ్రహ్మంకన్నా) వేరు కాదు అని తేలుతోంది.

కనుక కంటికి కనిపించే యీ ప్రపంచమంతా వాస్తవం కాదని తిరస్కరించటం (నిషేధించటం) జరుగుతోంది.

ఇలా బ్రహ్మకన్న వేరుగా ప్రపంచం లేదని నిషేధించటమే అపవాదము.

ఈ అసత్య కల్పనంతా దేనివల్ల జరుగుతోందో దానిపేరు మాయ. ఆ మాయను గూడా మన అపవాద విధానంలో నిషేధింపబడినవాటిలో చేరిపోయిందని మనం గమనించాలి. అందువల్లే "యా మా సా మాయా" అని నిర్వచనం చెప్పారు. "ఏది లేదో అది మాయ" అని అర్థం.

మాయకే అవిద్య అని మరో పేరు. దీనికి "యా న విద్యతే సా అవిద్యా" అని నిర్వచనం చెప్పారు. ఉండేదాని పేరు విద్య. ఏది వుండదో దాని పేరు అవిద్య.

ఈ వ్యుత్పత్తులవల్ల మాయ (లేక అవిద్య) అనేది కేవల కల్పితమని మరొక సారి ధ్రువపడుతోంది.

ఈ విధంగా అధ్యారోపవిధానంతో కారణ పరంపరను తెలుసుకొని, అపవాద విధానంతో కార్య పరంపరను నిషేధిస్తూ పోవటంవల్ల "బ్రహ్మపదార్థంకంటే భిన్నంగా ఏదీ లేనే లేదు. కనుక, ఉన్న నేను ఆ బ్రహ్మ పదార్థంకన్నా వేరయ్యే ప్రసక్తి లేదు" అనే జ్ఞానం కలుగుతుంది.

ఇలా అధ్యారోపాపవాదాలవల్ల నేనే బ్రహ్మననే అనుభవాత్మకమైన జ్ఞానం ఎవడికి కలుగుతుందో వాడే జీవన్ముక్తుడు.

ఈ విధంగా పీఠిక నుంచీ ఈ 18వ శీర్షిక వరకూ అధ్యారోపాపవాద విధానాలను వినియోగించుకొని జీవన్ముక్తిని పొందే రీతిని మనం వివరించుకొన్నాం. దీనిలో శాస్త్రీయ పదజాలాన్ని, కార్యకారణ పరంపరలను, విస్తారంగా ప్రస్తావించుకొన్నాం. అవన్నీ తేలికగా స్మృతి పథంలో వుండేందుకోసం కొన్ని ముఖ్యాంశాలను పట్టికలుగా తయారుచేసుకొందాము.

ప్రక్క పేజిలోని ముఖ్యాంశ పట్టిక పరిశీలిద్దాం.

**అధ్యారోపానికి మూలకారణం = అజ్ఞానం = మూలప్రకృతి**

- **సత్త్వము**
  - సత్త్వప్రధాన మూలప్రకృతి = మాయ
    - దీనిలో ప్రతిఫలించిన చైతన్యం ఈశ్వరుడు (ఇతడు సమష్టి)
      - సమష్టి మూల ప్రకృతిలోవుండటమే ఇతని సుషుప్తి
- **రజస్సు**
  - రజోగుణప్రధాన మూలప్రకృతి = అవిద్య
    - దీనిలో ప్రతిఫలించిన చైతన్యం జీవుడు (ఇతడు వ్యష్టి)
      - వ్యష్టి అవిద్యలో వుండటమే వీరి సుషుప్తి
- **తమస్సు**
  - తమోగుణప్రధాన మూలప్రకృతి = తామసి
    - దీనిలో ప్రతిఫలించిన చైతన్యం జగత్తు
      - **ఆవరణ శక్తి**
        - అసత్త్వావరణము ఇది పరోక్ష జ్ఞానం వల్ల నశిస్తుంది.
        - అభానావరణము ఇది శ్రవణ, మనన నిదిధ్యాసల వల్ల గలిగిన అపరోక్ష జ్ఞానంవల్ల నశిస్తుంది.
      - **విక్షేప శక్తి**
        - సూక్ష్మాకాశము
        - సూక్ష్మవాయువు
        - సూక్ష్మాగ్ని
        - సూక్ష్మ జలము
        - సూక్ష్మ భూమి

(ఇవే అపంచీకృత పంచభూతములు, లేక తన్మాత్రలు)

**సూక్ష్మ పంచభూతములు**

| | | |
|---|---|---|
| సత్త్వాంశ పంచ జ్ఞానేంద్రియాలు (ఆకాశం– చెవి వాయువు– చర్మం అగ్ని– కన్ను జలం– జిహ్వ భూమి– ముక్కు) | రజోగుణాంశ పంచ కర్మేంద్రియాలు (ఆకాశం– వాక్కు వాయువు– చేయి అగ్ని– పాదము జలం– విసర్జకం భూమి– జననేంద్రియం) | తమోగుణాంశ పంచీకృత పంచభూతాలు |
| ఈ అసత్య గుణాంశలన్నీ చేరి అంతఃకరణం | ఈ రజోగుణాంశలన్నీ చేరి ప్రాణం | బ్రహ్మాండములు |
| అహం కార, చిత్త బుద్ధి, మనస్సులు | ప్రాణ, అపాన, వ్యాన ఉదాన, సమానాలు | 4రకాల జీవరాశులు (ఉద్భిజ, స్వేదజ, అండజ, జరాయు జములు) |

పంచ ప్రాణాలు + పంచజ్ఞానేంద్రియాలు + పంచ కర్మేంద్రియాలు
+ మనోబుద్ధులు = సూక్ష్మశరీరం = లింగశరీరము

| | |
|---|---|
| పరలింగ శరీరము హిరణ్యగర్భుని లింగ శరీరము మహత్తత్వము (ఇది ఈశ్వరుని స్వప్నావస్థ) | అపరలింగ శరీరము జీవుల లింగ శరీరము అహంకారము (ఇది జీవుని స్వప్నావస్థ) |

**శరీరము మూడు రకాలు**

- కారణం
  - సమష్టి — ఈశ్వరుడు
  - వ్యష్టి — ప్రాజ్ఞుడు
- సూక్ష్మం
  - సమష్టి — హిరణ్యగర్భుడు
  - వ్యష్టి — తైజసుడు
- స్థూలం
  - సమష్టి — వైశ్వానరుడు విరాట్
  - వ్యష్టి — విశ్వుడు

సమష్టి సామాన్య నామం = ఈశ్వరుడు

వ్యష్టి సామాన్య నామం = జీవుడు

**విచారణ విధానాలు**

- అధ్యారోపము
  - సప్తసోపానాలు
    1. అజ్ఞానము
    2. ఆవరణ తత్త్వం
    3. విక్షేపం
    4. పరోక్షజ్ఞానం
    5. అపరోక్షజ్ఞానం
    6. దుఃఖనివృత్తి
    7. ఆనందప్రాప్తి
- అపవాదము
  - కార్యం నుంచి కారణం వైపుకు నడక

(కారణం నుంచి కార్యం వైపుకు నడక)

ఇట్లు మాయా వివరణమునందు ప్రథమ వర్ణకము సమాప్తము.

(వర్ణకమనగా విభాగము)

# ద్వితీయ వర్ణకము

## 19. అర్హత

"ఆత్మజ్ఞానోపదేశ విధి"లో మనను గురించి మనం వివేచన చేసుకొనే విధానాన్ని వివరించారు. ఇది మొదటి మెట్టు.

తరువాత మాయా వివరణ ప్రథమవర్ణకంలో ఈ మొదటి మెట్టువల్ల గలిగిన జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటానికి మంచి సాధనాలయిన అధ్యారోప, అపవాదాలను గురించి వివరించారు.

వివేచన చేయటమూ తెలిసింది, సాధన చేసే విధానమూ తెలిసింది. అయినా మనకు ఆత్మానందం అనుభవంలోకి రావటం లేదేమిటి? ఈ సందేహం తీరాలంటే మనకున్న యోగ్యత గురించి మనం పరిశీలించుకోవలసి వుంటుంది.

"పోలీసు పనంటే యేముంది? దొంగలను కనిపెట్టటం, వెళ్ళి పట్టుకోవటం! దానికి సాధనం సాక్ష్యాలను సేకరించటం! అంతే గదా!" ఇలా అనుకొని, ఒక రోగిష్ఠి నీరస వృద్ధుడు ఆ వుద్యోగానికి వచ్చాడనుకోండి. వాడివల్ల ఆ పని జరుగుతుందా? జరగదు. కేవలం విషయం తెలిస్తే చాలదు. దాన్ని సాధించే యోగ్యత వాడికి వుండాలి. కండబలం, యౌవనం, ధైర్యం మొదలైనవి పోలీసు ఉద్యోగానికి యోగ్యతలు. పోలీసు ఉద్యోగం కావాలంటే ముందుగా యీ యోగ్యతలను సంపాదించాలి.

సంగీతసాధన చెయ్యాలనుకొంటే, రాగాల పేర్లు బట్టీ పడితే చాలదు. త్రిస్థానాలను పలికే గొంతును సాధించాలి ముందు.

అలాగే, ఆత్మవిద్యలో (వేదాంత విద్యలో) గూడా, అనుభవం రావాలంటే, కొన్ని యోగ్యతలను ముందుగా సంపాదించాలి. శాస్త్రపరిభాషలో యీ యోగ్యతను "అధికారం" అని పిలుస్తారు. యోగ్యత గలవాడు "అధికారి".

ఆత్మవిద్యలో అడుగు పెట్టటానికి యోగ్యతను కలిగించే అధికారంలో నాలుగు మెట్లున్నాయి. అందుకే దీన్ని "సాధన చతుష్టయం" అంటారు. చతుష్టయం అంటే నాలుగు.

(i) నిత్యానిత్య వస్తు వివేకము

(ii) ఇహాముత్ర ఫలభోగ విరాగము

(iii) **శమదమాది షట్క సంపత్తి**

(iv) **ముముక్షుత్వము**

అనేవే ఆ నాలుగు మెట్లు.

ఒక్కొక్కదాని అర్థం తెలుసుకొందాం.

### (i) నిత్యానిత్య వస్తు వివేకము

నిత్య + అనిత్య + వస్తు వివేకము.

ప్రపంచంలో నిత్య వస్తువేది? అనిత్య వస్తువేది? అనే వివేకమే నిత్యానిత్య వస్తు వివేకం. వివేకం అంటే విమర్శవల్ల వచ్చిన జ్ఞానం.

మామూలు లోకవ్యవహారంలో మనం బ్రతికి వున్నంత కాలమూ స్థిరంగా వుండే వాటిని నిత్య వస్తువుల కింద భావిస్తూ వుంటాము. కొన్ని వస్తువులు కొంత కాలం పోయినాక నశించి పోతాయని తెలిసినా గూడా, అవి వున్నంత కాలమూ వాటిమీద ప్రేమతో వ్యవహరిస్తాము. అవి కావాలని ఆరాటపడతాము. ఉదాహరణకు, తలలో పెట్టుకొనే పువ్వు సాయంకాలానికి వాడిపోతుందని తెలుసు. అయినా దాన్ని చూచి మోహపడుతూనే వుంటాము.

ఒక వస్తువు కొంత కాలం వుండి తరువాత అంతరించిపోతే, అది వున్నంత కాలమూ, దాని ఉనికి నిజమైన ఉనికే గదా అని మనం భావిస్తూ వుంటాము. కనిపించింది కనుక, కనిపించిన సమయంలో దాని ఉనికి సత్యమే అని వాదిస్తాం.

ఇలా వాదించే మనమే, కలలో కనిపించిన నిధి సత్యమైన నిధి అని అంగీకరించము. "అది కనిపించినప్పటికీ, దాని ఉనికి సత్యమైనది కాదు. అది కనిపిస్తూ వుండిన సమయంలో గూడా ఆ నిధికి నిజమైన ఉనికి లేదు" అని మనం ఖచ్చితంగా చెపుతాము.

అంటే, మనం ఒక చోట ఒక రకంగా వాదిస్తున్నాం! మరొక చోట మరొక రకంగా వాదిస్తున్నాం! ఇది తప్పు కదా! ఒక వస్తువు కనిపించినంత కాలం అది నిజంగా వున్నట్లే అని అంగీకరిస్తే, కలలో కనిపించిన నిధి గూడా, ఆ సమయంలో సత్యమే అని అంగీకరించు. అలా అంగీకరిస్తే ఆ నిధి అక్కడికి ఎలా వచ్చింది, మళ్ళీ ఎక్కడికి పోయింది. వగైరా ప్రశ్నలకు సమాధానం దొరకదు. కనుక ఆ నిధి ఆ సమయంలో గూడా సత్యమని అంగీకరించటం సాధ్యం కాదు.

కనిపించినంత మాత్రాన సత్యం కానక్కరలేదని అంగీకరించేటట్లయితే, కొంత కాలం కనిపించి తరువాత కనిపించకుండా పోయే ఏ వస్తువైనా సరే, అసత్యమే (లేనిదే), కనిపిస్తూ వుండిన సమయంలో గూడా లేనిదే, అని అంగీకరించాలి. తప్పదు.

అందుకనే,"భూత భవిష్యద్వర్తమాన కాలాలు మూడిటిలోనూ అవిచ్ఛిన్నంగా నిలబడి వుండే వస్తువు మాత్రమే నిజంగా అస్తిత్వం వున్న వస్తువు. అదే నిత్యమైన వస్తువు" అని వేదాంత శాస్త్రం నిర్వచిస్తోంది. "ఏ ఒక్క క్షణంలో అయినా అది లేనిదయితే, అది త్రికాలాలలోనూ గూడా పూర్తిగా లేనిదే" అని గూడా వేదాంత శాస్త్రం వివరిస్తోంది.

ఈ చర్చ ప్రకారం ఆలోచిస్తే, పరబ్రహ్మ పదార్థం ఒక్కటే నిజమైన నిత్యసత్య వస్తువు. మనకు కనిపించే, ఊహకందే, యీ జగత్తంతా అనిత్యమే, అసత్యమే అని వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, స్మృతులు మొదలయినవన్నీ ఏకకంఠంగా నిర్ణయించి చెపుతున్నాయి.

ఈ జ్ఞానం మనస్సుకు పట్టటమే నిత్యానిత్యవస్తు వివేకం. ఇది సాధన చతుష్టయంలో మొదటిమెట్టు.

### (ii) ఇహాముత్ర ఫలభోగ విరాగము

ఇది రెండవ మెట్టు. పేరు పెద్దదే గాని, దీని సారాంశం వైరాగ్యం. దేనిపట్ల వైరాగ్యం? ఈ లోక సుఖాల పట్ల, పరలోక సుఖాల పట్ల గూడా వైరాగ్యం!

వైరాగ్యమంటే యేమిటి? కోరిక లేకపోవటమే వైరాగ్యం.

కోరిక ఎందుకు కలుగుతుంది? ఏదైనా వస్తువును చూచినపుడు గానీ, దాన్ని గురించి విన్నప్పుడు గానీ, "ఇది సత్యమైనది, దీనివల్ల నాకు లాభం కలుగుతుంది". అని విశ్వాసం ఏర్పడితే దానిమీద ప్రేమ కలుగుతుంది.

సముద్రతీరాన, దూరాన, వెండి ముద్ద కనిపించింది. ఎగిరి గంతువేసి దూకబోయాడు. ప్రక్కన వున్న ఆప్తుడు చూసి "ఎందుకు ఉరుకుతున్నా" వన్నాడు. "వెండికోస"మని వీడు చెప్పాడు. "అది వెండి కాదురా, ముత్యపు చిప్ప. ఎండలో అలా మెరుస్తోంది" అని ఆప్తుడు చెప్పాడు. వీడు గూడా పరిశీలించి చూశాడు. అది ముత్యపు చిప్పే! కానీ వెండి లాగా కనిపిస్తోంది. ఇక వీడికి ఆ వెండిమీద రాగం (కోరిక) వుంటుందా? వుండదు. ఎందువల్ల? కనుపించకనా? కాదు, కనిపిస్తోంది.

కనిపించినా, అది అసత్యమని అర్థమయింది గనుక, ఇక దానిమీద కోరిక వుండదు. ఇదే వైరాగ్యం! ఈ వైరాగ్యానికి కారణమేమిటి? ఆ కనిపిస్తూ వున్న వెండి నిజం కాదని జ్ఞానం కలగటమే!

మరో అంశం గూడా వుంది.

నీ గదిలోకి చాకులాంటి కుర్రవాడొకడు ప్రవేశిస్తున్నాడు. వాడి చేతిలో మంచి మామిడి పండు వుంది. అది నీకందించబోతున్నాడు. నీకు చురుకుగా వుండే యువకులంటే ఇష్టం. మామిడిపండంటే నాలిక కోసుకొంటావు. సంతోషంగా పిల్లవాడికి కరచాలనం చేసి, మామిడిపండు అందుకోవాలనుకొంటున్నావు.
ఇంతలో ఫోను మ్రోగింది. విసుగుగానే ఫోను ఎత్తుకొన్నావు. అవతల మాట్లాడుతున్నది నీ ఆప్తమిత్రుడు, పోలీసు అధికారి.

"ఆ పిల్లవాడి చేతిలో వున్న మామిడి పండులో బాంబు వుంది. నీ శత్రువులు ఆ కుర్రవాడికి యిచ్చి పంపారు" అని అతడు చెపుతున్నాడు.

ఇక నీకు ఆ పిల్లవాడు గానీ, మామిడి పండు గానీ ప్రియమైనవి అవుతాయా? కానేరవు.

"ఆ మామిడిపండు తియ్యగా వుంటుంది, అది మంచి రుచిని కలిగిస్తుంది" అని భావించినంత కాలం దానిమీద ప్రేమ వుంటుంది. దానివల్ల సుఖం రాదని, పైగా ప్రమాదం వస్తుందనీ తెలిసినపుడు ఇక ప్రేమ వుండదు. ఇదే వైరాగ్యం. ఈ వైరాగ్యానికి కారణమేమిటి? ఆ వస్తువువల్ల లాభం రాదని తెలియటమే.

ఫలభోగాలు రెండురకాలు.

**1. ఇహఫలభోగాలు**

**2. పరలోక (అముత్ర) ఫలభోగాలు**

ఈ లోకంలో వచ్చే ఫలాలు, వాటి భోగాలు, గూడా మనం చేసే కృషినిబట్టి లభిస్తాయి. బాగా శ్రమించి పొలం మీద పనిచేస్తే, ఎక్కువ బస్తాల ధాన్యం వస్తుంది. వచ్చిన ఈ ఫలం కొన్నాళ్ళనుభవించే సరికి అయిపోతుంది. మళ్ళీ శ్రమించి సంపాదించుకోవాలి.

పరలోక సుఖాలు గూడా, మనం శ్రమించి సంపాదించుకొనే పుణ్యఫలాల మీద ఆధారపడి వుంటాయి. బాగా శ్రమిస్తే స్వర్గలోక ఫలితాలు అందుతాయి. ఇంకా

ఇంకా శ్రమిస్తే బ్రహ్మలోక, వైకుంఠ, కైలాసాది ఫలితాలు లభిస్తాయి. ఇవి గూడా, ధాన్యపు బస్తాల లాగానే, మన శ్రమకు ఫలితాలే గనుక, అనుభవించగా అనుభవించగా ఒక నాటికి అయిపోక తప్పదు.

ధాన్యపు బస్తాల విషయంలో అయితే అవి వుండగానే, ఒక ప్రక్క కొంచెం అనుభవిస్తూ, మరొక ప్రక్క కొంచెం శ్రమిస్తూ, ప్రోగు చేసుకొనేందుకు వీలు వుంది. పరలోక ఫలాల విషయంలో ఈ వీలు లేదు. ఆ పుణ్యాలను అనుభవించే కాలంలో మళ్ళీ పుణ్యాలను చేసుకొనే వీలు లేదు. కనుక, పూర్తిగా అనుభవించేసి, దివాళా తీసి, భూమికి వచ్చి, మళ్ళా పుణ్యంకోసం ప్రయత్నించ వలసిందే.

అందువల్ల ఈ పరలోక ఫలాలు, అశాశ్వతాలు మాత్రమే గాక, మనకు మరింత చిక్కులు తెచ్చి పెట్టే స్వభావం కలవి.

ఈ జ్ఞానం కలిగిననాడు, ఇహలోక సుఖాల మీదా, పరలోక సుఖాల మీదా గూడా విరక్తి పుట్టుకొస్తుంది. ఎంత తీవ్రంగా పుట్టాలంటే "నీకు బ్రహ్మపదవి ఇస్తామయ్యా" – అని అంటే, కుక్క వాంతిని చూసినట్లు అసహ్యించుకొని అవతలకు పోవాలి.

కడుపు బాగా నిండినప్పుడు, లడ్డూ వద్దని పక్కన పెట్టడం వైరాగ్యం కాదు. పైన చెప్పినట్టుగా తీవ్రమైన ఇచ్ఛారాహిత్యం కలగటమే నిజమైన వైరాగ్యం. ఇదే ఇహాముత్ర ఫలభోగ విరాగం.

### (iii) శమదమాది షట్క సంపత్తి

అనగా శమము మొదలైన ఆరు అంశములను కలిగి వుండుట. అవి – **1. శమ, 2. దమ, 3. ఉపరతి, 4. తితిక్షా, 5. శ్రద్ధ, 6. సమాధానములు.** ఇవి సిద్ధించటమే శమాది షట్క సంపత్తి. దీనినే శమదమాది షట్కసంపత్తి అని కూడా వ్యవహరిస్తూ వుంటారు. ఇప్పుడు ఈ ఆరు అంశాలను విడివిడిగా తెలుసుకొందాం.

### 1. శమము

శమము అనగా అంతరింద్రియ నిగ్రహము. అంతరింద్రియ మనగా మనస్సు. మనస్సులోకి పూర్వజన్మ వాసనవల్ల అనేక రకాల ఆలోచనలు వస్తూ వుంటాయి. మనస్తత్త్వ శాస్త్ర ప్రకారం ఈ మనస్సుకు మంచి చెడ్డలతో పని లేదు. అన్నిరకాల ఊహలనూ చేస్తూనే వుంటుంది. ఈ ఆలోచనా ప్రవాహాన్ని మనోబలంచేతనే అరికట్టడం పేరు శమం.

పూర్వజన్మ వాసనవల్ల వచ్చే ఆలోచనా పరంపరను నిర్లక్ష్యం చేసి, తను భావించ దలుచుకున్న మంచి విషయానికి సంబంధించిన భావనా పరంపరను నిలబెట్టు కోవటమే శమమని తాత్పర్యం. మనోబలం తీవ్రంగా వున్నవారు సంకల్పబలంచేతనే దీనిని సాధించవచ్చును. ఇతరులు దమం ద్వారా దీనిని సాధించాలి.

**2. దమము**

దమము అనగా బహిరింద్రియ నిగ్రహం. బహిరింద్రియములు పది. వాటిలో జ్ఞానేంద్రియములు ఐదు. కర్మేంద్రియములు ఐదు. పూర్వ జన్మ వాసనవల్ల మనసులోకి కోరికలు ప్రవేశించినపుడు బాహ్యేంద్రియాలు ఆయా కోరికలు తీర్చుకొనే పనులను ప్రారంభిస్తాయి. వీటిలో చెడు పనులేవో శాస్త్రం ద్వారా తెలుసుకొని, మనసు వాటిని కోరుతున్నా సరే, ఇంద్రియాలు ఆ పనిని చేయకుండా నిరోధించటమే దమము. ఈ నిరోధం కూడా మనోబలం ద్వారానే జరగాలి. అయితే మనస్సులోని సంకల్పాలను సరాసరి నిగ్రహించేదానికన్నా, బయటి ఇంద్రియాలను నిగ్రహించటానికి తక్కువ మనోబలం సరిపోతుంది. సరి అయిన శ్రద్ధతో దమాన్ని అభ్యాసం చేస్తే మనోబలం పెరిగి శమం సులభంగా సిద్ధిస్తుంది. అలా కాక వంచన కోసమో, డాంబికం కోసమో దమాన్ని అభ్యసిస్తే, సమయం చూసుకొని మనసులోని సంకల్పాలు పెట్రేగి శమం పూర్తిగా దూరమై, దమం కూడా ధ్వంసమైపోతుంది. కనుక దమాన్ని నిజాయితీతో, శ్రద్ధా విశ్వాసాలతో, సాధన చేయటం చాలా అవసరం.

**3. ఉపరతి**

ఉపరతి అనగా విరమించుకోవటం. లోకంలో శబ్దములు, రూపములు మొదలైనవి మనసును ఆకర్షించి బంధిస్తూ వుంటాయి. ఆ కనిపించే వస్తువులలో ఏదో గొప్పదనం వుందని విశ్వాసం కలగడంవల్ల వాటి ఆకర్షణలో పడతాం మనం. వివేక జ్ఞానంవల్ల వాటిలో మనమనుకొన్న గొప్పదనం లేకపోగా, అవి శాశ్వతాలు కావని, పైగా వాటి అనుభవంవల్ల చివరిలో మనకి దుఃఖమే కలుగుతుందని, ఈ రకంగా వాటిలో గల దోషాన్ని దర్శించటం అభ్యాసం చేసుకొన్న కొద్దీ వాటికి గల ఆకర్షణశక్తి సన్నగిల్లి, ఇంద్రియాలు వాటివైపు పరిగెత్తటం విరమించుకొంటాయి. ఇలా విరమించుకోవటమే ఉపరతి.

వివేకంవల్ల కలిగిన ఉపరతి ద్వారా దమాన్ని సాధించినపుడు అది శమానికి దారి తీస్తుంది. అలా కాక భయంవల్ల గానీ, కాసేపు దీనిని నిగ్రహించుకుంటే గొప్ప లాభం వస్తుందని గాని, దమాన్ని సాధించినట్లైతే అది మొదటికే మోసాన్ని తెస్తుంది.

ఉదాహరణకు, పట్టుబడితే తన్నుతారని భయపడి దొంగతనం మానినవాడు దుర్బలుల దగ్గర దొంగతనం చేయనే చేస్తాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షం కావాలని గొప్ప ఇంద్రియ నిగ్రహంతో తపస్సు చేసిన రాక్షసులు వరాలు పొందాక ఘోరంగా వ్యవహరించారు. కనుక వివేకం ద్వారా ఉపరతిని, దాని ద్వారా శమాన్ని, సాధించినప్పుడే సత్ఫలితం లభిస్తుంది. ఈ ఉపరతికే సంన్యాసము, నిష్కామకర్మానుష్ఠానము, వ్యవహారలోపము అనేవి రూపాంతరాలు.

### 4. తితిక్ష

తితిక్ష అనగా సహనం. దుఃఖాలు, శీతోష్ణాది వైషమ్యాలూ వచ్చినపుడు వాటికి తగిన ప్రతిక్రియను చేయాలని కోరుకోవటం జీవులకు సహజం. ఈ కోరికతోనే మానవులు పాపాలు కూడా చేస్తారు. ఎన్ని చేసినా పూర్వకర్మ ఫలం అనుభవించక తప్పదని, ఈ నాటి దుఃఖానికి వెనుకటి తన తప్పులే కారణమని, వివేకం కలిగిన వాడు అన్యాయమైన మార్గాల ద్వారా తన దుఃఖాలను పోగొట్టుకోవాలని చూడడు. ఇంకొక అడుగు ముందుకు వేసి, ఈ దృశ్య ప్రపంచం అనిత్యమని, అల్పమని, అసత్యమని, గ్రహించినవాడు ఈ లోకంలో లభించే సుఖాల లాగానే దుఃఖాలు కూడా నిస్సారమని గ్రహిస్తాడు. వాడు ఇంద్రియ సుఖాలను సంపాదించాలనే ప్రయత్నం మానినట్లే, ఇంద్రియాలవల్ల కలిగే దుఃఖాలను పోగొట్టుకోవాలనే ప్రయత్నం కూడా మానుకుంటాడు. ఇదే తితిక్ష. తితిక్ష ఉపరతికి ద్వారంగా పని చేస్తుంది.

### 5. శ్రద్ధ

శ్రద్ధ అనగా విశ్వాసం. పైన చెప్పిన నాలుగు అంశాలలోనూ ప్రతి చోటా వివేకం ద్వారా ఆ అంశం లభిస్తున్నట్లు మనకు అర్థమైంది కదా! ఆ వివేకం శాస్త్ర వాక్యాలవల్ల కలుగుతుంది. ఆ వాక్యాలను గురువులు వివరిస్తారు. గురువుల పట్ల, శాస్త్రముల పట్ల, విశ్వాసంతో వున్నప్పుడే ఆ భావాలు మనకు సరిగా అర్థమౌతాయి. అనుభవంలోకి కూడా వస్తాయి. కనుక, పై నాలుగు అంశాలకీ మూలమైనది శ్రద్ధ.

మనకు విభిన్న అనుభూతులు వుంటాయి. ఉదాహరణకు, ఈ దేహం నాది అని, నేనే ఈ దేహమని, రెండు అనుభూతులూ మనకే వున్నాయి. ఈ అనుభూతులను విశ్లేషించి, సత్యాన్ని అన్వేషించేటప్పుడు, ఒక్కొక్కప్పుడు గురువులు, శాస్త్రాలు మన అనుభవానికి విరుద్ధంగా మాట్లాడుతున్నట్లు కనిపిస్తూ వుంటుంది. కాని, వారు చెప్పినట్లు విశ్వసించి పరిశీలిస్తే మన అనుభవాలలో గల తికమకలు తొలగి, వారు చెప్పిన నిర్ణయానికే మనమూ వస్తాము. అప్పుడు సత్యజ్ఞానం కలుగుతుంది. ఇది కలిగే ముందు

విశ్లేషణ దశలోనే గురువుల, శాస్త్రాల వాక్యాలను తిరస్కరిస్తే, మన తికమక మరింత జటిలమే అవుతుంది. కనుక, "గురుశాస్త్ర వాక్యములు సత్యములే, నాకు కలిగే సందేహాలు సరిగా ఆలోచించక పోవటంవల్ల కలుగుతున్నాయి" అనే దృఢభావన వున్నప్పుడే సత్యజ్ఞానం సిద్ధిస్తుంది. అట్టి దృఢభావన పేరే శ్రద్ధ.

### 6. సమాధానం

సమాధానమనగా ఏకాగ్రత. లోకంలో కోరిక, భయము మొదలైనవాటి బలంవల్ల ఏక్రాగ్రత ఏర్పడుతుంది. ఉదాహరణకు, పరీక్షలు దగ్గరకు వస్తున్నకొద్దీ విద్యార్థికి ఏకాగ్రత పెరుగుతుంది. ఇది సమాధానం కాదు. "నాయొక్క మూల స్వరూపం ఏది? ఈ జగత్తుయొక్క మూల తత్త్వమేది?" అనే జిజ్ఞాసవల్ల లౌకిక విషయాలపట్ల అశ్రద్ధ ఏర్పడి, తత్త్వ వస్తువుపై ప్రీతి పూర్వకమైన ఏకాగ్రత ఏర్పడుతుంది. దీని పేరే సమాధానం.

సమాధానం జన్మ సంస్కారంవల్ల తనంత తానుగా మొలకెత్తుతుంది. దీనివల్ల వివేకం పెరుగుతుంది. పెరిగిన వివేకం సమాధానాన్ని మరింత పెంచుతుంది. ఈ రెంటివల్ల శ్రద్ధ పెరుగుతుంది. శ్రద్ధాసమాధానములు తితిక్షను, తితిక్ష ఉపరతిని, ఉపరతి దమాన్ని, దమం శమాన్ని కలిగిస్తాయని మనం గ్రహించాలి.

ఈ అరు అంశాలూ కలిపి శమదమాది షట్కసంపత్తి. ఇది సాధన చతుష్టయములో మూడవ మెట్టు. నాలుగవ మెట్టు పేరు ముముక్షుత్వం.

### (iv) ముముక్షుత్వము

ముముక్షుత్వము అంటే మోక్షము కావాలనే కోరిక అని వ్యాకరణం ప్రకారం అర్థం. వేదాంతశాస్త్ర పారిభాషికంగా దీనికి మోక్షంపై తీవ్రమైన ఇచ్ఛ అని అర్థం. "తీవ్రమైన" అంటే ఏమిటి?

అర్ధరాత్రి నిద్రిస్తుండగా ఇల్లంటుకుంది అనుకోండి. మెలకువ వచ్చిన యజమాని డబ్బును, పెళ్ళాం పిల్లల్ని, తీసుకొని బయటపడాలని ప్రయత్నిస్తాడు. ఇది సాధ్యం కానప్పుడు డబ్బును వదలి, పెళ్ళాం పిల్లల్ని బయటకు తీసుకురావాలని ప్రయత్నిస్తాడు. కొంప పూర్తిగా కూలిపోతున్నపుడు ఇక లాభం లేదని అన్నీ వదిలేసి, అందర్నీ వదిలేసి, తను బయట పడితే చాలని ఆరాట పడతాడు. ఆ సమయంలో వేరే ఏదైనా సంపాదించుకుందామని కాని, నిలబెట్టు కుందామని గాని, ఆలోచన వుండదు. ఈ మంటల్లోంచి తను బయటపడితే చాలని ఆలోచిస్తాడు, ప్రయత్నిస్తాడు. ఇదే తీవ్రేచ్ఛ.

ఇదే రీతిగా సంసార తాపాలు పెచ్చు పెరిగినపుడు, కోరికలన్నీ వదలి పరమాత్మ తాదాత్మ్యాన్ని పొందాలని తీవ్రంగా ఆరాటపడటం పేరు ముముక్షుత్వం (లేక) ముముక్షా.

ముముక్షుత్వం కలగాలంటే ఇతర విషయాల మీద కోరికలు పోవాలని చెప్పుకున్నాం కదా. ఈ కోరికలను ఏషణలు అంటారు. వీటిని మూడు రకాలుగా పెద్దలు విభజించారు.

1. **దారైషణ**

2. **పుత్రైషణ**

3. **ధనైషణ –** వీటినే ఏషణత్రయం అంటారు.

దారైషణ అంటే భార్యపై కోరిక. ఇది అన్ని ఇంద్రియాల కోరికలకూ సంకేతం. పుత్రైషణ అంటే పిల్లలపై కోరిక. ఇది సమస్త బంధుజన ప్రీతికీ సంకేతం. ధనైషణ అంటే డబ్బుపై కోరిక. ఇది అన్ని విధాల ఐశ్వర్య, అధికార, కీర్తులపై కోరికకూ సంకేతం.

ఏషణత్రయాన్ని పరిత్యజించి "భగవన్! నాకీ సంసార బంధంనుంచీ ముక్తి (విడుదల) ఎలా వస్తుంది? ఎప్పటికి వస్తుంది?" అని ఒకటే ఆరాటపడటం పేరే ముముక్షుత్వము. ఇది వున్నవారికే ఆత్మవిద్యలో ప్రవేశించేందుకు అర్హత వుంటుంది. మూడవ మెట్టుగా చెప్పుకున్న శమదమాది షట్కసంపత్తికి ఫలితంగా మానవులలో ముముక్షుత్వం పరిపాకదశకు చేరుకుంటుంది.

ఈ విధంగా 19వ శీర్షిక ప్రారంభం నుంచి ఇప్పటివరకూ ఆత్మవిద్యలో అడుగు పెట్టడానికి గల యోగ్యతను లేక అర్హతను కలిగించే నాలుగు మెట్లను, (సాధన చతుష్టయాన్ని) గూర్చి చెప్పుకొన్నాం. ఈ నాలుగు మెట్లకూ గల పరస్పర సంబంధాన్ని అక్కడక్కడా ప్రస్తావించుకున్నాం. స్పష్టతకోసం ఆ సంబంధాన్ని మరో సారి చర్చించుకొందాం.

మొదటి మెట్టు నిత్యానిత్యవస్తు వివేకం. ఇది పాండిత్యం గలవారికి గ్రంథ పరిచయంవల్ల తేలికగా లభిస్తూనే వుంటుంది. కాని వారిలో చాలామందికి దీనివల్ల లభించవలసిన వైరాగ్యం మాత్రం లభించదు. అందువల్ల కేవలం నిత్యానిత్యవస్తు వివేకం చాలదని, దీనికి తోడుగా ఇహాముత్రార్థఫలభోగ విరాగం వుండి తీరాలని రెండవ మెట్టు చెప్పబడింది. కొంత తపస్సాధన చేసినవారికి పై రెండూ వుంటాయి కాని, ఏదో సందర్భంలో కోపతాపాదులు కొమ్ము విసురుతూనే వుంటాయి. మహర్షుల

కథల్లో ఇలాంటి ఘట్టాలనేకం చూశాం మనం. ఈ దశకూడా దాటాలి. అందుకే శమదమాదిషట్కసంపత్తి అనే మూడో మెట్టు ఏర్పడింది. పై మూడు మెట్లూ వుంటే చాలా మటుకు యోగ్యత లభించినట్లే. కానీ, ఈ దశలో కూడా కొందరు సగుణోపాసన పారవశ్యంలో పడి తత్త్వచింతనకు దూరమయ్యే అవకాశం వుంది. అందుకోసం ముముక్షుత్వమనే నాలుగవ మెట్టును కూడా స్వీకరించడం జరిగింది.

## 20. గురు శరణాగతి

ఈ నాలుగు మెట్ల అధికారము సంపూర్ణంగా స్వాధీనమైన సాధకుడు తన పాండిత్యంవల్ల, లోకానుభవంవల్ల, తన తపస్సాధనలవల్ల, భక్తి పారవశ్యంవల్లా, తత్త్వాన్ని అందుకోవటం సాధ్యంకాదని అనుభవ పూర్వకంగా తెలుసుకొంటాడు. అపుడతడు అనన్య భక్తితో బ్రహ్మనిష్ఠుడైన సద్గురువును శరణు వేడుతాడు.

శరణు వేడటమంటే? ఆ సద్గురువువల్ల వేరే కోరికలేవో తీరాలనే సంకల్పం లవలేశం కూడా లేకుండా, "గురుదేవా! నేనెవరిని? దేవుడెవరు? ఈ లోకమేమిటి? నాకు వచ్చిన ఈ బంధం ఎలా పోతుంది?" అని ఏకాగ్రభావంతో ప్రార్థించాలి. ఆ గురువు సాక్షాత్పరమాత్మ స్వరూపుడనే నిశ్చయంతో ఆరాధించాలి.

ఈ విషయంలో శ్రుతి

**"పరీక్ష్యలోకాన్ కర్మచితాన్**
**బ్రాహ్మణో నిర్వేదమాయాత్**
**నాస్త్యకృతః కృతేన।**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్॥**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్"**

(బ్రహ్మజ్ఞానాసక్తుడైనవాడు ఈ లోకాలన్నీ పూర్వకర్మచేత సంపాదితాలని గ్రహించి, కర్మసంపాదితమైన పదార్థాల ద్వారా కర్మాతీతమైన మూలపదార్థాన్ని అందుకోవటం అసాధ్యమని గుర్తించి, నీరసపడిపోయాడు. అలాంటివాడు సమిధను చేత ధరించి (అనగా అత్యంత వినీతుడై) వేద వేత్త, బ్రహ్మ నిష్ఠుడు అయిన గురువును శరణుపొందాలి) – అని చెప్పింది.

భగవద్గీతగూడా

**"తద్విద్ధిప్రణిపాతేన**
**పరిప్రశ్నేన సేవయా"**

(సాష్టాంగ వందనం చేత, వినయ పూర్వక ప్రశ్న చేత సేవచేత, ఆ తత్త్వరహస్యాన్ని తెలుసుకో)– అని చెప్పింది.

కనుక సద్గురువును విశేషంగా ప్రార్థించగా ఆయన సత్త్వ రజ స్తమోగుణాలద్వారా జీవుడు, ఈశ్వరుడు, జగత్తు అనే వాటిరాకను, తరువాత ఆత్మ స్వరూపాన్ని గూడా స్పష్టంగా వివరిస్తాడు.

అలా ఉపదేశంపొందిన సాధకుడికి, అనేక జన్మల పుణ్య పరిపాకబలంవల్ల ఈశ్వరానుగ్రహం కలిగి, అతని సాధన చతుష్టయం సఫలమవుతుంది. ఇలాంటి తత్త్వజ్ఞానాన్ని ప్రసాదించే గురువును దేవుడే అనుకోవాలి.

ఈ విధంగా సద్గురుముఖంగా జీవాత్మపరమాత్మల అభేదాన్ని ఎవడు విచారణ పూర్వకంగా గ్రహిస్తాడో వాడే ముక్తిని అందుకోగలడు.

ఇట్లు మాయావివరణమునందు ద్వితీయవర్ణకము సమాప్తము.

## తృతీయ వర్ణకము

19వ శీర్షిక నుంచీ ఇప్పటి వరకు వేదాంత తత్త్వానికి కావలసిన యోగ్యతలను గూర్చి చర్చించుకొన్నాము. ఇట్టి యోగ్యతలను సంపాదించుకొని, ఏ రకమైన బ్రహ్మతత్త్వాన్ని విచారణ చెయ్యాలో దాన్ని ఆ వెనుకటి శీర్షికల్లో ప్రస్తావించుకొన్నాము.

బ్రహ్మవిచారణ బహుముఖాలుగా జరగాలి. ఎటునుంచీ విచారణ ప్రారంభించినా, చివరికి వచ్చే నిర్ణయం ఒకటే అవాలి. అలా అయినప్పుడే మనం చేసిన నిర్ణయం సరియైనదని నిర్ధారణ అవుతుంది. అందుకే తీవ్ర ముముక్షుత్వం గలిగిన శిష్యుడికి, సద్గురువు అనేక విధాలయిన విచారణా మార్గాలను అభ్యాసం చేయిస్తాడు. ఇపుడు మరొక మార్గాన్ని పరిశీలిద్దాము.

### 21. ఆత్మ– అనాత్మ

మనకు కనిపించే యీ విస్తారమైన ప్రపంచంలో చైతన్యం గల పదార్థాలు కొన్ని, చైతన్యం లేని పదార్థాలు కొన్నీ కనిపిస్తున్నాయి. చైతన్యం గల పదార్థాలను చేతనములనీ, చైతన్యంలేని పదార్థాలను జడములనీ అంటారు.

చైతన్యమంటే యేమిటి? స్వతంత్రమైన చలనమే చైతన్యమని స్థూలంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ స్వతంత్రమంటే యేమిటి? తను కదలటానికి ఇతరుల ఇచ్ఛతో

నిమిత్తం లేకపోవటం. కనుక స్వతంత్రమైన చలనానికి వెనుక తన ఇచ్ఛ వుంటుంది. జ్ఞానంగలవారికి మాత్రమే ఇచ్ఛ వుండగలదు. కనుక ఇచ్ఛ వెనకాల జ్ఞానం వుంటుంది. కాగా, చేతనములు అంటే. జ్ఞానంగల పదార్థములు అని తేలిందన్నమాట.

జ్ఞానమనేది కేవలం ఆత్మ లక్షణం. సత్యము, జ్ఞానము, అనంతము అనేవి పరబ్రహ్మ లక్షణాలని వేదం చెప్పింది.

ప్రపంచంలో మనకు కనిపించే చేతన పదార్థాలలో కూడా, కొంత చైతన్యాంశ, కొంత జడాంశ, వుంటుంది. ప్రపంచంలోని మొత్తం చైతన్యాంశను విడదీస్తే దాని పేరు ఆత్మ పదార్థం. మిగిలిన జడాంశమంతా అనాత్మ పదార్థం.

**ప్రశ్న:** ఆత్మ అనేది ఒకే ఒక పదార్థమనీ, అద్వితీయమనీ చెప్పుకొని వున్నాం. కానీ, లోకంలో చేతన పదార్థాలు అనేకంగా, విభిన్నంగా కనిపిస్తున్నాయి గదా! కనుక, మనం ఇదివరలో చెప్పుకొన్న అద్వితీయ ఆత్మ, ఈ చైతన్యం, ఒకటి కాదేమో!

## 22. అవచ్ఛిన్నవాదము

**సమాధానము:** అలా కాదు. ఉన్న ఆత్మ ఒకటే అయినా, అది అంతటా ఏకరూపంగా వ్యాపించివున్నా, దాన్ని మనం ఏదో ఒక ఉపాధి ద్వారా మాత్రమే గ్రహించగలుగుతున్నాము.

ఉదాహరణకు, ఆకాశం మన చుట్టూతా ఏకరూపంగా వ్యాపించే వుంది. కానీ, దాన్ని మనం సాక్షాత్తుగా గ్రహించలేము. ఒక కుండ వుంటే, దానిలో వున్న ఖాళీ ప్రదేశాన్ని బట్టి ఇక్కడ ఆకాశం వుందని గుర్తించి, దాన్ని ఘటాకాశమని వ్యవహరిస్తాము. అలాగే పెద్ద గదిలో వున్న ఖాళీనిబట్టి దాన్ని గుర్తించి, దాన్ని మఠాకాశమని వ్యవహరిస్తాము. ఇక్కడ అసలు ఆకాశము, ఘటాకాశము, మఠాకాశము అని వేరే వేరే పదార్థాలు వున్నాయా? లేవు. అసలు ఆకాశాన్ని సూటిగా గుర్తించలేని మనం. ఘటాన్ని బట్టీ, మఠాన్ని బట్టీ ఘటాకాశ, మఠాకాశాలనే పేర్లతో దాన్ని గుర్తుపడుతున్నాం. గుర్తుపట్టి ఘటాకాశం వేరు, మఠాకాశం వేరు అంటున్నాం. ఇక్కడ ఆకాశాన్ని మనం గుర్తించేందుకు ఉపకరించిన ఘట మఠాలను ఉపాధులు అని వ్యవహరిస్తారు. అంటే, ఘటం ఉపాధిగా గల ఆకాశాన్ని ఘటాకాశమనీ, మఠం ఉపాధిగా గల ఆకాశాన్ని మఠాకాశమనీ అంటారన్నమాట. కాగా యీ ఉపాధులవల్ల ఆకాశంలో నిజమైన మార్పేమీ రాలేదు. ఐనాసరే, అది వేరు ఇది వేరు అనే వ్యవహారానికి మాత్రం యీ ఉపాధులే కారణమయినాయి.

అదే విధంగా జ్ఞాన రూపమయిన చైతన్యం ఏకరూపంగా అంతటా వ్యాపించి వున్నా గూడా, దాన్ని మనం, వివిధ అంతఃకరణాల ద్వారా మాత్రమే గ్రహించ గలుగుతున్నాం. కుండలో ప్రవేశించిన ఆకాశం లాగా, మనిషి అంతఃకరణంలోకి ప్రవేశించిన చైతన్యం మానవుడని, పశువు అంతఃకరణంలోకి ప్రవేశించిన చైతన్యం పశువు అనీ, దేవతల అంతఃకరణంలోకి ప్రవేశించిన చైతన్యం దేవతలనీ, మనం వ్యవహరిస్తున్నాము. కాగా అంతఃకరణములు అనబడే ఉపాధుల ద్వారా, ఒకే ఆత్మ అనేక జీవాత్మలుగా మనకు కనిపిస్తూ వుంటుంది.

**ప్రశ్న:** చైతన్యం అంతఃకరణాలలోకి ప్రవేశించింది అంటున్నారుగా! అంటే అంతకు ముందు ఆ చైతన్యం అంతఃకరణంలో లేనట్లే గదా! అంటే, చైతన్యం అంతటా వ్యాపించి లేనట్లే గదా!

**సమాధానము:** ఘటాకాశం అన్నప్పుడు ఆకాశం నిజంగా ఘటంలోకి ప్రవేశించిందా? లేదే! అయినా ఘటంలోకి ప్రవేశించిందని భావించి, ఆ ఆకాశాన్ని ఘటాకాశమని వ్యవహరించాము. అలాగే, ఇక్కడ గూడా చైతన్యం నిజంగా ప్రవేశించలేదు. నీవు ఒకానొక అంతఃకరణం ద్వారా ఆ చైతన్యపు ఉనికిని గుర్తించగలిగి, ఆ వివేకం సరీగా లేకపోవటంవల్ల, నీవు గుర్తించిన చైతన్యం ఆ అంతఃకరణంలో ప్రవేశించిందని వ్యవహరిస్తున్నావు. ఈ నీ వ్యవహారం అవివేకంవల్ల జనించినది కనుక, దానిని భ్రమ అంటారు. దీనినే మరో రకంగా చెప్పాలంటే పరమార్థంగా చూస్తే ఈ ప్రవేశం అసలే లేదు. వ్యావహారిక దశలో మాత్రం వున్నట్లు కనిపిస్తోంది. గనుక, ఇది ఒకటే ఆత్మ. వ్యావహారిక దశలో అనేక జీవాత్మలు వున్నాయి.

**ప్రశ్న:** అనేక విభిన్న అంతఃకరణాలనేవి వుంటే, చైతన్యం ప్రవేశించినట్లయి, విభిన్నజీవులుగా మనకు కనిపించే అవకాశం వుంటే వుండుగాక. మీరు చెప్పిన ప్రకారం, చైతన్యం పోగా మిగిలిన జడపదార్థం అంతా కలిపి ఒకటే పదార్థం అని చెప్పాలి. అది ఒకటే అయినప్పుడు దానిలోంచి వేరు వేరు అంతఃకరణాలు ఎలా ఏర్పడుతాయి? వేరు వేరు అంతఃకరణాలే లేకపోతే, వాటిలోకి చైతన్యం ప్రవేశించిందనే వ్యవహారమే వుండదు గదా!

**సమాధానము:** జడపదార్థం గూడా పరిణామవశాన అనేక రూపాలుగా వుంది. కానీ, దానిలో కొంత భాగం కుండగా పరిణామం పొందింది. కొంత భాగం మూకుడుగా పరిణామం పొందింది. కొంత భాగం పెంకుగా పరిణామం పొందింది. అపుడు కుండ, మూకుడు, పెంకు అనే వ్యవహారాలు వస్తాయి. అవి చేసే పనులు గూడా

వేరుగా వుంటాయి. కాని, కుండలో గాని, మూకుడులో గాని, పెంకులో గాని, మట్టి కాకుండా వేరే పదార్థమేదయినా వుందా? లేదు. ఉన్న మట్టికే కారణదశలో, అనగా మట్టిముద్దగా వున్న దశలో, ఇది ఒకటే అనే ఏకత్వ వ్యవహారం వుంటుంది. కార్యదశలో అనగా కుండ, మూకుడు, పెంకు వగైరా ఆకారాల దశలో, దానికి ఇవి వేరు అనే అనేకత్వ వ్యవహారం వుంటుంది.

అలాగే జడరూపమైన అనాత్మకు కూడా కారణదశలో ఏకత్వం వుంటుంది. కార్యదశలో అనేకత్వం వుంటుంది. అనాత్మయొక్క కార్యదశలోని రూపాలే అంతఃకరణాలన్నీ. ఇవి అనేకాలుగా భాసిస్తూ వుంటాయి. గనుక, చైతన్య రూపమైన ఆత్మ వీటిలో ప్రవేశించినట్లు కనిపించటంలో అసంభవమేమీ లేదు.

కాగా, ప్రపంచలో ఏ వస్తువు కనిపించినా, దానిలో చైతన్యాంశ ప్రవేశించి వుందని గుర్తించి, తద్ద్వారా ఆ ప్రవేశం కేవలం వ్యావహారికమేనని గుర్తించి, పారమార్థిక దశలో చైతన్యం ఏకరూపమనీ, అది సర్వవ్యాపి అనీ, గుర్తించటమే ఇంతవరకూ మనం చేసిన విచారణకు ఫలితం. ఇలా ఉపాధులలో చైతన్యప్రవేశ వ్యవహారం ద్వారా, అఖండ చైతన్యాత్మకమైన ఆత్మపదార్థాన్ని గుర్తించే విధానాన్ని అవచ్ఛిన్న వాదము అంటారు.

అవచ్ఛిన్నము అంటే సామాన్య భాషలో కూడివున్నది, పరిమితమైనది అని చెప్పుకోవచ్చు. చైతన్యం యీ అంతఃకరణాలతో కూడి వుండినట్లుగా వుండి, పరిమితమైనదిగా కనిపిస్తూ వుంటుంది. గనుక, ఈ విచారణ విధానాన్ని **అవచ్ఛిన్నవాదము** అన్నారు.

దీని ద్వారా ఆత్మ నిజంగా (పరమార్థదశలో) అవచ్ఛిన్నం కాదని, అనగా దేనితోనూ కూడిలేదనీ, దేనివల్లా పరిమితం కాదనీ, గ్రహింపు కలిగించటమే యీ అవచ్ఛిన్న వాదానికి ప్రయోజనం.

ఆఖండ చైతన్యాన్ని గుర్తించేందుకు మరో విధానం గూడా వుంది. దాని పేరు ప్రతిబింబవాదము.

## 23. ప్రతిబింబవాదము

ఆత్మ ఒకటే అయిన మాటా, అది అంతటా వ్యాపించి వున్న మాటా, నిజమే. కానీ, మన అంతఃకరణంలో ప్రతిబింబించినపుడు మాత్రమే మనం దాన్ని గుర్తించ

గలుగుతున్నాం. ఏ అంతఃకరణంలోనూ ప్రతిబింబించకుండా, ఒట్టిగా వ్యాపించివున్న దశలో ఆత్మ చైతన్యాన్ని మనం గుర్తించలేము. అంతే గాక వేరు వేరు అంతఃకరణాల్లో అదే ఆత్మ ప్రతిబింబించినప్పుడు, వేరు వేరు ప్రతిబింబాలను చూచి, అవి ఒకే ఒక బింబానికి (మూలవస్తువుకి) ప్రతిబింబాలనే మాట మరచిపోయి, వేరు వేరు జీవాత్మలు వున్నాయని వ్యవహరిస్తున్నాము.

(అద్దంలో ఒక వస్తువు ప్రతిబింబిస్తే ఆ మూల వస్తువును బింబమనీ, అద్దంలోపల కనిపించిన బొమ్మను ప్రతిబింబమనీ వ్యవహరిస్తారు. ఆ మూలవస్తువుకు ప్రతిబింబం ఏర్పడినప్పుడు మాత్రమే దానికి బింబమనే వ్యవహారం కలుగుతుంది. లేకపోతే అది కేవలం వస్తువు. దేనికీ బింబం కాదు.)

ఆకాశంలో ఒకడే సూర్యుడున్నాడు. ఆ సూర్యబింబం సముద్రంలో, చెరువులో, కడవలో, మూకుడులో ప్రతిబింబించింది. పిల్లవాడు ఇది చూసి సముద్రంలో ప్రతిబింబించిన సూర్యుడు చాలా ఎక్కువగా కిరణాలను వెదజల్లుతున్నాడు గనుక పెద్ద సూర్యుడనీ, మూకుడులో ప్రతిబింబించిన సూర్యుడి కిరణాలు కొద్ది దూరమే వ్యాపిస్తున్నాయి గనుక చిన్న సూర్యుడనీ, ఇలా అనేకమంది సూర్యులు కనిపిస్తున్నారనీ అంటాడు. కానీ జ్ఞానం గల పెద్దవాడు మాత్రం ఉన్న సూర్యుడు ఒకడేననీ, కనిపించే యీ ప్రతిబింబాలు భ్రాంతివల్ల వచ్చాయనీ, అంటాడు. అలాగే అనేకులుగా కనిపించే జీవాత్మలందరూ, ఒకే ఒక పరిపూర్ణ ఆత్మకు ప్రతిబింబాలని తెలివిగలవారు గుర్తిస్తారు.

ప్రశ్న: అయ్యా! ఇందాక అవచ్ఛిన్నవాదం చెప్పేటప్పుడు, ఆత్మ పదార్థం కారణదశలో ఏకమనీ, కార్యదశలో అనేకమనీ చెప్పారు. ఇప్పుడు ప్రతిబింబవాదంలో, మీరు అన్ని చోట్లా సూర్యుడు నీళ్ళల్లోనే ప్రతిబింబించాడని ఉదాహరణ చెపుతున్నారు. అన్ని చోట్లా నీరే వుండగా, ఒకే సూర్యుడు ఒకే నీటిలో ప్రతిబింబించాడన్నమాట. కానీ, అంతఃకరణాలు ఆ విధంగా ఒకే నీటివంటివి కాదు. దేనికది వేరు వేరు. కనుక, మీరు చెప్పిన ఉదాహరణ దీనికి అతకదు గదా!

**సమాధానము:** ఉన్నది ఒక్క నీరే. కానీ అదే నీటిని ఒక చోట చూసి సముద్రమంటున్నావు. మరో చోట చూసి చెరువంటున్నావు. మరో చోట బావి అంటున్నావు. మరో చోట కుండనీరంటున్నావు. సముద్రంలో నీరు గాక వేరేమయినా వున్నదా? చెరువులో నీరు గాక వేరేమయినా వున్నదా? బావిలో నీరు గాక వేరేమయినా వున్నదా? లేదు గనుక, సముద్రము, చెరువు, బావీ అన్నీ ఒకటే అనగలవా? అలాగే

అనాత్మ పదార్థం గూడా అంతా ఒకటే అయినా, అది వేరు వేరుగా అయి వ్యవహారం చేస్తూ వుంటుంది. అందువల్ల వేరు వేరుగా వున్న అంతఃకరణాలు ఏర్పడతాయి. వాటిలో ఆత్మ ప్రతిబింబించి వేరు వేరు జీవాత్మలుగా మనకు కనిపిస్తూ వుంటుంది.

**ప్రశ్న:** అవచ్ఛిన్న వాదంలోనూ మీరు చెప్పింది ఇదే. ఇక మళ్ళీ ప్రతిబింబ వాదమంటూ రెండవ సమాధానం ఎందుకు చెప్పినట్లు?

**సమాధానము:** సూర్యుడు నీళ్ళలో ప్రతిబింబించి నప్పుడు, నీటికి చెందిన చల్లదనము, కదలిక, వంటి నీటి ధర్మాలు, సూర్య బింబానికి అంటవు గదా! అలాగే నేను కర్తననే కర్తృత్వము, నేను భోక్తననే భోక్తృత్వము, మొదలైనవి అంతఃకరణ ధర్మాలు. అందువల్ల ఇవి దానిలో ప్రతిబింబించిన ఆత్మకు ఏ మాత్రం అంటవు. నీటిలో ప్రతిబింబించిన సూర్యబింబం కదులుతున్నట్లుగా వుండటం ఆభాసే అని అంగీకరిస్తావు గదా! అలాగే, అంతఃకరణంలో ప్రతిబింబించిన ఆత్మ జీవాత్మగా యేర్పడి తనకు కర్తృత్వ భోక్తృత్వాదులను అంటగట్టుకోవటం కూడా ఆభాసే. అందుకే ఈ జీవాత్మను చిదాభాసుడు అని గూడా వ్యవహరిస్తారు. ఈ విషయాన్ని స్పష్టం చెయ్యటం కోసమే ప్రతిబింబవాదమనే యీ సమాధానం.

దీనివల్ల మనకు తెలిందేమంటే, సూర్యప్రతిబింబమంటూ వేరే లేదు. అసలు సూర్యుడే ఇలా కనిపిస్తున్నాడు. అంతే. అలాగే జీవాత్మ అనేవాడు చిదాభాసుడే. అంటే కేవలం ఉహాజనితుడే. కనుక, పరమాత్మే జీవాత్మ. జీవాత్మే పరమాత్మ.

**ప్రశ్న:** అయ్యా! అవచ్ఛిన్నవాదంలో ఘటంలోని ఆకాశం కల్పితమనలేదు మీరు. ఇక్కడ మాత్రం చిదాభాసుడైన జీవాత్మ ఊహా జనితుడు, కల్పితుడు అంటున్నారు. అంటే వాడు అసత్యమైనవాడు. అలా అయితే, అసత్యమైన జీవాత్మకు సత్యమైన పరమాత్మతో ఐక్యం (ఏకత్వం) ఎలా కుదురుతుంది? అసత్యమైనవాడూ, సత్యమైనవాడూ ఒకడే అనటం కుదరదు గదా!

**సమాధానము:** నీరు, తరంగం, బుడగ అని మూడు పదార్థాలు ఉన్నాయి గదా, లోకంలో. తరంగమంటే యేమిటి? నీటికన్నా వేరుగా తరంగంలో ఏదయినా పదార్థం వుందా? లేదే? ఏదీ లేకపోతే దానికి తరంగమనే వ్యవహారం ఎందుకు వచ్చింది? వేరుగా ఏదయినా వుంటే దాన్ని నీటినుంచీ విడదీసి చూపగలగాలి గదా! నీటికన్నా వేరే పదార్థమేదీ లేదు తంరంగంలో. కానీ, ఆకార విశేషాన్నిబట్టి ఆ నీటినే తరంగమని వ్యవహరిస్తున్నాం మనం. అలాగే తరంగం కన్నా వేరుగా బుడగలో ఏ పదార్థమూ లేదు. అయినా తరంగంలో వచ్చిన ఒక ఆకార విశేషాన్నిబట్టి దాన్ని

బుడగ అంటున్నాం. బుడగకు ఆధారం తరంగం. అంటే తరంగంలో బుడగ కల్పింపబడింది. అదే విధంగా నీటిలో తరంగం కల్పింపబడింది.

సరీగా ఇదే రీతిగా, జీవాత్మకు మూడు దశలున్నాయి. పారమార్థిక దశ, వ్యావహారిక దశ, ప్రాతిభాసిక దశ అని.

స్వప్నావస్థాభిమాని అయిన దశలో జీవుణ్ణి ప్రాతిభాసిక జీవుడంటారు. అభిమానించటమంటే ఆ అవస్థలో పడివుండటమన్న మాట. (ప్రాతిభాసికుడంటే వున్నట్లు కనిపించేవాడు)

జాగ్రదవస్థాభిమానిగా వున్న దశలో జీవుణ్ణి వ్యావహారిక జీవుడంటారు. (వ్యావహారికుడంటే, వ్యవహారదశ కోసం వున్నాడని మనం ఒప్పుకొనేవాడు)

సుషుప్తి అవస్థాభిమానిగా వున్న దశలో జీవుణ్ణి పారమార్థిక జీవుడంటారు. (పారమార్థికుడు అంటే నిజంగా సత్యమైనవాడు)

వీరిలో పారమార్థికుడు నీటి వంటివాడు. వ్యావహారికుడు తరంగం వంటివాడు. ప్రాతిభాసికుడు బుడగ వంటివాడు. నీటిలో అల, అలలో బుడగ, కల్పితమయినట్లుగా పారమార్థికుడిలో వ్యావహారికుడు, వ్యావహారికుడిలో ప్రాతిభాసికుడు, కల్పింపబడ్డారు. నీటిలో వున్న తీపిదనము, ద్రవగుణము, చల్లదనము అన్నీ అలలో గూడా కనిపిస్తాయి. అల ద్వారా బుడగలో గూడా కనిపిస్తాయి. అలాగే స్వతహా పారమార్థిక జీవుడిలో వున్న సత్ చిత్ ఆనందమనే లక్షణాలు వ్యావహారికుడిలో భాసిస్తాయి. వాడి ద్వారా ప్రాతిభాసికుడిలో గూడా భాసిస్తాయి.

అల లేందే బుడగ లేదు. నీరు లేందే అల లేదు. అలాగే వ్యావహారికుడు లేందే ప్రాతిభాసికుడు లేడు. పారమార్థికుడు లేందే వ్యావహారికుడు లేడు. కాగా, బుడగకీ అలకీ గూడా ఆధారభూతమైనది నీరే అయినట్లు, ప్రాతిభాసికుడికీ వ్యావహారికుడికీ గూడా ఆధారమైనవాడు పారమార్థికజీవుడు.

బుడగ అన్నప్పుడూ, అల అన్నప్పుడూ, అక్కడ నిజంగా వున్నది నీరే. అలాగే, ప్రాతిభాసికుడు, వ్యావహారికుడు, అన్నప్పుడు అక్కడ నిజంగా వున్నది పారమార్థిక జీవుడే. పారమార్థిక జీవుడికే మరో పేరు పరమాత్మ. మరో పేరు కూటస్థుడు (కూటము అంటే కంసాలి బంగారాన్ని సాగదీసే దిమ్మె. బంగారం సాగదీయబడి వివిధ రూపాలను చెందుతుంది. ఈ దిమ్మె (కూటం) మాత్రం ఏ మార్పూ లేకుండా అలాగే వుంటుంది. ఆ కూటం లాగా ఏ మార్పూ లేకుండా (నిర్వికారంగా) వుండేవాడు కూటస్థుడు.)

కల్పితమైన బుడగ సత్యమైన జలంకన్నా వేరు కాదు. ఆ రెండూ ఒకటే అనటంలో ఏమీ తప్పు లేదు గదా! ఇక్కడ బుడగ, నీరు అనేవి వేరు వేరు పదార్థాలు కావు. ఒకే వస్తువుకు వేరు వేరు పేర్లు. అందువల్లే అవి రెండూ ఒకటే అంటున్నాం. అలాగే జీవాత్మ కూటస్థుడైన పరమాత్మకన్న వేరు కాదు. కనుకనే వారిద్దరూ ఒకటే అనటంలో తప్పు లేదు.

ఘటాకాశము, మఠాకాశము ఒకటే అని అవచ్ఛిన్నవాదంలో మనం చెప్పుకొన్నది గూడా యీ సత్యమే.

ఈ ప్రతిబింబవాద రూపమైన విచారణ మార్గంలో మరొక విశేషాన్ని గూడా మనం దర్శించవచ్చు.

పరమాత్మ చైతన్యం మొత్తం అనాత్మపదార్థంలో, అనగా అజ్ఞానంలో ప్రతిబింబిస్తే, ఈశ్వరుడని వ్యవహరింపబడతాడు. అంతఃకరణంలో ప్రతిబింబించినపుడు జీవుడని వ్యవహరింపబడతాడు.

పెద్ద స్ఫటిక శివలింగం వెనుక చిన్న గులాబీ పువ్వు పెట్టామనుకోండి. అపుడు ఆ గులాబీ మనకు కనిపించదు. లింగం మాత్రం ఎర్రగా కనిపిస్తుంది. ఇట్టి సందర్భంలో స్ఫటికలింగం గులాబీ పుష్పోపహితమయింది. అందువల్ల ఎర్రగా వుందనే ఆభాసం (భ్రాంతి) మనకు కలుగుతోందని శాస్త్రకారులు వ్యవహరిస్తారు. (ఇక్కడ ఉపహితమంటే దగ్గరలో వున్నది అని తాత్పర్యం. గులాబీ గుణాలు స్ఫటికంలోకి సంక్రమించాయి గనుక గులాబీపువ్వు లింగానికి ఉపాధి అయిందని అర్థం)

పరమాత్మ చైతన్యం స్ఫటికలింగం అనుకొంటే, అనాత్మ రూపమైన అజ్ఞానం గులాబీపూవు వంటిది. ఆత్మచైతన్యం అజ్ఞానోపహితమయినపుడు దానికి ఈశ్వరుడని (భగవంతుడని) వ్యవహారం కలుగుతుంది. అంతఃకరణ రూపంలోవున్న అజ్ఞానంలో ఆత్మచైతన్యం ఉపహితమైనపుడు, జీవుడనే వ్యవహారం కలుగుతుంది.

అద్దంలో ఒక వస్తువు ప్రతిబింబిస్తే, ఆ వస్తువును బింబమనీ, అద్దం లోపల కనిపించే బొమ్మను ప్రతిబింబమనీ పిలుస్తారు అని చెప్పుకొన్నాం. ఆ పరిభాష ప్రకారం, బింబచైతన్యం పరమాత్మ. ఆ బింబ చైతన్యం అజ్ఞానోపహిత మయినపుడు దాని పేరు ఈశ్వరుడు(లేక భగవంతుడు). అది అంతఃకరణలో ఉపహితమైనపుడు దాని పేరు జీవుడు.

ఈ మొత్తం చర్చవల్ల జీవుడు, ఈశ్వరుడు, పరమాత్మ అనేవి వేరు వేరు పేర్లే తప్ప వేరు వేరు వస్తువులు కావనీ, అవన్నీ ఒకటే అని, మనకు స్పష్టమవుతోంది. ఇదే ప్రతిబింబవాదరూపమైన విచారణ పద్ధతికి పరమార్థం.

ఈ విధంగా, అవచ్ఛిన్నవాద విధానంలోనూ, ప్రతిబింబవాద విధానంలోనూ గూడా, ఆత్మ అనాత్మలను విడదీసి చూడగా, పరిశుద్ధమైన ఆత్మ పదార్థం ఒకటేననీ, అదే సత్యమనీ, అదే నేననీ, నిరూపణ అవుతోంది.

ఇట్లు మాయావివరణమునందు తృతీయ వర్ణకము సమాప్తము.

## చతుర్థ వర్ణకము

ఇక ఇపుడు మరో మార్గాన విచారణ చేద్దాం.

### 24. జీవికి దుఃఖం స్వాభావికమా, ఆగంతుకమా?

మన వేదాంత విచారణ అంతా ఎందుకు మొదలయిందంటే, శాశ్వతమయిన సుఖాన్ని పొందటం కోసం! శాశ్వతసుఖము అంటే, దుఃఖ స్పర్శలేని సుఖం. అసలలాంటి సుఖం సంభవమా అసంభవమా అని ముందు తేల్చుకోవాలి. అసంభవమైన దానికోసం పరుగులు తీయటం వెర్రి అవుతుంది కదా!

శాస్త్రం చెప్పే పరమాత్మ మాట దేవుడెరుగు, ముందు మనకు అంతో ఇంతో పరిచయం వున్నవాడు జీవాత్మ. ఈ జీవాత్మకు దుఃఖం అంటకుండా వుండే అవకాశం అనేది అసలు వుందా లేదా అనేది మన ప్రస్తుత చర్చనీయాంశం. జీవాత్మకు దుఃఖమనేది స్వాభావికమయితే, అది నువ్వెన్ని వాదాలు చేసినా పోదు. ఆగంతుకమయితే ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడయినా పోతుంది. కనుక జీవుడికి దుఃఖం స్వాభావికమా ఆగంతుకమా అనేది ముందు తేలాలి.

స్వాభావికమంటే ఏమిటి?

నిప్పుకు వెచ్చదనం స్వాభావికం. వెచ్చదనం పోతే నిప్పుకు నిప్పనే వ్యవహారమే వుండదు. తియ్యదనం బెల్లానికి స్వాభావికం. తీపి లేకపోతే అది బెల్లమే కాదు. ప్రవహించగలగటం నీటికి స్వాభావికం. ఆ గుణం లేకపోతే అది నీరే కాదు. ఏ గుణం లేకపోతే ఆ వస్తువు ఆ వస్తువు కాకుండా పోతుందో, అది ఆ వస్తువుకు స్వాభావికం.

నీటికి వెచ్చదనం ఆగంతుకం. ఏ సూర్యకిరణాలలోని అగ్నితోనో సంపర్కం కలగటంవల్ల నీరు తాత్కాలికంగా వెచ్చబడ్డా, ఆ గుణం నీటిలో కలకాలం నిలువ వుండదు. గాలికి వాసన ఆగంతుకం. ఏ పూల పొదులో గాలిలో తేలి, ఆ వాసన గాలికి అంటినట్లు కనిపించినా, గాలిలో ఆ వాసన స్థిరంగా వుండదు. కొంత కాలం వుండి పోయే గుణాలు ఆగంతుకాలు.

ఇపుడు మన ప్రశ్న జీవుడుకి దుఃఖం ఆగంతుకమా, స్వాభావికమా? – అని.

**ప్రశ్న:** జీవికి దుఃఖం స్వాభావికమే అందాము. అంటే నష్టమేమి? కర్పూరపు బిళ్ళ ఎంత చిన్నదయినా, దాని ఘాటు పోనేపోదు. ఘాటు దానికి స్వాభావికం. కర్పూరంలోంచి ఘాటు పోవాలంటే, కర్పూరపు బిళ్ళ పూర్తిగా హరించుకు పోవలసిందే, గత్యంతరం లేదు. అలాగే, దుఃఖం జీవికి స్వాభావికము అన్నామంటే, వాడి దుఃఖం వాడి జన్మలో పోయే అవకాశం లేదన్నమాట! జీవుడనేవాడు పూర్తిగా హరించుకుపోతేనే వాడి దుఃఖం పోతుందన్నమాట!

**సమాధానము:** కానీ, వేదశాస్త్రాలు, అనుభవంగల పెద్దలు, జీవుడిదుఃఖం పోయేందుకు, సుఖం వచ్చేందుకు, ఉపాయాలు చెపుతున్నారు. జీవుడి దుఃఖం స్వాభావిక మనేటట్లయితే, పెద్దల అనుభవాలు, వేద శాస్త్రాలు, పూర్తిగా అబద్ధమనవలసి వస్తుంది.

**ప్రశ్న:** అనవలసివస్తే అందాం. దానికేమి? ఈ జీవాత్మ అనేవాడు పూర్తిగా నశించినప్పుడే వాడికి దుఃఖనివారణ, లేకపోతే లేదు – అని సిద్ధాంతీకరిస్తాము. నష్టమేమిటి?

**సమాధానము:** ఒకటే నష్టం. జీవాత్మ నశించే అవకాశమే లేదు. ఈ మాట మన వెనుకటి విచారణ విధానాలలో నిరూపణ అయింది. అదీగాక , వేదశాస్త్రాలను తిరస్కరించినా, నాకు శాశ్వత సుఖం కలిగింది అని అనుభవపూర్వకంగా చెప్పే వారి, మాటలను కొట్టిపారవేయటం అంత సులువు గాదు.

ఆ అనుభవాలను చెప్పేవారు, తెలివి తక్కువవారని గానీ, పిచ్చివారని గానీ, మోసగాళ్ళని గానీ, చెప్పేందుకు ఏ మాత్రం వీలు లేదు. వాళ్ళు తమ సొంత పిల్లలకే అలా చెప్పుకొంటున్నారు కనుక మోసం చేస్తున్నారనే వీలు లేదు. వారి లోకవ్యవహార రీతి ప్రశస్తంగా వుంది గనుక పిచ్చివారనేందుకు వీలు లేదు. వారి తార్కిక ధోరణి నిర్దుష్టంగా వుంది గనుక తెలివితక్కువ వారనేందుకు వీలు లేదు. వారి నిజ జీవితంలో ఏ ఇతర విషయంలోనూ అబద్ధం చెప్పనివారు గనుక ఈ ఒక్క విషయంలోనే అబద్ధం

చెపుతున్నారని అనుకోవటానికి మన దగ్గర ఏమీ కారణం లేదు. ఇక వారి అనుభవాన్ని ఏలా కొట్టిపారవేయగలం?

వెనుకటి మహనీయుల అనుభవాల రికార్డులే వేదశాస్త్రాలు. కనుక, వాటిని గూడా కొట్టిపారవేసి, జీవుడు నశించిపోయేవాడనీ, దుఃఖం వాడికి స్వాభావికమనీ నిర్ణయించటం సబబు ఎలా అవుతుంది?

**ప్రశ్న:** సరే, పోనీ, ఇలా అందాం. జీవుడు నిత్యుడే. దుఃఖం వాడికి స్వాభావికమే. కానీ, ఆ దుఃఖం మాత్రం వాడి లాగా నిత్యం కాదు. కనుక, అది వాడి ప్రయత్నంచేత నశించే అవకాశం వుంది. ఇలా అంటే నష్టమేమిటి?

**సమాధానము:** ఇది మరీ చిత్రంగా వుంది. వేడి నశించిపోయి చల్లగా వున్న వస్తువును నీవు అగ్ని అని పిలుస్తావా? తీపిదనం లేని సుద్దముక్కను బెల్లమంటే నీవు అంగీకరిస్తావా?

**ప్రశ్న:** అది కాదయ్యా! ఒక మంత్రవేత్త తన మంత్రబలంతో కాలే కాలే నిప్పుబొగ్గుల్ని తన చేత్తో పట్టుకోవటమే గాక, నీ చేతిలో గూడా నిలబెడతాడు. ఆ నిప్పు కాలదు. అంత మాత్రంచేత అది నిప్పే కాదంటావా? ఒకడు ఏదో మూలిక తెచ్చి పాముకు వాసన చూపి, పామును చేత్తో పట్టుకొంటాడు. ఆ పాము కదులుతునే వుంటుంది. కానీ కరవదు. కరచినా విషం ఎక్కదు. అంత మాత్రంచేత అది పామే కాదంటావా? అలాగే ఒక జీవుడు తన యోగబలంవల్లో, కర్మబలంవల్లో, ఉపాసనాబలంవల్లో, దుఃఖాన్ని పోగొట్టుకొంటాడు. అపుడు వేదశాస్త్రాల ప్రకారం దుఃఖనివృత్తీ సంభవిస్తుంది. సుఖమూ ప్రాప్తిస్తుంది. జీవుడికి దుఃఖం స్వాభావికమూ అవుతుంది. ఇలా అంటే తప్పేమిటి?

**సమాధానము:** నీవు చెప్పిన ఉదాహరణల్లోనే తప్పు వుంది. నీవు చెప్పినట్లు మంత్రబలం వల్లో, ఓషధిబలంవల్లో, మణిబలంవల్లో నిప్పులో వేడి తగ్గినా, పాములో విషం పోయినా, ఆ మణిమంత్రాదుల ప్రభావం తొలగిపోగానే, అగ్నికి వేడి రానే వస్తుంది. పాము కాటు వేయనే వేస్తుంది. అంటే ప్రతిబంధకంగా వున్న మణిమంత్రాదుల ప్రభావం తొలగిపోగానే, స్వాభావికగుణం మళ్ళీ కనపడనే కనబడుతుంది. అదే రీతిగా యోగ ఉపాసనాదులవల్ల జీవుడి దుఃఖం తాత్కాలికంగా మరగునపడినా, అదివాడికి స్వాభావికం గనుక, యోగోపాసనాదుల ప్రభావం తగ్గిపోగానే, మళ్ళీ దుఃఖం బయట పడనే పడుతుంది.

**ప్రశ్న:** కొద్ది కాలం మందు వేసుకొంటే, దీర్ఘకాలం ఆరోగ్యం లభించటం లేదా? అలాగే యోగాదులవల్ల శాశ్వత దుఃఖనివృత్తి ఎందుకు కారాదు?

**సమాధానము:** ఆరోగ్యం మనిషికి స్వాభావికం. రోగం ఆగంతుకం. మందువల్ల ఆగంతుక మయిన రోగం పోగా స్వాభావికమయిన ఆరోగ్యం నిలబడి వుంటుంది. నీవు చెప్పిన ఉదాహరణను బట్టి యోగాదులు మందు వంటివైతే, అవి ఆగంతుకమైన దాన్నే పోగొట్టగలవు గానీ స్వాభావికమైన దానిని పోగొట్ట లేవు. అంతేగాక, ఒక జీవితంలో స్వల్ప కాలం పాటు చేసిన పనివల్ల, అవధి లేకుండా శాశ్వతమైన ఫలితం రావటం సంభవం కాదు. కనుక, దుఃఖం స్వాభావికమై శాశ్వతమైతే, దాని యొక్క శాశ్వత నివారణ స్వల్పకాలికమైన యోగోపాసనాదుల ద్వారా సాధించటం అసంభవం.

**ప్రశ్న:** మేము చెప్పేదీ అదే! జీవుడికి దుఃఖం స్వాభావికం. గనుక, ఎప్పటికప్పుడు దాన్ని యోగాదులతో నివారించుకొంటూ వుండాలి. చలికాలంలో చలిమంటల వలె యోగాదులు దుఃఖ నివారణ చేస్తూవుంటాయి. ఎప్పటికప్పుడు యోగాది సాధనలు చేసుకొంటూ వుండాలిసిందే అని మేము చెపుతాము.

**సమాధానము:** మీరు చెప్పవచ్చు. కానీ, వేదశాస్త్రానుభవాలు ముక్తి, (అనగా ఆనందప్రాప్తి) శాశ్వతమని చెపుతున్నాయి. ఒక సారి ముక్తి లభించినాక, ఇక అది పోదని చెపుతున్నాయి. ఆ ప్రమాణాల మాటేమి చెయ్యాలి?

**ప్రశ్న:** అయ్యా! మీరెంత సేపటికీ ప్రమాణాలమీద ఆధారపడతారెందుకు?

**సమాధానము:** ఎందుకో ఇందాకనే చెప్పుకొన్నాం. ప్రమాణాలు మాత్రమే గాక, వెనుకటి శీర్షికలలో చెప్పుకొన్న తార్కిక పరిష్కారాలు గూడా జీవికి దుఃఖం స్వాభావికం కాదని నిరూపించాయని చెప్పుకొన్నాం. మరొక సారి గుర్తు చేసుకొందాం. వినండి.

జీవాత్మకు దుఃఖం స్వాభావికమని గదా మీరంటున్నారు? అదే నిజమయితే, సుషుప్త్యవస్థలో, అనగా ఇంద్రియాలవల్ల, వాటి విషయాలవల్ల, ఏ మాత్రమూ సుఖదుఃఖ సంపర్కం లేని దశలో, జీవాత్మయొక్క స్వరూపం దుఃఖాత్మకమనే అనుభవం కలగవలసి వుంటుంది. కానీ, ప్రతి జీవి సుషుప్తినుంచీ తిరిగి వచ్చినాక, తాను ఆ సమయంలో సుఖంగా వున్నాను అని స్మరిస్తున్నాడు. ఈ అనుభవానికి అపవాదం (ఎక్సెప్షన్ = మినహాయింపు) లేదు.

అలాగే ఒక కళాకారుడు ఏ ఉద్రేకాలూ లేకుండా ప్రశాంతంగా విశాల సాగరం వంకో, పర్వత శిఖరం వంకో, చూస్తూ కూర్చున్నాడు. ఒళ్ళు మరచి పోయాడు.

కొంత సేపటికి ఏదో వ్యవహారం వచ్చి లోకంలో పడ్డాడు. పడ్డాక, ఏమీ పట్టని ఆ సమయంలో హాయిగా వున్నానంటున్నాడు.

మరొకడు సమాధి స్థితిలోకి వెళ్ళి ఇంద్రియ విషయ సంయోగం వదిలేశాడు. తిరిగి వచ్చాక, వాడు గూడా తాను సమాధిలో అద్భుతానందం పొందా నంటున్నాడు.

కనుక, జీవాత్మకు స్వాభావికమైనది ఆనందమే అని తేలటం లేదా? కాగా దుఃఖమనేది ఆగంతుకం అని నిశ్చయం కావటం లేదా? కనుక, శాస్త్రాలను బట్టీ, తర్కాన్నిబట్టీ, అనుభవాన్ని బట్టీ, గూడా దుఃఖమనేది జీవాత్మకు ఆగంతుకమనీ, ఆనందం స్వాభావికమనీ నిశ్చయమవుతోంది.

**ప్రశ్న:** నా స్వాభావికం ఆనందమయితే, నాకు దుఃఖం ఎందుకు రావాలి?

## 25. దుఃఖం ఎలా కలుగుతోంది?

ఈ ప్రశ్నకు సమాధానం రావాలంటే జీవుడికి ఎప్పుడెప్పుడు దుఃఖం వస్తోందో ఆలోచించాలి. మన అనుభవంలో చూస్తే సుషుప్తి అవస్థలో మనకు రవ్వంత కూడా దుఃఖం లేదు. ఇక స్వప్నావస్థలోకి గాని, జాగ్రదవస్థలోకి గాని వస్తే ఎంతో కొంత దుఃఖం కలుగుతోంది. సుషుప్తి అవస్థకీ, మిగిలిన అవస్థలకీ, గల భేదమేమిటి?

ప్రధాన భేదం ఒక్కటే, సుషుప్తి అవస్థలో జీవుడికి శరీరంతోనూ, ఇంద్రియాలతోనూ, సంపర్కం లేదు. అంటే ఈ దేహమే నేను అనే అనుభవం లేదు. మిగిలిన రెండు అవస్థలలోను, ఏదో ఒక శరీరంలో జీవుడు ప్రవేశించి, "ఈ దేహమే నేను" అంటాడు. కనుక జీవుడికి శరీర స్వీకారం వున్న చోటల్లా అతనికి దుఃఖం వుంటుంది. అలాంటి శరీర స్వీకారం లేని చోట దుఃఖం ఏ మాత్రమూ వుండదు – అని తేలుతోంది.

"శరీర స్వీకారం వున్నంత మాత్రాన ఎంతో కొంత దుఃఖం వుండి తీరవలసిందే అని ఖాయంగా చెప్పవచ్చునా? లోకంలో కొందరు అదృష్ట జీవులు వున్నారు. వాళ్ళు ఎప్పుడు చూసినా సుఖంగానే కనిపిస్తూ వుంటారు. ఉదాహరణకి, మా యువరాజుగారు అంతే"– అని ఎవరైనా అనేటట్లైతే, అది భ్రాంతి మాత్రమే అని చెప్పక తప్పదు. ఎంత రాజైనా, ఎంత మహర్షి అయినా, ఏదో ఒక సందర్భంలో దుఃఖం మనస్సుకు తగలని మనిషి వుండడు. దగ్గర బంధువులు మరణించినప్పుడో, లేదా తనకే మరణం ఆసన్నమైనప్పుడో, లేదా వూహించని నష్టం నెత్తి మీద పడినప్పుడో, దుఃఖ స్పర్శ తప్పనే తప్పదు.

మరొక చిత్రం కూడా వుంది. లోకంలో, కొందరు ఒక పక్క కష్టపడుతూనే "మేము హాయిగా వున్నాం" అంటారు. పరుగు పందెంలో హద్దు దగ్గరకు వస్తున్న కుర్రాడు, ఒక పక్క రొప్పుతూనే గెలవబోతున్నాననే సంబరంలో ఆనందంగా పరుగెత్తుతూ వుంటాడు. ఆ సమయంలో వాణ్ణి అడిగితే రొప్పుతూనే ఆనందంగా వున్నానంటాడు. ఇది– రాబోయే విజయ సుఖాన్ని రొప్పటం అనే దుఃఖం మీద ఆరోపించి దుఃఖాన్నే సుఖంగా దర్శించడం తప్ప మరొకటి కాదు. డబ్బు కోసం రాత్రింబవళ్ళు ఆనందంగా శ్రమపడేవారు, వగైరావారంతా కూడా ఈ కోవలోకే వస్తారు.

మొత్తం మీద తేలిందేమంటే, దుఃఖాన్నే సుఖంగా భ్రమించటమో,

దుఃఖాన్ని దుఃఖంగానే అనుభవించటమో, ఏదో ఒకటి లేని శరీరధారి వుండనే వుండడు అని.

## 26. జీవన్ముక్తుడి దుఃఖం

**ప్రశ్న:** వాదన బాగానే వుంది కానీ, ఇది మీరు పూర్వం చెప్పిన మాటలకు చిక్కు తెస్తుంది. ఎలాగంటే, ఆత్మజ్ఞానం కల్గిన జీవన్ముక్తుడికి శాశ్వతానందం లభిస్తుందని మీరు చెప్పారు. జీవన్ముక్తుడు అంటే శరీరంగల వివేకి. మీరు ఇప్పుడు చెప్పిన మాటల ప్రకారం, వీడికి శరీరం వుంది కనుక, ఎంతో కొంత దుఃఖం వుండి తీరాలి. అలా వుంటే వాడు జీవన్ముక్తుడే కానేరడు. ఇది మీ పూర్వపు మాటకు దెబ్బ కాదా?

**సమాధానము:** జీవన్ముక్తుడు అయినంత మాత్రంచేత, వాడికి ఆకలి దప్పులు లేవని, కత్తి పెట్టి పొడిచినా వాడికి తెలియదని, మేము చెప్పలేదు. జీవన్ముక్తుడు అంటే బండరాయి కాదు. వాడికీ సుఖదుఃఖాలు వుంటే, సామాన్య మానవుడికి, వాడికీ తేడా ఏమిటి? అని నీకు సందేహం కలుగవచ్చు.

జీవన్ముక్తుడు తనయొక్క అంతఃకరణకు కలిగే సుఖదుఃఖాలను తాను సాక్షియై తిలకిస్తూ వుంటాడు. అలా తిలకించే సమయంలో కూడా శుద్ధ సచ్చిదానంద స్వరూపుడైన తనకు, అసత్య స్వరూపము, జడ స్వరూపము, దుఃఖస్వరూపము అయిన అంతఃకరణానికి, ఏమీ సంబంధం లేదని అతడు దర్శిస్తూనే వుంటాడు. అతడు ఇలా దర్శించగలగటానికి ఉపనిషద్వాక్యాలు, తార్కిక హేతువులు, స్వానుభవము కూడ అతనికి సహాయం చేస్తూ వుంటాయి.

ఉపనిషత్తులు అనేక చోట్ల ఆత్మ అసంగమని చెప్పాయి. (అసంగము అంటే ఏదీ అంటనిది). ఆత్మకు ఏ అవయవాలు లేవనీ, అందువల్ల దానికి మరొక దానితో సంబంధం కలిసే అవకాశం లేదనీ, పూర్వమే చెప్పుకొని వున్నాం. ఇలాంటివన్నీ తార్కిక హేతువులు. ప్రతిరోజూ సుషుప్తిలో దుఃఖస్పర్శ లేని ఆత్మను మనం దర్శిస్తూనే వున్నాం. ఇది స్వానుభవం.

ఈ విధంగా వేద, తర్క, అనుభవాలు ఆత్మతత్త్వాన్ని స్పష్టంగా ప్రదర్శింపజేస్తూ వుండటంవల్ల, జీవన్ముక్తుడు దుఃఖంతో ఏ మాత్రమూ సంపర్కము పొందడు. అతని అంతఃకరణ మాత్రం ఇలాంటివి అనుభవిస్తూనే వుంటుంది.

ఇక వివేకంలేని సామాన్య మానవుడి దగ్గరకు వస్తే, అతడు దేహమే నేననే భ్రాంతిలో వుంటాడు. కనుక, తనయొక్క అంతఃకరణకు సంబంధించిన సుఖ దుఃఖాలను తనకూ, తనకు సంబంధించిన చైతన్య సత్యత్వాదులను అంతఃకరణానికీ, అంటగడతాడు. అలా అంటగట్టి, అంతఃకరణంలో దుఃఖం ప్రవేశించినపుడు నాకే దుఃఖం కలిగింది అంటాడు. అలాగే, దేహానికి సంబంధించిన వర్ణాశ్రమాదులను తనకు అంటకట్టుకొని, నేనే బ్రాహ్మణుడిని, నేనే దేశభక్తుడిని ఇత్యాదిగా వ్యవహరిస్తూ వుంటాడు.

పై విచారణవల్ల తేలిందేమంటే శరీరం గల జీవన్ముక్తుడికీ, సామాన్య మానవుడికీ కూడా బయటికి కనిపించే దుఃఖానుభవంలో తేడా ఏమీ లేకపోయినప్పటికీ, అంతరంగంలో మాత్రం ఒకడు సాక్షిగా దర్శిస్తూ వుంటాడు. మరొకడు తానే సుఖదుఃఖాలు పొందుతూ గగ్గోలు పెడుతూ వుంటాడు. ఇది ఎవడికి వాడికి అనుభవైక వేద్యం.

వారి బహిరంగ అనుభవంలో కూడా ఒక సూక్ష్మమైన భేదం వుంది. జీవన్ముక్తుడి దృష్టిలో స్వప్నావస్థకు, జాగ్రదవస్థకు భేదం లేదు. స్వప్నంనుంచీ మేల్కొన్నవాడు, స్వప్నాన్ని ఎలా అసత్యమైనదానినిగా దర్శిస్తాడో, అదే విధంగా జాగ్రదవస్థనుంచీ ఆత్మ తత్త్వజ్ఞానంలోకి మేల్కొన్న జీవన్ముక్తుడు జాగ్రదవస్థను కూడా అసత్యంగానే దర్శిస్తాడు. అవివేకికి ఇలాంటి దర్శనం వుండదు.

## 27. దేవతల దుఃఖనివారణ శక్తి

**ప్రశ్న:** మీరు చెప్పిన దానిని బట్టి దేవతలకు కూడా దుఃఖం తప్పదని తెలుస్తోంది. ఎందుకంటే చాలా మంది దేవతలు జీవన్ముక్తులు కారు కదా! అయితే కష్టాలు తీరేందుకు

దేవతలను ఉపాసించమని వేదశాస్త్రాలు చెపుతున్నాయి. తమ కష్టాలే తీరని దేవతలు ఇతరుల కష్టాలు తీర్చగలరా?

**సమాధానము:** లోకంలో ఒక రాజుగారు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అంత మాత్రంచేత ఆయన తనను ఆశ్రయించినవారి దారిద్ర్యం తీర్చలేడా? ఆయనకు ఒక అంశంలో దుఃఖం వున్నా, మరో అంశంలో మరో దుఃఖాన్ని పోగొట్టే శక్తి వుండవచ్చు. దేవతల విషయం కూడ అలాంటిదే. దేవతలకు దేహస్వీకారం వుంది కనుక ఆ అంశంలో వారికి దుఃఖ స్పర్శ వుంటుంది. ఇతరాంశంలో వుండే శక్తివిశేషంవల్ల, వారు కొన్ని దుఃఖాలను పోగొట్టగలరు.

ఏతావతా తేలిందేమంటే "శరీరమే నేను" అనుకోవటం వల్ల దుఃఖం వస్తుంది. శరీరం నేను కాదనుకోవటమే ముక్తి.

## 28. నాలుగు రకాల ముక్తులు

**ప్రశ్న:** మీరు శరీర రాహిత్యమే ముక్తి అని పునరుద్ఘాటిస్తున్నారు. కానీ కొందరు ముక్త పురుషులు ఆకాశంలో నక్షత్ర రూపంలో ప్రకాశిస్తూ వున్నారని శాస్త్రాలలో అక్కడక్కడా వుంది. దీనికి మీరేమంటారు?

**సమాధానము:** అలా వున్న మాట వాస్తవమే. వారు చెప్పింది కూడ వాస్తవమే. కాని శాస్త్రాలలో నాలుగు రకాల ముక్తులను వివరించారు.

**1. సాలోక్య ముక్తి:** ఒక భక్తుడు ఒక దేవతను ప్రేమతో ఉపాసిస్తే అతడికి తన ఉపాస్యదేవతయొక్క లోకంలో నివాసం లభిస్తుంది. ఇదే సాలోక్య ముక్తి. దీనిని సాధించే ఉపాసన పేరు "చర్య". చర్య అనగా భగవంతుడు ప్రభువని, తాను దాసుడనే భావనతో చేసే కైంకర్య రూపమైన సేవ.

**2. సారూప్య ముక్తి:** భక్తుడు తన దేవతను మరింత బాగా ఉపాసించగా వాడికి ఆ దేవతతో సమానమైన రూపమూ, ఆ లోకనివాసమూ కూడా లభిస్తాయి. ఇదే సారూప్య ముక్తి. దీనిని సాధించే విధానం పేరు "క్రియ". క్రియ అంటే ఆయా దేవతలయొక్క పూజ, జప, హోమాది విధి.

**3. సామీప్య ముక్తి:** భక్తుడు మరింత గట్టిగా ఉపాసన చేయగా అతనికి తన ఉపాస్య దైవముయొక్క సమీపంలోనే, ఆ దేవతయొక్క ఆకారం లాంటి ఆకారంతో నివసించే స్థితి వస్తుంది. ఇదే సామీప్య ముక్తి. దీనిని సాధించే విధానం పేరు "యోగం". ఇక్కడ యోగము అంటే యమ, నియమాలతో కూడిన అష్టాంగ యోగం.

**4. సాయుజ్య ముక్తి:** ఉపాసన సగుణ స్థాయిని దాటి, నిర్గుణస్థితికి పోగా జీవాత్మ పరమాత్మలు ఒకటేనని సాక్షాత్కారం కలగటమే సాయుజ్య ముక్తి. దీనికి సాధనం "జ్ఞానం", జ్ఞానమనగా నిత్యానిత్య వస్తువివేక పూర్వకమైన ఆత్మతత్త్వ దర్శనం.

పై నాల్గింటిలో మొదటి మూడూ ముఖ్యమైన ముక్తులు కావు. అంటే వాటికి ముక్తి అనే వ్యవహారం వున్నప్పటికీ, ముక్తి అనే పదానికి ప్రధానమైన అర్థం అది కాదు. ఎందుకంటే, ఆ మూడు ముక్తులు శాశ్వతమైనవి కావు. అంతే గాక ఆ ముక్తిలో ఆ జీవికి ఏదో ఒక శరీరం వుంటుంది. బహు కాలం తరువాత భక్తుడికి తన పుణ్యం క్షీణించగా ఆ దివ్యశరీరం పోయి మళ్ళీ జన్మ రానే వస్తుంది.

నాల్గవ ముక్తి అలాంటిది కాదు. దీనిలో జీవికి ఏ రకమైన శరీరమూ వుండదు. ఆ జీవికి పునరావృత్తి ప్రసక్తి లేదు. ఇదే ముఖ్య ముక్తి. మనం దీనిని ఒక్కదానినే ముక్తి అని వ్యవహరిస్తున్నాం. ఇతర శాస్త్రాలలో నక్షత్రాది రూప జీవులకు ముక్తి లభించింది అన్నప్పుడు, ఆ ముక్తి మొదటి మూడు ముక్తులలో ఏదో ఒక రకానికి చెందినదై వుంటుంది.

మరొక విషయం కూడా ఈ సందర్భంలో మనం చెప్పుకోవాలి. ఏమంటే యోగమనే శబ్దాన్ని కూడ పెద్దలు రెండు అర్థాలలో వాడుతున్నారు. ఒక అర్థం ఇపుడే మనం చెప్పుకున్నాం. మరొక అర్థం నిర్గుణ పరబ్రహ్మకు, జీవాత్మకు అభేదాన్ని అనుసంధానం చేయటమే. ఈ అర్థాన్ని పురస్కరించుకొనే శాస్త్రాలలో కొన్నిచోట్ల యోగం వల్లనే ఆత్మదర్శనం లభిస్తుందని చెప్పారు. ఉదాహరణకు

**ఆయం హి పరమోధర్మః**
**యద్యోగే న ఆత్మదర్శనం**

(యోగంతో ఆత్మ దర్శనాన్ని సాధించటమే ఉత్తమ ధర్మం). ఇలాంటి చోట్ల యోగశబ్దానికి రెండవ అర్థాన్ని స్వీకరించాలి.

ప్రశ్న: శరీరం లేకపోతేనే మోక్షం అన్నారు. శరీరం వుంటేనే సుఖ దుఃఖాల స్పర్శ వుంటుందన్నారు. కనుక, మీరు చెప్పేదానిని బట్టి మీ మోక్షంలో శరీరమూ లేదు, సుఖ దుఃఖాలు లేవు. కనుక మీరు చెప్పే మోక్షం కేవలం శూన్యస్వరూపమని అర్థం చేసుకోవచ్చునా?

**సమాధానము:** మోక్షం శూన్యస్వరూపం కాదు. ఎందుకో విచారిద్దాం.

## 29. మోక్షము శూన్యస్వరూపము కాదు

శరీరము, శరీరంలో ఇంద్రియాల ద్వారా గ్రహించబడే సుఖదుఃఖాలు, లేనంత మాత్రాన ఆ స్థితి శూన్యమే అని నిర్ధారణ చేయగలమా అనేది మన ముందు వున్న ప్రశ్న.

మనకు నిత్యానుభవంలో వున్నది సుషుప్తి. సుషుప్తిలో శరీరానుభవం వున్నదా? లేదు. ఇంద్రియజన్య సుఖదుఃఖానుభవం వున్నదా? అదీ లేదు. అంత మాత్రాన సుషుప్తిని శూన్యావస్థ అనగలమా? ఒక వేళ పట్టుదలకోసం అన్నా, సుషుప్తి తర్వాత వచ్చే మెలకువలో, "సుషుప్తి దశలో నేను సుఖంగా వున్నాను" అని కలిగే స్మృతి అందరికీ అనుభవంలోవుంది. కనుక, సుషుప్తి దశ కేవలం శూన్యం కాదనీ, అక్కడ సుఖం వుందనీ, "నేను" కూడా అక్కడ వున్నాననీ, నిరూపణ కావటం లేదా? కనుక శరీరము, తజ్జన్య సుఖదుఃఖాలు, లేనంత మాత్రాన ఆ స్థితిని శూన్యమనేందుకు వీలు లేదు. ఈ కారణంచేతే మోక్షం శూన్యం కావటానికి వీలు లేదు.

**ప్రశ్న:** సుషుప్తిలో నేను వున్నాను, సుఖం వుంది అనే అనుభవం కలిగి, దాని యొక్క స్మృతి జాగ్రదవస్థలో మనకు కలుగుతుందని మీరే చెపుతున్నారు. సుఖం వుంది కనుక ఏదో రూపంలో ఇంద్రియాలు కూడా అక్కడే వున్నాయనీ, ఇంద్రియాలు వున్నాయి కనుక, ఏదో రూపంలో శరీరం కూడా అక్కడే వుందనీ, ఎందుకు చెప్పరాదు?

**సమాధానము:** ఒక వస్తువు వుందనటానికి మన అనుభవమే ప్రమాణం. మన అనుభవంలోకి రాలేదూ అంటే ఆ వస్తువు అక్కడ లేకపోయి వుండాలి లేదా ఆ వస్తువు మన అనుభవానికి రాకుండా అడ్డు వచ్చేది వేరే ఏదైనా వుండాలి. సుషుప్తి అవస్థలో శరీరం వుంది అని చెప్పేటట్లయితే అది అనుభవంలోకి రావాలి. అలాంటి అనుభవం ఎవరికీ లేదు. ఇక ఆ శరీరానుభవం కలుగకుండా అడ్డం పెట్టే ఆవరణ ఏదైనా వుండి వుండాలి. అలాంటి ఆవరణ లభించాలి. సూర్యుణ్ణి మేఘాలు కమ్మితే, సూర్యుడు కనిపించడు గానీ మేఘాలు కనిపిస్తాయి కదా! సుషుప్తి దశలో అలాంటి ఆవరణ యొక్క అనుభవం కూడా ఎవరికీ లేదు. కనుక, వున్న శరీరాన్ని కప్పిపుచ్చే ఆవరణ ఏదో సుషుప్తిలో వుంది అనటం కుదరదు. కనుక సుషుప్తిలో శరీరం లేనే లేదని చెప్పాలి. (ఒక వ్యక్తి సుషుప్తిదశలోవున్నప్పుడు, వాడి శరీరం ఇక్కడే పడి వుండటం మన బోటివారికి కనిపిస్తూనేవుంది గదా అంటారేమో, సుషుప్తిదశలో వున్నవాడి శరీరం ఇక్కడ వుందనేది, జాగ్రదవస్థలోవున్న మరొక జీవుడి అనుభవమే గాని, వీడి అనుభవం కాదు. వీడి అనుభవానికి సంబంధించినంతవరకు ఆ శరీరం లేనిదే.)

శరీరం లేకుండానే సుఖానుభవం కనిపిస్తోంది కనుక, ఈ సుఖం ఇంద్రియ విషయ సంయోగంవల్ల కలిగే లోక సామాన్యమైన సుఖం కాదనీ, అది సుషుప్తి దశలో అనుగతంగా వున్న ఆత్మయొక్క నిజమైన స్వరూపమనీ, మనం గ్రహించాలి.

**ప్రశ్న:** ఆత్మయొక్క నిజస్వరూపమే సుఖం అయ్యేటట్లయితే, నేనే సుఖాన్ని అనే జ్ఞానం సుషుప్తి అవస్థలో వుండగా ఎందుకు కలగటంలేదు? సుషుప్తి దాటిపోయి మెలకువ వచ్చినాక స్మృతిగా మాత్రమే అది ఎందుకు తెలుస్తోంది?

**సమాధానము:** స్మృతిగా తెలుస్తోంది కనుక ఆత్మయొక్క స్వరూపం సుఖమే అనటాన్ని మనం తిరస్కరించలేము. సుషుప్తిలోనే సూటిగా ఆత్మస్వరూప జ్ఞానం కలిగినట్లయితే, ఆ స్థితి మోక్షమే అవుతుంది గానీ, సుషుప్తి కాదు.

**ప్రశ్న:** సుషుప్తే మోక్షం అందాం. అశరీరత్వము, ఇంద్రియజన్య సుఖదుఃఖ రాహిత్యము, అనే లక్షణాలు సుషుప్తికి సరిపోతున్నాయి కదా! అదే మోక్షమంటే నష్టమేమి?

**సమాధానము:** మోక్ష మంటే పునరావృత్తి లేనిది. సుషుప్తిలోనూ, మోక్షంలోనూ కూడా ఇంద్రియ స్పర్శలేని సుఖానుభవం సమానమే కానీ, సుషుప్తి తర్వాత దుఃఖానికి పువరావృత్తి కనిపిస్తూ వుంది. అదీ కాక సుషుప్తి దశలో "నేనెవరో నాకు తెలియదు" అనే అజ్ఞానం వదలిపెట్టకుండా వుంది. మోక్షస్థితిలో ఇలాంటి అజ్ఞానం వుండే అవకాశం లేదు. కనుక సుషుప్తే మోక్షం అనటానకి వీలు లేదు.

అంతే కాక అజ్ఞానమనే తెర సుషుప్తిలో అనుభవానికి వస్తోంది. కనుక, అది ఆత్మయొక్క నిజస్వరూపాన్ని కొంతవరకూ కమ్మివేస్తోంది. ఆత్మలో కూడా "వున్నాను" – అనే అంశము (దీనినే సదంశము అంటారు), "నేనే జ్ఞానాన్ని" అనే అంశము (దీనినే చిదంశము అంటారు), కమ్మివేయబడతాయి. "ఆనంద"మనే అంశం మాత్రం మబ్బులలోంచి తెల్లని వెలుగుగా కనిపించే సూర్యకాంతి లాగా అనుభవానికి వస్తూ వుంటుంది. అందుచేత సుషుప్తి అవస్థలో ఆత్మయొక్క సత్ చిత్ అంశల దర్శనం లభించదు. కనుకనే సుషుప్తి సమయంలో నేను వున్నాననీ, నేను సుఖాన్ననీ, జ్ఞానం అనుభవానికి రాదు. ముక్తి దశలో ఆత్మయొక్క స్వరూపం సదంశతోనూ, చిదంశతోనూ, ఆనందాంశతోనూ పరిపూర్ణంగా అనుభవానికి వస్తుంది.

ఇక్కడ అంశ పదాన్ని ఆత్మలో అవయవాలు వున్నాయి– అనే అర్థంలో స్వీకరించరాదు. అనగా ఆత్మలో సదంశ అనేది ఒక పక్క, చిదంశ అనేది ఒక పక్క, ఆనందాంశ అనేది ఒక పక్క, వేరు వేరుగా లేవు. సత్తే చిత్తు. ఆ చిత్తే ఆనందం.

ఇందులో ఆనందత్వం మాత్రమే సుషుప్తిలో అనుభవానికి వస్తోంది కనుక, దానిని ఆనందాంశ అని వ్యవహరిస్తున్నాం.

ఏతావతా తేలిందేమంటే సుషుప్తికీ, ముక్తికీ కొంత పోలిక వున్నప్పటికీ, ఆ రెండూ పూర్తిగా ఒకటి కావు. అలాగే సుషుప్తి ఎలా శూన్యావస్థ కాదో అలాగే ముక్తి కూడా శూన్యావస్థ కాదు. సుషుప్తి ఏ విధంగా ప్రత్యక్ష అనుభవమో, మోక్షం కూడా అలాగే ప్రత్యక్ష అనుభవమే!

## 30. శరీరం రావటానికి కారణమేమిటి?

**ప్రశ్న:** మీరు చెప్పినట్లు మోక్షం శూన్యం కాకపోతే, ఆత్మపదార్థం దేనితోనూ సంబంధం లేనిదే అయితే, ఇక ఆత్మకు శరీరం యెందుకు కలుగుతోంది? పంచభూతాలవల్ల శరీరం ఏర్పడుతోంది అని మీరు అంటారేమో! అలా అయేటట్లయితే, పంచభూతాలనేవి సృష్టిలో ఎప్పటికీ వుండనే వుంటాయి కనుక, సృష్టిలో ఇంతవరకూ ఎవరికీ మోక్షం రానే రాలేదని చెప్పాలి. ఇంత వరకూ ఎవరికీ రాని మోక్షం ఇక మీద మరొకరికి వస్తుందని ఊహించటం హాస్యాస్పదం. కాగా, ఇంతవరకు రాని, ఇకముందు రాబోని, మోక్షం గురించి ఇంత చర్చ యెందుకు?

**సమాధానము:** పంచభూతాలవల్ల మాత్రమే యీ శరీరం ఏర్పడుతుందని మేము చెపితే గదా, నీవు చెప్పిన చిక్కులన్నీ వచ్చిపడేది. కొండంత మట్టిముద్ద వున్నంత మాత్రాన, కుండలు వచ్చి మన ముందు వాలుతాయా? మట్టిని కుండలుగా చేసే కుమ్మరివాడు వుండవద్దా? కళాఖండాలవంటి కుండలను నిర్మించగల కుమ్మరి వున్నాడు. కాని వాణ్ణి మహాసముద్రం మధ్యంలో చిన్న తెప్పకొయ్య మీద కూర్చోబెట్టి ఇక కుండలు చెయ్యమన్నాం. చెయ్యగలడా? కుండలు జన్మించాలంటే, మట్టిముద్దా వుండాలి. కుమ్మరీ వుండాలి. కుండకు ఆ రెండూ కారణాలే. కుండ తయారయినాక దానిలో ఏ మూల చూచినా మట్టే కనిపిస్తుంది కానీ, కుమ్మరివాడు కనిపించడు. కార్యంగా మారినాక గూడా, ఆ కార్యంలో దర్శనమిచ్చే కారణాన్ని **"ఉపాదానకారణము"** అంటారు. అలా దర్శనమివ్వని కారణాన్ని **"నిమిత్త కారణము"** అంటారు. ఏదైనా ఒక కార్యం జన్మించాలంటే ఒక్క ఉపాదానకారణం వున్నా చాలదు, ఒక్క నిమిత్త కారణం వున్నా చాలదు. రెండూ వుండాలి. శరీరోత్పత్తికి నీవు చెప్పిన పంచభూతాలు ఉపాదాన కారణం. ఆ జీవియొక్క పూర్వ కర్మమే నిమిత్త కారణం. ఈ రెండూ కలిసినప్పుడే శరీరం ఆవిర్భవిస్తుంది. శరీరములయొక్క జన్మ పరంపర అనాది గనుక

మొదటి శరీరంయొక్క జన్మకు నిమిత్తకారణం ఎక్కడినుంచీ వస్తుంది అనే ప్రశ్నకు తావు లేదు.

కనుక, యీ జీవికి సుఖదుఃఖాలను అనుభవించవలసిన కర్మ వుంటే, ఆ కర్మ తనకు కావలసిన పంచభూత భాగాలను తీసికొని, తనకు కావలసిన రూపంలో శరీరాన్ని నిర్మిస్తుంది. దానిలో గూడా జాగ్రదవస్థలోని అనుభవాలకు అనుకూలమైన శరీరాన్ని జాగ్రదవస్థలోనూ, స్వప్నావస్థలోని అనుభవాలకు అనుకూలమైన శరీరాన్ని స్వప్నావస్థలోనూ, నిర్మిస్తుంది.

ఏ రకమైన అనుభవానికి అవకాశంలేని కాలం వచ్చే సరికి, ఏ రకమైన శరీరమూ లేకపోవటంవల్ల సుషుప్తి అవస్థ వస్తుంది. ఇంతలో మళ్ళీ ఏదో ఒక రకమైన కర్మ తోసుకు వచ్చే సరికి, సుషుప్తి అవస్థ తొలగిపోయి, స్వాప్నిక శరీరమో, జాగ్రత్ శరీరమో, వస్తుంది. ఆత్మజ్ఞానంవల్ల అన్ని రకాల కర్మలూ పూర్తిగా నశించిపోతే, ఇక మళ్ళీ శరీరాన్ని నిర్మించటానికి కావలసిన నిమిత్తకారణం లేదు కనుక, పంచభూతాలన్నీ అక్కడే వున్నా, యీ జీవికి శరీర సృష్టి జరగదు. మట్టి వున్నా కుమ్మరి లేకపోతే కుండ పుట్టదని చెప్పుకొన్నాం గదా. కనుక, శాశ్వత సుఖరూపమైన మోక్షం లభించాలంటే ఆత్మజ్ఞానం పొందటం ఒకటే మార్గం.

## 31. జ్ఞానంవల్ల మోక్షం

**ప్రశ్న:** ఆత్మ జ్ఞానంవల్ల అన్ని రకాల కర్మలూ ఒక్క సారిగా నశించిపోయే మాట సాధ్యమయ్యేటట్లయితే, మీరు చెప్పిన అశరీరత్వరూపమైన ముక్తి సాధ్యమవుతుంది. కానీ, కేవలం జ్ఞానంవల్ల వెనుకటి కర్మలన్నీ నశించిపోతాయనటం యుక్తియుక్తం కాదు. వేదవాక్యాలూ దాన్ని అంగీకరించవు. **"అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం"** (చేసికొన్న పాపమైనా పుణ్యమైనా అనుభవించి తీరవలసిందే. అవి పోయేందుకు వేరే దారి లేదు.) అని **"నాఽఽ భుక్తం క్షీయతే కర్మ"** (అనుభవించనిదే కర్మ క్షయించదు) అనీ, అనేక ప్రమాణవాక్యాలు వున్నాయి. ఇలా వుండగా ఆత్మజ్ఞానంవల్ల మోక్షం వచ్చేస్తుందని ఎలా చెప్పగలరు?

**సమాధానము:** ఈ గ్రంథ ప్రారంభంనుంచీ 17వ శీర్షికదాకా అధ్యారోపం గురించి చర్చ చేసుకొని వున్నాం. ఆ శీర్షికలలో యీ కర్మ పరంపరాత్మకమైన సృష్టి అంతా తాడుమీద పామును ఆరోపించినట్లుగా, పరమాత్మమీద ఆరోపించగా ఏర్పడినదేనని నిరూపించుకొన్నాం. చీకటిలో తాడును చూచి పామని భ్రమించినప్పుడు, ఆ పాము తోక పోయేందుకు ఒక ఉపాయము, తల పోయేందుకు ఒక ఉపాయము

అక్కర లేదు. దీపం తెస్తే పాము మొత్తం ఒకే సారి ఎగిరిపోతుంది. అలాగే ఆధ్యారోపవిధానంలో, భ్రాంతిగా ఉద్భవించిన యీ సకల జగత్తు నశించాలంటే, అది దీనిలోని భాగాలను క్రమక్రమంగా నశింపజేయటమనే ప్రక్రియవల్ల సాధ్యమే కాదు. భ్రాంతికి మూలమైన అజ్ఞానం పోతే, సృష్టి మొత్తం ఒకే సారి ఎగిరిపోతుంది. చీకటిని వెలుతురు మాత్రమే పోగట్టగలిగినట్లుగా, భ్రాంతిని జ్ఞానం మాత్రమే పోగొట్టగలదు– అని ఈ శీర్షికలలో మనం విస్తారంగా నిరూపించుకొని వున్నాం. కనుక, జ్ఞానంవల్ల కర్మలు నశించటం యుక్తియుక్తం కాదనటం పొరపాటు.

ఇక వేదవాక్యాల సంగతి విచారిద్దాం. నీవు చెప్పిన వాక్యాలు వున్నాయి. అలాగే **"జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా"** (జ్ఞానమనే అగ్ని అన్ని రకాల కర్మలను భస్మం చేస్తుంది) అని, **"జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణః"** (జ్ఞానాగ్నిచేత కర్మలన్నీ దహించి వేయబడగా ముక్తిని పొందుతున్నారు) అని, ఇలాంటి వాక్యాలు కూడా వేద శాస్త్రాలలో వున్నాయి. రెండు రకాల వాక్యాలూ శాస్త్రాలలోనే వున్నప్పుడు, ఈ రెండింటిలో ఒకటి అబద్ధం అనరాదు. ఆ రెండింటినీ సమన్వయ పరిచే విధానం ఆలోచించాలి.

అలాగే వున్న వాక్యాలలో ప్రబల వాక్యమేదో, దుర్బల వాక్యమేదో విచారించాలి. దుర్బల వాక్యం ఏ సందర్భంలో వచ్చిందో, దానికి ప్రయోజనమేమిటో, కూడా విచారించాలి.

ఒక పిల్లవాడికి కారం అంటే చాలా ఇష్టం. ఆ తల్లి చెప్పింది– "కారం విషం వంటిది. తీపి ఎంతైనా తిను. తీపి అమృతం వంటిది" అని. పిల్లవాడు వృద్ధుడయ్యాడు. చక్కెర వ్యాధి పట్టుకుంది. వైద్యుడు వచ్చి "తీపి విషం. కావాలంటే కొద్దిగా కారం తినండి" అన్నాడు. ఆ మనిషికి సందేహం వచ్చింది. "మా అమ్మ కారం విషం అని చెప్పింది. ఈ వైద్యుడు తీపి విషం అంటున్నాడు. దీనిలో ఏది ప్రమాణం?" అని. మనమేమి చెపుతాం? "రెండూ ప్రమాణమేనయ్యా! కానీ ఈ వయస్సులో నీకు చక్కెర వ్యాధి వచ్చింది కనుక ప్రస్తుతం నీకు వైద్యుడి మాటే ఉత్తమ ప్రమాణం" అని చెపుతామా లేదా?

ఈ మాట ఎలా చెప్పాం మనం? తల్లి ఏ సందర్భంలో ఆ మాట చెప్పిందో, వైద్యుడు ఏ సందర్భంలో ఈ మాట చెప్పాడో, రెండూ విచారించాం. ఏ సందర్భానికి ఆ సందర్భంలో రెండూ సత్యాలే కనుక రెండూ ప్రమాణ వాక్యాలే అన్నాం. కానీ ప్రస్తుత సందర్భంలో చక్కెర వ్యాధి ప్రమాదకరంగా వుంది కనుక వైద్యుడి వాక్యమే ప్రబలవాక్యమని నిర్ణయం చేసి, దుర్బలమైన తల్లి వాక్యాన్ని తిరస్కరించి, వైద్యుడి మాటే వినమని నిర్ణయించాం.

అదే విధంగా సంసార దశలో కర్మలయొక్క, వాటి ఫలితాలయొక్క, గతులను వివరించేటప్పుడు చెప్పినట్టివి **"నా భుక్తం క్షీయతే కర్మ"** మొదలైన వాక్యాలు. ఆ సందర్భంలో అవి ప్రమాణాలే, సత్యాలే.

ఈ కర్మపరంపరంతా ఎలా ఉద్భవిస్తోంది? దీని మొత్తాన్ని అధిగమించడం ఎలా? అనే చర్చ సందర్భంలో చెప్పినవి **"జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా"** మొదలైన వాక్యాలు. ఆమూలాగ్ర తత్త్వచర్చాసందర్భంలో చెప్పినవి కనుక ఈ వాక్యాలే ప్రబలవాక్యాలు.

"ఒక కర్మ చేసి దాని చెడు ఫలితంనుంచి తప్పించుకొని పారిపోవటం సాధ్యం కాదు. కనుక చెడుపనులు చేయవద్దు"– అని చెప్పడమే మొదటి రకం వాక్యాలకు తాత్పర్యం.

ఎన్ని రకాల సత్కర్మలు చేస్తూపోయినా, ఈ జన్మపరంపరకు అంతే దొరకదనీ, అందువల్ల ఎప్పటికైనా సరే, ఈ కర్మపరంపరా, జన్మపరంపరా, ఏ అజ్ఞానంవల్ల ఉద్భవించాయో దానిని సమూలంగా నిర్మూలించాలంటే జ్ఞానమే కావాలనీ, అజ్ఞానానికి విరోధి జ్ఞానమే కనుక అజ్ఞానాన్ని, దానివల్ల పుట్టిన సుఖ దుఃఖ పరంపరనూ, శాశ్వతంగా నశింపచేయ గలిగినది జ్ఞానం ఒక్కటేననీ, చెప్పటమే రెండవ రకం వాక్యాలకు తాత్పర్యం.

ఈ రెండు రకాల వాక్యాలలో రెండవ రకం వాక్యాలే ప్రబల వాక్యాలని సులభంగానే మనం గ్రహించగలం. కనుక వేద శాస్త్ర ప్రమాణంచేత కూడా ఆత్మజ్ఞానంవల్లనే అశరీరాత్మకమైన మోక్షస్థితి సిద్ధిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఇట్లు చతుర్థవర్ణకము సమాప్తము.

## పంచమ వర్ణకము

### 32. త్రివిధ కర్మలు

**ప్రశ్న:** బాగుంది. కర్మాచరణ దశ ఒకటి, కర్మ సముదాయాన్ని మొత్తాన్ని అధిగమించే దశ ఒకటి, అని చెపుతున్నారు మీరు. అయితే ఈ కర్మలు ఎన్ని రకాలు? వీటి కర్తలెన్ని రకాలు? ఆ కర్త లెవరు?

**సమాధానము:** కర్మ మూడు రకాలు. పాపము, పుణ్యము, మిశ్రమము అని.

దేవతలు మొదలైన వారి శరీరాలు కేవల పుణ్యకర్మకు ఫలితంగా వస్తాయి. పశువులు మొదలైన శరీరాలు కేవల పాపకర్మకు ఫలితంగా వస్తాయి. మనుష్యులు శరీరాలు పుణ్యం కొంత, పాపం కొంత కలవగా, ఆ మిశ్రమ కర్మకు ఫలితంగా వస్తాయి.

పైన చెప్పిన మూడు రకాల కర్మలలో ప్రతి ఒకటీ మళ్ళీ మూడు రకాలు ఉత్కృష్టము, మధ్యమము, సామాన్యము అని.

ఉదాహరణకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది శరీరాలు, హిరణ్యగర్భుని శరీరము, ఉత్కృష్ట పుణ్యానికి ఫలం. దేవేంద్రాదుల శరీరం మధ్యమ పుణ్యానికి ఫలం. యక్ష, కిన్నర, కింపురుషాది శరీరాలు సామాన్య పుణ్యానికి ఫలం.

విషపు చెట్లు, ముళ్ళ చెట్లు, పులులు, పాములు, తేళ్ళు వంటి పరాపకారకములైన తిర్యక్ జడశరీరాలు ఉత్కృష్ట పాపానికీ ఫలం. మామిడి, అరటి, గేదెలు, గాడిదలు వంటి తిర్యక్ జడశరీరాలు ఏనుగులు వంటి శరీరాలు సామాన్య పాపానికి ఫలం.

ఇక మిశ్రమకర్మలో మోక్షం పొందటానికి చేయవలసిన పనులకు అనుకూలమైన మనుష్య శరీరం ఉత్కృష్ట మిశ్రకర్మ ఫలం. మోక్షం కోసం కాక, కామ్యకర్మలకు, తనకు విహితములైన కర్మలకు, అనుకూలమైన మానవ శరీరం మధ్యమ మిశ్రకర్మకు ఫలం. క్రూరకర్మలు, పాపకర్మలు చేసే మానవ శరీరం సామాన్య మిశ్రకర్మకు ఫలం.

ఈ కర్మఫల విచారణవల్ల మనకు ఒక విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఏమంటే, మనకు మానవ జన్మ వచ్చింది గనుక, మనం మిశ్రకర్మ స్థితిలో వున్నాం. ఇక మనం ఎలాంటి పనులు చేస్తున్నాం? అని విచారించుకోవాలి. మనం సామాన్య మిశ్రకర్మ స్థితిలో వుంటే, ఆ పద్ధతి మార్చుకొని ముందు మధ్యమ మిశ్రమకర్మ స్థితిలోకి వెళ్ళేందుకు ప్రయత్నం చేయాలి. అపుడు సకామ కర్మానుష్ఠానము వంటివి అందుతాయి. ఆ స్థితి ఖాయమైనాక ఉత్కృష్ట మిశ్రకర్మ స్థితికి చేరుకొనే ప్రయత్నం చేయాలి. ఈ చర్చకు ఇదే ముఖ్య ఫలం.

పైన విభజించిన ప్రకారం 9 రకాల కర్మలు తేలాయన్నమాట. వీటన్నింటినీ ఆచరించే కర్త ఎవరు?

### 33. కర్తృత్వ విచారణ

ఈ విచారణలో మనం ఇదివరలో చెప్పుకున్న విషయాలు కొన్ని మళ్ళీ వస్తాయి. కానీ వాటిని ఇప్పుడు మనం వేరే దృక్కోణంతో చెప్పుకుంటాం కనుక పునరుక్తి కాదు.

కర్మలను చేసేది ఎవరు? అని ప్రశ్న.

**ప్రశ్న:** దానికి ఇంత విచారణ ఏమి? లోకంలో ప్రతివాడూ నేను చేస్తున్నా, నేను చేస్తున్నా అంటున్నాడు. అలా అనేటప్పుడు "నేను" అనే పదానికి అందరి మనస్సులలోనూ వున్న అర్థమేమంటే ఈ దేహాన్ని "నేను" అని అభిమానించే చైతన్య పదార్థం ఒకటి లోపల వుంది. ఆ చైతన్య పదార్థాన్ని "ఆత్మ" అని పిలుస్తూ వుంటారు. కనుక నేను అనబడే ఆత్మే అన్ని రకాల కర్మలకూ కర్త.

**సమాధానము:** ఈ ఆలోచన కొంతవరకూ బాగానేవుంది కానీ, మనం వెనుకటి శీర్షికలలో ఆ చైతన్య పదార్థమైన ఆత్మకు ఏ రకములైన వికారాలు (మార్పులు) వుండే వీలు లేదనీ, దానిలో స్వగత భేదములు (అవయవములు) ఏవీ లేవనీ, అందువల్ల అది ఏ రకమైన క్రియలూ చేయలేదనీ, చెప్పుకొని వున్నాం. అలాంటప్పుడు నిష్క్రియమైన, నిరవయవమైన, ఆ ఆత్మను కర్తగా చెప్పటం ఎలా కుదురుతుంది?

**ప్రశ్న:** అయ్యా! ఈ మెలికెల మాట లెందుకు? లోకంలో అందరికీ నేనే (ఆత్మనే) కర్తని అని అనుభవముంది. నేను చేసే పనులకు నేను కాకుండా మరొకరు ఎవరో కర్తగా వుండే అవకాశం కనిపించడం లేదు. అనుభవాన్ని కాదని, ఏదో తర్కం పెట్టడం న్యాయమౌతుందా?

**సమాధానము:** అనుభవాన్ని కాదనటం లేదు. ఉన్న అనుభవం ఏమిటి?– అని లోతుగా పరిశీలిస్తున్నాం. లోకంలో అనుభవాల్లాగా కనిపించేవన్నీ సత్యాలే అనే నియమం లేదు. ఉదాహరణకు, రైలులో ప్రయాణం చేసే బాలుడికి బయట చెట్లన్నీ పరిగెత్తుతున్నాయనీ, తను కదలకుండా ఉన్నాడనీ, అనుభవం కలుగుతోంది. ఈ అనుభవం సత్యమా? కాదు. కేవలం భ్రాంతి. అలాగే నేను కర్తని అనే అనుభవం కూడా అధ్యాసవల్ల (భ్రాంతివల్ల) కలిగే అవకాశం వుంది.

**ప్రశ్న:** అవకాశమనే గానీ ఖాయంగా అధ్యాసే అని చెప్పే వీలు లేదు కదా! అలాంటప్పుడు లోకానుభవాన్ని నమ్మి ఆత్మకు కర్తృత్వం స్వభావ సిద్ధమనీ, సత్యమనీ, ఎందుకు చెప్పరాదు?

**సమాధానము:** కర్తృత్వం ఆత్మకు స్వభావ సిద్ధమయితే, స్వభావమనేది ఎప్పటికీ నశించదు గనుక కర్తృత్వం ఎప్పటికీ పోదు. కర్తృత్వం ఉన్నంత కాలం సంసారబంధం వుంటుంది. కనుక వేదాంత శాస్త్రం ఎంత విచారణ చేసినా బంధం పోయే వీలే లేదు గనుక మోక్షమనేది ఎప్పటికీ రాదు. కనుక వేదాంత శాస్త్రమంతా వ్యర్థమని చెప్పవలసి వస్తుంది.

**ప్రశ్న:** అలా కాదండీ! ఒకడు కోపిష్ఠి స్వభావంవాడు ఉన్నాడు. స్వభావం తప్పని తెలుసుకొని, విశ్వామిత్రుడి లాగా గట్టి ప్రయత్నం చేస్తే, కోప స్వభావం పోయి,

శాంత స్వభావం రావడం సాధ్యమే. అలాగే, గట్టి ప్రయత్నం చేస్తే ఆత్మకు కర్తృత్వ స్వభావం పోయి, అకర్తృత్వ స్వభావం ఏర్పడుతుంది. వేదాంతాలు దీనినే బోధిస్తున్నాయి.

**సమాధానము:** నీవు చెప్పిన ఉదాహరణలో స్వభావమనే పదానికి స్వగుణము అనే అర్థాన్ని తీసుకొని, నీకు నీవే గందరగోళ పడుతున్నావు. కోపిష్ఠి స్వభావము అన్న చోట కోపిష్ఠితనం గుణమే కానీ వాడి ఆత్మ స్వరూపం కాదు. నేను కర్తను అన్నచోట కర్తృత్వం ఇలాంటి గుణం కాదు. కర్తృత్వమే ఆత్మయొక్క స్వరూపమని భావం. అలా కాకపోయినట్లయితే ఒక చిక్కు వస్తుంది. కోపిష్ఠి స్వభావం వాడు 24 గంటలు, 360 రోజులు కోపంగా వుండలేడు. తరచుగా కోపంగా వుంటే వుంటాడు. ఆత్మయొక్క కర్తృత్వం కూడా ఇలాంటిదే అయినట్లయితే, ఆత్మ అకర్తగా వుండే దశ అప్పుడప్పుడు వుంటుందని చెప్పాలి. అలా చెపితే, ఆత్మ అవికారి (మార్పులు లేనిది) అన్న మాట పోతుంది. అది కుదరదు. కనుక ఆత్మ అనేది అయితే సర్వాత్మనా కర్త కావాలి, లేదా సర్వాత్మనా అకర్త కావాలి.

**ప్రశ్న:** సర్వాత్మనా కర్తే అందాం.

**సమాధానము:** అగ్నికి ఉష్ణత్వం స్వభావసిద్ధం. అంటే అగ్ని వున్న చోట ఉష్ణత్వం వుండి తీరుతుంది. అలాగే కర్తృత్వం ఆత్మకు స్వభావ సిద్ధమయితే, ఆత్మ వున్న చోటల్లా కర్తృత్వం వుండితీరాలి. మరి సుషుప్తి దశ వుంది. దీనిలో ఆత్మకు కర్తృత్వం ఎక్కడ వుంది? ఏమి చేసినా ఆ దశలో ఆత్మకు కర్తృత్వం అంటకట్టడం సాధ్యం కాదు. కనుక సర్వావస్థలలోనూ ఆత్మ కర్త అనే మాట చెల్లదు.

**ప్రశ్న:** ఆగండి! ఆ సమయంలో ఆత్మయొక్క కర్తృత్వం బయట పడేందుకు తగిన అవయవాలు ఆత్మ దగ్గర లేవు గనుక అకర్త లాగా కనిపిస్తున్నాడు. ఒక మహావీరుడున్నాడు. వాడు కత్తి పట్టుకుంటే మెరుపు లాగా, గంతులు వేసి, వందల గొర్దీ గొంతులు నరకగలడు. కానీ వాడు ఎల్లప్పుడూ కత్తి పట్టుకొనే వుండడు కదా! ఇంట్లో భోజనం చేసేటప్పుడు వాడి పరాక్రమం మనకు కనిపించదు. అంత మాత్రం చేత ఆ సమయాలలో వాడు వీరుడు కాడని చెప్పగలమా? అలాగే సుషుప్తిదశలో ఆత్మకు ఇంద్రియాలతో సంబంధం తెగిపోతుంది గనుక వాడి కర్తృత్వం బయటపడటం లేదు. అంతే.

**సమాధానము:** సుషుప్తి దశలోనే కాదయ్యా! మెలకువగా ఉన్నప్పుడు కూడా ఒకడు అలా స్తబ్ధంగా ఏ ఆలోచనా లేకుండా కూర్చొన్నప్పుడు, వాడు ఏ పనీ చేయడం

లేదు. అప్పుడు వాడి ఆత్మకు అంతఃకరణంతోనూ ఇంద్రియాలతోనూ సంబంధం వుంది. అయినా కర్తృత్వం కనిపించడం లేదు. దీనిని ఏమనాలి? దీనిని సమన్వయించాలంటే ఒకటే మార్గం. కర్తృత్వం ఇంద్రియాలది. ఇంద్రియాల కర్తృత్వాన్ని అధ్యాసవల్ల ఆత్మకు అంటకట్టుకుంటున్నాడు మానవుడు. ఇందాక చెప్పుకున్న ఉదాహరణలో రైలులో బాలుడు తనలో వున్న కదలికను చెట్లకు అంటగట్టి, చెట్లలో వున్న స్థిరత్వాన్ని తనకు అంటగట్టుకున్నాడు. (ఆరోపించుకున్నాడు) ఇలాంటి ఆరోపణే అధ్యాస. కనుక కర్తృత్వం ఇంద్రియాలలో వుండగా దానిని అధ్యాసవల్ల తనకు (ఆత్మకు) జీవుడు తగిలించుకుంటున్నాడు- అంటే ఏ చిక్కూ వుండదు. అప్పుడు కర్తృత్వం ఆత్మయొక్క స్వభావం కాదు గనుక, సుషుప్తిలో కర్తృత్వం కనిపించడం లేదనే దోషం వుండదు. ఆత్మ అవికారి అనే మాటకు భంగం కూడా వుండదు. ఆత్మ **"సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ"** వంటి వేదవాక్యాలకు కూడా భంగం వుండదు. (ఆత్మ కేవలమూ సాక్షి మాత్రుడు, చేతన స్వభావుడు, అద్వితీయుడు, నిర్గుణుడు అని పై వాక్యానికి భావం.) ఇంద్రియాలయొక్క కర్తృత్వాన్ని తనలో ఆరోపించుకొంటున్నాడు కనుక, "నేనే కర్తను" అనే అనుభవానికి కూడా విరోధము వుండదు. కనుక కర్తృత్వమంతా ఇంద్రియాలదే అని చెప్పక తప్పదు.

**ప్రశ్న:** మీరు చెప్పిన సమన్వయాలన్నీ బాగానే వున్నాయి. కానీ ఇంద్రియాలు జడాలు. జడములకు కర్తృత్వాన్ని ఎలా చెపుతారు? అదీ గాక ఒకడు కర్త అంటే వాడు పని చేసేందుకు వేరే సాధనాలుండాలి. వీడు వడ్రంగి అంటే, వాడి చేతిలో ఉలో, రంపమో వుండాలి, అలాగే ఇంద్రియాలు కర్తలు అంటే, వాటి క్రింద పనిచేసే ఇంద్రియాలు వేరే వున్నాయి అని చెప్పాలి.

**సమాధానము:** పెద్ద గాలి వచ్చింది. చెట్లు ఎగిరి అవతల పడ్డాయి. చెట్లను విసిరేసిందెవరు? గాలే కదా! అది జడమే కదా! చెట్లను విసిరేటప్పుడు దాని దగ్గర వేరే పనిముట్లు ఏమి వున్నాయి? అలాగే పెద్ద వరద వచ్చింది. కట్టలు తెగిపోయాయి. ఇళ్ళు కూలిపోయాయి. నీరే కదా ఇంత పని చేసింది. జడమే కదా అది. దానికి వేరే సాధనాలు ఎక్కడ వున్నాయి? కనుక లోకానుభవాన్ని బట్టి జడపదార్థములు కూడా కర్తలయ్యే అవకాశం వుంది. అంతే గాక, జడ వస్తువులు వేరే సాధనాలు లేకుండానే కర్తలయ్యే అవకాశం వుంది. అదే విధంగా ఇంద్రియాలు కూడా జడాలు అయినప్పటికీ, వాటికి వేరే సాధనాలు లేకపోయినప్పటికీ, అవి కర్తలు కావడంలో ఇబ్బంది ఏమీ లేదు.

**ప్రశ్న:** బాగానే వుంది. ఇంద్రియాలు కర్తలు అని బహువచనం ఉపయోగిస్తున్నాం. మీ ఉద్దేశంలో ఏవి ఇంద్రియాలు? అవి ఎన్ని రకాలు? అవి చేసే పనులేమిటి?

## 34. ఇంద్రియాలు

జరిగే పనులను బట్టి ఇంద్రియాలను విభజించే విధానాలు అనేకం వున్నాయి. అయితే, మన ప్రస్తుత చర్చకు వాటిని మనస్సు, వాక్కు, కాయము అని విభజిస్తే సరిపోతుంది. ఈ మూడిటిలో ప్రతి ఒకటీ పాపకర్మలూ చేయగలదు. పుణ్యకర్మలూ చేయగలదు. రెండూ ఇటూ అటూగా కలసిన మిశ్రకర్మలూ చేయగలవు.

మనస్సు చేసే కర్మలలో సగుణ ధ్యానం, నిర్గుణ ధ్యానం, పరలోక చింత, భక్తి జ్ఞాన వైరాగ్యాల గురించి ఆలోచన, ఇటువంటివన్నీ మానస పుణ్యకర్మలు.

వీటికి వ్యతిరేకంగా, ఇంద్రియాలకు సంబంధించిన విషయ చింత, పరులకు అపకారం చేద్దామనే ఆలోచన, వేదశాస్త్రాలను ధిక్కరిద్దామనే ఊహ, ధర్మాధర్మాలూ కల్పితాలు అనే నిశ్చయం, ఇలాంటి బుద్ధి వికారాలన్నీ మానస పాపకర్మలు.

కొంత నిర్గుణ ధ్యానంతో కొంత ఇంద్రియ విషయచింతనూ, కొంత సగుణ ధ్యానంతో కొంత పరోపకార చింతనూ, ఇలా విరుద్ధ ఆలోచనలను కలగాపులగంగా కలిపివేసి చింతించటమే మానస మిశ్రకర్మ.

ఇక వాచిక కర్మల దగ్గరకు వచ్చేసరికి, సద్గ్రంథాలు చదవటం, దివ్యనామ కీర్తన చేయడం, సనాతన శాస్త్రాలను పరిశీలించటం, మహామంత్రాలను మనస్సులో జపించటం, ఇతరులకు ఉపకారం చేసే మాటలను మాట్లాడటం, పలికే సత్యవాక్యాన్ని మృదువుగా పలకటం, ఈ మొదలైనవన్నీ వాచిక పుణ్యకర్మలు.

వేదాలనూ, శాస్త్రాలనూ, దేవతలనూ, గురువులనూ నిందించటం, అసత్యాలు పలకటం, కరుకుగా మాట్లాడటం, అందరినీ వెక్కిరించటం, దుర్వార్తలను చేరవేయటం, ఈ వగైరాలన్నీ వాచిక పాపకర్మలు.

మంచి పూజలూ వ్రతాలూ చేస్తూనే మధ్యలో హాస్యాలాడడం, శాస్త్రప్రసంగాలు చేస్తూనే వాటిలో పరనిందను జోడించటం, తత్త్వవివరణలు చేస్తూనే రాజకీయ వార్తలను ప్రస్తావించటం, ఇటువంటివన్నీ వాచిక మిశ్రకర్మ.

ఇక, కాయిక కర్మలు– తీర్థయాత్రలు, పెద్దలకూ దేవతలకూ గురువులకూ నమస్కారాలు, దేవతాపూజలు, సత్పురుష దర్శనం, త్యాగం, దానం, లోకోపకారం కోసం సంచారం, ఇటువంటివన్నీ కాయిక పుణ్యకర్మలు.

ఇతరులను పీడించటం, దొంగతనాలు చేయటం, దుస్సాంగత్యం, వగైరాలన్నీ కాయిక పాపకర్మలు.

ఒక వూరి పేదలను పోషించటం కోసం మరో వూరి పేదలను దోచుకురావటం, దేవాలయాలు కట్టటంకోసం దోపిడీలు చేయటం, అన్న దానాలు చేసి వంటవారికి డబ్బు ఎగగొట్టటం, ఇటువంటివన్నీ కాయిక మిశ్రకర్మలు.

ఈ విధంగా చూసినపుడు మనం చేసే పనులు కోట్ల రకాలు వున్నా. అవన్నీ మనోవాక్కాయములనబడే మూడు ఇంద్రియాలలో ఏదో ఒక దానికి సంబంధించినది కాక తప్పదు. అని స్పష్టమౌతోంది.

## 35. కర్మ విచారణ ఫలము

మన దగ్గర ఏ కర్మ జరిగినా, పైన చెప్పిన విధంగా అది మనోవాక్కాయాల్లో దేనికి సంబంధించిందో ఆలోచించుకోవాలి. అలా ఆలోచించుకుంటే రెండు రకాల ఫలితాలు వస్తాయి.

1. ముఖ్య ఫలము, 2. అవాంతర ఫలము.

**ముఖ్య ఫలము:** ఆత్మ దేనినీ అంటుకోదనీ (అసంగమని), దానిలో అవయవాలు ఏవీ లేవనీ (నిరంశమనీ), అది అంతటా నిండి వున్నదనీ, (పరిపూర్ణమనీ), శుద్ధ చైతన్యమే దాని స్వరూపమనీ, పూర్వమే నిశ్చయించుకున్నాం. అట్టి ఆత్మ ఏ కర్మకూ, అంటే మానసిక కర్మకు కానీ, వాచిక కర్మకు కానీ, కాయిక కర్మకు కానీ, దేనికైనా సరే, కర్త కానేరదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అందువల్ల ఆత్మ స్వరూపినైన నన్ను ఏ కర్మా రవ్వంత కూడా ముట్టుకోలేదు అనే విషయాన్ని నిస్సంశయంగా తెలుసుకొని నేను ఏ మాత్రమూ కర్తృత్వం అంటనివాడిని అనే దృఢ నిశ్చయంతో వుండి పోవటమే పైవిచారణకు ముఖ్య ఫలం.

ఇలాంటి దృఢానుభవం పేరే బ్రహ్మజ్ఞానం.

**అవాంతర ఫలము:** ఇట్టి బ్రహ్మజ్ఞానం ఎంత కలిగినా సరే, మనస్సులో ఆలోచనలు వున్నంత వరకూ, మనోవాక్కాయాలు మూడింటిచేత పుణ్యకర్మలే చేయించాలి. అది అసంభవమైతే దాన్ని మిశ్రకర్మల యందు ప్రవర్తించేట్టు చూడాలి. అంతే గానీ పాపకర్మలను మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ ముట్టుకోనీయరాదు.

ఇలా పాపకర్మలను పరిహరించి కనీసం మిశ్రకర్మనైనా ఇంద్రియాలచేత చేయించే శక్తి పై విచారణవల్ల మాత్రమే కలుగుతుంది. ఇదే ఈ విచారణకు అవాంతర ఫలము.

ఒకడు ఇంట్లో ఆవును పెంచుతున్నాడు. దాంతో రోజూ చెంబెడు పాలు తాగుతున్నాడు. దాని పేడతో పిడకలూ కొట్టుకుంటున్నాడు. కనుక పాలూ పిడకలూ అనేవి రెండూ ఆవుయొక్క ఫలాలే. కానీ వీటిలో పాలు ముఖ్యఫలం. పిడకలు అవాంతరఫలం. ఇక్కడ పిడకల వంటిదే మన విచారణలోని పాపకర్మ పరిహారం.

**ప్రశ్న:** అన్నీ బాగానే వున్నాయి. ఆత్మ కర్త కాదు. తామరాకుకి నీటి చుక్క అయినా కొంచెం అంటుతుందేమో కానీ ఆత్మజ్ఞానికి కర్మ ఏ మాత్రం అంటదు. అతడు అకర్త. ఇంద్రియాలు చేసే కర్మలకు సాక్షి. ఇంతవరకూ ఒప్పుకున్నాం. ఇంతా చెప్పి ఆత్మజ్ఞాని తన ఇంద్రియాలచేత పుణ్యకర్మలే చేయించాలి. అని నియమం పెడుతున్నారెందుకు? అలా నియమం వుందీ అంటే, ఆ నియమంవల్ల వాడికి మంచి ఫలితమూ, నియమాన్ని భంగం చేస్తే చెడ్డ ఫలితమూ వస్తాయని అర్థమే కదా! అలా కర్మఫలాలను పొందేవాడు కర్త కాకుండా ఎలా పోతాడు?

## 36. బ్రహ్మ విద్వరిష్ఠుడు

**సమాధానము:** ప్రశ్న బాగానే వుంది. బ్రహ్మజ్ఞాని కర్త కానేరడు. నిజమే కానీ, బ్రహ్మజ్ఞానం కలిగినంత మాత్రంచేత అతడు పూర్తిగా బ్రహ్మాకారాన్ని వెంటనే పొందడు.

బ్రహ్మజ్ఞానం రెండు రకాలు. ఒకటి బ్రహ్మను గూర్చి సరైన ఆలోచన. ఆలోచన పేరే వృత్తి. కాగా మొదటి రకం బ్రహ్మజ్ఞానం, బ్రహ్మను గూర్చిన మనోవృత్తి. మనోవృత్తి అనేది ఎప్పుడైనా సరే, అంతఃకరణంలో చైతన్యం ప్రతిఫలించినపుడే సంభవిస్తుంది. అందుచేత ఈ రకమైన బ్రహ్మజ్ఞానాన్ని బ్రహ్మను గూర్చిన వృత్తి అంటారు. అదే **బ్రహ్మవిషయికవృత్తి.**

ఇట్టి బ్రహ్మను గూర్చిన వృత్తిని, అనగా ఆలోచనను, మళ్ళీ మళ్ళీ, మళ్ళీ మళ్ళీ, పునారావృత్తం చేస్తూవుంటే, తైలధార లాగా మధ్యలో సందు లేకుండా వుండేటట్లుగా పునరావృత్తం చేస్తూవుంటే, చిట్టచివరకు అంతఃకరణలో వృత్తి అనే భాగం ఎగిరిపోయి, కేవలం చైతన్యం మిగులుతుంది. దీనినే చరమ వృత్తి అంటారు. ఇట్టి చరమ వృత్తిలో వున్న బ్రహ్మజ్ఞానం బ్రహ్మను గూర్చిన వృత్తి కాదు. బ్రహ్మయే ఆకారమైన వృత్తి. ఇదే బ్రహ్మాకారవృత్తి.

అడవిలో ఎండు చెట్లకు కారుచిచ్చు అంటుకొన్నది. చెట్లకు చెట్లు కాలిపోతున్నాయి. ఆ కారు చిచ్చు ఎక్కడనుంచీ వచ్చింది? ఒకదాని కొకటి రాచుకున్న కొమ్మలలోంచే వచ్చింది. కొమ్మలలోంచి వచ్చిన చిచ్చు కొమ్మలనే తగల బెడుతుంది.

అలాగే విచారణ అనే ఆలోచనలోంచి పుట్టిన మొదటిరకం బ్రహ్మజ్ఞానం ఆలోచనలనే కాల్చివేస్తోంది.

కారుచిచ్చు అలాకొంత సేపు కొమ్మలను కాల్చినాక ఉన్న కొమ్మలన్నీ అయిపోతాయి. కొమ్మలన్నీ నశించిపోగా కొమ్మలతో పాటు కారుచిచ్చు కూడా నశించి పోతుంది.

అలాగే బ్రహ్మను గూర్చిన జ్ఞానం అనే వృత్తి ఇతర చిత్తవృత్తులన్నిటినీ క్రమంగా దహించివేసి, చివరకు చరమ వృత్తి దగ్గరకు వచ్చి, ఆ పైన వృత్తులతో పాటు తాను కూడా అంతరించిపోతుంది.

ఇట్టి స్థితి పేరే బ్రహ్మాకారమైన జ్ఞానం. ఇదే ఉత్తమ బ్రహ్మజ్ఞానం.

మొదటి రకం బ్రహ్మజ్ఞాన స్థితిలో వున్నవాణ్ణి, బ్రహ్మవిత్ అంటారు. అంతకంటే కొంచెం పైవాణ్ణి బ్రహ్మ విద్వరుడు అంటారు. అంతకంటే కొంచెం పై వాణ్ణి, బ్రహ్మవిద్వరీయాన్ అంటారు. ఇంతవరకూ వాడిలో ఎంతో కొంత చిత్తవృత్తి మిగిలే వుంటుంది. ఆ పై స్థితిలో వున్నవాణ్ణి, బ్రహ్మ విద్వరిష్ఠుడు అంటారు. ఇతడికి ఏ రకమైన వృత్తులూ లేవు.

ఇలా సర్వవిధవృత్తులనూ సంపూర్ణంగా సంహరించుకున్న బ్రహ్మవిద్వరిష్ఠుడు ఒక్కడికే ఏ రకమైన విధి నిషేధాలూ లేవు. మిగిలిన మూడు రకాల బ్రహ్మవేత్తలకూ ఎంతో కొంత వృత్తి మిగిలి వుంటుంది కనుక, ఆ వృత్తి నంటిపెట్టుకొని వాళ్ళకు విధి నిషేధాలు సంక్రమిస్తాయి. తమకు వున్న జ్ఞానబలంవల్ల ఆ విధినిషేధాలు పాటించకపోయినా వారికి నష్టం కలగక పోవచ్చు కానీ, బొత్తిగా చిత్తవృత్తి లేనివారు కాదు గనుక, అలాంటివారిని లోకంలోని ఇతర సాధకులు ప్రమాణంగా తీసుకుంటారు కనుక, అలాంటి సామాన్య జనులు చెడిపోకుండా వుండటం కోసం, వారిమీద అనుగ్రహ బుద్ధితో ఈ విధినిషేధాలను పాటించాలి అని పెద్దలు నిర్ణయించారు.

అందువల్ల మొత్తం మీద తేలిందేమంటే, ఆత్మజ్ఞాని అయినవాడు కర్మలను చేసేవారి మధ్యలో వున్నప్పుడు తనూ అలాంటివాడుగానే వుండాలి. అలా వుంటూనే జిజ్ఞాస కలవారిని గుర్తుపట్టి, వారికి బ్రహ్మతత్త్వాన్ని ఉపదేశించి, కర్మల మీద వైరాగ్యం కలిగించాలి.

ఈ చర్చంతా ఎక్కడనుంచీ వచ్చిందంటే విచారణకు ఫలమేమిటి అన్న దగ్గరనుంచీ వచ్చింది. కాగా, ఇప్పుడు తేలిందేమంటే, ఇంద్రియాలదే కర్తృత్వం గానీ, ఆత్మకు కర్తృత్వం ఎంత మాత్రమూ లేదు – అని.

## 37. ఆత్మ కారయిత కాగలదా?

**ప్రశ్న:** అయితే, ఆత్మ కర్త కాకపోయినా కారయిత (చేయించేవాడు) కావచ్చు కదా?

**సమాధానము:** కారయిత అంటే చేయించేవాడు. అంటే వాడు ఇంకొకడితో చెప్పి పనిచేయిస్తాడన్నమాట. ఆత్మ కారయిత అయినట్లయితే, కర్తలు ఇంద్రియాలు అని అదివరకే నిశ్చయమైంది కనుక, ఆత్మ ఇంద్రియాలను ప్రేరేపించి పనులు చేయిస్తోంది– అని అర్థం వస్తుంది.

అలా చెప్పేటట్లయితే, ఆత్మకు ప్రేరేపించటం అనే వికారాన్ని అంటకట్టినట్లవుతోంది. ఆత్మకు ఏ వికారాలూ అంటవని వేదంలో అనేక చోట్ల వుంది. మనం వెనుకటి శీర్షికల్లో ఆ విషయం చెప్పుకున్నాం. కనుక ఆత్మకు ప్రేరకత్వాన్ని అంటకడితే ఆత్మయొక్క నిర్వచనమే దెబ్బతింటుంది.

మరొక చిక్కు కూడా వుంది. మీరు చెప్పే కారయితృత్వం (చేయించేవాని తనం) ఆత్మకు స్వభావసిద్ధమా? లేక ఆగంతుకమా? అని విచారించాలి. అది ఆత్మకు స్వాభావికం అంటే, ఆ గుణం ఆత్మ వున్నంత కాలమూ వుండి తీరుతుంది. ఉదాహరణకు వెచ్చదనం నిప్పుకు స్వాభావికం. వెచ్చదనం నిప్పు వున్నంత కాలమూ వుంటుంది గదా! ఆత్మకు కారయితృత్వం కూడా అలాంటిదే అని మీరు అనేట్లయితే అది ఎన్నటికీ పోనే పోదు. అది పోకపోతే, ఆత్మకు దుఃఖంతో సంబంధం పోనే పోదు. అంటే మోక్షం ఎన్నటికీ రానే రాదు అని తేలుతుంది.

ఇది ఎవరూ అంగీకరించిన విషయం కాదు. వేదమూ అంగీకరించదు, అనుభవజ్ఞులూ అంగీకరించరు. నిజంగా మోక్షమే లేదనుకుంటే మనం ఇంత శ్రమపడి విచారణ చేయక్కరలేదు. కనుక కారయితృత్వం ఆత్మకు స్వాభావికం అనుకోవటం కుదరదు.

ఇక పోతే ఆత్మకు కారయితృత్వం స్వాభావికమే అని ఏదో రకంగా సాధిస్తే మరో చిక్కు కూడా వచ్చి పడుతుంది. నిప్పు వున్నంత సేపూ వేడి వున్నట్లుగా, ఆత్మ వున్నంత సేపూ కారయితృత్వం వుండి తీరాలి గనుక, సుషుప్తి దశలో కూడా ఆత్మ అక్కడే వుందని నిశ్చయం చేశాం కనుక, ఆ దశలో కూడా ఆత్మకు కారయితృత్వం వుండి తీరాలి. కానీ ఇది అనుభవవిరుద్ధం. సుషుప్తిదశలో ఆత్మ కేవలం నిర్వికారంగా

వుంటుందని ఆబాల గోపాలమూ అందరికీ తెలుసు. దీనివల్ల కూడా కారయితృత్వం ఆత్మకు స్వాభావికం కాదని నిశ్చయ మౌతోంది.

**ప్రశ్న:** అయ్యా! కొంచెం ఆగండి! సుషుప్తి దశలో కారయితృత్వం కనిపించనంత మాత్రంచేత ఆత్మకు కారయితృత్వమే లేదని పెద్ద నిర్ణయం చేస్తున్నారే మీరు! ఒకడు గొప్ప ఉపాధ్యాయుడు అని విని చూద్దామని వాళ్ళింటికి వెళ్ళాం. మనం వెళ్ళే సరికి రాత్రి పొద్దుపోయింది. ఇంట్లో ఎవరూ విద్యార్థులు లేరు. ఆయన ఒక్కడే కూర్చుని వున్నాడు. అది చూసి చీచీ ఈయన అసలు ఉపాధ్యాయుడే కాదు. అయితే పాఠాలు చెప్పడేమి?– అంటారా మీరు?

అలాగే సుషుప్తి దశలో ఆత్మ ఆ ఉపాధ్యాయుడి లాగా ఒంటరిగా కూర్చొని వుంది. ఆ సమయంలో ఇంద్రియాలేవీ ఆత్మ దగ్గరలో లేవు. అందువల్ల ఆత్మలో అంతర్గతంగా వున్న కారయితృత్వం బయట పడటం లేదు. అంత మాత్రంచేత ఆత్మకు కారయితృత్వం అసలే లేదనటం బావుండదు.

**సమాధానము:** అలా అయితే జాగ్రద్దశలోనే ఉదాసీనంగా, మౌనంగా, ఏ ఆలోచనలూ లేకుండా వున్న సిత్థిని వూహించు. ఇలాంటి దశ అప్పుడప్పుడు మనకు సంభవిస్తూనే వుంటుంది కదా! అప్పుడు ఇంద్రియాలు ఆత్మకు దగ్గరలో వున్నాయి కదా! అప్పుడు ఆత్మకు కారయితృత్వం వుంటే వ్యక్తం కాకుండా వుంటుందా? వ్యక్తమైంది అంటే, అది ఉదాసీనస్థితి కానే కాదు కదా! కనుక, కేవలం ఇంద్రియ సన్నిధి లేదు కనుక ఆత్మయొక్క కారయితృత్వం వ్యక్తం కాలేదు అనటం సబబు కాదు. కారయితృత్వం అసలే లేదు కనుక అది సుషుప్తిలోనూ వ్యక్తం కాలేదు, ఉదాసీనస్థితిలోనూ వ్యక్తం కాలేదు.

**పశ్న:** సరే పోనీ! కారయితృత్వం ఆత్మకు ఆగంతుకమే అందామా?

**సమాధానము:** అలా అంటే ఆత్మ కొంత కాలం కారయితృత్వం లేని ముక్తి దశలోనూ, కొంత కాలం కారయితృత్వం గల బంధదశలోనూ వుంటుందని అర్థం వస్తుంది. అంటే మీరు ఇకపై సాధించే ముక్తి కూడా ఆద్యంతములు కలదే అవుతుంది. ఆద్యంతములు కలవి అశాశ్వతములని ఇదివరకే చెప్పుకున్నాం. కాగా ఈ పక్షంలో మీరు చెప్పే ముక్తి ఆద్యంతములు గల అశాశ్వత ముక్తి అని తేలుతోంది. అలాంటిది ముక్తే కానేరదు కదా! అంటే అసలు ముక్తే లేదని మీరు చెప్పినట్లయింది. ఇది మళ్ళీ వేదశాస్త్ర అనుభవ విరుద్ధం. కనుక ఆత్మకు కారయితృత్వం ఆగంతుకం కావడానికి కూడా వీలు లేదు.

**ప్రశ్న:** ఇది మరీ బావుందండీ! జడాలైన ఇంద్రియాలు కర్తలు అన్నారు. పక్కనే వున్న ఆత్మ కారయిత కాదన్నారు. మరయితే ఎవరి ప్రేరణా లేకుండానే జడాలైన ఇంద్రియాలు కర్తలైపోతున్నాయంటారా?

**సమాధానము:** ఇంద్రియాలను రాగద్వేషాదులు ప్రేరణ చేస్తున్నాయి. అందువల్ల అవే కారయితలు. ఎందుకంటే రాగద్వేషాదులు వుంటే ఇంద్రియాలు పనిచేస్తున్నాయి. అవి లేకపోతే ఇంద్రియాలు పని చేయవు. (వీటినే అన్వయ, వ్యతిరేకాలు అంటారు.) ఇది అందరికీ అనుభవంలో వుంది. కనుక, రాగద్వేషాదులే కారయితలు.

**ప్రశ్న:** అయ్యా! ఇంద్రియాలు జడాలు కనుక వాటికి ప్రేరణ కర్తలు ఎవరు?– అని అడిగితే, రాగద్వేషాదులు అంటున్నారు మీరు. ఈ రాగద్వేషాదులూ జడాలే కదా! మీ మనసులో ఒక జడం మరొక జడాన్ని ప్రేరేపిస్తుంది అనే విశ్వాసం వున్నట్లుంది. అలా అయ్యేటట్లయితే మీకు రెండు కుండలు ఇస్తాం. ఒక కుండ మరో కుండను చంకన పెట్టుకొని చెరువుకు పోయి నీళ్ళు తెచ్చేట్లు చేయండి. అప్పుడు మీ మాటలు విశ్వసిస్తాం.

**సమాధానము:** ఇలాంటి ప్రశ్నే మీరు 33వ శీర్షికలో వేశారు. అక్కడ ఒక జడపదార్థం మరొక జడపదార్థాన్ని కదిలించే సందర్భాలు వుంటాయని రెండు ఉదాహరణలు ఇచ్చాం. ఇక్కడ మరొక ఉదాహరణ కూడా ఇస్తాం. అగ్ని జడమే కదా! గంధకం జడమే కదా! సూరేకారం జడమే కదా! ఈ మూడూ వేసి ఒక ఇనుప గొట్టంలో దట్టించాం. వెంటనే అవి పేలి వాటి ముందువున్న ఇనుప గుండును తోయగా అది పోయి కోట గోడలను కూలగొట్టింది. ఇక్కడ జడం కాని దేది? జడాన్ని మరొక జడం ప్రేరేపించటం లేదా? అలాగే అచేతనాలైన రాగద్వేషాదులు మనోవాక్కాయాలనే ఇంద్రియాలను కదిలించటం కూడా అసంభవమేమీ కాదు.

**ప్రశ్న:** మీరు చెప్పేది అనుభవానికి అతకాలి. ప్రతివాడికీ నేను యుద్ధాలు చేయిస్తున్నాను, ఓట్లు వేయిస్తున్నాను, వంటలు వండిస్తున్నాను, అంటూ నేను చేయిస్తున్నాను, నేను చేయిస్తున్నాను అని అనుభవం వుంది. ప్రత్యక్షంగా వున్న ఈ అనుభవాన్ని కాదని, ఏవో మెలికలు పెట్టి, ఈ కారయితృత్వాన్ని రాగద్వేషాదులకు అంటగట్టడం న్యాయమా?

**సమాధానము:** కర్తృత్వం ఎవరిది? అనే విచారణ దగ్గర గూడా మీకు ఇలాంటి సందేహమే వచ్చింది. అక్కడ ఏమి చెప్పుకొన్నామో గుర్తు చేసుకోండి. ఇంద్రియాలలో

వున్న కర్తృత్వాన్ని అధ్యాసవల్ల ఆత్మకు అంటగడుతున్నామని అక్కడ చెప్పుకొన్నాం. ఇక్కడి పరిస్థితి కూడా అదే. స్ఫటిక శివలింగం వెనకాల గులాబీ పువ్వు పెడితే ఆ లింగం కెంపు లింగం లాగా కనిపిస్తుంది. ఎందువల్ల? గులాబీ శివలింగానికి బాగా దగ్గరగా వుండం వల్లా, ఆ లింగము స్వచ్ఛంగా వుండి ప్రతిబింబించే స్వభావం గలది అవటంవల్లా, శివలింగం వెనుక గులాబీ వుందని మనకు తెలియక పోవటంవల్లా, గులాబీలోని ఎర్రదనాన్ని మనమే శివలింగానికి అంటగట్టి, అది కెంపు లింగమని భ్రమిస్తూ వుంటాం. ఇదే అధ్యాస.

ఇదే రీతిగా రాగద్వేషాలు ఆత్మకు అతి దగ్గరగా వుండటంవల్లా, రాగ ద్వేషాదుల గురించి మనం సరిగా అవగాహన చేసికొని వుండకపోవటంవల్లా, ఆత్మ స్ఫటికలింగం వలె అతిస్వచ్ఛమైన దవటంవల్లా, రాగద్వేషాదులలోని కారయితృత్వం ఆత్మదే అని అధ్యాసవల్ల మనం భ్రమిస్తున్నాం. అందువల్లే నేను ఇళ్ళు కట్టిస్తున్నాను, పొలం దున్నిస్తున్నాను అని ఇలా కారయితృత్వాన్ని అనుభవిస్తున్నట్లనిపిస్తోంది. ఇది అనిపించటమే గాని సత్యమైన అనుభవం కాదు. భ్రాంతివల్ల ఉదయించిన అసత్య అనుభవాన్ని ఆధారం చేసికొని నిర్ణయాలు చేయటం న్యాయం కాదు. అందువల్ల రాగద్వేషాదులదే కారయితృత్వం అని నిశ్చయించక తప్పదు.

మరొక విషయం గూడా ఈ సందర్భంలో ప్రస్తావించుకోవాలి.

పైన చెప్పుకొన్న అధ్యాస ఉదాహరణలో, గులాబీలోని ఎర్రదనాన్ని స్ఫటిక లింగానికి ఆరోపించామే గాని, లింగంలోని స్వచ్ఛత్వాన్ని గులాబీకి ఆరోపించలేదు. (అంటగట్టలేదు). కాని కొన్ని చోట్ల ఇటూ అటూ రెండు వైపులా ఆరోపణ జరిగిపోతూ వుంటుంది.

ఉదాహరణకు, కమ్మరివాడు (ఇనుప పనిముట్లు చేసేవాడు) కొడవలికి పనికి వచ్చే ఇనుప ముక్కను, కత్తికి పనికి వచ్చే ఇనుప ముక్కను, బండి చక్రపు చట్రానికి పనికివచ్చే ఇనుపముక్కను తెచ్చి, కొలిమిలో వేసి బాగా కాల్చి బయటకు తీశాడు.

అప్పుడే అక్కడికి వచ్చిన కుర్రవాడొకడు, ఎర్రగా కణకణలాడుతున్న ఆ ముక్కలను చూసి, ఈ నిప్పు గుండ్రంగా వుంది, ఈ నిప్పు పొడ్గుగా వుంది, ఈ నిప్పు పొట్టిగా వంకరగా వుంది అన్నాడు. అక్కడితో ఆగక, కొంచెం పరిశీలించి చూసి, ఇవి ఇనుప ముక్కలే గాని, యీ ఇనుము కాలుస్తోంది అన్నాడు.

ఇక్కడ ఆ బాలుడు ఇనుము లోగల పొడుగు, పొట్టి, గుండ్రం వగైరా గుణాలను నిప్పుకి ఆరోపించాడు. నిప్పులో గల కాల్చే గుణాన్ని ఇనుముకి ఆరోపించాడు. ఇలా రెండు పక్కలా ఆరోపణ జరిగేదాన్ని అన్యోన్యాధ్యాస అని పిలుస్తారు.

ఆత్మ– రాగద్వేషాదుల విషయంలో జరిగేది అన్యోన్యాధ్యాసే. అందువల్లే రాగద్వేషాదులలో గల కారయితృత్వాన్ని ఆత్మకు ఆరోపించి, ఆత్మే కారయిత అంటున్నాం. ఆత్మలో గల అకారయితృత్వాన్ని (పనిచేయించని తనాన్ని) రాగద్వేషాదులకు ఆరోపించి, వాటిని అకారయితలు (చేయించనివి) అంటున్నాం.

**ప్రశ్న:** యుక్తిలో మీరు చెప్పిన దానిలో దోషం ఏమీ లేదు. నిజమే గాని, ఉపనిషత్తులలో ఆత్మను గురించి చెపుతూ **"హృషీకేశః సర్వాంతర్యామీ"** అనే పదాలు ప్రయోగించారు. హృషీకేశః అంటే ఇంద్రియాలకు అధిపతి అని అర్థం. సర్వాంతర్యామీ అంటే, అన్ని ఇంద్రియాలలోనూ ఉన్నవాడు అని అర్థం. ఇంద్రియాలకూ ఆత్మకూ ఎంత మాత్రమూ సంబంధం లేకపోతే, ఈ శ్రుతి వాక్యాలు ఏమికావాలి?

## 38. వేదం లోకవ్యవహారరీత్యా మాట్లాడే ఘట్టాలు

**సమాధానము:** ఎవరూ లేని ఇంట్లో అర్ధరాత్రి పూట దీపం వెలుగుతోంది. ఆ వెలుతురులో గూట్లో వున్న బంగారపు గిన్నె కనిపించి, దారే పోయే దొంగవాడు ఎత్తుకు పోయాడు. ఇక్కడ దొంగకు బంగారపు గిన్నెను చూపించింది ఎవరు? దీపం! కనుక దొంగచేత దొంగతనం చేయించిన కారయిత దీపం అని చెప్పాలి. అందువల్ల ఆ దీపానికి కూడా కొంత పాపం వుందని చెప్పాలి. ఒప్పుకోవచ్చునా?

ఒప్పుకునేందుకు వీలు లేదు. ఆ దీపం ఈ దొంగకోసం ప్రత్యేకంగా వెలగలేదు. అంతే కాదు. ఈ బంగారు గిన్నె కోసం కూడా ప్రత్యేకంగా వెలగలేదు. అంతే కాదు, ఏ వస్తువును గాని ప్రకాశింప చేయటం కోసం ఆ దీపం ప్రత్యేకంగా ఏ పనీ చేయలేదు. ప్రకాశించటం దాని స్వభావం. అది అలా ప్రకాశిస్తూనే వుంటుంది. అది ప్రకాశించే సమయంలో, దాని పరిధిలో, ఒక వస్తువూ, ఒక చూచేవాడు వుంటే, ఆ వస్తువు ఆ చూచేవాడికి కనిపిస్తుంది. ఆ ఇద్దరిలో ఏ ఒక్కళ్ళు లేకపోయినా, దీపం అక్కడ వున్నా కూడా, ఏ వస్తువూ ఏ ద్రష్టకూ కనిపించదు. ఈ వస్తువులను గానీ, ఈ ద్రష్టను గానీ తన పరిధిలోకి తెచ్చుకొనేందుకు గానీ, బయటకు గెంటేందుకు గానీ, దీపం కృషి చేయదు. అందువల్ల దీపానికి ఏ పాపమూ, ఏ పుణ్యమూ, అంటేందుకు వీలు లేదు.

అయినా కూడా దీపం వుంటేనే దొంగకు బంగారపు గిన్నె కనిపిస్తుంది కనుక, దొంగకు బంగారపు గిన్నెను దీపం చూపించింది అని సామాన్యపు మాటగా లోకులు

వ్యవహరిస్తూ వుంటారు. అంటే దీపానికీ, దొంగకూ ఎంతో కొంత సంబంధం వున్నట్టు లోకులు వ్యవహరిస్తూ వుంటారు.

అలాగే సూర్యుడు అస్తమించి రాత్రి అయిపోతే, అందరూ కదలకుండా నిద్రపోతారు. సూర్యుడు వస్తే లేచి పాపాలో పుణ్యాలో చేస్తూ వుంటారు. కనుక, "పనులు చేయించేవాడు సూర్యుడు" అనే వ్యవహారం ఏర్పడుతూ వుంటుంది. అంత మాత్రంచేత జనుల పాపపుణ్యాలు గానీ, వాటి ఫలితాలు గానీ సూర్యుడికి అంటగట్టటం సాధ్యం కాదు.

సూదంటురాయి గుండుసూదిని ఆకర్షించింది అన్నాము. ఇక్కడ సూదిని ఆకర్షించే గుణం సూదంటు రాయిలో లేదని చెప్పటం కష్టసాధ్యం. అందుచేత సూదంటు రాయికి ఆకర్షణ కర్తృత్వం పట్టిందని అనిపిస్తూ వుంటుంది. సూదంటురాయిలో ఆకర్షించే స్వభావం వున్న మాట నిజమే, కానీ, గుండు సూదిని గుంజటానికి సూదంటురాయి చేసిన ప్రత్యేకమైన కృషి ఏమైనా వున్నదా?– అని ఆలోచిస్తే ఏమీ కనిపించదు. అందుచేత, దీపం విషయంలో లాగానే, ఇక్కడ కూడా సూదంటురాయికీ, సూదికీ గల సంబంధం కేవలం వ్యావహారికమే అని చెప్పక తప్పదు.

ఇలాగే ఆత్మకూ ఇంద్రియాలకూ నిజమైన సంబంధం లేకపోయినా, ఆత్మ యొక్క సన్నిధి వుంటేనే ఇంద్రియాలు పనిచేస్తాయి కనుక, ఆత్మను ఇంద్రియాలకు అధిపతి (హృషీకేశః) అనీ, ఆత్మ ఇంద్రియాలలో వ్యాపించి వున్నది (సర్వాంతర్యామీ) అనీ, వేదం లోకవ్యవహారరీత్యా వర్ణిస్తోంది అని మనం అర్థం చేసుకోవాలి.

ఈ విధంగా రకరకాల యుక్తులతో, ప్రమాణ వాక్యాలతో, ఉదాహరణలతో, ఆత్మ (అనగా నేను) కర్తను గానీ, కారయితను గానీ కాదు అని నిశ్చయమౌతోంది. తర్కం నిశ్చయిస్తోంది! అనుభవం మాత్రం అందనంటోంది!! ఎందువల్ల?

## 39. భావనాత్రయము

నేనే పరమాత్మను అనేదే ఉన్న సత్యం. కానీ ఇప్పుడు మనం ఉన్న స్థితి దీనికి పూర్తిగా తల్లకిందులు. అంటే, నేను పరమాత్మను ఎంత మాత్రమూ కాదనేదే మన ప్రస్తుత భావన. ఇది ఉన్న యథార్థ స్థితికి పూర్తిగా తల్లకిందుల భావన కనుక దీన్ని **విపరీతభావన** అంటారు. (విపరీతము అంటే తల్లక్రిందులు)

ఈ స్థితిలో వుండగా, కొందరు పెద్దల సాంగత్యంవల్ల మన ప్రస్తుత భావన సరి కాదని తెలుస్తుంది. కానీ ఒప్పుకో బుద్ధి కాక వాదిస్తాం. అంటే హేతువులను

పరిశీలిస్తాం. ఆ పరిశీలనలో మన వాదం ఓడిపోతుంది. అయినా "ఇదేమిరా? నేను వేరు, ఈ లోకం వేరు, ఆ పరమాత్మ వేరు, అని ఇంత స్పష్టంగా అనుభవంలో వుంటే, వీళ్ళు కాదని సిద్ధాంతీకరిస్తున్నారేమిటి?" అన్న సందేహం మన హృదయనాడులను పట్టుకొని వేలాడుతూనే వుంటుంది. ఇది అసంభవం అని లోలోపల గోల బయలుదేరుతూ వుంటుంది. ఇట్టి స్థితి పేరు **"అసంభావన"**

ఈ దశలో, గ్రంథాలలో ఏముంది? వివిధ దేశాలలో పెద్దలేం చెప్పారు? సాధన బాగా చేసినవారి అనుభవాలెలా వున్నాయి? అని ఇలా విస్తారంగా అన్వేషణ మొదలు పెడతాం. ఇన్ని రకాల అన్వేషణలలో, సాక్షాత్పరమేశ్వరుడినుంచీ ఆవిర్భవించిన వేదాల పరిశీలనే ఎక్కువ ప్రయోజనకారిగా మనకు నిరూపణ అవుతుంది. విస్తారంగా వున్న వేదవాఙ్మయాన్ని పరిశీలించిన గొద్దీ, ఆత్మతత్వంగురించి ఒక చోట ఒక రకంగా, మరో చోట మరో రకంగా, రక రకాలుగా, కనిపించి, సంశయాలు మరింత పెరిగిపోతాయి. ఈ స్థితి పేరు **"సంశయభావన"**

ఈ సంశయ భావన, అసంభావన, విపరీత భావనలు మనను ఆక్రమించుకొని వుంటాయి గనుక, కేవల తత్త్వశ్రవణం మనకు అనుభవాన్ని అందించలేకపోతోంది.

నిజానికి సత్యమైన జ్ఞానం అగ్ని వంటిదే. అది అజ్ఞానమనే గడ్డిని అవలీలగానే కాల్చగలదు. కానీ, కొందరు మంత్ర ప్రయోగాలు, మణి ప్రయోగాలు, ఓషధి ప్రయాగాలు చేస్తే నిప్పు బ్రహ్మాండంగా జ్వలిస్తున్నా ఎదురుగా వున్న గడ్డి, ఒక పోచ గూడా కాలదు. అగ్నికి మణి, మంత్ర, ఓషధులు ఎలాంటివో తత్త్వానుభవానికి సంశయభావనా, అసంభావనా, విపరీతభావనలు అటువంటివి.

మనకు జన్మతో సంక్రమించిన వరుస విపరీతభావన, అసంభావన, సంశయభావన, అయినప్పటికీ, అంతఃపురంలో వున్న రాజును పట్టుకోవాలంటే ముందుగా ప్రాకారాలను, ఆ తరువాత రాజ ప్రాసాదాలను, తరువాత భవన ద్వారాలను, ఛేదించినట్లు తత్త్వాన్వేషకుడు ముందుగా సంశయ భావనను ఛేదించాలి. ఆ పైన అసంభావనను, విపరీతభావనను వరుసగా జయించాలి.

### సంశయ భావన

సంశయభావనలో "వేదాల నిశ్చయం ఏది?"– అనేది ముఖ్యమైన ప్రశ్న. వేదాలు అంటే ఈ సందర్భంలో వేదాలలోని తత్త్వప్రతిపాదన చేసే భాగాలు. వాటి పేరే ఉపనిషత్తులు. వీటి తాత్పర్యమేమిటి?– అని ఇప్పుడు మన ప్రశ్న.

అసలు తాత్పర్యం అంటే ఏమిటి?

## 40. తాత్పర్యము

మనింటికి ఒక చుట్టం వచ్చాడు. ఆ సమయానికి మన ఇంట్లో పదేళ్ళ పిల్లవాడికి కొత్తగా జ్వరం వచ్చి తగ్గింది. వచ్చిన పెద్దమనిషి రక రకాల పిండివంటలు తెచ్చి, ప్రేమగా పిల్లవాడి చేతిలో పెట్టాడు. పిల్లవాడి తల్లి పిల్లవాణ్ణి చటుక్కున పక్కకు తీసుకెళ్ళి "అది విషం. తిన్నావంటే నా మీద ఒట్టు" అన్నది.

ఇక్కడ "అది విషం" అనే వాక్యానికి అర్థం ఏమిటి?

ఆ పిండివంటలు విషం కావని ఆ తల్లికి తెలియదా? కావాలని అబద్ధం చెబుతోందా? అబద్ధం చెబుతోంది అనుకుందామంటే, వచ్చిన బంధువు ఆమెకు కావలసినవాడే. కావలసినవాడి మీద లేనిపోని నింద ఎందుకు వేస్తుంది?

కనుక ఈ సందర్భంలో "అది విషం" అనే వాక్యం పలికేటప్పుడు ఈ తల్లి మనస్సులో వున్న భావం ఏమంటే, "విషం తింటే నీకు ఎటువంటి అపకారం జరుగుతుందో, ఈ పిండివంటలు తింటే నీకు అటువంటి అపకారం జరుగుతుంది" అని.

"ఇది విషం" అన్న వాక్యంలో రెండు పదాలున్నాయి. వీటిలో ఏ పదంలో ఈ చెప్పిన అర్థమంతా వుంది? దేనిలోనూ లేదు. ఏ పదంలోనూ లేకపోతే పదాల సమూహమైన వాక్యంలోకి ఈ అర్థం ఎలా వస్తుంది?

"చెప్పే ఆ తల్లి హృదయంలోంచి ఈ భావం ఈ చిన్ని వాక్యంలోకి పదాలతో నిమిత్తం లేకుండానే ప్రవేశించింది"- అంటారా? అలా అనేట్లయితే, ఆ తల్లి హృదయంలో ఈ భావమే ఉందో, వేరే భావమే వుందో, నిర్ణయించటానికి మనకు దివ్యదృష్టి వుండాలి- అని సందేహం రావచ్చు.

దివ్యదృష్టి ఏమీ అక్కర లేదు. మనకు నిత్య జీవితంలో ఈ రకమైన వాక్యాలు అనేకం తారసపడుతూనే వుంటాయి. మనకు తక్షణమే అర్థమైపోతూ వుంటాయి. ఎలా అర్థమౌతూ వుంటాయి?

ఈ సంభాషణ చేసేవారికి, ఆ సంభాషణ వెనుక గల సందర్భం బాగా తెలిసి వుంటుంది. ఆ సందర్భాన్ని బట్టి, మాట్లాడేవారి స్వభావాన్ని బట్టి, "ఈ వాక్యం పలికేటప్పుడు పలికేవారి హృదయంలో వున్న భావం ఇది" – అని మనం అవలీలగా గ్రహించేస్తూ వుంటాం. పలికేవాడి హృదయంలో గల భావానికే తాత్పర్యం అని పేరు.

ఓ అప్పారావు మన దగ్గరికి వచ్చి ఒక పెద్ద కథ చెప్పాడు. ఇంత పెద్ద కథకీ తాత్పర్యమేమిటీ అంటే, ఓ వెయ్యి రూపాయలు అప్పు కావాలని. వాడు చెప్పిన కథలో అప్పు ప్రసక్తే వుండదు. వున్నా చాలా స్వల్పంగా వుంటుంది. అయినా వాడి రొద పూర్తి అయ్యే సరికి అప్పు కోసమే ఇంత పురాణం చెపుతున్నాడని మనకు అర్థమవుతూ వుంటుంది. కనుక ఆ కథ మొత్తానికి తాత్పర్యం అప్పు అన్నమాట.

ఒక చిన్న వాక్యంలో అయితే సందర్భాన్ని బట్టి తాత్పర్యం చెప్పేశాం. పెద్ద కథలో సందర్భం ఒకటే చాలదు. అనేక విషయాలు పరిశీలించి తాత్పర్యం నిర్ణయించాలి. చిన్న కథ విషయంలోనే తాత్పర్య నిర్ణయానికి ఇంత పెద్ద కథ వుంటే, ఒక మహాగ్రంథంలో, భిన్న విభిన్న విషయాలను, భిన్న విభిన్న కోణాలలోంచి పరిశీలించి చర్చించేటప్పుడు ఎటు వస్తున్నామో, ఎటు పోతున్నామో, మనకు త్వరగా అర్థం కాదు. అందుకనే మన పెద్దలు ఇలాంటి గ్రంథాల తాత్పర్య నిర్ణయానికి ఆరు రకాల పరీక్షలు చేయాలని నిర్ణయించారు. వీటినే షడ్విధ లింగాలు అంటారు. లింగము అంటే చిహ్నం. గ్రంథంలో గల ఆరు రకాల చిహ్నాలను బట్టి, ఆ గ్రంథం యొక్క తాత్పర్యమేమిటో, అంటే ఆ గ్రంథం చెప్పేవాడి హృదయంలో గల భావమేమిటో, మనం నిర్ణయించు కోవాలి. ఆ తాత్పర్యమే ఆ గ్రంథకర్తయొక్క నిశ్చయం అవుతుంది.

## 41. షడ్విధ లింగాలు

**ఉపక్రమోపసంహారావభ్యాసోఽపూర్వతా ఫలమ్ ।**
**అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్య నిర్ణయే ॥**

(i) ఉపక్రమ ఉపసంహారాలు (ii) అభ్యాసము, (iii) అపూర్వత, (iv) ఫలము, (v) అర్థవాదము, (vi) ఉపపత్తి – ఇవి షడ్విధ లింగాలు. వీటినిబట్టే ఏ గ్రంథానికైనా తాత్పర్య నిర్ణయం చేయాలి.

నిజానికి మన నిత్య వ్యవహారంలో ఇవన్నీ తెలిసీ తెలియకుండా చేస్తూనే వుంటాం. మనలో తెలివి గలవారు వీటిని ఇంకా బాగా చేస్తారు. అలాంటివారు తాత్పర్య నిర్ణయం తీసుకొనే విధానాలను విశ్లేషిస్తేనే ఈ ఆరు పేర్లు ఏర్పడతాయి. అంతే గాని ఇవేవో కొత్తగా వూడిబడ్డ విషయాలు కావు. ఇక ఒక్కొక్కటిగా ఈ ఆరు అంశాలను పరిశీలిద్దాం.

### (i) ఉపక్రమ – ఉపసంహారములు

ఉపక్రమము అంటే చెప్పదలచుకొన్న విషయాన్ని ప్రారంభించే విధానం. ఉపసంహారం అంటే, దాన్ని ముగించే విధానం. మొదలుకీ, ముగింపుకీ సంబంధం

వుండాలి. అలా వుంటే ఉపక్రమంలోనూ, ఉపసంహారంలోనూ అనుగతంగా వుండే విషయమే ఆ మొత్తం గ్రంథానికి తాత్పర్యమని నిర్ణయించవచ్చు.

కొందరు ఉపన్యాసం చెపుతూ వుంటారు. వారు రామాయణంతో ప్రారంభించి, మధ్యలో భారతంలోకి ప్రవేశించి, చివరకు భాగవతంలో వుండగా, సమయమయి పోయిందని ఉపన్యాసం ఆపేస్తూ వుంటారు. అలాంటి ఉపన్యాసాలకు తాత్పర్యమే వుండదు.

అలాకాక, వాల్మీకిమహర్షి రామాయణం తీసికోండి. ఆయన శ్రీరాముడి సద్గుణాల వర్ణనతో తన గ్రంథాన్ని ప్రారంభించాడు. రాముడి పట్టాభిషేకంతో గ్రంథం ముగించాడు. దీనినిబట్టి శ్రీరాముడి సద్గుణాలవంటి సద్గుణాలను మనం గూడా అభ్యసిస్తే, మనకు గూడా విజయం లభిస్తుందనీ, రావణాసురుడి లాగా దుర్గుణాలను అభ్యసిస్తే సర్వనాశనం లభిస్తుందనీ, ఆ గ్రంథానికి తాత్పర్యమని మనం గ్రహించగలుగుతున్నాము.

అలాగే ఉపనిషత్తులలో, ఛాందోగ్యోపనిషత్తు ఒక గొప్ప గ్రంథం. అందులోని ఆరవ అధ్యాయంలోనే "తత్త్వమసి" అనే మహావాక్యం వుంది. వేదాంత శాస్త్రానికి మణికిరీటంవంటి వాక్యమిది.

అందువల్ల ఛాందోగ్య షష్ఠాధ్యాయం చాలా ముఖ్య గ్రంథమయింది.

అది **"సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్ ఏక మేవాద్వితీయం"** అనే వాక్యంతో ప్రారంభమయింది. "నాయనా! ఈ ప్రపంచానికి ముందు సత్పదార్థం ఒక్కటే వుంది. అది ఒకటంటే ఒకటే, రెండవది అనేదే లేదు"- అని అర్థం.

తరువాత ఆ ఉపనిషత్తులో అనేక విషయాలు చర్చకు వచ్చాయి. చిట్టచివరికి **"ఐతదాత్మ్యమిదం సర్వం, తత్సత్యం, స ఆత్మా, తత్త్వమసి శ్వేతకేతో"** అని ముగింపులో వుంది. "ఈ కనిపించే ప్రపంచమంతా ఆ మొట్టమొదటి సత్స్వరూపమే. ఆ సత్తు సత్యమైనది. అదే ఆత్మ. ఓ శ్వేతకేతూ! ఆ సత్తే నీవు" – అని అర్థం.

సత్పదార్థంతో ఉపక్రమం అయి, మళ్ళీ దానితోనే ముగింపు జరుగుతోంది గనుక, యీ గ్రంథంలో అనుగతంగా వున్నది సత్పదార్థం. అందువల్ల, "ఆ సత్ నీవే" అని చెప్పటమే ఈ గ్రంథానికి తాత్పర్యం- అని మనకు నిశ్చయమవుతోంది. ఈ రకమైన గుర్తునే ఉపక్రమోపసంహార లింగము అంటారు.

### (ii) అభ్యాసము

అభ్యాసము అంటే చెప్పిన మాటే మళ్ళీ రెండు మూడు సార్లు చెప్పటం. కొడుకు తప్పని సరి పని మీద కల్లోలిత ప్రాంతాలకు ప్రయాణం చెయ్యవలసి వచ్చిందనుకోండి. తండ్రి "జేబులో డబ్బు జాగర్త. కొత్తవారిని నమ్మి నీ సూటుకేసు వారికి అప్పచెప్పి, యిటూ అటూ తిరగవద్దు. జేబులో డబ్బు జాగర్త. జేబుదొంగలుంటారు జాగ్రత్త" అని ఇంకా చాలా చెపుతూ వుంటాడు. దీనిలో జేబులో డబ్బుగురించి ఆయన ఎక్కువ సార్లు ప్రస్తావిస్తున్నాడు. దాన్నిబట్టి, ఏది ఎలా పోయినా, జేబులో డబ్బు జాగర్తగా వుంటే, ఎలాగోలా కార్యం చక్కబెట్టుకొని రావచ్చనేది, ఆ తండ్రి మనసులో వున్న తాత్పర్యమని మనకి అర్థమౌతుంది. ఇలా పునరుక్తివల్ల తాత్పర్య గ్రహణం జరిగితే, ఆ పునరుక్తిని అభ్యాసము అంటారు.

ఇందాక చెప్పుకున్న ఛాందోగ్యోపనిషత్తు ఉదాహరణలోనే "తత్త్వమసి" అనే వాక్యం 9సార్లు పునరావృత్తమయింది. "తత్ అంటే సృష్టికి పూర్వం అద్వితీయంగా వున్న ఆ సత్ పదార్థం, త్వం = నీవే, అసి = అయివున్నావు" అని ఆ వాక్యానికి అర్థం. తండ్రి ఈ వాక్యం మొదటి సారిగా చెప్పినప్పుడు కుమారుడైన శ్వేతకేతువుకి విశ్వాసం కలగక సందేహం వెలిబుచ్చాడు. తండ్రి ఆ సందేహానికి సమాధానం చెప్పి మళ్ళీ "తత్త్వమసి" అని ప్రతిపాదించాడు. ఇలా ఆ ఉపనిషత్తులో **"తత్త్వమసి"** అని 9సార్లు ప్రతిపాదన జరిగింది. ఇలా లేవనెత్తిన సందేహాలన్నిటికీ పరిష్కారాలు చెప్పి, మళ్ళీ మళ్ళీ "తత్త్వమసి" అని ప్రతిపాదించటంవల్ల ఆ ఉపనిషత్తుకి తత్త్వమసి అనే జీవాత్మ పరమాత్మల అభేదాన్ని బోధించటంలోనే తాత్పర్యం వుంది- అని మనకు అర్థమౌతోంది. ఇదే అభ్యాస లింగము.

### (iii) అపూర్వత

షడ్విధ లింగాలలో ఇది మూడవ లింగం. అపూర్వత అంటే కొత్తదనం. మనం ఏదైనా ఒక వస్తువుని చూసినప్పుడు, అది మామూలుగా మనం చూసే వస్తువులకన్నా భిన్నంగా, ఆశ్చర్యకరంగా వుంటే, అపుడు దాన్ని అపూర్వంగా వుంది అని అంటూ వుంటాం.

ఒకానొక గ్రంథంలో అనేక విషయాలు చెప్పబడి వుండగా, అందులో ఒక విషయం లోకరీతికి భిన్నంగా, ఒక విశేషంగా మనలను ప్రత్యేకంగా ఆకర్షిస్తూ వుంటే, దానిని అపూర్వ విషయం అంటాం. అలా అపూర్వంగా కనిపించే విషయమే, ఆ గ్రంథానికి ప్రత్యేక తాత్పర్యమని కూడా మనం గ్రహిస్తూ వుంటాం.

ఉదాహరణకు, ఉపనిషత్తులలో ఆత్మ అనేది అఖండ ఏకరస స్వరూపము అనీ, అయినా సరే అది ప్రత్యక్షాది ప్రమాణాలకు దొరకనిదనీ, చెప్పబడివుంది. అఖండ ఏక రసస్వరూపము అంటే, ఆమూలాగ్రం ఆనందమే దాని స్వరూపమన్నమాట. ఆనందమే దాని స్వరూపమైతే, అది మన అనుభవానికి రాకుండా ఎలా వుంటుంది? అనుభవానికి వస్తే కదా అది ఆనందమని మనం చెప్పగలిగేది? అనుభవానికి వచ్చింది అంటే, అది ప్రత్యక్ష ప్రమాణ గమ్యం అయిపోతుంది. అయితే ఉపనిషత్తు మాత్రం ఆత్మస్వరూపం ఆనందమే కానీ, అది ప్రత్యక్షం మొదలైన ఏ ప్రమాణాలకు లొంగదు అంటోంది. ఇది లోకవిరుద్ధంగా వుంది. అందుచేత మన దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. ఇదే ఆత్మ విషయంలో వున్న అపూర్వత.

సామాన్యంగా లోకంలో మనం ఏదైనా విషయాన్ని తెలుసుకోవాలంటే ప్రత్యక్ష ప్రమాణం చేతగానీ, లేదా ప్రత్యక్ష అనుమానాలతో కలిపిగానీ, లేదా ఇతర ప్రమాణాలు ఒకటో, రెండో, అంతకన్నా ఎక్కువో, కలిపి గానీ తెలుసుకొంటూ వుంటాం. ఉదాహరణకు ఎదురుగా వుండే చెట్టుని చూడాలంటే కన్ను చాలు. ఇది ప్రత్యక్ష ప్రమాణం. దూరంగా వున్న కొండ మీద పొగను చూసి, అక్కడ నిప్పు వుంది అని ఊహిస్తే, అది అనుమాన ప్రమాణం. యజ్ఞ యాగాదులు చేస్తే స్వర్గం వస్తుందన్న జ్ఞానం శబ్దప్రమాణం. అయితే, ఈ బ్రహ్మను గూర్చిన వాక్యాలు వేదంలో వున్నాయి. వాటిని వినగా బ్రహ్మను గూర్చిన పరోక్ష జ్ఞానం కలుగుతుంది. దీనిని శబ్దప్రమాణం అంటారు. శబ్దప్రమాణం చేత పరోక్షజ్ఞానం కలిగాక మనన, నిదిధ్యాసలు చేయగా, పరబ్రహ్మజ్ఞానం కలుగుతుంది. అంటే, మనస్సుయొక్క సహకారంతో శబ్దప్రమాణం పరబ్రహ్మజ్ఞానాన్ని మనకు కలిగిస్తోంది – అన్నమాట. ఇది బ్రహ్మపదార్థంలో వున్నటువంటి ఒక అపూర్వత.

పరబ్రహ్మలో మరొక అపూర్వత కూడా వుంది. లోకంలో కొన్ని వస్తువులు స్వయంప్రకాశములని ప్రసిద్ధి పొంది వున్నాయి. ఉదాహరణకు, సూర్యబింబం. ఇలా ప్రసిద్ధి వున్నప్పటికీ, అవి పరమార్థంగా స్వయంప్రకాశములు కావు. వాటియొక్క ప్రకాశగుణం కూడా పరబ్రహ్మం యొక్క ప్రకాశం మీదే ఆధారపడి వుంది. పరబ్రహ్మం యొక్క ప్రకాశం ఒక్కటి మాత్రమే నిజమైన స్వయంప్రకాశం. ఇది కూడా పరబ్రహ్మంలోని అపూర్వతే. దీనినే అలౌకికతా రూపమైన అపూర్వత అని వ్యవహరిస్తూ వుంటారు.

బ్రహ్మం యొక్క ఈ అపూర్వతా లక్షణాన్ని ఛాందోగ్యోపనిషత్తు ఒక చిన్న కథ ద్వారా వివరించింది. ఉద్దాలకుడనే తండ్రి శ్వేతకేతువనే తన కొడుకుకి పరబ్రహ్మతత్త్వం గురించి చెపుతూ, "పరబ్రహ్మం సర్వత్రా వ్యాపించి వున్నప్పటికీ, అది ఏ ప్రమాణానికీ దొరకదు. కంటికీ, చెవికీ, ఇంక ఏ జ్ఞానేంద్రియానికీ దొరకదు. మనసుకు కూడా దొరకదు" అని చెప్పాడు. పుత్రుడికి ఇది నమ్మబుద్ధి కాలేదు. "బ్రహ్మపదార్థం నిజంగా అంతటా వ్యాపించి వుంటే, అది ఏ ఇంద్రియానికీ దొరకకుండా ఎలా వుంటుంది?" అని ఆకుర్రవాడు వాదించాడు.

అప్పటికే బాగా చీకటి పడింది. తండ్రి ఆ పూటకి ఉపదేశం చాలిస్తూ, ఒక మంచిపాత్రలో నీళ్ళు తీసుకు రమ్మన్నాడు. కొడుకు తెచ్చాక రెండు పెద్ద పెద్ద ఉప్పురాళ్ళు దాంట్లో పడవేయమన్నాడు. నీటిలో పడ్డాక కూడా దీపపు కాంతిలో ఉప్పురాళ్ళు స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయి. తండ్రి ఆ పాత్ర మీద మూత పెట్టించి, ఆవలించి రేపు మాట్లాడుకుందామని చెప్పి, లేచి వెళ్ళిపోయాడు.

మర్నాడు నిత్యానుష్ఠానాలైనాక, తండ్రి కొడుకులు మళ్ళీ సమావేశమైనారు. తండ్రి ఆ మూత తీసి నిన్న వేసిన ఉప్పురాళ్ళు బయటికి తీయి అన్నాడు. శ్వేతకేతువు మూత తీసి చూడగా ఉప్పురాళ్ళు కనిపించలేదు. నీళ్ళలో వేలు పెట్టి తడిమి చూశాడు. అయినా ఏమీ చేతికి తగలలేదు. తండ్రి నవ్వుతూ ఒక నీటిబొట్టు నోట్లో వేసుకో అన్నాడు. శ్వేతకేతువు వేసుకొని "ఉప్పగా వుంది"– అన్నాడు. తండ్రి ఆ గిన్నెలోగల నీళ్ళను ఈ మూలా, ఆ మూలా, మధ్యలో, కిందా, పైనా, తలో చోటునుంచీ, తలో చుక్కా తీసి, క్రమంగా రుచి చూడమన్నాడు. ఎక్కడ చూసినా నీరు ఉప్పగానే వుంది.

'దీన్ని బట్టి నీవు ఏం గ్రహించావో చెప్పు" అన్నాడు తండ్రి. "నిన్న నేను నీళ్ళలో వేసిన ఉప్పురాళ్ళు ఇపుడు ఈ నీరంతా వ్యాపించి వున్నాయి. అని తెలిసింది" అన్నాడు కొడుకు.

తండ్రి ఇలా చెప్పాడు "అవును. ఉప్పు నీరంతా వ్యాపించే వుంది. అయినా నీ కన్ను గానీ, నీ చెయ్యి గానీ, దాన్ని తెలుసుకోలేక పోయాయి. నీ నాలుక మాత్రం దాన్ని తెలుసుకో గలిగింది. అదే విధంగా. ఈ దేహేంద్రియాది సముదాయం మొత్తంలో ఆత్మసత్త సర్వత్రా వ్యాపించే వుంది. అయినా కూడా ఇంద్రియాలు ఏవీ దానిని గ్రహించలేవు. దానిని మనం వేదరూపములైన ఆప్తవాక్యాల ద్వారా మాత్రమే గ్రహించగలం".

ఇదే పరబ్రహ్మ తత్త్వంలోని అలౌకికతారూపమైన అపూర్వత. ఇలాంటి అపూర్వతా లక్షణం ఆత్మ పదార్థంలో వుందని ఉపనిషత్తు చెపుతోంది కనుక, "ఇంద్రియాతీతమైన సద్వస్తువే పరమార్థ సత్యము" అని చెప్పటమే ఈ ఉపనిషత్తుకు తాత్పర్యమని, ఈ అపూర్వతాలింగంవల్ల మనకు అవగతమౌతోంది.

**(iv) ఫలము**

ఏదైనా ఒక గ్రంథంలో చాలా విషయాలు చెప్పి, ఇవన్నీ తెలుసుకోవటం వల్ల మీ ఐశ్వర్యం బాగా పెరుగుతుంది అని వ్రాశారనుకోండి. అపుడు ఆ గ్రంథం మొత్తానికి తాత్పర్యం ఐశ్వర్యమే అని మనం గ్రహించ గలుగుతాం. ఎలా గ్రహించ గలిగాం? ఈ గ్రంథ పఠనానికి ఐశ్వర్యం ఫలితమని చెప్పారు కనుకనే గ్రహించ గలిగాం. ఇలా ఫలితం చెప్పటాన్నే ఫలము అనే లింగం అంటారు.

ఇందాక చెప్పుకున్న ఛాందోగ్యోపనిషత్తులోనే ఆత్మ గురించి కొంత వివరించి, అఖండైక రసస్వరూపమైన జ్ఞానం పొందినవాడికి, ప్రారబ్ధానుభవం తీరగానే, విదేహకైవల్యం లభిస్తుంది– అని వుంది. విదేహకైవల్యం అంటే శరీరం విడిచిపెట్టిన తక్షణమే పరబ్రహ్మంలో లీనమై పోవటం. ఈ స్థితి వచ్చినవాడు "భూత భవిష్యత్ వర్తమాన కాలాలు మూడింటిలో కూడా నేను కర్తనూ కాను, భోక్తనూ కాను. అంటే, పూర్వంకూడా నేను కర్తను, భోక్తనుకాను. పూర్వంకూడా నేను పరిశుద్ధ పరబ్రహ్మమునే, ఇప్పుడూ అంతే, ఇక ఎప్పటికీ అంతే" అనే జ్ఞానాన్ని పొందుతాడు, దాని పేరే మోక్షం.

కాగా, ఛాందోగ్యోపనిషత్తు ఇట్టి మోక్షాన్ని ఫలంగా వర్ణిస్తోంది కనుక, ఈ ఫలలింగాన్ని బట్టి, అద్వితీయమైన ఏకరసమైన పరబ్రహ్మ వస్తువే ఛాందోగ్యోపనిషత్తుకు తాత్పర్యమని మనం గ్రహించాలి.

**(v) అర్థవాదము**

అర్థవాదము అంటే ఉదాహరణలు చూపించి, జరిగే ప్రక్రియలను వర్ణించి, తద్వారా అసలు విషయాన్ని ప్రతిపాదించటం. ఉదాహరణకు, ఛాందోగ్యోపనిషత్తు ప్రారంభంలోనే ఒక ప్రశ్న వేశారు. ఒక వస్తువుని తెలుసుకుంటే, మిగిలిన అన్ని వస్తువులను తెలుసుకొన్నట్లే అయ్యే వస్తువు ఒకటి వుందా? లేదా?– అనేదే ఆ ప్రశ్న.

అలాంటి వస్తువు వుండే వీలే లేదు అన్నాడు శ్వేతకేతువు. అప్పుడు తండ్రి ఉద్దాలకుడు కొన్ని ఉదాహరణలిచ్చాడు.

ఒకడు ప్రొద్దున్నే పొరుగూరికి బయలుదేరాడు. వెళ్ళేటప్పుడు ఊరి బయట కుమ్మరివాడు పెద్ద మట్టిముద్దను తొక్కుతూ కనిపించాడు. అతడు సాయంత్రం తిరిగి వచ్చేసరికి అక్కడ మట్టి ముద్ద లేదు. రక రకాల కుండలు వున్నాయి. ఆ కుండలను చూసి, "ఆ మట్టిముద్దే ఈ కుండలైంది కనుక, ఈ కుండలు ఆ మట్టిముద్దే" అన్నాడు వాడు. ఒక్క మట్టిముద్దను తెలుసుకోవటంవల్ల ఈ కుండలన్నీ మట్టే అని వాడు గ్రహించాడు కదా! కనుక, "ఒకటి గ్రహిస్తే దాన్నిబట్టి మరొకటి గ్రహించటం సాధ్యం కాదు", అని సిద్ధాంతీకరించటం కుదరదు. లోకంలో అనేక వస్తువులు వుంటే వాటన్నింటికీ మూలకారణమైన ఒక వస్తువు వుంటే, ఆ మూలకారణ వస్తువును తెలుసుకొంటే, దానిలోంచి వచ్చిన ఈ రకరకాల వస్తువులను తెలుసుకొన్నట్లే అవుతుంది– అని ఉద్దాలకుడు కథ ద్వారా కుమారుడికి నిరూపించాడు.

ఇలా కథ మొదలైన విధానాల ద్వారా చెప్ప దలచుకొన్న సిద్ధాంతాన్ని వివరించడాన్ని అర్థవాదము అంటారు.

వేదాంత శాస్త్రంలో అర్థవాదములను ఏడు రకాలుగా విభజించారు. అవి–

1. సృష్టి , 2. స్థితి, 3. లయము 4. ప్రవేశము 5. నియమనము 6. తత్ – త్వం పదార్థ శోధనము 7. ఫల ప్రతిపాదకము

ఇక ఈ ఏడు అర్థవాదములను వివరించుకోవలసి వుంది.

### (v.1) సృష్టి అర్థవాదము

ఉపనిషత్తులలో కొన్ని చోట్ల సృష్టి క్రమాన్ని వర్ణిస్తూ వుంటారు. ఉదాహరణకు, తైత్తిరీయంలో ఆత్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలము, జలమునుంచి పృథ్వి, ఈ పంచభూతాలలోంచి 14 లోకాలు, వచ్చాయి– అని వర్ణించారు.

ఈ వర్ణనవల్ల లయ సమయం వచ్చేసరికి, లోకాలన్నీ తమ తమ భూతాలలోనూ, భూతాలలో కూడా, భూమి జలంలోనూ, జలం అగ్నిలోనూ, అగ్ని వాయువులోనూ, వాయువు ఆకాశంలోనూ, ఆకాశం ఆత్మలోనూ, లయిస్తుంది అని చెప్పినట్లు అవుతుంది.

ఈ విధానమంతా ఎలా వున్నదంటే, మట్టి ముద్దలోంచి కుండ పెంకులు, కుండ పెంకులలోంచి కుండా వచ్చి, మట్టిగానే నిలిచి వుండి, మళ్ళీ కుండ పగిలినప్పుడు కుండముక్కలై, వాటిని చూర్ణం చేయగా మళ్ళీ మట్టిముద్దే వచ్చినట్లుగా వుంది.

దీనిని బట్టి, కుండ మట్టిలోంచి పుట్టి, మట్టిలోనే నిలచి వుండి, మళ్ళీ మట్టిలోనే లయమైందని మనం గ్రహిస్తున్నాము. అదే రీతిగా ఉపనిషత్తులలోని సృష్టి స్థితి లయ వాక్యాలవల్ల, ఆత్మ పదార్థంలోంచే పంచభూతాలు, సమస్త సృష్టి ఉద్భవించి, ఆత్మ పదార్థంవల్లే నిలచి వుండి, మళ్ళీ ఆత్మలోనే లయించిపోతున్నాయి అని మనకు తెలుస్తుంది. ఇలా మూల కారణమైన ఆత్మతత్త్వాన్ని వర్ణించడాన్ని సృష్టిరూప అర్థవాదము అంటారు.

### (v.2) స్థితిరూప అర్థవాదము

ప్రపంచంయొక్క స్థితిని వర్ణించటం ద్వారా తత్త్వాన్ని ప్రతిపాదించే విధానాన్ని స్థితిరూప అర్థవాదము అంటారు.

### (v.3) లయ అర్థవాదము

ఈ ప్రపంచం లయించే విధానాన్ని వర్ణించటం ద్వారా తత్త్వప్రతిపాదన చేసే పద్ధతిని లయ అర్థవాదము అంటారు. (స్థితి లయ అర్థవాదములు రెంటికీ ఉదాహరణ సృష్టి అర్థవాదంలోనే కలిసివుంది గమనించండి.)

### (v.4) ప్రవేశ అర్థవాదము

ఛాందోగ్యోపనిషత్తులో "ఆ ఆత్మవస్తువు ఇదిగో ఈ చోటునే చీల్చుకొని, ఆ చిల్లి ద్వారా శరీరంలోకి ప్రవేశించింది"- అని చెప్పారు. మరొక చోట "ఆత్మ దానిని సృజించి దానిలో తాను దూరింది" అని చెప్పారు. మరొక చోట "జీవాత్మ రూపంగా నేను సృష్టిలోకి ప్రవేశించి, పేర్లను, రూపాలను, వృద్ధిచేస్తాను- అని ఆత్మ తలపోసింది" అని చెప్పారు. ఇలా కథలు కథలుగా ఆత్మ సృష్టిలోకి ప్రవేశించింది అని చెప్పటంవల్ల మనకేమి తేలుతోంది?

మనం చూస్తుండగానే ఒక రామయ్యగారు ఒక ఇంట్లోకి దూరాడు. కొంత సేపైనాక ఆయనే వేషం మార్చుకొని, తలకాయ బయటకి పెట్టి, వచ్చేపోయే వారిని పలకరిస్తున్నాడు. అప్పుడే మంటాం? "ఈ పలకరించే పెద్దమనిషి రాజు లాగా అలంకారం చేసుకొన్నాడు గానీ, ఈయన ఇందాకటి రామయ్యే. ఆ ఇంట్లో రెండో మనిషి వుండేందుకే అవకాశం లేదు కనుక, ఈయనే ఆయన" అంటాం కదా!

అలాగే, ఆ పరబ్రహ్మ వస్తువే సృష్టిలోకి ప్రవేశించింది అని కథలు కథలుగా ఉపనిషత్తులు చెప్పటంవల్ల, "ఇప్పుడు జీవాత్మగా కనిపించే ఈ చిన్నమనిషి ఆ

పరబ్రహ్మమే, ఏమీ భేదం లేదు" అని మనకు నిర్ధారణ అవుతోంది. ఇలా నిర్ధారణ చేసే విధానం పేరే ప్రవేశ అర్థవాదము.

## (v.5) నియమన అర్థవాదము

బృహదారణ్యకోపనిషత్తులోని అంతర్యామి బ్రాహ్మణంలో ఇలా చెప్పారు. "ఎవడైతే భూమిలో వుంటూ, భూమికి లోపలివాడై వుంటాడో, ఎవడిని భూమి ఎరుగదో, ఎవడికి భూమి శరీరమో, ఎవడు భూమికి లోపల వుండి, భూమిని నియమిస్తూ వుంటాడో, అట్టి ఈ పురుషుడే నీ ఆత్మ. అతడే నీలోని అంతర్యామి. అతడే అమృతుడు. ఇలాగే జలంలో, ఆకాశంలో, అన్నిట్లోనూ వుండి వాటిని నియమించే పురుషుడే నీకు ఆత్మ"– అని వరుసగా వాక్యాలు వస్తాయి. జీవాత్మ పరమాత్మలకు గనుక భేదము వుండి వున్నట్లు అయితే, అతడే నీలోని అంతర్యామి అని చెప్పటం కుదరదు. కనుక జీవాత్మ పరమాత్మలకు ఐక్యం చెప్పటమే ఆ వాక్యాలకు తాత్పర్యం అని నిర్ణయించక తప్పదు.

ఇలా ప్రపంచాన్ని నియమించే పురుషుణ్ణి ఒకణ్ణి చెప్పి, వాడే నువ్వు అని చెప్పటం ద్వారా, జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని సాధించే విధానాన్ని నియమన అర్థవాదము అంటారు.

## (v.6) తత్ – త్వం పదార్థ శోధన అర్థవాదము

తత్ అంటే పరమాత్మ. త్వం అంటే జీవాత్మ. ఈ రెండు పదాలకూ గల అర్థాలను పరిశోధన చేయటం ద్వారా, వారిద్దరికీ భేదం లేదని ప్రతిపాదించే విధానాన్ని, తత్త్వం పదార్థ శోధన అర్థవాదము అంటారు. ఉదాహరణకు, తైత్తిరీయంలో "ఈ పురుషుడు అన్నరస మయుడు" అని వుంది. దీనిని బట్టి పురుషుడికి (పరమాత్మకి), అన్నరస మయుడికి (జీవాత్మకి), భేదం లేదని తెలుస్తోంది.

అలాగే ఛాందోగ్యోపనిషత్తులో అగ్ని, సూర్యుడు, చంద్రుడు, మెరుపులు, అనే పదార్థాలను పరిశీలించి వాటిలో ఎఱ్ఱగా కనిపించేది అగ్నిభాగమనీ, తెల్లగా కనిపించేది జలభాగమని, నల్లగా కనిపించేది భూమిభాగమనీ, నిర్వచించి, ఆ భూమి, జలము, అగ్ని అనే మూడింటిలోనూ సత్పదార్థం సమానంగా వ్యాపించి వుంది అని వివరించి, కనుక అగ్ని, సూర్యుడు మొదలైనవన్నీ కూడా సత్పదార్థము యొక్క వికారాలేననీ, అందువల్ల వాటి అన్నిటియందు కూడా సత్పదార్థమునే భావన చేసి, ఉపాసన చేయాలనీ చెప్పారు. దీనిని బట్టి ఆ సత్పదార్థమే, జీవాత్మగా వ్యక్తమైందని మనకు తెలుస్తోంది. ఇక్కడ సత్పదార్థమంటే తత్, జీవాత్మ అంటే త్వం.

ఇలా విభిన్న రీతులలో తత్, త్వం పదాల అర్థాలను పరిశీలించి, వాటి ఐక్యాన్ని నిరూపించటమే తత్త్వం పదార్థ శోధన అర్థవాదము.

### (v.7) ఫల ప్రతిపాదక అర్థవాదము

తైత్తిరీయ ఉపనిషత్తులో బ్రహ్మవేత్త పరబ్రహ్మమునే పొందుతాడు, అంటే తనే పరబ్రహ్మమై పోతాడు- అని చెప్పారు. మరొక చోట బ్రహ్మ వేత్త అమరుడయ్యాడు అన్నారు. ఇలాంటి వాక్యాలలో బ్రహ్మ జ్ఞానానికి జీవ బ్రహ్మల ఐక్యమే పరమఫలము అని చెప్పినట్లయింది. ఇట్లా అన్నిటినీ మించిన పరమోత్తమ ఫలం జీవబ్రహ్మల ఐక్యమే అని చెప్పటంవల్ల ఈ ఉపనిషత్తులయొక్క తాత్పర్యం జీవబ్రహ్మైక్య ప్రతిపాదనమే అని మనకు నిశ్చయమౌతోంది. ఇలా ఫలప్రతిపాదన ద్వారా సిద్ధాంత ప్రతిపాదన చేసే విధానాన్ని ఫల ప్రతిపాదక అర్థవాదము అంటారు.

ఈ విధంగా 7 రకాల అర్థవాద విధానాలతోనూ కూడా ఉపనిషత్తులయొక్క తాత్పర్యం జీవ బ్రహ్మైక్య ప్రతిపాదనమే అని నిశ్చయమౌతున్నది.

### (vi) ఉపపత్తి

ఇది షడ్విధ తాత్పర్య లింగాలలో 6వది. ఉపపత్తి అంటే నిరూపణం. ముందు ఒక విషయాన్ని చెప్పి, దానిని హేతువులతోనూ, ఉదాహరణలతోనూ, నిరూపించడమే ఉపపత్తి.

ఉదాహరణకు, ఛాందోగ్యోపనిషత్తులో "ఒక మట్టిముద్దను తెలుసుకొంటే, దానితో చేసిన రక రకాల కుండలు, మూకుళ్ళు, ముంతలు, బానలు, కూజాలు, ప్రమిదలు వగైరాలన్నీ మట్టే అని మనకు తెలిసిపోతుంది. కుండ, ముంత, మూకుడు, అనేవన్నీ వట్టి పేర్లే. మట్టి అనేది ఒక్కటే సత్యం"- అని వుంది. దీనివల్ల లోకంలో ఎన్ని రకాల వస్తువులు కనిపించినా కారణమే సత్యమనీ, కార్యం అసత్యమనీ, ఈ ఉదాహరణ మనకు నిరూపిస్తోంది.

ఈ విధంగా ప్రతిపాదితమైన అంశాన్ని దృష్టాంతాదుల ద్వారా నిరూపణ చేయటం పేరే ఉపపత్తి.

ఈ విధంగా షడ్విధ లింగాలతోనూ, వేద వాక్యాలకు తాత్పర్య నిర్ణయం చేయాలి.

38వ శీర్షికలో ఆత్మకర్త గానీ, కారయిత గానీ, కాదని నిశ్చయం చేశాం. 39వ శీర్షికలో తర్కరీత్యా జరిగిన ఈ నిర్ణయం ఎందుకు అనుభవానికి అందటం లేదు

అనే విచారణ ప్రారంభించి సంశయభావన, అసంభావన, విపరీత భావన, అనే భావనాత్రయం గురించి ప్రస్తావించుకొన్నాం. ఆ శీర్షికలోనే వేద వాక్యాలయొక్క తాత్పర్యం ఏమిటో నిశ్చయంగా తేల్చుకుంటే, సంశయభావన పోతుందని, అది పోతే అసంభావన, విపరీత భావనలు ఒకదాని తరువాత ఒకటిగా పోతాయని చెప్పుకున్నాం. వేద వాక్యాల తాత్పర్య నిర్ణయం ఎలా చేయాలి? అనే ప్రశ్న వచ్చింది. దానికి సమాధానంగా 41వ శీర్షికలో షడ్విధ లింగాల గురించి వివరించుకున్నాం. ఈ షడ్విధ లింగాలవల్ల వేదాంత వాక్యాలన్నింటికీ జీవాత్మ పరమాత్మల ఐక్యమే తాత్పర్యమని గ్రహించాము.

### శ్రవణ మనన నిదిధ్యాసలు

ఇలా సకల వేదాంత వాక్యాల తాత్పర్య నిశ్చయాన్ని గ్రహించటం పేరే శ్రవణం. దీనివల్ల సంశయభావన తొలగిపోతుంది. ఇలా శ్రవణంవల్ల గ్రహించిన విషయాన్ని వివిధ యుక్తులతో, ఉదాహరణలతో, మళ్ళీ మళ్ళీ అలోచించుకుంటూ దృఢపరచుకోవటం పేరే మననం. దీనివల్ల అసంభావన తొలగిపోతుంది. మననం చేత దృఢమైన ఆత్మతత్త్వాన్ని ఏక రూపంగా, ఇతర విరోధిభావాలు అడ్డురాకుండా, మనస్సులో ఆవర్తన చెయ్యటం పేరే నిదిధ్యాసము. దీనివల్ల విపరీత భావన నశిస్తుంది.

36వ శీర్షికలో బ్రహ్మవిద్వరిష్ఠుడి గురించి వివరించుకొంటూ చరమ వృత్తి అనీ, బ్రహ్మాకార వృత్తి అనీ, చెప్పుకున్నాం. బ్రహ్మయే ఆకారమైన ఆ చరమ వృత్తి, ఈ నిదిధ్యాసవల్లే కలుగుతుంది.

కనుక షడ్విధ లింగాలతోనూ తాత్పర్య నిర్ణయం ద్వారా శ్రవణాన్ని, తద్ద్వారా మననాన్ని, తద్ద్వారా నిదిధ్యాసను సాధించి, తద్ద్వారా బ్రహ్మవిద్వరిష్ఠుడు కావటమే ఈ ఆత్మానాత్మ విచారణకు పరమఫలం.

ఇట్లు మాయావివరణమునందు పంచమ వర్ణకము సమాప్తము. ఓం తత్సత్.

## శ్రీ శంకర భగవత్పాదుల

# అద్దంలో నగరము

**(1999 జూన్ 15,16,17, తేదీలలో దత్తపీఠంలో చేసిన ప్రవచన సారం)**

దక్షిణామూర్తి స్తోత్రమనే అద్భుత వేదాంత ప్రకరణ గ్రంథాన్ని రచించింది ఆది శంకరాచార్యులు. ఆయనకు ఆ జ్ఞానం గోవింద భగవత్పాదుల ద్వారా లభించింది. గోవింద భగవత్పాదులకు గురువు గౌడపాదులు. ఆయనకు వ్యాసుడు గురువు. ఆ వ్యాసులవారు పుడుతూనే 20 ఏళ్ళ వయస్సువాడై, పుస్తకాలేవీ చదివే పని లేకుండానే అంతా నోటికొచ్చేసినట్లు పుట్టాడు. ఆయన 4 లక్షల శ్లోకాలు రాశాడు. రాశాడని చెప్పుకోవడం తప్పితే, లెక్క పెట్టటానికి మనకు ఓపిక చాలదు. అటువంటి గ్రంథాలను ఆయన వ్రాశాడు. ఆయనకు ఈ విద్య ఎక్కడనుంచీ వచ్చిందయ్యా అంటే, దక్షిణామూర్తి స్వామివారి దగ్గరనుంచీ వచ్చింది.

ఆ స్వామివారు ఎవరంటే, సనక సనందన సనత్కుమార సనత్సుజాతులనే మహర్షులు వుండేవారు. వారు బ్రహ్మయొక్క మానసపుత్రులు. ఈ నలుగురూ ఆత్మతత్త్వం తెలుసుకోవాలనుకున్నారు. అలా అనుకున్నదే తడవుగా, తండ్రి అయిన బ్రహ్మగారి దగ్గరకు వెళ్ళారు. తండ్రిగారు చెప్పింది వాళ్ళకి నచ్చలేదు. అక్కడ నుంచీ తమ తాత అయిన విష్ణుమూర్తి వద్దకు వెళ్లారు. వెళ్ళేటప్పటికి ఆయన శేషతల్పంపై పడుకొని శ్రీలక్ష్మితో సంభాషణ చేస్తూ వారికి కనిపించాడు. దాంతో వారికి కోపం వచ్చి అక్కడినుంచి వెళ్ళిపోయారు. ఎవరు మంచి వాళ్ళు? అని ఆలోచించారు. ఆలోచించగా, బోళా శంకరుడు వున్నాడని తెలిసింది. "ఆయన అయితే ఉన్నమాట వున్నట్టు చెపుతాడు. ఆయన దగ్గర దాపరికం వుండదు. ఆయనకు వస్తే వస్తుందని చెపుతాడు. లేకపోతే లేదని చెపుతాడు" అని విని, కష్టపడి కైలాస పర్వతం ఎక్కారు. అయితే వారికి అక్కడ మంచి నృత్యం చేస్తూ శివుడు కనిపించాడు. వాళ్ళకి తల తిరిగిపోయింది. 'మనం దారి తప్పాం' అనుకొని మరో దారిలోకి వెళ్ళిపోయారు.

శివుడు నాట్యం చేస్తూ వీరిని ఓర కంట చూస్తూనే వున్నాడు. “వీళ్ళు నన్ను అర్థం చేసుకోలేద” ని ఆయన జాలిపడ్డాడు. శివుని శరీరంలో ఎడమ భాగంలో అమ్మవారు వుంటుంది. ఎడమ భాగము అంటే ఉత్తరభాగం.(మనం తూర్పుదిశగా కూర్చున్నప్పుడు ఎడమ భాగం ఉత్తరదిశ అవుతుంది.) ఆమెను అక్కడ వదిలేసి కేవలం దక్షిణభాగంలో వున్న మూర్తిని స్వీకరించాడు. కనుక ఆయనకు దక్షిణామూర్తి అని పేరు వచ్చింది. బాగా కరుణగా వుండటం పేరు దక్షిణ. దాక్షిణ్యం (అనగా కరుణ) కలిగిన మూర్తి కనుక ‘దక్షిణామూర్తి’ అని పేరు వచ్చింది.

ఆయన సనకాదులు వెళ్లే దారిలో ఒక మఱ్రి చెట్టు కింద కూర్చున్నాడు. మంచి తేజస్సుతో కనిపిస్తున్నాడు. ఈయన ఎవరు? అని దివ్యదృష్టితో చూడటం ప్రారంభించారు సనకాదులు. ఈయన బ్రహ్మాంశనుంచి వచ్చాడా? విష్ణ్వంశ నుంచి వచ్చాడా? శివాంశనుంచి వచ్చాడా? దేవజాతులలోంచి వచ్చాడా? మానవుడా? మునీశ్వరుడా? – అని పరిశీలిస్తున్నారు. ఎంత పరిశీలిస్తున్నా వారికి ఆయనయొక్క తేజస్సు ఏ మాత్రం అంతు పట్టడం లేదు.

సనక సనందాదులంటే వారి దివ్యశక్తులు కొద్దిపాటివి కావు. ఎవడైనా కనిపిస్తే వాడి చరిత్రంతా చెప్పేస్తారు. అటువంటిది ఈ చెట్టు క్రింద కూర్చున్న మహనీయుని చూసేటప్పటికి “ఆయన ఎవరు? ఆయన ఎక్కడనుంచి వచ్చాడు? ఆయన మూలం ఏమిటి? ఆయనయొక్క పూర్వజన్మ ఏమిటి? ఆయనయొక్క పరజన్మ ఏమిటి?”అని మనసులో యోచన చేస్తే, వాళ్ళకి ఏమీ కనిపించటం లేదు. అనంతమైన, ఆనందమయమయిన, తేజోమయమైన, చిద్విలాసమైన, మూర్తి విశేషమే దర్శనమిస్తోంది తప్పితే, ఆయన తత్త్వాన్ని ఏమీ అర్థం చేసుకోలేక పోయారు. చాలా సేపు దీక్షగా ఆయన వంక చూసి, చూసి తపోనిమగ్నులై ‘ఈ తత్త్వం ఏమిటా?’ అని మననం చెయ్యబోయేటప్పటికి, ఎట్లాగయితే ఆ భ్రమర కీటక న్యాయంలో, భయంతో భ్రమరం వంక చూస్తున్న కీటకం భ్రమరంతో తాదాత్మ్యాన్ని పొందుతుందో, అదే విధంగా వీళ్ళు కూడా ఒకానొక అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతున్నారు తప్పితే, ఆయన ఏమిటో తెలియడం లేదు.

అప్పుడు “ఇది ఏమిటి? మనం ఎక్కడున్నాం? ఈయన ఎవరు? కోఽయం” అని వాళ్ళు మళ్ళీ విచారణ ప్రారంభిస్తే, వారికి ఏమీ తెలియలేదు. వాళ్ళు అప్పటికి చతుర్వేదములు, షట్ఛాస్త్రములు ఔపోసన పట్టిన మహాత్ములు అవడంచేత, వాళ్ళ శాస్త్రవిజ్ఞానాన్ని, తపోమయమైన మహత్తును, సమన్వయించి చూసినా కూడా ఆయన

తత్త్వం అంతు బట్టకపోవటంవల్ల, వాళ్ళు వినీతులై, “దేవా! నువ్వెవరివి? మేమెవరు?” అని ఆయననే ప్రశ్నించారు.

ఎందుకంటే నువ్వెవడివి అనే ప్రశ్న కంటే, నేనెవడిని? అనే ప్రశ్నకే ఎక్కువ ఉపయోగం వుంది. ఒక వేళ దక్షిణామూర్తి స్వామివారు “నేను చాలా గొప్పవాణ్ణి, బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల కంటే ఎక్కడో పైన ఒక మహాలోకం వుంది. దాంట్లో ఒక దేవుడున్నాడు. ఆ దేవుడిలోంచి నేను వచ్చాను” అని చెప్పినా కూడా మనకేమి ప్రయోజనం?

మన సంగతి మనం తెలుసుకోవాలి కానీ, మన గురువు గురించి గొప్పలు చెప్పుకుంటే మనకేమి వస్తుంది? కొన్నాళ్ళు పోయిన తరువాత మన తోటివాళ్ళు సాధన చేసి, కొంచెం విశిష్టమైన స్థితిని సంపాదిస్తే, ఇంత గొప్ప గురువును ఆశ్రయించినా మనం ఇట్లాగే వున్నామే! కనుక మన గురువుకేమీ రాదు అని ఆయనకే టోపీ పెట్టేస్తాము. ఎందుకంటే గురువుకు వచ్చిన తరువాత నాకు రాలేదంటే నీవు సరిగా సాధన చేయలేదంటారు. అందుకని గురువుకే రాదంటాం మనం.

ఇటువంటి బుద్ధి మనకు కొత్తగా వచ్చింది కాదు. ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక మహర్షి పుత్రుడైన శ్వేత కేతువు అనే కుర్రవాడికి ఉపనయనం చేయడం ఆలస్యం అయింది. ఎందుకంటే తండ్రి తపోదీక్షలో వున్నాడు. బ్రహ్మవర్చస్సు కోరే బ్రాహ్మణుడు, కుమారుడికి 5వ సంవత్సరంలోనే ఉపనయనం చేయవచ్చు. పూర్వంలో మహర్షులంతా 5వ సంవత్సరంలోనే చేశారు. “గర్భాష్టమేషు బ్రాహ్మణ ముపనయీత” అనే శాస్త్రం సామాన్యమైన శక్తిసామర్థ్యాలు గల బ్రాహ్మణుని ఉద్దేశించినది. విశేషశక్తి సామర్థ్యములు కలిగి వుండి, కేవలం బ్రహ్మవర్చస్సు, బ్రహ్మజ్ఞానం అనేవి తప్పితే, ఇంకేమీ అక్కరలేదని ఎవడైతే అనుకున్నాడో, వాడికి 5వ ఏటనే ఉపనయనం చేసి, 5వ ఏటనే వేదాధ్యయనంలో పెట్టవచ్చు. ఏదైనా కారణం చేత కుదరకపోతే. “అషోడశం” 16వ సం॥ వరకు హద్దు వుంది బ్రాహ్మణుడికి. 16 సంవత్సరాలు దాటగానే బ్రాహ్మణ్యం పోతుంది.

ఛాందోగ్యంలో చెప్పిన కథ కృతయుగంలో జరిగింది. దాంట్లో శ్వేతకేతువుయొక్క తండ్రి అయిన ఉద్దాలక మహర్షి ఒకానొక తపోదీక్షలో, తపస్సమాధిలో, వుండటంవలన కుమారుడికి ఉపనయనం చేయడం కుదరలేదు. ఆయన కళ్ళు తెరిచేటప్పటికి, ఆ బాలుడికి 12 సంవత్సరాలు వచ్చాయి. 12 సంవత్సరాలు వచ్చినా మనవాడు ఆటలు ఆడుకొంటున్నాడు. “నీకు ఆట లేమిట్రా” అని వెంటనే పిల్చి “మన వంశంలో

పుట్టినవాడు ఎవడూ ఇలా లేడురా. 12 సంవత్సరాలు వచ్చేసరికి వేదాలు అయిపోయి వుండాలి నీకు. కానీ, నీవిలా తిరుగుతున్నావేమిటి" అని చీవాట్లు పెట్టాడు. ఎంతైనా పాత కాలం కదా, "ఏం చెయ్యమంటారు నాన్నగారు" అన్నాడు కుర్రవాడు. వెంటనే వాణ్ణి గురువు వద్దకు పంపించాడు తండ్రి. అక్కడ 12 సంవత్సరాలలో చతుర్వేదములు, షట్ఛాస్త్రములు అన్నీ కూడా సంపూర్ణంగా అధ్యయనం చేశాడు.

వేదానికి 1360 శాఖలు వున్నాయి. షట్ఛాస్త్రాలు, వాటి అర్థాలు, సమన్వయాలు, అన్నీ శ్వేతకేతువు 12 సంవత్సరాల్లో చదివేశాడు. అయితే అతనికి గర్వం వచ్చింది. తండ్రిగారు వచ్చినా కూడా మాట్లాడడు. పెద్దలు ఇంటికి వచ్చినా కూడా నమస్కారం పెట్టడు. "ఏం చదువుకున్నారండి మీరు? తర్కశాస్త్రం చదివారా? చివరి దాకా చదివారా?" అంటూ వుంటాడు. చదివానంటే వాణ్ణి ప్రశ్నలు వేసి పడకొడుతూ వుంటాడు.

ఇలా గర్విష్ఠిగా వున్న కొడుకును చూశాడు తండ్రిగారు. ఒక రోజున ఏకాంతంగా "ఏమిట్రా నాయనా! మంచి గర్వంలో వున్నావు? ఏమిటి కథ?" అని అడిగాడు.

"ఏముంది నాన్నగారు! చదువంతా అయిపోయింది కదా, గురువుగారి ఇంటికి వెళ్ళవలసిన పని లేదు కదా" అన్నాడు శ్వేతకేతువు. "నాకొక సందేహం వున్నది చెబుతావా?" అన్నాడు తండ్రి.

"దాందేముంది, అడగండి" అన్నాడు పుత్రుడు.

ఆయన "ఏ ఒక్క విషయాన్ని తెలిసికొంటే, ప్రపంచంలో వుండే సమస్త విషయాలు తెలుస్తాయో, అటువంటి కీలకమైన చిన్న అంశం వుంది. ఆ అంశం తెలుసుకున్నావా?" అన్నాడు.

పుత్రుడి గుండెల్లో రాయి పడింది. తర్కం, మీమాంస చదువుకున్నావా? వైద్యశాస్త్రం, నాట్యశాస్త్రం చదువుకున్నావా? అంటే చెపుతాడు గానీ, "ఏదో చిన్న అంశం వుంది. అది తెలుసుకుంటే శాస్త్రాలన్నీ తెలుస్తాయి. లోకాలన్నీ తెలుస్తాయి. అటువంటి ఒకే ఒక అంశం నువ్వు తెలుసుకున్నావా?" అని అడుగుతున్నాడు. ఏం చెప్పాలి? అని ఆలోచించి, "అటువంటి విషయం వుండటానికి వీలు లేదు" అన్నాడు పుత్రుడు. దానికొక ఉదాహరణ చెప్పాడు. "రామయ్యగారితో మీకు పరిచయమైతే సుబ్బయ్యగారితో పరిచయమైనట్లేనా? ఇదెక్కడైనా కుదురుతుందా? వారి లక్షణం వేరు. వీరి లక్షణం వేరు. ఒకర్ని తెలుసుకుంటే ఇంకొకరిని తెలుసుకున్నట్లే అంటే

ఎలా కుదురుతుంది? ఏ విషయం తెలుసుకోవాలంటే ఆ విషయం తెలుసుకోవాలి. అంతే కాని ఒక్క విషయం తెలిసికొంటే అన్ని విషయాలు తెలుస్తాయంటున్నారు. అది సాధ్యం కాదు" అన్నాడు పుత్రుడు. తండ్రిగారు "ఉంటుందని నిరూపణ - మాట అలా పెట్టు. ఉండేందుకు అవకాశం వున్నదని మాత్రం నిరూపణ చేస్తానువిను" అన్నాడు.

ఎలాగంటే – ఒక తండ్రి, 50, 60 ఏళ్ళున్నవాడు, ఆయన 10 ఏళ్ళ కొడుకుని వెంట బెట్టుకొని పొద్దున్నే 4గం॥కు నిద్ర లేచి, 5గం॥ కు స్నానం చేసి, సూర్యోదయం కాకుండానే పక్క ఊరికి బయలు దేరాడు. దార్లో చిన్న ఏరు అడ్డం వచ్చింది. ఆ ఏటి ఒడ్డుకు వెళ్ళేటప్పటికి అక్కడ ఒక కుండలు చేసే కుమ్మరివాడు వున్నాడు. తెల్లవారేటప్పటికే ఏట్లో వొండ్రు సిద్ధంగా వుంటుంది కదా. ఆ కుమ్మరివాడు ఆ బురద అంతా బయటికి లాగి, పొడిమట్టి వేసి గట్టిగా మర్దనచేసి, పెద్ద మట్టి ముద్ద పెట్టాడు. తండ్రితో వెళుతున్న కుర్రవాడు దాన్ని చూసి "నాన్న! ఇదేమిటి?" అన్నాడు. "ఇది మట్టిముద్దరా, ఇది ఆ కుమ్మరివాడు తయారుచేశాడు" అన్నాడు తండ్రి. ఈ లోపల పడవ వచ్చింది. వారు ఏరు దాటి వెళ్ళిపోయారు. పని పూర్తిచేసుకుని సాయంత్రానికి తిరిగి వచ్చారు.

సాయంత్రం 4, 5 గంటల ప్రాంతంలో వారు తిరిగి ఏటి దగ్గరకు వచ్చేటప్పటికి, ఆ కుర్రవాడు అటూ ఇటూ చూశాడు. అక్కడ మట్టిముద్ద లేదు. కొన్ని రకాల కుండలు, మూకుళ్ళు, ప్రమిదలు, కూజాలు, ముంతలు తయారు చేసి వున్నాయి. ఆ కుర్రవాడు ఒక్క సారి "నాన్నా ఇవన్నీ మట్టే" అన్నాడు.

"అదేమిట్రా? ఇవి మట్టెందుకు అవుతాయి? ఇవి కుండలు, ఇవి కూజాలు, ఇవి ముంతలు, ఇవి ప్రమిదలు" అన్నాడు తండ్రి.

"నీవన్నమాట నిజమే కాని, ఇవన్నీ మట్టే" అన్నాడు పుత్రుడు.

"నీకెట్లా తెలిసింది?" అన్నాడు తండ్రి.

"పొద్దున నేను మట్టిముద్ద చూశాను కదా! ఇప్పుడా ముద్ద లేదు. ఆ మట్టి ముద్ద ఉన్న చోటులో ఇవన్నీ ఉన్నాయి. కనుక మట్టి ముద్దే ఇన్ని ఆకారాలుగా వచ్చేసింది" అన్నాడు పుత్రుడు. అక్కడితో ఆగక, "ఇది కూజా, ఇదీ మట్టే. ఇది కుండ, ఇదీ మట్టే. ఇది బాన, ఇది ప్రమిద –అన్నీ మట్టే!" అన్నాడు.

అన్నీ మట్టే అని వాడికెలా తెలిసింది? వాడు పొద్దున ఒక మట్టి ముద్ద చూశాడు. అంటే సూర్యోదయ సమయంలో మట్టి ముద్దను గురించి జ్ఞానం సంపాదించాడు.

సాయంత్రం అయ్యేటప్పటికి 100 రకాల వస్తువులను అక్కడ చూశాడు. చూసి "ఆ మట్టిముద్దే ఇవి. ఆ మట్టి ముద్దలోంచి ఇవి వచ్చేశాయి" అన్నాడు.

"కనుక ఒక మట్టి ముద్దను తెలుసుకొనటం ద్వారా 100 కుండలు తెలిసినాయి. 100 బానలు, మూకుళ్ళు తెలిసినాయి. కనుక ఒక వస్తువును తెలుసుకుంటే, 100 వస్తువులు తెలిసేందుకు అవకాశం వుందని దీనివల్ల నిరూపణ అవుతోందా? లేదా?" అన్నాడు ఉద్దాలక మహర్షి. మళ్ళీ ఒకక్షణం ఆగి ఆయనే "అసంభవం అన్నావు కదా! నేను చెప్పేది తప్పైతే కావచ్చు కాక, అలాంటి వస్తువు లేకపోతే లేకపోవచ్చుగాక ఉండటానికే అవకాశం లేదనటం చెల్లదు. వుందా? లేదా? అని తరువాత విచారణ చెయ్యాలి" అన్నాడు.

"ఈయన ఇలా కాలికీ, వేలికీ మెలిక వేస్తాడని అనుకోలేదే" అనిపించింది కుర్రవాడికి. దాంతో మళ్ళీ గురువుగారి దగ్గరకు వెళ్ళమంటాడేమోనని భయం వేసింది. దాన్ని తప్పించుకుందామనుకుంటుండగా ఒక మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. "ఒకవేళ అటువంటిది ఉంటే, మా గురువుగారికే తెలియదు నాన్నగారు" అన్నాడు.

"అదేమిట్రా? ఆయనకు తెలియదని నువ్వెట్లా చెపుతావురా?" అన్నాడు తండ్రి.

"ఆయనకు నేనంటే చాలా ఇష్టమండీ. ఆయనకు అన్ని సేవలూ చేశాను. కనుక ఆయనకు తెలిసివుంటే నాకు చెప్పకుండా వుండేవారు కాదు. కనుక ఆయనకు ఇది తెలియదు" అన్నాడు పుత్రుడు.

శంకర భగవత్పాదులవారు ఇక్కడ వ్యాఖ్యానం రాస్తూ "అలా గురువుగారి గురించి తక్కువగా మాట్లాడటం పాపమని తెలిసినా కూడా, గురుకుల క్లేశాన్ని మళ్ళీ అనుభవించవలసి వస్తుందేమోననే భయంతో, ఆ కుర్రవాడు అలా అనేశాడు". అని వ్రాశారు.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే "మా గురువు గొప్ప" అని ఒక పక్క చెప్పుతూనే "మీకేమీ రాలేదేమయ్యా?" అని అడిగితే, "మా గురువుకే రాదు" అనేస్తారు. అది మానవ స్వభావం. అందుచేత ఆత్మ విద్యా విషయంలో గురువుని గురించి తెలుసుకునే వారు, తానెవరో తెలుసుకునేందుకు కూడా గట్టి ప్రయత్నం చేయాలి.

ఇంతకూ మనం దక్షిణామూర్తివారి దగ్గరనుంచి వచ్చాం. సనకాదులు ఆయనను చూసి, "ఈయన ఎవరు? ఏమిటి?" అని లోలోపలే అన్వేషించారు. ఆయన గురించి ఏమీ అర్థం కాక, ఆయన గొప్పవాడైతే మనం ఎవరం? ఆయనకూ మనకూ తారతమ్యమేమిటి? ఆయనవల్ల మనకేమన్నా ఉపయోగం వుంటుందా? లేదా? ఆ

మహనీయుడి తత్త్వమేమిటి? ఆ తత్త్వంవల్ల మనకొచ్చే ఉపయోగం ఏమిటి? అని విచికిత్సలో పడినపుడు, ఆయన ఏమీ మాట్లాడకుండా చిన్ముద్ర చూపించాడు.

చిన్ముద్ర అంటే బొటనవేలుని, చూపుడు వేలుని కలుపుతారు. మిగతా వేళ్ళు వదిలిపెడతారు. దీన్ని చిన్ముద్ర అంటారు. ఇది గురువులు చూపించాలి. మనం చూపించుకోకూడదు. అయితే దీని అర్థం ఎలా తెలుస్తుంది?

**యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ**

**తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః –** అని ఉపనిషత్తులో వుంది.

గురువులు గొప్ప విషయాలు చెపుతూనే వుంటారు. అయితే ఆ చెప్పిన విషయాలు మనలో ప్రకాశించాలి. అంటే దీపం వెలగాలి. గురువునందు దైవసమానమైన భక్తి కలిగినప్పుడే, ఆ దీపం వెలుగుతుందని ఉపనిషత్తులలో మనకి చెప్పారు. గురువునందు, భగవంతునియందు నిస్వార్థమైన భక్తి ఎవరికైతే వుంటుందో, వాళ్ళకి మహాత్ములు చెప్పినట్టి మహనీయమైన అర్థములు హృదయంలో వాటంతటవే ప్రకాశిస్తాయి.

ఏమిటయ్యా ప్రకాశించటం అంటే–

చిన్నపిల్లలు ఇంట్లో వుంటారు. వాళ్ళకి ఏడాది రెండేళ్ళు వచ్చి వుంటాయి. బొత్తిగా అజ్ఞానంలో వుండరు. ఆకలేస్తే అన్నం తినాలని తెలుసు. అన్నం మెతుకులు ఏరుకొని తింటూనే వుంటారు. అన్నం తినాలంటే మాత్రం పేచిపెట్టి ఇటూ అటూ ఆడుకుంటారు. నాయనమ్మలు వాళ్ళ వెంటపడి నోట్లో కుక్కుతూ వుంటారు. వాళ్ళు ఫోజు కొట్టి చివరకు తింటూ వుంటారు. ఈ బాలుడి యొక్క పరిస్థితి విచారించండి. ఆ బాలుడు అన్నం తింటే ఆకలి తీరుతుందనే జ్ఞానం బొత్తిగా లేనివాడు కాదు. కానీ అది హృదయంలో ప్రకాశించలేదు. అదే విధంగా మనం ఎన్ని గ్రంథాలు చదివినా ఎన్ని ఉపన్యాసాలు విన్నా మనకు వేదాంత తత్త్వ విషయం ప్రకాశించడం లేదు.

ఎప్పుడు ప్రకాశిస్తుందయ్యా అంటే, దానికి ఉపనిషత్తు

**“యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ”** – అంటోంది.

ముందర దేవునియందు అవ్యాజమైన భక్తి వుండాలి. అవ్యాజమైన భక్తి అంటే కోరికలు లేని భక్తి. నాకు ఈ కోరికలు తీరాలి. ఐశ్వర్యం రావాలి. కష్టాలు తీరాలి అనే కోరికలు లేకుండా అకారణమైన భక్తి వుండాలి. ఇదే మొదటిది. దేవుడియందు భక్తి సంపాదించిన తరువాత అటువంటి సమాన స్థాయిలో గురువు మీద కూడా భక్తి

వుండాలి. గురువంటే ఎవరి దగ్గరనుంచి మనం ఉపదేశం గ్రహిస్తున్నామో వారు. ఆ రెండు రకాల భక్తులు ఎవరికైతే ఉంటాయో వాడు మహాత్ముడవుతాడు.

**"తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః"**

"అటువంటి మహాత్ములకి మేము చెప్పే ఈ బోధలన్నీ లోపల తమంత తాముగా దీపిస్తాయి అని చెపుతోంది ఈ మంత్రం. ఆకలి దీపించినట్టుగా, అన్నం మీద కోరిక దీపించినట్టుగా, ఐశ్వర్యం మీద కోరిక దీపించినట్టుగా, ఈ తత్త్వార్థం మీద జ్ఞానం లోపల దానంతటదే ప్రకాశిస్తుంది.

అలా ప్రకాశింప చేయటానికి ఏమి కావాలి అంటే, ఈశ్వరభక్తి, గురుభక్తి కావాలి. ఈశ్వరభక్తి, గురుభక్తి వంటివి పరిపూర్ణంగా మూర్తీభవించినవాళ్ళు, సనక సనందన సనత్కుమార సనత్సుజాతులు. వీళ్ళు అంతకు ముందే మహా తపస్సులు చేసి ఈశ్వరభక్తిని, అవ్యాజమైన గురుభక్తిని కూడా పొంది వున్నారు కనుక, ఆయన వంక ఎప్పుడైతే ఆ ఆర్తి దృష్టితో చూశారో, ఆయన వెంటనే తన చిన్ముద్రా ప్రదర్శనంచేత వాళ్ళకి అర్థజ్ఞాపనం చేశాడు. లోపల నుంచీ దీపింప చేశాడు. ఏమని దీపింప చేశాడంటే–

ఈ మూడు నిలువు వేళ్ళు కూడా జాగ్రత్ స్వప్న సుషుప్తులు అనే మూడు అవస్థలను సూచిస్తాయయ్యా! ప్రతివాడు "నేను, నేను" అనుకుంటున్నాడు కదా? నేనని ఎప్పుడు అనుకుంటున్నాడంటే మెలకువ వున్నప్పుడు అనుకుంటున్నాడు. కలలో వున్నప్పుడు కూడా అనుకుంటున్నాడు. అంతే గానీ పూర్తిగా నిద్రలో వున్నప్పుడు మాత్రం అనుకోవటం లేదు. అనుకోకపోయినా ఆ సుషుప్తి దశలోనుంచీ మళ్ళీ జాగ్రద్దశలోకి వెళ్ళినపుడు "నేను ఇందాక కాసేపు సుషుప్తిదశను అనుభవించి వచ్చాను. ఆ సుషుప్తిదశలో నేను చాలా సుఖంగా వున్నాను" అని చెపుతున్నాడు. అంటే "నేను" అనే సాక్షాదనుభవం సుషుప్తి అవస్థలో లేకపోయినప్పటికీ, సుషుప్తి అవస్థలో తను మాత్రం నిశ్చయంగా వున్నాననీ, ఆ వుండటం కూడా అనందరూపంగా వున్నాననీ, జాగ్రద్దశలో స్మరిస్తున్నాడు.

స్మరించడం అంటే గుర్తు చేసుకోవడం. ఎప్పుడూ దేన్ని గురించి గుర్తు చేసుకొంటాము అంటే, మనయొక్క అనుభవాన్నే గుర్తు చేసుకుంటాము. అంతే గానీ "చిన్నప్పుడు నా ఐదో ఏట ఏం జరిగిందో గుర్తు చేసుకోండి" అని నేనంటే మీరేం గుర్తు చేసుకుంటారు?" "ఐదో ఏట మానాన్నచేత దెబ్బలు తింటూ వుండేవాడిని"

అని నేను చెప్పాలి. మీరంతా కూడా మీయొక్క అనుభవాలని మీరు గుర్తు చేసుకోగలరు గానీ, ఇంకొకరి అనుభవాలని గుర్తు చేసుకోలేరు.

ప్రతివాడూ కూడా గాఢనిద్రలోనించి బయటకి వచ్చినాక, గుర్తు చేసుకొంటున్నాడు. ఏమని? "నేను ఇప్పటి దాకా సుషుప్తి దశ అనుభవించి వచ్చాను. అంటే గాఢనిద్ర అనుభవించి వచ్చాను. ఈ గాఢనిద్రలో నేను ఆనందమయంగా వున్నాను. చాలా ఆనందంగా వున్నాను" అని గుర్తు చేసికొంటున్నాడు.

అత్యంత ఆప్తులైన తల్లిదండ్రులు గానీ, పుత్రాదులు గానీ, మరణించిన సమయంలో చాలా దుఃఖాక్రాంతులై, ఒళ్ళు తెలియకుండా శోకాలు పెడుతున్న సమయంలో కూడా, ఆ శోకతీవ్రతవల్ల ఒళ్ళు అలసిపోయి, నిద్రలో పడిపోతారు. ఆ నిద్రలో పడిపోయినవాళ్ళు, ఆ గాఢనిద్రలోంచి బయటకి వచ్చి "హమ్మ! హాయిగా నిద్ర పట్టిందండీ!" అని చెపుతారు. అన్నం పెడితే హాయిగా తిన్నాను అనడు, సినిమాలు చూపిస్తే హాయిగా చూశాను అనడు. కానీ, నిద్రలోకి వెళ్ళి వచ్చాక నేను నిద్రలో హాయిగా వున్నానని చెపుతాడు. ఎందుకంటే వాడికి స్మృతి అలా వుంది. గుర్తు, అనుభవం, అలా వుంది. ఇంత దుఃఖస్థితిలో వుండగా కూడా ఆనందాన్నే స్మరిస్తున్నాడు.

అలాగే పిల్లలకు ఏ పెళ్ళిళ్ళో జరుగుతాయి. ఇంటి నిండా బంధువులు వస్తారు. మనవళ్ళు, మనమరాళ్ళు, అందరూ వస్తారు. మంచి గంతులేస్తూ ఆనందంగా వుంటారు. అప్పుడు కూడా అలసటతో నిద్ర పోతారు. నిద్రపోయినవాడు మళ్ళీ నిద్ర నుంచి లేచి వచ్చి, నిద్రలో చాలా ఆనందంగా వున్నానని చెపుతాడు.

రోజుకి 10,000 రూపాయలు సంపాదించే జీతగాడికి మనం చేయి పట్టమని చెప్పి, ముష్టివాడికి వేసినట్లుగా ఒక పావలా వాడి మొహాన పారేసి "నీ సంపాదన ఈవాళ ఒక పావలా పెరిగిందోయ్, నువ్వు రోజూ 10000 రూపాయలు సంపాదించేవాడివి. ఈరోజు నీ సంపాదన 10000 రూపాయల పావలా" అంటే వాడు సంతోషపడడు. ఈ పావలా సంపాదనను అధికమైనదిగా వాడు భావించడు. అలాగే పుత్రులయొక్క వివాహంలో, మనుమలు, మనుమరాళ్ళయొక్క ఆటల్లో, ఆనందంలో తేలేవాడు కూడా, నిద్రలోంచి లేచి, "నేను ఆనందంగా వున్నాను" అని చెపుతున్నాడంటే, వాడు నిద్రలో అనుభవించిన ఆనందం, మెలకువలో అనుభవించిన ఆనందం కంటే చాలా గొప్పది అయివుండాలి. ఇంతకంటే నాశిరకం ఆనందాన్ని అనుభవించి వున్నట్లయితే, "ఛీ ఛీ అనవసరంగా నాకు నిద్ర పట్టిందండీ! నిద్ర పట్టకుండా వుంటే బావుండును. నిద్రవల్ల నా ఆనందమంతా చెడిపోయింది" అని చెప్పేవాడు.

కనుక మనం ఎన్ని రకాల ఆనందాలను ఈ లోకంలో ఊహించగలమో, అన్ని ఆనందాలకంటే, ఉత్తమోత్తమైన ఆనందాన్ని సుషుప్తి అవస్థలో మనం అనుభవిస్తున్నాము. అలాగే ఎన్ని రకాల దుఃఖాలను భూలోకంలో మనం తెలుసుకోగలమో, అన్ని రకాల దుఃఖాలవల్ల కలిగేటటువంటి క్రుంగు కంటే కూడా, దాన్ని కాంపెన్‌సేట్ చేయగల (పరిహారం చెల్లించగల), మహత్తర ఆనందం సుషుప్తిలో మనకు లభిస్తోంది.

ఇలాంటి సుషుప్తినీ, మెలకువనూ, స్వప్నాన్నీ కూడా ఎవడైతే అనుభ విస్తున్నాడో వాడి పేరే "నేను."

లోకంలో ప్రతివాడూ ఈ మూడు అవస్థలను వేరు వేరుగా అనుభవిస్తూనే వున్నాడు. ప్రతివాడూ తనను "నేను" అని వ్యవహరించుకొంటూనే వున్నాడు. తనను "నేను" అనే పిల్చుకొనే ప్రతివాడూ, ఎదుటివాణ్ణి "నువ్వు" అని పిలుస్తున్నాడు. అంటే ఒక "నేను" మరొక "నేను" ను వేరుగా చూస్తోందన్నమాట.

లోకంలో ఇన్ని కోట్ల "నేను" లు వుంటే, ఇందులో ప్రతిఒొక్క "నేను" కూడా జాగ్రత్, స్వప్న, సుషుప్తుల కంటే భిన్నమైనదే అయితే, మరి "నేను" అనే దానికి అర్థం ఏమిటి? తత్త్వమార్గంలో మానవులను కల్లోలపరచే ప్రశ్న ఇదే. దీనికి సమాధానమే వేదాంతంలో చిట్టచివరి మెట్టు. ఈ మెట్టు మాటల కందేది కాదు. అందుకనే శ్రీ దక్షిణామూర్తి స్వామి వారు ఈ సమాధానాన్ని కేవలం ముద్రద్వారా వివరించారు.

ప్రపంచంలో ఏ దేశంలో అయినా సరే, తనను గూర్చి తానే గర్వపడిపోయే ప్రతిమనిషీ, తనను గూర్చి తాను నిర్దేశించుకోవలసిన సందర్భం వస్తే, నాలుగు వేళ్ళూ ముడిచి బొటనవేలుతో తన గుండెలను తానే పొడుచుకొంటూ "నేను వీరుణ్ణి, నేను ధనికుణ్ణి, నేను పండితుణ్ణి" అని విర్రవీగుతూ వుంటాడు. వాడికి తెలియకుండానే వాడు తనకు తన బొటనవేలు సంకేతమనీ, తాను తన హృదయంలో అధికంగా అభివ్యక్తమౌతున్నాననీ, తన భంగిమ ద్వారా వ్యక్తం చేస్తున్నాడు. అందువల్లే వేదాంతవిద్యలో హృదయం ఆత్మకు స్థానమని, జీవాత్మ బొటనవేలులో విశేషంగా నివసిస్తున్నాడని వర్ణించారు. అందువల్లే దక్షిణామూర్తి స్వామివారు కూడా బొటనవేలును "నేను" కు సంకేతంగా స్వీకరించారు.

ఇక లోకంలో ఎదుటివాణ్ణి చెప్పవలసిన వచ్చినపుడు చూపుడువేలుతోనే చూపుతారు. అన్ని దేశాలలోనూ ఇది ఇలాగే వుంది. అందువల్ల చూపుడువేలు "నువ్వు"కు సంకేతం అవుతుంది.

"నువ్వు, నేను" అని పరస్పరం పిల్చుకొనే ఈ జీవులు వేరు వేరు కాదయ్యా! ఆ రెండూ ఒకటే అని బోధించడానికే దక్షిణామూర్తి స్వామివారు బొటన వేలును, చూపుడు వేలును, కలిపి సనకాది మునులకు చూపించారు.

వేదాంత పరిభాషలో చెప్పాలంటే, బొటనవేలు పరమాత్మ. చూపుడువేలు జీవాత్మ. ఈ రెంటిలో ఒకే చైతన్యం సమంగా వ్యాపించి వుంది. కానీ "అట్టి అఖండ చైతన్యాన్ని నేనే" అనే జ్ఞానం పరమాత్మకు వుంది. జీవాత్మకు లేదు. అందువల్లే బొటనవేలు నిటారుగా పైకి నిలబడి వుంది. చూపుడు వేలు కిందకి వొంగి పరమాత్మలో కలసిపోతోంది. అంటే, జీవుడు ఆత్మ విచారణ ద్వారా పరమాత్మచైతన్యంలో ఐక్యాన్ని పొంది, తాను కూడా అఖండ చైతన్యమై ప్రకాశిస్తున్నాడు. ఈ అఖండ చైతన్యస్థితే పరమసత్యం, చరమ సత్యం. దాన్ని బోధిస్తున్నది కనుకనే, ఈ ముద్ర పేరు చిత్+ ముద్ర=చిన్ముద్ర. అనగా చైతన్యముద్ర.

కాగా, దక్షిణామూర్తి స్వామివారు చిన్ముద్ర ద్వారా సనకాదులకు బోధించిన తత్త్వసారమేమంటే, "ఈ మొదటి మూడు వేళ్ళూ మీరు కాదయ్యా! అంటే, జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలకు మీరు అతీతులయ్యా, అట్టి మీరు సాక్షాత్తూ పరమాత్మ స్వరూపులయ్యా!" అనేదే.

ఇదంతా ఆయన నోటితో చెప్పలేదు. ఈ చిన్న చర్యతో చెప్పారు. వాళ్ళకి వెంటనే లోపల అగ్ని దీపించినట్లుగా, ఒక మహోజ్జ్వలమైన కాంతిగా, ఆ దివ్యజ్ఞానం దీపించింది.

అపుడు వాళ్ళు ఏమన్నారంటే, "ఓ దక్షిణామూర్తీ! నువ్వే పరమాత్మవు. నువ్వే గురువువు. నువ్వే నేను" అన్నారు. సమస్త వేదాంతానికి సారమైన మాటలు ఇవే.

ప్రపంచంలో ఎవరినైతే పరమాత్మ అని పిలుస్తున్నామో, "ఆ పరమాత్మ నేనే" అనే జ్ఞానం కలగాలి. ఆ పరమాత్మే మనకు ఆరాధ్యమైన గురువని తెలియాలి. ఆ జ్ఞానం ఎవరివల్ల కలిగిందంటే, ఆ ఆదిగురువైన దక్షిణామూర్తి స్వామివారి వలన. అందుచేత ఆదిశంకర భగవత్పాదులు వేదాంత గ్రంథాలన్నీ రాసే ముందర, "దక్షిణామూర్తి స్వామివారే గురువు. ఆయనే పరమాత్మ. ఆయనే నేను. మూడు వస్తువులు వేరువేరుగా లేవు" అనే అర్థాన్ని ప్రతిపాదన చేస్తూ, ఒక స్తోత్రం రచించారు.

పరమాత్మ ముందుగా ఈశ్వర రూపాన్ని స్వీకరించాడు. గురువుగా ఒక రూపం స్వీకరించాడు. అజ్ఞాని అయిన నేనుగా ఒక రూపాన్ని స్వీకరించాడు. ఉన్నది ఒకడే.

**"ఈశ్వరో గురుః ఆత్మా ఇతి మూర్తి భేదాత్ విభాగినే"**, మూర్తి అంటే ఆకారం. ఆకారంలో భేదాన్ని తనే పొందాడు. అని వారాస్తోత్రంలో నిరూపించారు.

మనం తెలుసుకోవలసిందల్లా ఏమిటయ్యా అంటే, "ఒకటే వస్తువు వుంది. అదే మూర్తి భేదాలను పొందింది" అని. ఒకే మట్టిముద్ద వుంది. అదే బాన అయింది, కుండ అయింది, మూకుడు అయింది, ముంత అయింది, అనేటటువంటి జ్ఞానం సనక సనందనాదులకు ఆ దక్షిణామూర్తి స్వామివారి దగ్గరనుంచి కలిగింది. వారి ద్వారా వ్యాసమహర్షికి, వారిద్వారా గౌడపాదాచార్యుల వారికి, వారిద్వారా గోవిందపాదాచార్యుల వారికి, వారిద్వారా శంకరభగవత్పాదస్వామివారికి, సంక్రమించింది. ఆ రోజు సనకాది మహర్షులకు ఏ స్వానుభవమైతే కలిగిందో, ఏ జ్ఞానమైతే తనంత తాను స్వామివారి అనుగ్రహంచేత దీపించిందో, ఆ అర్థాన్ని శ్రీ శంకరాచార్యులవారు పది శ్లోకాలుగా నిబంధన చేశారు. దాని పేరే – **"దక్షిణామూర్తి స్తోత్రం".**

సాంప్రదాయికులంతా వేదాంత పఠనం చేసేటప్పుడు, ఈ దక్షిణామూర్తి శ్లోకాలను ముందర పారాయణ చేసి గాని , వేదాంత శ్రవణం చేయరు.

ఆ స్తోత్రానికి ముందు సాంప్రదాయికమైన దక్షిణామూర్తి ధ్యాన శ్లోకం వొకటుంది. ఏమంటే –

**మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం యువానం**
**వర్షిష్ఠాం తే వసదృషిగణై రావృతం బ్రహ్మనిష్ఠైః ।**
**ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్ర మానందమూర్తిం**
**స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తిమీడే ॥**

ఆయన మంచి యువకుడుగా వున్నాడు. ఈ శిష్యులంతా ముసలివాళ్ళుగా వున్నారు. వీళ్ళు యుగయుగాలుగా తపస్సు చేసి కొట్టుమిట్టాడుతున్నారు. ఆయన ముదిత వదనుడై వున్నాడు. మంచి నవ్వు ముఖంతో వున్నాడు. వీళ్ళు తత్త్వం తెలియక దుఃఖాక్రాంతులై ముఖాలు చిన్నబుచ్చుకొని వున్నారు.

ఈ మహర్షులంతా ఆయన చుట్టూతా చేరి వున్నారు. వీళ్ళ హృదయాల నిండా సందేహాలు. ఆయన హృదయంలో ఏముందో వీళ్ళకి తెలియదు. వాళ్ళకు ఎన్ని సిద్ధులు వచ్చినా, ఎంత తపస్సులు చేసినా, ఎన్ని రకాల శాస్త్ర పరిచయాలు వున్నా, వాళ్ళ హృదయంలో ఆనందం లేదు. హృదయంలో లేదు కనుక ముఖంలో కూడా అది

వ్యక్తం కావటం లేదు. వాళ్ళ హృదయంలో ఇన్ని సందేహాలు, సంకటాలు వుంటే, ఆయన వ్యాఖ్యానం ఏమీ చెయ్యటం లేదు. కేవలం మౌనంతోనే వ్యాఖ్యానం చేస్తున్నాడు.

ఒక చిన్న ముద్ర చూపించాడు. అంతే! కేవలం ముద్రాప్రదర్శనచేత, మౌనం ద్వారానే, వ్యాఖ్యానం చేశాడు. "ఏమండీ! ఈ ముద్ర మీరూ చూపిస్తున్నారు. మాకు ఏమీ జ్ఞానం కలగటం లేదేమిటండీ!" అంటారేమో. ఆ ముద్రచేత ఏ దీప్తి అయితే కలగవలసివుందో, దానికి కావలసింది లోపల మనకు తయారు కాలేదు.

శేషాద్రి స్వాములవారని ఒక మహనీయుడు వుండేవాడు. ఆయన ఒక శిష్యుడి తలపైన చెయ్యిపెట్టాడు. ఏ ముహూర్తం చూసి చెయ్యి పెట్టాడో గాని, ఆ శిష్యుడు ఇక కళ్ళు తెరవలేదు. రాయి లాగా కూర్చున్నాడు. ఆయన బంధువులంతా వచ్చి "మావాడికేదో చేశావు. చేతబడి చేశావు. మావాడికి మా ధ్యాస లేకుండా పోయింది" అని గోలచేశారు.

ఆయన ఏమీ కంగారు పడలేదు. "నేనేం చేసేదయ్యా? నేను ఎక్కడికి వెళ్ళినా సరే అగ్గిపుల్ల వేసుకుంటూ వెళ్తాను. ఆ పుల్లలను మీ అందరి మీదా పారేశా. ఎవరికీ అంటుకోలేదు. అక్కడ కర్పూరం వుంది. అది అంటుకొంది. నేనేం చేసేది, ఫో" అన్నాడు. అలాగే లోపల ఆ కర్పూరాన్ని మనం తయారు చేసుకొంటే, ఆ దక్షిణామూర్తిస్వామివారు గాని, వారి అంశతో ఉద్భవించిన మహనీయులైన గురుసత్తములు గానీ, ఎవరైతే వున్నారో, వారు మనకి ఏ జ్ఞానదీప్తిని కలిగిస్తారో, అది వెంటనే అంటుకొంటుంది. అయితే, అంటుకోకపోతే ఏం చెయ్యాలి?

కర్పూరం తయారు కాలేదనటానికి వేరే నిదర్శనం అక్కర లేదు. మన నెత్తిన అగ్గిపుల్ల కాదు గదా, గ్యాస్‌పొయ్యి పెట్టినా అంటుకోదు. ఏం భయం లేదు. అందుచేత ఇప్పుడు ఏమి చెయ్యాలి?

మన హృదయాలు ఆధ్యాత్మిక విద్యను గ్రహించటానికి, తగినటువంటి పవిత్రమైన కర్పూరంగా పరివర్తన చెందటానికి, ఏ రకమైన భావన చెయ్యాలి? – అనే విషయాన్ని ఈ దక్షిణామూర్తి స్తోత్రంలో మనకు అందిస్తున్నారు.

అందుకనే ఎవరు ఎన్ని రకాల ఉపనిషద్భాష్యాలు చదవనీయండి, బ్రహ్మసూత్ర భాష్యాలు, భగవద్గీత, ప్రకరణ గ్రంథాలు చదవనీయండి, ఏం చదివినా సరే, పూర్వ సంప్రదాయంలో అందరూ కూడా ఈ దక్షిణామూర్తి స్తోత్రాన్ని వేదాంత పాఠానికి మొదటా చివరా కూడా పారాయణ చేసేవారు. అంటే దక్షిణామూర్తి స్తోత్రంతోనే వేదాంతవిద్య ప్రారంభం కావాలని ఆ సంప్రదాయం యొక్క సారాంశం అన్నమాట.

ఆ దక్షిణామూర్తి స్తోత్రాన్ని శంకర భగవత్పాదులవారు వ్రాస్తే, అనేకమంది మహనీయులు దానికి వ్యాఖ్యానం వ్రాశారు. అందరూ వ్రాసిన వ్యాఖ్యానాలు ఒక యెత్తు, సురేశ్వరాచార్యులవారు వ్రాసిన వ్యాఖ్యానం ఒక ఎత్తు.

సురేశ్వరాచార్యులవారు ఎవరో ఆయన విశేషమేమిటో తెలియాలంటే మనం ఆనాటి చారిత్రక సన్నివేశాలు కొద్దిగా తెలుసుకోవాలి. శంకరాచార్యులవారు అద్వైత విజ్ఞానాన్ని ఈ భారతదేశమంతా పంచి పెట్టటానికి సంచారం చేస్తున్న రోజులలో, "మీమాంసాశాస్త్రం" అని, ఒక శాస్త్రం బాగా ప్రచారంలో వుండేది. అది కూడా వేదాన్ని ఆధారంగా చేసుకుని తత్త్వాన్ని బోధించే శాస్త్రమే.

మీమాంసాశాస్త్రంవారు కర్మవాదులు. అంటే, "వేదోక్తమైన యజ్ఞయాగాది కర్మానుష్ఠానం ద్వారా మాత్రమే మోక్షం వస్తుంది. ప్రతివాడూ వాడికి యజ్ఞయాగాది రూపమైన ఏ విధులు వేదంలో విధింపబడివున్నాయో, వాటిని అనుష్ఠానం చెయ్యాలి తప్పితే, వట్టిగా ఈ తత్త్వశాస్త్రాలు చదివితే ఏమీ లాభం లేదు" అనేది వాళ్ళ సిద్ధాంతం.

దానికి ఆ రోజులలో కుమారిలభట్టుగారని ఒక సిద్ధపురుషుడు ప్రధాన ఆచార్యుడుగా వుండేవాడు. ఆయన దగ్గర మండనమిశ్రుడనే శిష్యుడు, ఆయనంతటి పండితుడు, వుండేవాడు. ఆ రోజుల్లో సర్వోన్నత స్థాయిలో వున్నది కుమారిల భట్టుగారు కనుక, మనం వారిని అద్వైత సిద్ధాంతపరంగా అంగీకరింప చేసినట్లయితే ఆయన శిష్యపరంపర అంతా మన వైపు చేరిపోతుందనే అభిప్రాయంతో శంకరాచార్య స్వామివారు వారి దగ్గరికి వెళ్ళారు.

వీరు వెళ్ళే సమయానికి, కుమారిలభట్టుగారు ఒక ఊక తొట్టె కట్టించుకొని, దాంట్లో నిప్పుపెట్టి, దాంట్లో కూర్చొనివున్నారు. అప్పటికి తొడలవరకు కాలిపోయివున్నారు. అట్లానే కదలకుండా వున్నారు.

ఆ సమయంలో శంకరాచార్యులవారు వెళ్ళారు. అప్పుడు శంకరాచార్యుల వారి వయస్సు 16 సంవత్సరాలు. భట్టుగారికి 90 సంవత్సరములు వయస్సు. వీరు వెళ్ళి నమస్కారం పెట్టగా "నాయనా! ఎందుకు వచ్చా" వంటే "మీతో తత్త్వవిషయం చర్చ చేయటానికి వచ్చానండీ" అన్నారు. శ్రీభట్టుగారు దివ్యజ్ఞాన సంపన్నుడు కనుక "నీవు సాక్షాత్తు శంకరుడియొక్క అవతారానివయ్యా! నీతో మాట్లాడటం అదృష్టమే గానీ, ప్రస్తుతం ఈ పరిస్థితిలో వున్నాను. నీతో మాట్లాడే ఓపిక నాకు లేదు" అన్నాడు. అంటే "ఈ పరిస్థితిలో మీరెందుకు వున్నారు?" అని శంకరులు అడిగారు.

"జీవితంలో ఒక చిన్న తప్పు చేశాను. కావాలనే చేశాను. దానికి ప్రాయశ్చిత్తం చేసుకొంటున్నాను" అన్నారు భట్టుగారు.

ఆయన చేసిన తప్పు ఏమిటయ్యా అంటే, ఆ రోజుల్లో బౌద్ధులు వుండేవారు. వాళ్ళంతా కూడా వేదం అప్రమాణమని గట్టిగా వాదించేవారు. అయితే అప్పటికి బుద్ధుడు పోయాడు. బుద్ధుడి తరువాత బౌద్ధ మతం చాలా వెఱ్ఱి తలలు వేసింది. ఆ తరుణంలో, వాళ్ళయొక్క సిద్ధాంతం ఏమిటో, బయటికి చెప్పేవాళ్ళు కాదు. రహస్యంగా వాళ్ళకి నమ్మినబంట్లు అయిన శిష్యులకే పాఠాలు చెప్పేవారు. తక్కిన వాళ్ళందరికీ మహత్తులు చేసి చూపించేవారు. ఈ ప్రజలంతా ఆ మహత్తులను చూసి, ఆకర్షితులై వెళ్ళాల్సిందే తప్పితే, వాళ్ళ సిద్ధాంతమేమిటో బయట పెట్టరు. బయట పెడితే వాదంలో ఓడిపోతుందని భయం. వాళ్ళ వాదం ఏమిటో తెలుసుకుంటే గాని దాన్ని ఖండించేందుకు వీలు లేదు. అందుకోసం కుమారిలభట్టుగారు ఏం చేశారంటే, 10, 15 సంవత్సరముల చిన్నవయస్సులో వుండగా, తాను కూడా ఒక బౌద్ధయువకుడిగా వేషం వేసుకొని, బుద్ధుడి మీద తనకు భక్తి వుందని చెప్పుకుంటూ, ఆ గురువుల దగ్గరకు వెళ్ళి, మీ శాస్త్రం చెప్పవలసిందని ప్రార్థించాడు.

వాళ్ళు కొన్ని పరీక్షలు పెట్టి ఇతడు చాలా నిలకడైన కుర్రవాడు, తెలివైనవాడు అని గ్రహించి, ఆ బౌద్ధపాఠాలన్నీ ఈయనకు చెప్పారు. ఆ చెపుతుండగా చివరిస్థాయి దగ్గరకు వచ్చేసరికి, వాళ్ళు సూటిగా పరమాత్మను నిందించటం మొదలు పెట్టారు. ఈ కుర్రవాడిది వేడి రక్తం కదా, వాళ్ళు పరమాత్మను నిందిస్తుంటే, తట్టుకోలేక కళ్ళలో నీళ్ళు పెట్టుకొన్నాడు.

"ఏమిట్రా, పరమాత్మని నిందిస్తుంటే వీడు కళ్ళంబడి నీళ్ళు పెట్టుకున్నాడు?" అని ఆరా తీసి, ఆ గురువులు వీణ్ణి అక్కడనుంచి వెళ్ళగొట్టేశారు. అప్పటికే వాళ్ళ శాస్త్రాలు అన్నీ వచ్చేశాయి. కనుక ఈయనకి బాధ ఏమీ లేదు. ఆ తరువాత కాలంలో ఆయన ఆ బౌద్ధుల వాదాలన్నీ ముక్కలు ముక్కలుగా ఖండన చేసిపారేశాడు. మీమాంసా సిద్ధాంతం ప్రచారం చేశాడు. ఆ ప్రచారం చేస్తున్న రోజుల్లో, అక్కడి రాజు "ఏమయ్యా! నాకు ఈ వాదాలు, గీదాలు, తెలియవు. నాకు నిదర్శనం కావాలి" అన్నాడు.

ఆ రాజుయొక్క సభాభవనం పెద్ద కొండమీద వుంది. ఈ కుమారిలభట్టువారు "వేదములు కనుక ప్రమాణములైతే నాకు ఏమీ దెబ్బ తగలకుండుగాక" అని కొండమీంచి కిందికి దూకేశారు. ఏమీ దెబ్బ తగలలేదు కానీ, కాలియొక్క చిటికెన

వేలు కొంచెం బెణికిందట! సరే, అది ఎవరికీ తెలియలేదు. సభలో దిగ్విజయం పొందాడు. మీమాంసా శాస్త్రం కాస్తా విస్తారం అయిపోయింది.

ఆ తరువాత ఈయనకి చాలా దుఃఖం వచ్చింది. "ఏమిటి? వేదములు ప్రమాణములని సర్వశాస్త్రములు ఘోషిస్తూవుంటే, ఆ విషయం చెప్పి కొండమీంచి నేను దూకితే, నాకు వేలు ఎందుకు బెణకాలి? అది లెక్కలో విషయం కాదు గానీ, ఆ మాత్రం దెబ్బ ఎందుకు తగలాలి నాకు?" అని గురువుగారి దగ్గరికి వెళ్ళి అడిగాడు.

ఆయన "నాయనా! నీవు చాలా తప్పు చేశావు. వేదములు ప్రమాణములైతే నాకు దెబ్బ తగలకుండుగాక – అని వేదములు మీద ఒక పరీక్ష పెట్టావు. వేదములు ప్రమాణములే, నాకు దెబ్బ తగలదు అనాలి నువ్వు. వేదములు ప్రమాణములైతే దెబ్బ తగలకుండుగాక, కాకపోతే దెబ్బ తగులుగాక అని రెండు అవకాశాలు పెట్టావు. దానివల్ల వేదాలను కొంచెం అవమానం చేశావు నువ్వు. అందుకోసమే నీకు చిన్న దెబ్బ తగిలింది. లేకపోతే తగిలివుండేది కాదు. అది కేవలం నీవు చేసిన పొరపాటును చూపించటానికే! సరి దిద్దుకో" అని చెప్పారు.

అందుచేత కుమారిలభట్టువారు శంకరులవారికి ఏం చెప్పారంటే, "జీవితంలో నేను రెండు పొరపాట్లు చేశాను. ఒకటి గురువులకు ద్రోహం చేసి, అబద్ధం చెప్పి, విద్య చదువుకున్నాను. రెండు వేదములు ప్రమాణములనే విషయంలో కొంచెం పొరపాటు మాట మాట్లాడాను. అందుచేత ఈ రెండు దోషాలూ నాకున్నాయి. దీనికి ప్రాయశ్చిత్త మేమిటా అని విచారిస్తే, ఊక అగ్నిలో నన్ను నేను హోమం చేసుకోవటం కంటే వేరే మార్గం కనిపించలేదు. అందుచేత ఈ శరీరాన్ని నా అంతట నేనే దహనం చేస్తున్నాను. నడుము దాకా కాలింది ఇప్పుడు. కేవలం నా యోగశక్తితో నిలబడివున్నాను తప్పితే, నిలబడే పరిస్థితి కాదు. ఇప్పుడు నీతో వాదన చేసే ఓపిక లేదు. నా శిష్యుడు మండనమిశ్రుడని ఒకాయన వున్నాడు. ఆయన నర్మదాతీరంలో వున్నాడు. ఆయనతో మాట్లాడు. ఆయనతో మాట్లాడితే నాతో మాట్లాడినట్లే" అని చెప్పారు. శంకరాచార్యుల వారు మండనమిశ్రుడి దగ్గరికి వెళ్ళారు.

వెళ్ళే సరికి అక్కడ వీరికి ఏమి అర్థమయిందంటే, ఆ మండనమిశ్రుడు బ్రహ్మదేవుడి అంశతో పుట్టాడు. ఆయన భార్య ఉభయభారతీదేవి. ఆమె సరస్వతీదేవి అంశతో పుట్టింది. వాళ్ళిద్దరూ కూడా మీమాంసాశాస్త్రాన్ని, కర్మ సిద్ధాంతాన్నీ, భారతదేశంలో బాగా ప్రచారంచేస్తూ, వారు స్వయంగా యజ్ఞయాగాది అనుష్ఠానాలు చేస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ మహా పండితులు. శంకరులు వాళ్ళ దగ్గరికి వెళ్ళి

వాదన చేస్తానన్నారు. ఆ మండనమిశ్రుడు కొంచెం కోపిష్ఠి మనిషి. ఈయన కుర్రవాడు. ఆయన బాగా 70, 80 ఏళ్ళు కలవాడు.

ఈ 15-20 ఏళ్ళ కుర్రవాడు వచ్చి వాదన చెస్తాననేటప్పటికి ఆయనకు బాగా కోపం వచ్చింది. సరే పట్టుపడుతుంటే, వాదన చెయ్యాలి గదా! అయితే ఇద్దరికీ మధ్య పెద్ద మనిషిగా కూర్చోదగిన పెద్ద మనిషి గురించి విచారించారు వారిద్దరూ. ఆ చుట్టు పక్కల పండితులందరూ మావల్ల కాదంటే, మావల్ల కాదని జారుకొన్నారు. ఆ రోజుల్లో శంకరాచార్యులవారి గురించి ఎవరికీ అంతగా తెలియదు. మండనమిశ్రులవారు బాగా ప్రసిద్ధులు. వారు వాదన చేస్తుంటే న్యాయనిర్ణేతగా వుండడానికి ఎవరికీ ధైర్యం చాలటం లేదు. చివరికి మండనమిశ్రుడే ఒక మాట అన్నాడు. "నీకేమీ అభ్యంతరం లేకపోతే మా ఆవిడ మంచి పండితురాలు. ఆవిడైతే కూర్చోగలదు" అన్నారాయన. వెంటనే "నేను ఒప్పుకుంటాను" అన్నారు శంకరాచార్యులవారు.

ఆ ఉభయభారతీదేవిని మధ్యలో న్యాయ నిర్ణేత్రిగా పెట్టుకొని, ఇరువురూ వాదన ప్రారంభించారు. ఆవిడ "మీ వాదాలు బాగానే వున్నాయి గాని, ఇంటికి యతీశ్వరుడు వచ్చాడు. ఆయనకు వండిపెట్టాల్సిన బాధ్యత వుంది. మీ వాదాలు వింటుంటే ఇంట్లో పనులు ఎలా అవుతాయి? అందుచేత ఒక పని చేస్తాను. ఇద్దరి మెడలలో చెరో పుష్పమాల వేస్తాను. మీరు వాదిస్తూ వుండండి. ఎవరి మాల వాడిపోతే వారు ఓడిపోయినట్లు" అని చెప్పింది. సరే అన్నారు ఇద్దరూ. మాలలు వేసుకొని కూర్చొన్నారు. వరుసగా 7 రోజుల పైన వాగ్వాదం జరిగింది. ఆ ఏడు రోజులలోనూ ఒక్క సంధ్యావందనానికి, భోజనానికి మాత్రమే వాదన ఆపేవారట. తక్కిన కర్మలన్నీ పక్కన పెట్టేశారు. ఆ చుట్టు పక్కల వుండేవారు అంతా సభదీరి కూర్చొని వినేవారు. ఇద్దరూ అద్భుతమైన ప్రజ్ఞతో వాదన చేశారు. ఎనిమిదో రోజు వచ్చేసరికి మండనమిశ్రుడి మెడలోని మాల వాడింది. అది ఆయన గమనించుకోలేదు. ఆయన మంచి ధాటిగా వాదనచేస్తున్నాడు కానీ, వాదనలో పట్టు తప్పిపోయింది.

అంతకు ముందు, రోజూ భోజనానికి పిల్చేటప్పుడు ఉభయభారతీదేవి స్వాములవారికి దండం పెట్టి 'స్వామీ! భిక్షకు రండి' అని పిల్చేది. 'ఏమండీ! భోజనానికి రండి' అని భర్తను పిల్చేది.

ఆ రోజు ఇద్దరికీ నమస్కారం చేసి "ఇద్దరూ భిక్షకురండి" అన్నదట. ఎందుకు అలా అంది అంటే, వీళ్ళు ఒక పందెం వేసుకున్నారు. శంకరాచార్యులు ఓడిపోతే

ఆయన ఈ మండనమిశ్రుడు చెప్పిన పిల్లను పెళ్ళి చేసుకొని, యజ్ఞం చేయాలి. మండనమిశ్రుడు కనుక ఓడిపోతే ఆయన వెంటనే గుండు గొరిగించుకొని, ఎర్రబట్టలు కట్టుకొని, సన్న్యాసం పుచ్చుకోవాలి. ఇది వాళ్ళ పందెం. ఈవిడ ఇచ్చిన తీర్పు "ఇద్దరూ కూడా భిక్షకు రావల్సింది" అనే మాట. భార్య నోట ఆ మాట విని ఏమిటా అని చూసుకొనేటప్పటికి, మండనమిశ్రుడి మెడలో మాల కాస్తా వాడిపోయి వుంది.

ఆ రోజుల్లో తత్త్వనిష్ఠ ఎలా వుండేదంటే, పరాజితులమని నిశ్చయమైన తరువాత ఇక కుస్తీ పట్టటంవుండేది కాదు. "అప్పుడైతే వోడిపోయాను గానీ, మా సంప్రదాయం ఇంతే, మా వాళ్ళు ఇలా చేశారు." అని అలాంటి మాటలు ఆ రోజులలో లేవు.

ఎప్పుడైతే తన మాల వాడిపోయిందో మండనమిశ్రుడు సంన్యాసానికి అంగీకరించాడు. శంకరులు ఆయనకు సంన్యాసం ఇచ్చి సురేశ్వరాచార్యులవారు అని పేరు పెట్టారు. తరువాతి కాలంలో వారిని శృంగేరీ పీఠానికి అధ్యక్షులుగా చేశారు. ఈ సురేశ్వరాచార్యులవారిని వెంట పెట్టుకొని శంకరాచార్యులవారు దేశమంతటా చాలా చోట్ల తిరిగారు.

శంకరాచార్యులవారి వెంట వుండే శిష్యవర్గానికి ఈ కొత్త పండితుడిమీద కొంచెం కన్నెఱ్ఱ వుండేది. ఎందుకంటే తక్కిన వాళ్ళందరికన్నా ఈయన పెద్ద పండితుడు. వాళ్ళెవరూ ఈయనతో తట్టుకోలేరు. వాళ్ళకి ఈయన నిజంగా పరిపూర్ణంగా సంన్యాసం పుచ్చుకొన్నాడని విశ్వాసం లేదు. ఆచార్యస్వామివారికి మాత్రం ఈయన పరిపూర్ణంగా సంన్యాసం పుచ్చుకొన్నాడని తెలుసు. ఎందుకంటే ఆయనకు దివ్యదృష్టి వుంది గనుక, వీరిమీద అపారమైన విశ్వాసం వుండేది.

శంకరాచార్యులవారు తన జీవితకాలంలోనే తను వ్రాసిన గ్రంథాల మీద వ్యాఖ్యానాలను వ్రాయించాలని నిర్ణయం చేసుకొన్నారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క గ్రంథం ఇచ్చారు. అందరికీ ఇచ్చేటప్పుడు ఈ సురేశ్వరాచార్యులవారికి కూడా ఒక గ్రంథం ఇద్దామనుకొన్నారు. కానీ, సీనియర్ శిష్యులు శంకరాచార్య స్వామివారితో "స్వామీ! మీరు తొందరపడుతున్నారు. ఆయన ఏదో పందెంకట్టాడు గనుక, ఆ పందెంలో ఓడిపోయాడు గనుక, గతి లేక సంన్యాసం పుచ్చుకొన్నాడు తప్పితే, నిజంగా ఆయన పరివర్తన చెందినవాడు కాదు. మీ గ్రంథానికి వ్యాఖ్యానం రాయమని ఆయనకిస్తే, ఆయన తప్పుడు వ్యాఖ్యానాలు వ్రాసి మనకు చాలా అప్రతిష్ఠ కలిగిస్తాడు" అని చెప్పారు.

ఆచార్యస్వామివారి దగ్గర వచ్చిన చిక్కు ఏమిటంటే, వారికంటే వారి శిష్యులందరూ కనీసం 2 రెట్లు ఎక్కువ వయస్సులో వుండేవారు. ఈయన 30 సంవత్సరాల లోపు వయస్సు కలవారు. వాళ్ళంతా 70, 80, ఏళ్ళు దాటిన వయసుగలవాళ్ళు. లోకానుభవం, పాండిత్యం గలవాళ్ళుగా వుండేవారు. ఈయనేమో కుర్రవాడుగా వుండేవారు.

అందుచేత వారు తమ శిష్యులతో ఇలా అన్నారు. "అయ్యా! మీరంతా పెద్దలు. మీరు చెప్పిన మాట ఎప్పుడూ కాదనను. కానీ ఆయన తత్త్వం మీకు తెలియదు. మీరు వద్దన్నారు గనుక, ఆయనకి నేను వ్యాఖ్యాన గ్రంథం ఇవ్వను. కానీ ఆయన శక్తి మీకు తెలియాలి కనుక, ఒక పని చేస్తాను" అని ఆయనని పిలిచారు.

"ఏమండీ! అందరూ తలో గ్రంథం వ్రాస్తున్నారు. మీరు కూడ అద్వైత సిద్ధాంతం గురించి, స్వతంత్రంగా ఒక గ్రంథం వ్రాస్తే బావుంటుంది." అన్నారు శంకరాచార్యులవారు. సురేశ్వరాచార్యులవారు అప్పుడు 'నైష్కర్మ్యసిద్ధి' అనే పేరుతో ఒక గ్రంథం వ్రాశారు.

ఇప్పటికి కూడా నైష్కర్మ్యసిద్ధి అనే గ్రంథం అద్వైత సిద్ధాంత గ్రంథాలలో చాలా శిఖరాయమాణమైన గ్రంథము. పెద్దలంతా పాఠం చదువుతారు.

అది రచించిన తరువాత మిగిలిన శిష్యులంతా కూడా అటువంటి స్థాయిలో అద్వైత సిద్ధాంతాన్ని నిలబెట్టే గ్రంథం మరొకటి లేదని, తమ తప్పును తామే అంగీకరించారు.

అటువంటి సురేశ్వరాచార్యులవారు శంకరాచార్యుల వారు వ్రాసిన ఈ దక్షిణామూర్తి స్తోత్రం మీద "మానసోల్లాసము" అనే పేరుతో ఒక వ్యాఖ్యానం వ్రాశారు. శ్లోకాలలోనే వ్యాఖ్యానం. మామూలుగా అనేక చోట్ల మీలో అద్వైత వేదాంత పరిచయం వున్నవాళ్ళు ఈ దక్షిణామూర్తి స్తోత్రం వినే వుంటారు గానీ, ఈ మానసోల్లాస వ్యాఖ్యానం పేరు ఎక్కువమంది వినరు. ఈ మానసోల్లాస వ్యాఖ్యలో ఒక్కొక్క శ్లోకము శంకరులు ఎందుకు తీసుకొన్నారు? ఒక్కొక్క శ్లోకంలో ఏయే పూర్వపక్షాలను ఖండించి, అద్వైత సిద్ధాంతాన్ని స్థాపిస్తున్నారు? ఒక శ్లోకం తర్వాత ఒక శ్లోకానికి మెట్లు ఎట్లా పెట్టారు. 9 మెట్లతో అద్వైత సిద్ధాంతాన్ని మొత్తాన్ని ఆచార్యస్వామివారు ఎలా ప్రతిపాదించారు? అనే విషయాల్ని అద్భుతమైన ప్రజ్ఞతో నిరూపణ చేశారు.

ఆ మానసోల్లాస వ్యాఖ్యానం సురేశ్వరాచార్యులవారు వ్రాయబట్టే నిజంగా ఈ దక్షిణామూర్తి స్తోత్రంయొక్క మాహాత్మ్యం తెలుస్తున్నది. 'దీంట్లో ప్రతిపదానికీ ఇంతింత

అర్థం వుంది, ఈ పదం ద్వారా అన్ని మతాలను శంకరాచార్యులవారు పరామర్శ చేస్తున్నారు, ఈ వాక్యం ద్వారా ఈ మతాలని ఖండిస్తున్నారు, ఈ వాక్యంద్వారా ఆ రకమైన సాధన మార్గాన్ని వారు ప్రతిపాదన చేస్తున్నారు' – అనే విషయాలను అందరికంటే కూడా ఆద్యంగా, స్పష్టంగా నిరూపణచేసినవారు సురేశ్వరాచార్యులవారే. వారికి కూడా పాదవందనం చేస్తూ, ఆ మానసోల్లాసం కూడా గ్రహిస్తూ, మనం దక్షిణామూర్తి స్తోత్రంలోకి ప్రవేశిద్దాం.

**విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం**
**పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా।**
**యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥**

(తాత్పర్యం: ప్రతివాడికీ ఈ ప్రపంచం అంతా – అద్దంలో కనిపించే నగరం లాగా తనలోనే వుంది. కానీ నిద్రవల్ల తనలోనే కనిపించే స్వప్న ప్రపంచాన్ని తనకంటే బయట వున్నట్లుగా చూసిన విధంగా, ప్రతివాడూ యీ ప్రపంచాన్ని తనకంటే బయట ఉద్భవించినదాని లాగా, మాయాప్రభావంవల్ల, చూస్తున్నాడు. అలా చూసేవాడు మేల్కొన్న వెంటనే అద్వితీయంగా వున్న తనను (స్వాత్మను) మాత్రమే ప్రత్యక్షంగా దర్శిస్తున్నాడు. ఆ స్వాత్మయే గురుస్వరూపి అయిన దక్షిణామూర్తి. ఆయనకు ఈ నమస్కారము చెందుగాక.)

మూడు మూర్తులు వున్నాయి. ఆ మూర్తులు ఒకే మూర్తిలోంచి వచ్చినాయి. ఒక మూర్తి పేరు ఈశ్వరుడు, ఒక మూర్తి పేరు గురువు, ఒక మూర్తి పేరు ప్రతివాడూ నేను నేను అనుకొనే జీవుడు.

ఈ శ్లోకంలో ఏం చెపుతున్నారు? "గురుమూర్తయే దక్షిణామూర్తయే నమః" గురుమూర్తి అయిన దక్షిణామూర్తికి నమస్కారం చేస్తున్నాను– అంటున్నారు. దక్షిణామూర్తి అంటే ఈశ్వరుడు. గురుమూర్తి అంటే మనకు యెవరైతే తత్త్వబోధ చేస్తున్నారో వారు. ఈ మూర్తులకు ఇద్దరికీ భేదం లేదు. అయితే "నువ్వు" వున్నావుగా?

"నేను నమస్కారం చేస్తున్నా"నన్నట్లయితే "నువ్వు" వేరుగా వున్నట్లేగా? వారిద్దరు మాత్రం ఒకటైతే అవచ్చుగాక. ఐతే ఏమి? కాకపోతే ఏమి? నువ్వెవరివి? నీకొచ్చిన లాభమేమిటి? – అనేది ప్రశ్న.

"ఆయన సింహాసనంలో కూర్చున్నారు. నేను నేలమీద కూర్చొని నమస్కారం పెడుతున్నాను" అంటే భేదం చెపుతూనే వున్నావుగా. 'ఈశ్వరో గురు రాత్మేతి" ఆ

ముగ్గురూ ఒకటే అని ఎలా అంటావయ్యా? అంటే, "నమః" అనే పదానికి మనం మామూలు అర్థం తీసుకొంటే, ఈ చిక్కు వస్తుంది.

"నమ ప్రహ్వీ భావే" దానికంటే భిన్నంగా నేను లేను అనే భావంతో ఐక్యానుభవాన్ని పొందటం పేరే నమస్కారం– అని ఉపనిషద్వేత్తలు వివరించారు.

నమస్కారం అంటే రెండు చేతులు జోడించి, తల వొంచి మనం నమస్కారం చేస్తూవుంటాం. ఈ నమస్కారం చేయటానికి మామూలుగా అర్థం ఏమిటంటే, తల వొంచటంచేత "నీవు ఉన్నతుడవు, నేను అల్పుడను"– అనే విషయం నేను గుర్తించాననీ, రెండు చేతులూ జోడించటంచేత నా హృదయమనే పద్మాన్ని నీకు సమర్పిస్తున్నాననీ, ఇంత వరకూ మామూలు అర్థం. తత్త్వవేత్తలు చెప్పే అర్థం మరోటి వుంది. ఈ రెండు చేతులలో ఒకటి జీవాత్మ, మరొకటి పరమాత్మ, ఈ రెండూ దగ్గరికి చేరితే ఒకటే అయిపోతాయి. రెండు చేతులుగా వుండవు, ఒకే ముద్రగా అవుతాయి– అని. ఇదే ఐక్యానుసంధానం.

కనుక "నమః" అని మనం ఎప్పుడు నమస్కారం చేస్తున్నామో, అప్పుడు ఐక్యానుసంధానం కూడా మనం చేస్తున్నాము. ఈ ఐక్యానుసంధాన రూపమైన నమస్కారాన్నే ఈ దక్షిణామూర్తి స్తోత్రంలో చెపుతున్నారు తప్పితే, తలవొంచి, నీ యొక్క దాసుణ్ణి నేను, నువ్వు నన్ను అనుగ్రహించు, వేరే వరాలు ఇవ్వు, అని ప్రార్థించే నమస్కారం ఇక్కడ చేయటం లేదు. కనుకనే "తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే" అంటూ "నమః ఇదం" ఈ నమస్కారము అని ప్రత్యేకంగా చెపుతున్నారు.

"ఈ నమస్కారం" అంటే ఏదైతే ఆత్మానుసంధాన రూపమైనటువంటి, ఆ గురువునందు ఏకత్వాన్ని పొందేటటువంటి, నమస్కారం వుందో, ఆ నమస్కారాన్ని గురువుకి సమర్పిస్తున్నాను. ఎటువంటి గురువుకి? ఈశ్వర రూపంగా వున్న గురువుకి.

ఈశ్వరాభిన్న రూపంగా గురువును అనుసంధానం చేసి, ఆ ఈశ్వరాభిన్నుడైన గురువుతో నాకు ఏకత్వాన్ని అనుసంధానం చేస్తున్నాను అని చెపుతున్నారు. ఈశ్వరుడు ఒకడున్నాడు. గురువు ఒకడున్నాడు. ఆ గురువేమో ఈశ్వరరూపంతో తాదాత్మ్యం పొందాడు. గురువు తాదాత్మ్యం పొందిన ఈశ్వరుడిలో నేను కూడా తాదాత్మ్యం పొందుతున్నాను. ఇన్ని మెలికలు ఎందుకు? అంటే, –

"నాద్వైతం గురుణా సహ" అని వుంది. ఎన్ని రకాల అద్వైత ఉపన్యాసాలు చెప్పినా సరే, పొరపాటున కలలో కూడా, గురువుతో నేను సమానం అనుకోకూడదు.

అది ఏ శాస్త్రమూ అంగీకరించదు. గురువు ఉపదేష్టగా వుండి మనకు జ్ఞానం ప్రసాదిస్తున్నంత కాలమూ, జ్ఞానసిద్ధి ఇంకా లభించకుండా, ఇంకా జ్ఞానం కోసం ప్రార్థన చేస్తున్నంతకాలమూ, గురువు గురువే, శిష్యుడు శిష్యుడే. నీకు ఎంత శక్తి వచ్చినా గురువుకు, నీకు అద్వైతం కుదరదు.

గురువుతో అద్వైతం కుదరదని ధర్మశాస్త్రం ప్రకారం చెబుతారు, "ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేదాత్ విభాగినే" అని ఈశ్వరుడూ ఒకటే, గురువూ ఒకటే, జీవుడైన నువ్వూ ఒకటే- అని తత్త్వశాస్త్రంప్రకారం చెపుతున్నారు. ఈ రెండూ ఎట్లా కుదురుతాయి? అంటే, తత్త్వస్థితిలో అది సత్యమే అయినప్పటికినీ, సాధన స్థితిలో "నేను గురువుతో తాదాత్మ్యాన్ని పొందుతున్నాను. ఈ గురువుని నేనే గనుక నమస్కారం చెయ్యనక్కర లేదు. గురువుకు నేను ప్రార్థన చెయ్యక్కర్లేదు" అని ఎవరన్నా అన్నట్లయితే, వాడికి అద్వైతం కాదు గదా ఏ రకమైన జ్ఞానమూ రాదు. అభేదాన్ని ఎప్పుడూ కూడా ఈశ్వరుడితో అనుసంధానం చేయాలి. అభేదజ్ఞానాన్ని గురువు ద్వారా సంపాదించాలి. గురువు ద్వారా సంపాదించిన అభేదజ్ఞానాన్ని ఎవరి మీద ప్రయోగించాలంటే, ఈశ్వరుడి మీద ప్రయోగించాలి. ఆ ఈశ్వరుడికి ఈ ప్రకరణంలో పెట్టిన పేరు దక్షిణామూర్తి.

ఈ అభేదజ్ఞానం గురువు దగ్గరనుంచి ఏమని సంపాదిస్తున్నాము? "ఈశ్వరుడే ఈ ప్రపంచమంతా విస్తరించి వున్నాడు". అని సంపాదిస్తున్నాము. అంటే జీవుడనే రూపంలో కూడా ఈశ్వరుడే వచ్చివున్నాడని చెపుతున్నాం. ఈ జ్ఞానం గురువు ద్వారా వచ్చింది కనుక, ఆ గురువును ముందుగా ఈశ్వరుడి యందు లయంచేసి, అట్టి ఈశ్వరునిలో శిష్యుడు తాదాత్మ్యాన్ని భావన చేయాలి తప్పితే, ఈశ్వరుడిని దూరంగా పెట్టి, సాక్షాత్తుగా గురువులోనే తాదాత్మ్యభావన చేసినట్లయితే, ఆ గురువు మీద వుండే గురుభక్తి భిన్నమైపోతుంది. గురుభక్తి భిన్నమైతే వచ్చిన నష్టమేమిటి? తత్త్వం వస్తోంది కదా! అంటే, తత్త్వం రాదు. ఇందాక ఉపనిషత్తు మంత్రంలో

**యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ।**
**తస్యైతే కథితాహ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః ॥** - అనిచెప్పారు కదా!

అంటే ఈశ్వరుడియందు భక్తి వుండాలి. ఈశ్వరుడియందు ఎటువంటి నిర్మలమైన, నిష్కామమైన, భక్తి వున్నదో అటువంటి భక్తే సాక్షాత్తుగా గురువు మీద వుండాలి. అటువంటివారికి మాత్రమే ఈ ఉపనిషత్తులో బోధింపబడిన అర్థాలు హృదయంలో స్వయంగా ప్రకాశిస్తాయి- అని చెప్పారు.

తక్కినవారికి మాత్రం (అనగా గురువునందు, దేవుడియందు భక్తి లేనివారికి మాత్రం) ఉపనిషత్తులలోని విషయాలు కేవలం పురాణ శ్రవణంగా వుంటాయని చెప్పుకున్నాం. ప్రకాశించటం అంటే ఇందాక వివరించుకొన్నాం. వేదాంతార్థములు, అనగా, ఉపనిషత్తులలో చెప్పిన తత్త్వార్థములు, ప్రకాశించాలి అంటే, రెండు షరతులు– ఒకటి గురుభక్తి వుండాలి. రెండు ఈశ్వరభక్తి వుండాలి, నువ్వు గురువుతోనే తాదాత్మ్యాన్ని ముందరగా భావనచేసి, గురుభక్తిని పోగొట్టుకున్నట్లయితే, ఒక షరతు ఎగిరిపోయింది. అందువల్ల నీకు తత్త్వార్థజ్ఞానం ఎప్పటికీ స్ఫురించనే స్ఫురించదు. తత్త్వార్థజ్ఞానం ఎప్పుడైనా సరే, గురుభక్తిచేత దానంతటదే స్ఫురించాలి తప్పితే నీ కృషితో వచ్చేది కాదు.

ఈ విషయం దక్షిణామూర్తిస్వామివారియొక్క అవిర్భావ ఘట్టంలోనే మనకు తెలిసింది. దక్షిణామూర్తిస్వామివారు తనయొక్క చిన్ముద్రా ప్రదర్శన ద్వారా సనక సనందాదుల హృదయంలో అగ్నిని దీపింప జేయటంవల్ల వాళ్ళకు తత్త్వార్థదీప్తి కలిగింది. ఆ తత్త్వార్థదీప్తివల్ల "అహం బ్రహ్మాస్మి, నేనే బ్రహ్మను, నేనే పరమేశ్వరుణ్ణి," అనే జ్ఞానం కలిగింది. అది ఆ గురువుయొక్క అనుగ్రహం ద్వారానే, ఆ పరమేశ్వరుడియొక్క అనుగ్రహం ద్వారానే, వస్తుంది తప్పితే, స్వంత కృషిచేత రాదు.

**"ఈశ్వరానుగ్రహాదేవ పుంసా మద్వైతవాసనా"** అని కూడా ఒక శ్లోకం వుంది. ఈశ్వరానుగ్రహం వుండాలి. ఈశ్వరానుగ్రహానికి మూలభూతమైనది గుర్వనుగ్రహం. కనుక, గురుభక్తిని చెడగొట్టుకొనే అనుసంధానం ఎవడైనా తొందరపడి చేసినట్లైతే, వాడికి ఏ రకమైన తత్త్వార్థస్ఫూర్తీ సంభవించదు. కనుక ఈ దక్షిణామూర్తి స్తోత్రంలో ఆచార్యస్వాములవారు మనకు ఏమి ఉపదేశిస్తున్నారంటే, గురువును పరమేశ్వరుడుగా, అంటే పరమాత్మగా, మన ఇష్ట దైవం ఎవరైతే వున్నారో ఆ రూపంగా, ముందర భావన చేసి, ఆ తరువాత ఆ రూపం నేనే అనే భావన చెయ్యాలి అని చెపుతున్నారు. ఉపనిషన్మంత్రంలో కూడా "ఓ దేవతా! నువ్వే నేను. నేనే నువ్వు" అని భావన చేసి ఉపాసన చెయ్యాలని వుంది "అహం వై త్వమసి భగవో దేవతే! త్వం వా అహమస్మి భగవో దేవతే!" అని మంత్రం. ఏ దేవతనైతే ఉపాసన చేస్తున్నామో, ఆ దేవతను "నీవు నాకు వరాలియ్యి, డబ్బులియ్యి, ఐశ్వర్యాలియ్యి, పదవులియ్యి" అని కోరుతుంటే అది ఉపాసన కానే కాదు. ఏమని ఉపాసనచెయ్యాలి? "ఓ దేవతా! నువ్వే నేను" అని ఉపాసన చెయ్యాలి. "త్వం వా అహమస్మి భగవో దేవతే" అంటే మహిమాన్వితమైనటువంటి ఓ దేవతా! నువ్వే నేను. అక్కడితో ఊరుకోలా. "అహం

వై త్వమసి" "నేనే నువ్వు" అని రెండు ప్రక్కలా చెప్పేశారు. ఏ మాత్రము భేదం లేదని చెప్పడం కోసం అలా చెప్పారు. అందుకే రుద్రాభిషేకం చేసేటప్పుడు కూడా "నారుద్రో రుద్ర మర్చయేత్" అని చెప్పారు. శివుడికి అభిషేకం చేస్తుంటే "నేనే శివుణ్ణి" అనుకొని అభిషేకంచెయ్యాలి. అలాగే విష్ణువుకి పూజ చేస్తుంటే "అహం విష్ణుః" అనుకుంటూ చేయాలి. అలాగే అమ్మవారిని అర్చిస్తున్నప్పుడు "అహ మిత్యేవ విభావయే భవానీం" అని భావన చెయ్యాలి. అమ్మవారికి శ్రీ చక్రార్చన గాని, లలితా సహస్రనామార్చన గానీ, చేసేటప్పుడు, "అమ్మా నాకు ఐశ్వర్యం ఇవ్వవలసింది. ఇంకేదో ఇవ్వవలసింది" అని కోరకూడదు. కోరితే అవిగూడా వస్తాయి. కాదనటం లేదు. కోరకుండా చేసే ఉపాసనే గొప్పది. కోరకుండా చేసే ఉపాసన ఎట్లా చెయ్యాలి. ఈ విధంగా ఆ దేవతతో అభేదానుసంధాన రూపంగా చెయ్యాలి. సాక్షాత్తుగా గురువుతో అభేదానుసంధానం మాత్రం చెయ్యకూడదు. అందుకోసంగాను మెలికలు బెట్టి "దక్షిణామూర్తి స్వరూపి అయినటువంటి గురుదేవునకు ఈ నమస్కారాన్ని నేను సమర్పిస్తున్నాను"- అని వారు మకుటంగా పెట్టారు. అంటే ఇది ప్రతిశ్లోకంలోనూ చివరి పాదంగా వస్తుందన్నమాట.

సరే, నీవు ఎవరితో అభేదానుసంధానం సాధిస్తున్నావంటే, ఈశ్వర రూపాన్ని పొందివున్నటువంటి గురువుతో! అంటే ఈశ్వరుడు, గురువు అనే రెండు వస్తువులు లేవు. కాగా ఇప్పటికి మనకి వస్తువులు ఏం మిగిలినాయి? ఈశ్వరుడు, నేను అని రెండు మిగిలాయి. "మరి నేను ఎవరు"?- అని మన ప్రశ్న. దానికి సమాధానం ప్రారంభిస్తున్నారు. ఏమని?

**విశ్వం దర్పణదృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం .....** అని

ప్రపంచంలో ప్రతివాడికి "నేను ఎవరు" అనే ప్రశ్న ఎందుకొస్తుంది? హాయిగా ఆరోగ్యంగా వుండి, చేతినిండా డబ్బులుండి, పిల్లా, పాపా సుఖంగా వుండి, అన్నీ బాగుంటే నేనెవర్ని అనే ప్రశ్న ఎందుకు? నువ్వెవరివి అంటే రాజునని చెప్పేస్తాడు.

వాడు ప్రపంచం చూస్తున్నాడు. ఆ ప్రపంచంలో అనేక మందికి కష్టాలు వద్దన్నా నెత్తిన పడుతున్నాయి. కొందరు బాగా సుఖంగా వుంటున్నారు.

పరిశీలించి చూస్తే, వీడు చాలా సుఖంగా వుంటున్నాడని బయటి వాళ్ళు అనుకుంటున్నారు తప్పితే ప్రతివాడికీ తనయొక్క సుఖం గురించి తృప్తి కలగటం లేదు. అప్పుడు ఈ జగత్తును పరిశీలించి, "నాకంటే సుఖంగా వుండేవాళ్ళు ఎలా

సుఖంగా వుండగలుగుతున్నారు? నాకంటే ఎక్కువ దుఃఖంగా వున్నవాళ్ళు ఎందుకు ఇంత దుఃఖంలో పడుతున్నారు? నేను ఈ మాత్రం దుఃఖాన్ని అనుభవిస్తున్నాను గదా! దీన్ని కూడా తొలగించుకొని పరిపూర్ణమైన సుఖం పొందటానికి నేనేం చెయ్యాలి?" అని ప్రతివాడికి వాడంతట వాడికే ప్రశ్న బయలుదేరుతుంది, తపన బయలుదేరుతుంది.

ఆఫీసులో పనిచేస్తుంటే పై సీటుకు ప్రమోషను రావాలి. వ్యాపారం చేస్తుంటే ఈ సంవత్సరం వచ్చిన లాభం కంటే పై సంవత్సరం ఎక్కువ లాభం రావాలి. ఆధ్యాత్మిక సాధన చేస్తుంటే ఇవాళ వచ్చిన సిద్ధికంటే రేపు ఎక్కువ సిద్ధి రావాలి. ఎప్పుడూ పైదానికోసం మనం ప్రయత్నం చేస్తూ వుంటాము. ఆ ప్రయత్నంలో క్లేశం (కష్టం) కనిపిస్తూ వుంటుంది. ఇంత కష్టపడి ప్రయత్నం చేస్తున్నాం కదా! దీనివల్ల వచ్చే లాభం దీనికంటే పెద్దదవునా, కాదా, అని విచారణ చేసుకుంటూ వుంటాం. లక్షరూపాయలు పెట్టుబడి పెడితే 10 రూపాయలే లాభం వస్తుందనుకొంటే, ఎవడూ ఆ వ్యాపారం చేయడు. దానికి తగినంత లాభం వుండాలి. కనుక ప్రతివాడూ ఈ ప్రపంచాన్ని పరిశీలిస్తున్నాడు. పరిశీలించి చూడగా చూడగా, "అవున్రా! ఈ ప్రపంచాన్ని ఇన్నాళ్ళుగా చూస్తున్నాం కదా! ఇది నిజమైన ప్రపంచమేనా?" అని కొంతమందికి అనుమానం వస్తుందట. అలా ఎవడికైనా వస్తే, వాడు మాత్రమే ఈ వేదాంత విచారణకు అర్హుడని వేరే చోట్ల చెప్పారు. అలాంటి అర్హత మనకు వుందా? ఎవడికైనా ఒకడికి ఈ ప్రపంచాన్ని పరిశీలన చేసేటప్పుడు, "ఇది నిత్యం కాదు, ఇది ఎప్పటికప్పుడు కొట్టుకుపోతోంది" అనిపిస్తే, అప్పుడు వాడు "ఈ కనిపించే ప్రపంచంయొక్క తత్త్వం ఏమిటి?" అని విచారణ చేస్తే, బాగా ఆలోచించగా "ఇదంతా కూడా అద్దంలో కనిపించే బొమ్మ లాగా కనిపిస్తోంది" అనిపిస్తుందట!

కొండ ఎదురుకుండా అద్దం పెట్టాము. పెద్ద కొండ చిన్న అద్దంలో కనిపిస్తోంది. ఇక్కడ ఒక కొండ కనిపిస్తోంది. అద్దంలోపల మరొక కొండ కనిపిస్తోంది. కనిపించడంలో రెండూ సమానమే. ఆ కొండ, ఈ కొండ, రెండూ కనిపిస్తుంటే మనమేమంటామంటే "అద్దంలో వున్న కొండ అసలు కొండకాదండీ, అబద్ధపు కొండ" అంటాము. "బయట కనిపించే కొండ సత్యమైన కొండ" అంటాము. అద్దంలో కనిపించే కొండకీ, ఈ కొండకీ తేడా ఏమిటి? మనం ఇక్కడ కూర్చొని చూస్తున్నంత సేపూ రెండింటికీ ఏమీ తేడా లేదు. ఎదురుగా కనిపించే కొండను కావాలంటే వెళ్ళి ఎక్కగలము. ఈ అద్దంలో కనిపించే కొండ మీదకు ఎక్కలేము. ఆ భేదంచేత ఈ

రెండూ వేరనీ, మనకు కనిపించే కొండ సత్యమనీ, అద్దంలో కనిపిస్తున్న కొండేమో అసత్యమనీ, మనం మామూలుగా అనుకుంటూ వుంటాం. తత్త్వపరిశీలన చేసే పరిశీలకుడు మాత్రం ఏమంటాడంటే. "ఇట్లా నేను నిన్నటి దాకా అన్నా గానీ, బాగా పరిశీలించి చూస్తే, నాకు మామూలుగా కనిపించే కొండలు, నదులు, చెట్లు, పుట్టలు, ఇవన్నీ కూడా అద్దంలో కనిపిస్తున్న కొండల్లాగానే వున్నాయండీ, నిజమైన కొండల్లాగా కనిపించటంలేదు" అంటాడట!

"తెలివి మరీ ఎక్కువైపోయినట్లుందే, చూస్తేను?" అంటే, "అలా గాదండీ, నాకు నిజంగానే అట్లా అనిపిస్తోంది" అన్నాట్ట. "ఎందుకు నీకు అట్లా అనిపించిందయ్యా?" అంటే. "నాకొక సందేహం వచ్చిందండీ, ఇవాళేమో నేనిక్కడ కూర్చొన్నాను. ఎదురుగుండా ఒక కొండ కనిపించింది. అది నిజమైన కొండా, కాదా - అని అనుమానం వచ్చి ఆ కొండెక్కి వచ్చాను. అయితే నిన్న రాత్రి నిద్రపోయేటప్పుడు నాకు ఇంతకన్నా పెద్ద కొండ ఒకటి కనిపించింది. ఆ కొండమీద కూడా నాకు అనుమానం వచ్చి దానిమీదికి ఎక్కా. ఆ కొండమీదనుంచి దూకా. ఆ కొండమీద పరుగులెత్తా. అంతా స్పష్టంగా చూశా. అంతా బాగుందిగదా అనుకొంటే, ఇలా కళ్ళు తెరిచా. ఆ కొండ కనిపించలేదు. ఏమయిపోయిందో అర్థం కావట్లేదు. ఇంత లావు కొండ, పెద్ద పెద్ద బండలు, దానిమీద బ్రహ్మాండమైన చెట్లు, ఏనుగులు, పుట్టలు అన్నీ వున్నాయి. అక్కడ నేను బ్రహ్మాండంగా విహరించాను. అంత విహరించినటువంటి కొండ క్షణంలో కనిపించకుండా పోయింది. ఇప్పుడు ఇక్కడ ఇంత కొండ కనిపిస్తోంది. ఇది నేను నిద్రపోతున్న సమయంలో అప్పుడు కనిపించలేదు. కనుక, ఒక కొండ బాగా కనిపించి దానిమీద ఎక్కి విహరిస్తే అది సత్యమైన కొండ అని యే నియమాన్ని అయితే తీసుకొన్నానో, దాన్నే అన్వయించి, నిన్న రాత్రి కలలో నేను విహరించిన కొండను సత్యమైన కొండ అనాలి. కానీ నేనలా అనటం లేదు. ఇవాళ లేచినాక అది అబద్ధపు కొండ అంటున్నాను. కనుక, కల విషయంలో నేను ఉపయోగించిన నియమాన్ని ఇవాళ ఎదురుగుండా కనిపిస్తున్న ఈ కొండకు అన్వయించి, దానిమీద ఎక్కి విహరించినంత మాత్రాన ఇది సత్యమైన కొండ అనటానికి వీల్లేదు, అని చెపితే తప్పేమిటి? కనుక ఇదికూడా అబద్ధపు కొండే కావచ్చని నాకు సందేహం బయలుదేరిందండీ- అన్నాడట వాడు.

కాగా మనమేం చేస్తున్నామంటే, మాములుగా మన నిత్య వ్యవహారంలో ద్వంద్వసిద్ధాంతాలను అన్వయిస్తున్నాం స్వప్నంలో ఒక దృశ్యాన్ని చూస్తున్నాము. ఆ

దృశ్యం ఇవాళ అబద్ధమని మనం చెపుతున్నాము. ఎందుకు చెబుతున్నామయ్యా అంటే, కొన్ని కారణాలు చెబుతున్నాం. అది కొంచెంసేపే కనిపించింది. అది నిద్రపోక ముందు లేదు. నిద్ర మెలకువ వచ్చాక లేదు. నిద్రపోతున్న మధ్య కాలంలోనే వుంది. అక్కడ అటువంటి కొండ వుండటానికి అవకాశం లేదు. అవకాశం లేని చోట కొండ కనిపించడం, పూర్వాపరాల్లో కొండ లేకుండా వుండడం, వున్నట్టుండి మాయమయిపోవడం, ఈ కారణాలచేత, కల్లో కనిపించే కొండ అబద్ధమని మనం చెపుతున్నాం. బావుంది. ఇవే కారణాలను మనం ఒప్పుకొందాం. ఎదురుగుండా కనిపిస్తున్న ఈ కొండపై ఈ కారణాలనే అన్వయించి చూద్దాం.

నువ్వు నిద్రపోయే సమయంలో ఇది ఏమైపోయిందో తెలియదు. నువ్వు చచ్చిపోయిన తరువాత ఈ కొండ వుంటుందో లేదో తెలియదు. కనుక వెనకా ముందు తెలియకపోవటం దీనికీ సమానమే, దానికీ సమానమే. మెళకువ వస్తే కలలోని కొండ మాయమయిపోయినట్టుగా, ఉన్నట్టుండి చచ్చిపోతే ఇదీ మాయమయి పోతుంది. ఉన్నట్టుండి మాయమయిపోవడం కూడా దీనికీ దానికీ సమానమే. అయితే తేడా ఏమిటంటే? కాలపు కొలత దీనికి పెద్దది, దానికి చిన్నది.

“ఓహో! చాలా గొప్పగా వుందయ్యా నువ్వు చెప్పింది”. అంటూ వుండగానే, ఇంకొక పెద్దమనిషి వచ్చి–

“దీనిక్కూడా ఇంకొక చిక్కుంది. నాకు నిన్నొక కల వచ్చింది. ఆ కలలో నేనొక పెద్ద రాజుగా వున్నాను. నేను రాజుగా దేదీప్యమానంగా ప్రకాశిస్తుండగా నా శత్రువులు కొంతమంది వచ్చి నా రాజ్యం మీద దండెత్తారు. నేను అద్భుతమైన పరాక్రమంతో వాళ్లమీద యుద్ధానికి వెళ్ళాను. ఆ యుద్ధంలో ఓడిపోయి అడవిలోకి పారిపోయాను. అక్కడ నాకొక ఆటవిక స్త్రీతో పరిచయం ఏర్పడింది. నాకు పది మంది పిల్లలు పుట్టారు. వాళ్ళంతా పెద్ద వాళ్ళయ్యే దాకా అడవిలోనే వుండి, వాళ్ళందరినీ కూడ గట్టుకొని, అక్కడ వుండే ఆటవికులందరినీ పోగుచేసుకొని, మళ్ళీ వచ్చి యుద్ధంచేసి, నా రాజ్యం నేను సంపాదించాను. మళ్ళీ రెండో సారి నా సింహాసనం నేను ఎక్కబోయే సమయానికి నాకు మెలకువ వచ్చేసింది. కల ఎగిరిపోయింది” అన్నాడు.

వాడు మొదట రాజై పుట్టాడు. రాజ్యం చేశాడు. యుద్ధం చేశాడు. ఓడిపోయాడు. మళ్ళీ పిల్లలు పుట్టారు. వాళ్ళు పెద్దవాళ్ళయి యుద్ధంచేసే పరిస్థితి దాకా వచ్చారు. మళ్ళీ రాజ్యం గెలిచారు. ఎన్ని సంవత్సరాలు అయివుండాలండీ? వాడు నిద్దరపోయింది ఎంతసేపు? ఆ నిద్రలో కల ఉన్నది ఎంతసేపు? ఒకే కల కదలకుండా

కూర్చున్నదనుకొన్నా కూడా సరే, గరిష్ఠంగా వేసుకొన్నా కూడా, 7 లేక 8 గంటలు వరసగా కల వచ్చిందనుకొందాం. 7 లేక 8 గంటల కాలంలో వాడికి సుమారు పాతిక సంవత్సరాల కథ నడిచింది.

కనుక ఎవడి కాలపు కొలతను ఇప్పుడు తీసుకోవాలి? మెలకువగా వున్నప్పటి కాలం సరియైన కాలం అనుకోవాలా? కల్లో వున్నప్పటిది నికరమైన కాలపు కొలత అనుకోవాలా? ఏదో ఒకటే కరెక్టు అనుకునేందుకు కారణం లేదు గనుక, రెండూ కరెక్టే అనుకొందాం. రెండూ కరెక్టు అనుకొంటే, ఒకటి చిన్న కాలమని, ఒకటి పెద్ద కాలమని చెప్పే అవకాశం లేదు. కనుక మెలకువగా వున్నప్పుడు చూసే కొండ ఎక్కువ సేపు కనిపిస్తోంది, కల్లో వున్న కొండ కొద్ది సేపే కనిపిస్తోంది – అనటం కుదరదు. కనుక కల్లో వున్న కొండ అసత్యము, మెలకువలో వున్న కొండ సత్యము, అనే మాట కూడా ఇక్కడ కుదరదు.

అలా కాదండీ, కల్లో వున్నప్పుడేమో ఇవాళ కొండ కనిపించింది. మళ్ళీ రేపు వచ్చేటప్పటికి కలలో మళ్ళీ ఆ కొండ కనిపించలేదు. ఈ మాటు సముద్రాలు కనిపించినాయి. మెలకువ దగ్గర అట్లా కాదు. నిన్న ఏ కొండ కనిపించిందో ఇవాళ కూడా అదే కొండ కనిపించింది. అది ఎన్నాళ్ళైనా స్థిరంగా అలాగే వుంటుంది. కనుక ఇది నిజమైన కొండండీ. కలలో కనిపించేది ఎప్పటి కప్పుడు మారిపోతూ వుంది గనుక అది సత్యమైన కొండ కాదండీ అన్నాడు.

చాలా బావుందయ్యా. ఈ ఎదురుగుండా కనిపిస్తున్న కొండలో ఏ విధమైన మార్పూ లేదని, నీవు ఖాయంగా చెప్పగలవా? ఏ రోజు కారోజు ఈ కొండంతా ఏమీ మార్పులేకుండా నిన్నెట్లా వుందో, ఇవాళ కూడా అట్లాగే వుందా అంటే ఏం చెయ్యాలి? నిన్న ఏ స్థానంలో పూలు వున్నాయో. ఇవాళ అదే స్థానంలో పూలుండాలి. నిన్న ఏ స్థానంలో రాళ్ళున్నాయో, ఇవాళ అదే స్థానంలో రాళ్ళుండాలి. నిన్న ఏ స్థానంలో ఈగలున్నాయో, ఇవాళ అదే స్థానంలో ఈగలు వుండాలి. నిన్న ఎట్లాగ వుంటే, ఇవాళ అట్లాగే వుండాలి. అలాగ వుందా ఏ కొండైనా? ఏ వస్తువు కూడా నిన్న వున్నట్టు ఇవాళ వుండటం లేదు. ఏదో మార్పుతోనే వుంటోంది. మార్పు స్వల్పము, పెద్దది అనే భేదం వుండచ్చు తప్పితే, యథాతథంగా ఏ పర్వతమూ లేదు, ఏ నదీ లేదు. ప్రతిదీ ఎంతో కొంత మార్పు చెందుతూనే వుంది. అయితే నువ్వు ఏం చేస్తున్నావంటే, కొంత భేదం వుంటే, ఇది స్వల్ప భేదమని నీకు నువ్వే పరిమితి పెట్టుకుని, అదీ ఇదీ ఒకటే అంటున్నావు. ఆ భేదం కొంచెం ఎక్కువైతే అది వేరు, ఇది వేరు అని నీకు నీవే

చెప్పుకుంటున్నావు. ఎంత భేదమైతే ఎక్కువ? ఎంత భేదమైతే తక్కువ? అనే నిర్వచనం నీవేమైనా చేయగలవా? ఎంత ప్రయత్నం చేసినా అటువంటి నిర్వచనం మనం చెయ్యలేము.

వస్తువుయొక్క పరిమాణాన్నిబట్టి మనం మాట్లాడుతాం. చిన్న వస్తువు కనుక చిన్నపాటి తేడాను కూడా తేడాగా అంగీకరిస్తాం. అదే బాగా పెద్ద వస్తువైతే ఆ తేడాను లెక్కే చెయ్యం. అందుచేత నీవు పరిశీలన చెయ్యడంలో లోపమే తప్పితే, ప్రతి వస్తువూ కూడా ప్రతిరోజూ ఎంతో కొంత పరిణామాన్ని పొందుతూనే వుంది. పరిణామం లేకుండా లేదు.

రోజూ నిద్ర లేచి చూడగానే యీ కొండ ఇలాగే కనిపిస్తూ వుంటుంది అని ఇందాక చెప్పుకొన్నాం. దాన్ని గూడా పరిశీలిద్దాం. ఇవాళ ఈవూళ్లో వున్నాం. రాత్రికి ప్రయాణంచేసి వేరే ఊరువెళ్ళాం. దారిలో నిద్ర పట్టింది. తెల్లారి లేచి కళ్ళు తెరిచాము. ఎదురుగా ఆ కొండ వుందా? లేదు కదా. కనుక కళ్ళు తెరిస్తే రోజూ ఆ కొండ కనిపిస్తుందనే నియమం లేదు. మనం స్థానాంతరం పొందినట్లయితే, ఆ కొండ ఎగిరిపోవచ్చు. అలాగే స్వప్నంలో నువ్వు స్థానాంతరం పొందుతున్నావు. అందుచేత స్వప్నం తరువాత, పాతకొండ దర్శనమివ్వటంలేదు.

కనుక అనేక రకాలుగా ఆలోచించినా కూడా స్వప్నంలో కనిపించే కొండకి, మెలకువగా వున్నప్పుడు కనిపించే కొండకి, భేదం ఏమిటి?– అంటే స్పష్టంగా చెప్పేందుకు వీలు లేకుండా వుంది.

కాగా తేలిందేమిటయ్యా అంటే, మనం మెలకువగా వున్న దశలో చూస్తున్న ఈ ప్రపంచం, స్వప్నంలో చూస్తున్న జగత్తు లాగానే వుంది. ఈ స్వప్నంలో చూసే జగత్తంతా అద్దంలో చూస్తున్న బొమ్మ లాగానే వుంది. కనుక నేను పరిశీలించే ఈ జాగ్రత్ ప్రపంచమంతా కూడా కేవలం అద్దంలో చూస్తున్న బొమ్మ లాగా, కలలో చూస్తున్న పర్వతం లాగా, వుంది. ఇలా అనుకుంటూ వుండగానే, ఇంతలోగా వాడు సుషుప్తిలోకి వెళ్ళిపోయి, నిద్రలేచి, "నేనే ఆ కలలో కొండను చూశాను. నేనే మెలకువలో కొండను చూశాను. ఈ రెండూ లేకుండా నేను సుషుప్తిలో ఆనందరూపంగా వున్నాను" అని చెపుతున్నాడు. ఎవడైతే ఇలా చెబుతున్నాడో, అతడే ఆ దక్షిణామూర్తి రూపుడైన పరమేశ్వరుడితో ఐక్యం చెందినటువంటి గురువు. ఆ దక్షిణామూర్తినే నేను అని ఈ మొదటి శ్లోకంలో చెప్పారు.

నిద్రపోతున్నవాడు కలలో ఒక మహాసైన్యాన్ని చూసి, మహాయుద్ధాలు చేసి, అలా చేస్తూ చేస్తూనే, ఆ గందరగోళంలో వుంటూ వుండగానే, ఒక్క సారి మెలకువ వచ్చేసరికి, వాళ్ళందరూ ఎటుపోయారో ఎలా పోయారో, తెలియక గల్లంతైపోయి, "నేనొక్కణ్ణే వున్నాను, మహాసైన్యం లేదు, అంత మంది జనం లేనే లేరసలు" అని వాళ్ళందరినీ అసత్య వస్తువులుగానే నిర్ణయం చేస్తున్నాడు. "నేనే కల్లో ఈ మహా సైన్యాన్నంతా సృష్టిచేశాను. అక్కడి ఏనుగులను నేనే సృష్టి చేశాను. కత్తులను నేనే సృష్టిచేశాను. చెట్లను, కొండల్ని, నదుల్ని అన్నింటినీ నేనే సృష్టిచేశాను. చివరికి, నేనొక్కణ్ణే మిగిలాను. అవన్నీ లేనే లేవు" అని నిర్ణయం చేస్తున్నాడు. లేనే లేనివయినట్లయితే, లేనివాటిని ఎవడన్నా సృష్టి చేస్తాడా? అలాంటివాడు సృష్టికర్త అవుతాడా? కానీ, అలాంటి సృష్టి ప్రతివాడూ ప్రతిరోజూ చేస్తూనే వున్నాడు. అలా చేస్తూ చేస్తూ బయటికి వచ్చేసి, ఆ సృష్టి అసలు లేనే లేదు పొమ్మని వాడే చెబుతున్నాడు. అలా ఎవడైతే చెబుతున్నాడో, అంటే ఎవడైతే అనుదినమూ అఖండమైన స్వప్న సృష్టి చేస్తూ, ఆ సృష్టిని తను స్వయంగా అనుభవిస్తూ, తను సృష్టించిన సృష్టినుంచి సుఖదుఃఖాలను తనే స్వయంగా అనుభవిస్తూ, అంతా అయిపోయిన తరువాత కాలితో ఒక్క సారిగా తన్నేసినట్టుగా, ఆ స్వప్నప్రపంచాన్ని తన్నిపారేసి, ఇవతలికి వచ్చేసి, అసలు స్వప్నమే అబద్ధమండీ అనేస్తున్నాడే, వాడినే నేను.

స్వప్నం అబద్ధమనటానికి పాండిత్యం అక్కర్లేదు. ఎక్కడా శాస్త్రాలు చదువుకురానక్కర్లేదు. ఎవడన్నా పట్టుబట్టి స్వప్నం అబద్ధం కాదండీ, స్వప్నం కూడా నిజమే, నాకు బంగారం లాంటి కలలు వస్తున్నాయి– అంటే, వాడికి పాద నమస్కారం చేసి, "వెంటనే నాకొక లక్ష రూపాయలు అప్పుగా ఇచ్చి, నువ్వు నా స్వప్నంలోకి వచ్చి వసూలు చేసుకో" అంటే వాడి రంగు బయటపడిపోతుంది.

కొందరు దీనికి అంగీకరించరు. "మనం జాగ్రత్ ప్రపంచాన్ని చూస్తున్నట్టుగానే, స్వప్న ప్రపంచాన్ని కూడా చూస్తున్నాం. ఈ జాగ్రత్ ప్రపంచం లాగానే, స్వప్న ప్రపంచం గూడా సత్యమే" అని కొన్ని దేశాలవాళ్ళు నమ్మి, రాత్రిపూట నిద్రకు వెళ్ళేటప్పుడు "నీకు తియ్యటి కలలు కలుగు గాక" అని ఆశీర్వాదం చేస్తూ వుంటారు. తియ్యని కలలు కలిగితే వాళ్ళు సంతోష పడుతూ వుంటారు. మన దేశంలో మాత్రం తియ్యని కలలు కలిగినా ఒకటే, కారం కలలు కలిగినా ఒకటే, కలలన్నీ కల్లలే అని కొట్టిపారేస్తారు.

కల అబద్ధమని చెప్పడానికి ఏ పాండిత్యమూ అక్కర్లేదు. ఎంత పాండిత్యం వున్నా కూడా కలను నిజం చేసేవాడు లేదు.

తాను స్వయంగా ఆ కల్లో భాగంగా వుండి, ఆ కల్లో వచ్చిన సుఖ దుఃఖాలను స్వయంగా అనుభవించి, ఆ కలను తనే సృష్టిచేసి, ఇంత చేసినవాడు "ఆ కలకు నేను సృష్టికర్తను కాదు పొమ్మ"ంటున్నాడు. ఇలా ఎవడైతే కలను సృష్టిజేసి, కలలో తానే భాగంగా వుండి, కలను అనుభవించి కూడా, తనంతట తనే, ఎవడి ప్రమేయం లేకుండా, కల అబద్ధమని తిరస్కరించి పారేస్తున్నాడో, అటువంటివాడే ఈ దక్షిణామూర్తి స్వామివారు. వారే గురువు. వారే జీవుడు. వారే మూర్తిభేద విభాగి!

**"ఈశ్వరో గురు రాత్మేతి మూర్తి భేదాత్ విభాగినే".** మూడు మూర్తులు పొందినవాడు వాడే, అని చెప్పారు. ఇదే మొదటి శ్లోక సారాంశము.

మాటలు బాగానే వున్నాయండీ. కల విషయం అంతా ఒప్పుకొన్నాం. ఎవరూ కాదనలా. మాకు మంచి కలలు వచ్చినాయా, చెడ్డకలలు వచ్చినాయా అని, మీ దగ్గరకు వచ్చి ఏడవలేదు. "మా జాగ్రత్ జీవితంలో చాలా కష్టాలున్నాయండీ అవి పోయేటట్లు చేయండి" అని అడుగుతున్నాం తప్పితే, "మా కల్లో రోగాలు రాకుండా చెయ్యండి, మా కల్లో ఐశ్వర్యం కలిగేటట్టు చెయ్యండి" అని మిమ్మల్ని కోరటంలేదు. మేము ప్రపంచం గురించి వెదుకుతుంటే, మీరు కలగురించి మాట్లాడుతారేమిటి?– అని ప్రశ్న వేస్తుంటే, "ఆచార్యస్వామివారు ఈ శ్లోకంలో దానికే సమాధానం చెప్పారు. ఉదాహరణగా కల గురించి చెప్పారంతే" అని మనకు తెలియటం కోసం సురేశ్వరస్వామి వారు వ్యాఖ్యానం రాస్తూ ఏమన్నారంటే –

**శ్లో॥ ఆత్మ లాభాత్ పరో లోభో నాస్తీతి మునయో విదుః ।**
**తల్లాభార్థం కవిః స్తౌతి స్వాత్మానం పరమేశ్వరమ్ ॥**

ప్రపంచంలో ప్రతివాడూ కూడా ఏదో ఒక లాభం రావాలని కృషి చేస్తూ వున్నాడు. కానీ, తత్త్వవేత్తలైన మహర్షులంతా ఏమంటున్నారంటే, "నువ్వు ఎవరివో నీకు తెలిస్తే అంతకు మించిన లాభం లేదు. తక్కినవన్నీ అంతకంటే తక్కువ లాభాలే" అని అంటున్నారు. "వాళ్ళెవరో అంటే మనకేం వచ్చింది? వాళ్ళు తెలివి తక్కువ మాటలు మాట్లాడితే మనం కూడా అలాంటి మాటలు మాట్లాడాలని ఏమీ లేదు", అని అంటావేమో! కాదయ్యా,

**శ్లో॥ స్వేచ్ఛయా సృష్ట మావిశ్య విశ్వం యోఽ మనసిస్థితః ।**
**స్తోత్రేణ స్తూయతేఽ నేన స ఏవ పరమేశ్వరః ॥**

స్వప్న ప్రపంచాన్ని నీవు ఏ ప్రకారంగా అయితే సృష్టించావో, అదే ప్రకారంగా, ఒకానొక పరమేశ్వరుడనేవాడు ఈ జాగ్రత్ ప్రపంచాన్నంతా సృష్టిచేశాడయ్యా, వాణ్ణి

ఈ స్తోత్రంలో వారు (మహర్షులు) నిర్వచనంచేసి మనకు నిరూపిస్తున్నారు. జాగ్రత్తగా విను అంటున్నారు.

ఏమని నిర్వచనం చేస్తున్నారు? "స్వప్నం అసత్యం. జాగ్రత్తు సత్యం"– అని అంటున్నారు గదా! అంటే మెలకువలో మనకు కనిపించినదంతా సత్యమే. వెనుక చెప్పిన ఉదాహరణ తీసుకొనేటట్లయితే, ఆ కనిపిస్తున్న కొండ చాలా సత్యం. మనకు కల్లో కనిపించిన పెద్ద కొండమాత్రం అబద్ధం – అని నిర్ణయం చేస్తున్నాడు ప్రతివాడూ. నువ్వు ఒకటి సత్యమనీ, ఒకటి అసత్యమనీ, ఎలా నిర్ణయం చేస్తావో, ముందు దాన్ని నిర్వచనం చేసి చెప్పు. ఒక వస్తువు వుంది అనటానికి, ఇక్కడ ఎదురుకుండా ఈ వస్తువు వుందనటానికి, మీ ఎదురుగుండా నేను మాట్లాడుతున్నాననటానికి, ఏమిటి ప్రమాణం?

**శ్లో॥ అస్తి ప్రకాశత ఇతి వ్యవహారః ప్రవర్తతే ।**
**తచ్చాస్తిత్వం ప్రకాశత్వం కస్మిన్నర్థే ప్రతిష్ఠితమ్॥**

ఒక పెద్ద కొండ వుంది అని చెబుతున్నావు. లేదనే దాన్ని పక్కనబెట్టు. ఈ వుంది అనే చోట ఏం జరుగుతోంది? వుంది, నాకు కనిపిస్తోంది– అని నువ్వు అంటున్నావు. అలాగే ఒక శబ్దం వుంది. నేను మాట్లాడుతుంటే మీరు వింటున్నారు. ఈ శబ్దాన్ని మీరు కంటితో చూడడం లేదు. ఈ శబ్దం మీ చెవికి ప్రకాశిస్తోంది. అలాగే ఎక్కడ్నుంచైనా మంచి పూల వాసన వచ్చినట్లయితే, ఆ వాసన అనే వస్తువు ముక్కులకు ప్రకాశిస్తోంది. కనుక ఏదో ఒక ఇంద్రియానికి ఒక వస్తువు ప్రకాశిస్తే, అది వుంది. అని చెబుతున్నావు. "వున్నది, ఇది ప్రకాశిస్తోంది, నాకు అనుభవంలోకి వస్తోంది, నాకు కనిపిస్తోంది" అంటున్నావు. కనిపిస్తోంది అంటే కంటికి కనిపించనక్కర్లేదు. ఏ ఇంద్రియానికి కనిపించినా మన వ్యవహారంలో కనిపించినట్లే! వుంది, కనిపించింది, అనే రెండు మాటలు ఉపయోగిస్తున్నావు కదా. ఈ వుంది, కనిపించింది అనేటువంటి రెండు పదాల అర్థాలు దేన్ని ఆశ్రయించుకొని వున్నాయో, అది తేల్చి చెప్పు ముందర. తేల్చి చెప్పడమంటే, నీవు ఒక వస్తువు వుంది అని చెప్పడానికి, ఈ వస్తువు నాకు కనిపిస్తోంది అని చెప్పడానికి, దేన్ని ఆధారం చేసుకొని ఈ మాట చెబుతున్నావో అది విచారణ చేయి ముందు. అది ఏమిటో తేలిస్తే, దాన్ని బట్టి ఈ పెద్ద కొండ వున్నదీ, లేనిదీ, తేలిపోతుంది.

ఎదురుగుండా ఈ వస్తువు వుంది అని చెప్పటానికి మనకి సామాన్యంగా అనేక సహకారాలు కావాలి. ముందుగా నాకు కన్ను వుండాలి. నాకు కన్ను వున్నా సరే, ఉన్నట్టుండి దీపాలు ఆరిపోతే, సూర్యుడు కనిపించకుండా పోతే, ఎదురుగుండా వున్న

వస్తువు కనిపించదు. కన్ను బాగానే వుంది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. కానీ, ముఖం మీద చెంగేసుకు కూర్చున్నా. నాకేమైనా కనిపిస్తుందా? కనిపించదు. అంటే ఏమిటి? మధ్యన ఒక అడ్డం వుండకూడదు. ఇంతకూ వస్తువుకి, మనకి మధ్యలో అడ్డంకి, ఒక తెర వుంటుంది. దాన్ని ఆవరణం అంటారు. అది వుండకూడదు. సూర్యుడియొక్క ప్రకాశం వుండాలి. లేదా, ఒక దీపంయొక్క ప్రకాశం వుండాలి. తరువాత కన్ను పని చేయాలి. ఇవన్నీ వుంటే సరిపోతుందా? అసలైన పాయింటు మరోటి వుంది. "చూశామండీ, కళ్ళు బాగా పెట్టాం, కళ్ళజోడు కూడా పెట్టాం, ఒక పెద్ద దీపం పెట్టాం, చివరికి అక్కడ ఏమీ కనిపించటం లేదు. దోమ కూడా లేదు" అని గోలచేస్తే ఏమి లాభం? నీకు కనిపించాలంటే, అక్కడ ఏదన్నా వస్తువు వుండాలి. కనుక ఒక వస్తువు నిజంగా వుంటే, పైన చెప్పినవన్నీ సహకారాలుగా పనిచేస్తాయి. ఇన్ని సహకారాలు వున్నాయి అంటున్నావు కదా, వీటిలో ఏది నిజంగా నీకు వస్తువును చూపించేది? కన్ను చూపిస్తోందా? సూర్యుడియొక్క వెలుతురు చూపిస్తోందా? లేకపోతే ఈ తెర అనేది లేకపోవడం చూపిస్తోందా? ఇంకా ఏదైనా వేరే కారణం వుందా?

"అస్తి– అంటే వున్నది, ప్రకాశతే – అంటే ఇది కనిపిస్తున్నది – అనే రెండు పదాలను నువ్వు ఉపయోగిస్తున్నావు కదా. ఆ రెండర్థాలూ దేనిని ఆశ్రయించుకొని వున్నాయి"?

"నేను ఏ వస్తువును చూస్తున్నాని చెబుతున్నానో, ఆ వస్తువునే ఆశ్రయించుకొని వున్నాయి. వున్నది, ప్రకాశిస్తున్నది అనే రెండు భావాలూ కూడా, నేను కొండను చూస్తుంటే కొండనాశ్రయించుకొని వుంటాయి. నేను దోమను చూస్తుంటే దోమనే ఆశ్రయించుకొని వుంటాయి."

"అలా అనేటట్లయితే అస్తిత్వానికి పరిమాణం ఎంత? అది దోమంతా? లేక కొండంతా? అస్తి అనేది అన్ని వస్తువులనూ ఆశ్రయించుకుని వున్నది అంటే, దాని పరిమాణ నిర్ణయం చేసేదెలా?దీన్ని నీవు బాగా విచారణ చెయ్యి" అని ఒకడన్నాడు.

వాడంటున్నాడు "మీరు చెప్పిందంతా చేస్తే నాకేం ప్రయోజనం? అదీ గాక మీరు చెప్పిన పని వల్ల, మీరు చెప్పే ప్రయోజనం కలుగుతుందని నమ్మకం ఏమిటి? కనుక మీరు చెప్పేదానిలోగల హేతుబద్ధతను నిరూపించడమే గాక అలా విచారణ చేసినందువల్ల మీరు చెప్పిన ప్రయోజనాన్ని పొందినవారెవరైనా ఉంటే, వారిని నాకు చూపిస్తే నాకు దృఢమైన విశ్వాసం కలుగుతుంది. ఇదేదీ లేకుండా వట్టిగా ఈ విచారణ చెయ్యి అని ఎందుకు చెబుతున్నారు?" అని ఎదురు ప్రశ్న వేస్తున్నాడు.

**శ్లో॥ సర్వజ్ఞః సర్వకర్తా చ కథమాత్మా భవిష్యతి ।**
**శిష్యం ప్రతీత్థం పృచ్ఛంతం వక్తుమారభతే గురుః ॥**

(తాత్పర్యము – ఆత్మ సర్వజ్ఞుడు సర్వకర్త ఎలా కాగలదు అని శిష్యుడు ప్రశ్నించగా గురువు సమాధానం చెపుతున్నాడు.)

అదీ గాక, మీరు ఇంకొకటి ఏమంటున్నారంటే, "ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగినే" ఇని చెబుతున్నారు. ఒకటే వస్తువు వున్నది. ఆ వస్తువే ఈశ్వరుడుగా, ఆ వస్తువే గురువుగా, ఆ వస్తువే ఈ జీవుడుగా, మూడు రకాలుగా విభాగం పొందింది, రూపాంతరం చెందింది, అని చెబుతున్నారు. ఈ మాట బొత్తిగా నమ్మశక్యం కాకుండా వుంది. ఈశ్వరుడే జగత్తంతా సృష్టి చేశాడు. వాడు సర్వత్రా వ్యాపించివున్నాడు. వాడే జ్ఞానాన్ని పంచిపెడుతున్నాడు– అని మీరు చెబుతున్నారు. మీరు చెప్పే గురువుగారు అనేటువంటి వ్యక్తి ఆ ఈశ్వరుడితో సమానం. ఈశ్వరుడూ, ఈయనా లోపల ఒకటే. ఆ ఈశ్వరుడుకి ఎన్ని శక్తులు వున్నాయో, అన్ని శక్తులూ గురువుకీ వున్నాయి – అని చెపుతున్నారు. ఆయనకు వున్నాయో లేవో తెలియదు గానీ, నాకు మాత్రం లేవు. నేను రోజూ ఏడుస్తూ వుంటాను. పుట్టంగానే ఏడుపుతో పుట్టాను. రోజూ నిద్రలేవంగానే అపుడే నిద్ర లేపారేమని ఏడుస్తూ వుంటాను. పడుకునేటప్పుడూ రేపు అనుకున్న కార్యక్రమాలన్నీ అవుతాయో కావో, అని ఏడుస్తూ పడుకొంటాను. ఇలా నిరంతరం ఏడుస్తూ వుండటం నా కార్యక్రమం. ఈశ్వరుడేమో నిరంతరం ఆనంద స్వరూపంగా వుంటాడని మీరు చెబుతున్నారు. కనుక ఈశ్వరుడు నేనూ మాత్రం ఒకటి కాదు. మీరేమో ఆ పరమాత్మే నువ్వు అని చెపుతున్నారు. అది మా సిద్ధాంతం అంటున్నారు. అటువంటి సిద్ధాంతం మాకెందుకు? నా దుఃఖం పోయేందుకు ఉపాయం చెప్పమన్నా తప్పితే, ఏవోవో సిద్ధాంతాలు చెప్పి నన్ను గందరగోళం చెయ్యమని నేనడగలేదు – అని ప్రతిపక్షి దబాయిస్తుంటే, అటువంటి వాడికోసం ఆచార్యస్వామివారు "విశ్వం దర్పణ" శ్లోకం ద్వారా సమాధానం చెపుతున్నారు.

ఏ విధంగా చెప్పారయ్యా అంటే,

**అంతరస్మి న్నిమేలోకాః అంతర్విశ్వ మిదం జగత్ ।**
**బహిర్వన్మాయయా భాతి దర్పణే ప్రతిబింబవత్ ॥**

ఈ విషయాలు కొన్ని చెప్పుకున్నాం. మళ్ళీ వ్యాఖ్యాన రూపంగా ఇంకొక సారి వస్తాయి. మన చర్చంతా ఎక్కడనుంచి ప్రారంభమైందంటే, మనలోపల ఒక ప్రపంచం, బయట ఒక ప్రపంచం, అని రెండు ప్రపంచాలున్నాయి. లోపలి ప్రపంచం అసత్యమని, బయట ప్రపంచం సత్యమనీ, నిర్ధారణలో మనం వున్నాం. దాన్ని గురించి సందేహించి

గురువుగారి దగ్గరకు వెళ్ళలేదు. మనం వెళ్ళిందల్లా దుఃఖం పోగొట్టమని మాత్రం వెళ్ళాం. ఏమని నిశ్చయంతో వెళ్ళాం? బయట కనిపించే ప్రపంచంలో దుఃఖమనేది సత్యంగా వుంది. అది పోవాలి అని వెళ్ళాం. దాన్ని గురించే సురేశ్వరాచార్యులవారు ప్రస్తావన చేస్తున్నారు. ఈ ప్రపంచమంతా బయట వున్నట్లు కనిపిస్తోంది. బయట కనపడే ప్రపంచంలో మూడు లోకాలున్నాయనీ, 14 లోకాలు వున్నాయనీ ఏవో లెక్కలు చెబుతున్నారు. ఇంత బ్రహ్మాండమైన ప్రపంచం, మనకు కనిపిస్తున్న భూలోకం, తరువాత వాయుమండలం, తరువాత వాయువు కూడా లేనటువంటి ఆకాశమండలం, ఆకాశమండలంలో అనేక రకాలుగా కనిపిస్తున్నటువంటి నక్షత్ర గోళాలు, ఆ తరువాత ఆ గోళాలకి కూడా మించి మనకు కనిపించనటువంటి బ్రహ్మాండ పదార్థాలు, ఇదంతా బయటి ప్రపంచంలో మనకు వున్నాయి.

స్వప్నంలో కనిపించేటువంటి ప్రపంచంలో కూడా ఇటువంటి పదార్థాలన్నీ వున్నాయి. అక్కడా నేల వుంది, నీరు వుంది, నిప్పు వుంది, ఆకాశం వుంది, నక్షత్రాలున్నాయి, నక్షత్రాలకు మించి మనకు తెలియని పదార్థం అక్కడా వుంది. ఈ రెండూ కాకుండా అద్దంలో కనిపించే ప్రపంచం ఇంకొకటి వుంది. ఒక చిన్న అద్దంలో పెద్ద కొండ కనిపిస్తోంది. ఆ కొండమీద వుండే చెట్లూ, చెట్లమీద వుండే పిట్టలు, ఇంకా ఇటువంటివన్నీ దాంట్లో కనిపిస్తాయి. ఇటువంటి "దర్పణ ప్రపంచం" ఒకటి వుంది. ఈ అద్దంలో కనిపించే ప్రపంచం స్వప్నంలో భాగమా? మెలకువలో భాగమా? అనేది మన ప్రశ్న. పెద్ద చర్చ అక్కర్లేదు. మెలకువలో భాగమే. నువ్వు ఏం చెప్పావు? మెలకువలో కనిపించేదంతా సత్యము అని చెప్పావు. కలలో కనిపించేది మాత్రం అసత్యం అని నిశ్చయం చేసి చెప్పావు. అద్దంలో కనిపించే ఈ ప్రపంచం ఏదైతే వున్నదో, అది మెలకువలో భాగం అవునా? కాదా? అంటే అది మెలకువలో భాగమే అన్నావు. మెలకువలోనే భాగం అయివుంటే, అది సత్యమే అయివుండాలి. కనుక, నీవు చెప్పిన మాట ప్రకారంగా అద్దంలో కనిపించే మహానగరమేదయితే వుందో, పెద్ద కొండ ఏదయితే వుందో, అది కూడా సత్యమే. అక్కడ కూడా గింజలేసి పంటలు పండించుకో. మీ ఇంటికితోలే ధాన్యమంతా అక్కడనుంచే తోలించుకో. అద్దంలో కనిపించే పొలంలో, అద్దంలో కనిపించే కొండలో, ఏ రకమైన సౌకర్యాలు వుంటాయో, అవన్నీ కూడా చక్కగా నీవు అనుభవించి. మహారాజు లాగా ఏలుకో. మాకేమీ అభ్యంతరం లేదు– అంటే ఒప్పుకుంటావా?

కనుక జాగ్రత్ ప్రపంచమంతా సత్యమని నీవు అనేటట్లయితే, అందులో కొంత భాగం అసత్యమనటానికి కారణం చెపుతావా? అద్దంలో కనిపించేది మాత్రం సత్యం

కాదు, అలాగే నీళ్ళలో ప్రతిబింబిస్తే సత్యం కాదు, ఈ విధంగా ఒక పట్టిక వ్రాసిచ్చి ఇవి మాత్రం అసత్యము, మిగిలినవి సత్యము అని చెప్పాలి. ఆ వ్రాసియిచ్చినప్పుడు ఎందుకు అది సత్యం కాదో చెప్పాలి. కాగా, నీవు రెండు ప్రపంచాలని చెబితే, నేను మూడు రకాల ప్రపంచాలని తేల్చాను. ఈ మూడు రకాల ప్రపంచాల్లో ఏది సత్యమో నిర్ణయం చేయాలి. నిర్ణయం చేసేటప్పుడు "నాకు అలా తోచింది. నా మాట వినండి. లేకపోతే శపించేస్తాను" – అనరాదు. ఎదుటివారిని అంగీకరింప చేయాలి. అందుకే గురువుగారు మూడవ ప్రపంచ ప్రసక్తి తీసుకువచ్చి శిష్యుడికి ఒక ఎదురు ప్రశ్న వేశారన్నమాట.

"గురువుగారూ! ఇంతకూ మీరేమంటారు?" అని అడిగితే గురువుగారు చెపుతున్నారు– "మాకు ఇంత చర్చ అక్కర్లేదయ్యా! మా దృష్టిలో స్వప్నంలో కనిపించే ప్రపంచమూ అబద్ధమే, అద్దంలో కనిపించే ప్రపంచమూ అబద్ధమే. నువ్వు బయటకు కనబడుతోంది అంటున్న ఈ జాగ్రత్ ప్రపంచం కూడా అబద్ధమే. మూడూ అబద్ధమే. అందుచేత మాకు బాధ లేదు. నువ్వేమంటున్నావు? దీంట్లో ఇంత వరకు ఇది సత్యం, ఇంత వరకు ఇది అసత్యం, అని విడదీస్తున్నావు. విడదీస్తుంటే, ఏ లెక్కన విడదీస్తున్నావు? హద్దులెక్కడ పెట్టావు? అని మేము అడుగుతున్నాం. మరి మీ సంగతేమిటని అడిగితే, మాకు మూడు ప్రపంచాలూ అసత్యమే కనుక మాకు హద్దుల గోల లేదు. నీవు హద్దులు పెడుతున్నావు కనుక ఏ రకంగా హద్దులు పెడుతున్నావో తేల్చు అని అడుగుతున్నాం".

ఈ గురువు ఎప్పుడైతే ఇలా మడతపేచీ పెట్టాడో, అప్పుడు కొలతలు, హద్దులు, వివరించటం కుదరక, శిష్యుడు "మీరు చెప్పేదేదో కాస్త వివరంగా చెప్పండి" అన్నాడు. అప్పుడు గురువు చెపుతున్నాడు–

**శ్లో॥ స్వప్నే స్వాంతర్గతం విశ్వం యథా పృథగవేక్షతే ।**
**తథైవ జాగ్రత్ కాలేఽపి ప్రపంచోఽయం వివిచ్యతామ్ ॥**

స్వప్నంలో ప్రపంచాన్నొకటి చూస్తున్నావు కదా! అది లోపల వుందనుకొంటున్నావు కదా. బయట వుంది అనుకొంటున్న ఈ ప్రపంచం కూడా లోపలే వుంది. అది బయటే లేదసలు. నువ్వు సరిగ్గా విచారించి చూస్తే, సరిగ్గా విమర్శచేసి చూస్తే, నీకే అర్థమవుతుంది. బయట వుందని నీవు అనుకోవటమే తప్పితే, బయట ఏమీ ప్రపంచం లేదు. ఇది కూడా లోపలే వుంది. అదీ మా సిద్ధాంతం– అన్నారు. అదెలాగండీ? అంటే, చెపుతున్నారు.

శ్లో॥ స్వప్నే స్వసత్తైవార్థానాం సత్తా నాన్యేతి నిశ్చితా ।
కో జాగ్రతి విశేషోస్తి జడానా మాశు నాశినామ్ ॥

దీంట్లోని విషయాన్ని వెనుక వేరే మాటల్లో మనం చెప్పుకున్నాం. ఏదైనా ఒక వస్తువు వుంది అని అనుభవానికి వచ్చినప్పుడు, వాణ్ణి ఎంత దబాయించినా, వాడు లేదు అనడు. స్వప్నం చూసి వచ్చాడు. స్వప్నాన్ని చూసిన స్మృతి వాడికి వుంది. నేను పది సంవత్సరాల క్రిందట పసిపిల్లవాడుగా వుండేవాణ్ణి. తరువాత యువకుడుగా వుండేవాణ్ణి. ఇప్పుడు వృద్ధుడిగా వున్నాను. అని వాడికి వాడే గుర్తు చేసుకొని చెపుతున్నాడు. అంతే గానీ, ఎవరి బలవంతం చేతా చెప్పటంలేదు. అలాగే శాస్త్ర గ్రంథాలు చూసి చెప్పటం లేదు. అది వాడియొక్క స్మృతిలో వాడంతట వాడికే అనుభవానికి వస్తున్నది. అట్లాగే స్వప్నప్రపంచం వాడియొక్క స్మృతిలోనే వాడికి వుంది. ప్రత్యక్షంగా నేను 'అస్తి' అని అనుభవిస్తూ వుంటే, దాన్ని కాదనటానికి సాధ్యం కాదు. ప్రస్తుత కాలంలో "నాస్తి" అయ్యుండవచ్చు తప్పితే, నేను ఏ సమయంలో దాన్ని చూశానో అప్పుడది "అస్తి"– యే.

అయితే నీవు ఏమంటున్నావు? నేను చూసినా కూడా స్వప్నం అబద్ధమే అంటున్నావు. అది పూర్తిగా అబద్ధమైతే ఆ సమయంలో అది వుందనే భ్రాంతి ఎలా కలిగింది? ఎలా కలిగిందంటే, వున్నది అనేటువంటి ఒక గుణం (ధర్మం) లేని వస్తువుకు ఆపాదింపబడింది. నిజంగా ఏ మాత్రమూ లేని వస్తువుకి, వున్నది అనే గుణాన్ని తీసుకెళ్ళి ఆపాదించావు నీవు. ఏ సమయంలో? స్వప్న సమయంలో. ఎలా ఆపాదించావు? ఎక్కడ్నుంచి తీసుకువచ్చి ఆపాదించావు?

ఒకాయన, పెద్ద మనిషి, మంచి గంభీరంగా వున్నాడు. ఆరడుగుల ఎత్తు విగ్రహం, భీష్మాచార్యుడిలాగా గడ్డం, చూస్తే భయంకరంగా వున్నాడు. ఆయన్ను చూస్తే ఒకడికి భయమేసి, "మహారాజుగారండీ" అని, వాడికి సాష్టాంగ నమస్కారం చేసి, "బాబ్బాబూ! నన్ను రక్షించు" అన్నాడు. ఆయన "సరే, నిన్ను రక్షిస్తాను. నాకు ఓ పిడికెడు బియ్యం వెయ్యి" అన్నాడు. అదేమిటి? మహారాజునంటాడు. పిడికెడు బియ్యం అడుగుతున్నాడు – అని చూస్తే, వాడు ముష్టి వాడు. ముష్టి వాణ్ణి చూసి ఇట్లా అనుకొన్నావేమిట్రా? అని అడిగితే "కాదండీ, నేను ఫలానా మహారాజుగారిని ఒకప్పుడు చూశాను. ఆయన ఇట్లాగే నిటారుగా ఇంత ఎత్తు వుండేవాడు. వీడూ అట్లాగే ఉండే సరికి, వీణ్ణి మహారాజు అనుకొన్నాను" అన్నాడు.

ముష్టి వాడిలో మహారాజు గుణాన్ని ఎట్లా ఆపాదించాడు? ఆ మహారాజుగారి లక్షణాలు ఇంకో చోట చూశాడు. పొరపాటుపడి వాటిని ముష్టివాడిలో ఆపాదించేశాడు. అందువల్ల వాడు ముష్టివాడు అని తెలుసుకోలేక, కాళ్ళకు నమస్కారం పెట్టాడు.

కనుక ఒక చోట గల గుణం తీసుకువచ్చి ఇంకో చోట ఆపాదన చేశావంటే, ఈ గుణం ఇంకొక చోట వుంటే అక్కడి నుంచి తీసుకు వస్తావు. అంతే గానీ, ఏమీ లేనిదాన్ని ఒక చోట ఆపాదించలేవు.

చాలా చోట్ల భ్రాంతి పడుతూ వుంటాం. దూరంగా సముద్రపు ఒడ్డున వేసవి కాలంలో తిరుగుతుంటే, మంచి మెరుస్తున్న వెండి ముద్దలు కనిపిస్తుంటాయి. మనబోటివాడు వెళ్ళాడనుకోండి. ఇటు అటు చూస్తాడు ఎవరన్నా చుట్టు ప్రక్కల ఉన్నారేమో– అని. ఎవడూ లేడంటే పరుగెత్తుకెళతాడు అక్కడికి, బుడుంగున జేబులో వేసుకొందామని. అక్కడి దాకా వెళ్లేటప్పటికి నిజంగా అక్కడ వెండి ముద్ద లేదు. చివరికి ఎందుకూ పనికి రాని, విరిగిపోయిన ఆలిచిప్ప ఒకటి కనిపిస్తోంది. అది కనీసం మామిడితొక్కు తీద్దామన్నా పనికిరాదు. “ఇది ఆలిచిప్పే, దీన్ని చూసి వెండి అనుకొన్నానే” అని వాడు బాధపడుతాడు. కానీ, వాడు దాన్ని వెండి అని ఎందుకు అనుకొన్నాడు? అంతకు ముందే వీడు వెండిని చూసి వున్నాడు. వెండి పనికిరానిది అని అనుకొని వుంటే, వెళ్ళివుండేవాడు కాదు. వెండి చాలా విలువైందనీ, మెరుస్తూ వుంటుందనీ, వీడికి తెలుసు. కనుక, ఆ వెండిలో వున్నటువంటి మెరుగుని, తెల్లదనాన్ని, విలువని, తీసుకొచ్చి ఈ పనికిరాని ఆల్చిప్ప మొహం మీద పెట్టాడు. పెట్టేసి, ఇది వెండి అనుకొని, దాని కోసం పరుగెత్తాడు.

అలాగే ఎప్పుడైనా పొరపాటు పడ్డాము అంటే, ఎక్కడైనా ఇంకొక వస్తువులో వున్న, ఆ గుణాన్ని తీసుకువచ్చి దీనిమీద పెట్టేసి, అలా పెట్టినట్టు మనకే తెలియక ఖంగారుపడి, దానివల్ల భ్రాంతి పడుతూ వుంటాము. భ్రాంతియొక్క స్వభావం ఇది.

స్వప్నంలో కనిపించేది, స్వప్న కాలంలో సత్యం అనుకున్నాం. అసత్య వస్తువును సత్యం అనుకొన్నామంటే, సత్య గుణం ఎక్కడో వుండి వుండాలి. ఎక్కడో వున్న సత్య గుణాన్ని తీసుకు వచ్చేసి, ఆ స్వప్నంలో కనిపించిన కొండమీద ఆరోపించి, ఆ సమయంలో ఆ కొండ సత్యమేననే భ్రాంతి జ్ఞానంలో మనం పడ్డామన్న మాట!

ఐతే, నిజమైన సత్యగుణం ఎక్కడ వుంది అంటే, వెతుక్కొనక్కర్లేదు నీకు ఆ స్వప్న ప్రపంచం గూర్చిన మిథ్యాజ్ఞానం పోయి, ఆ స్వప్నమంతా అబద్ధమే అనే సత్యజ్ఞానం కలిగాక, ఎవరైతే మిగిలివున్నారో, ఆ నీలోనే వుంది ఈ సత్యగుణం!

నీలో వున్న సత్యగుణాన్నే ఆ కొండమీద ఆరోపించావు. ఆరోపించడం అంటే, దానిది కాని విషయాన్ని తీసుకెళ్ళి దానికి తగిలించడమన్నమాట. నీలోనే వున్నటువంటి "వున్నది" అనే గుణాన్ని తీసికెళ్ళి కొండ మీద ఒక సారి పెట్టావు. ఏనుగు మీద ఒక సారి పెట్టావు. సైన్యం మీద ఒక సారి పెట్టావు. ఇలా పెట్టేసి, ఏంటేంటో వున్నాయి అన్నావు. నిజంగా వున్నదేది? నిజంగా నీవు ఒక్కడివే వున్నావు అక్కడ. నువ్వు అంటే, ఇక్కడ నీ మనస్సు. నీ మనస్సే లేనిపోనివన్నీ కల్పించి, తనలో వున్న సత్తను, అనగా వుండుట అనే గుణాన్ని, ఆయా వస్తువుల మీద ఆరోపించి, ఆ సమయంలో అవి సత్యమే అనే భ్రాంతి జ్ఞానాన్ని కలిగించింది. కొంత సేపయిన తరువాత, మనం ఇవతలికి వచ్చి సరిగ్గా చూసేటప్పటికి, ఆ భ్రాంతిజ్ఞానం తొలగిపోగా, నిజంగా ఎవరియందైతే "వుండుట" అనే గుణం వున్నదో, ఆ నువ్వు మిగిలావు. దేనిలో అయితే నిజంగా వుండుట అనే గుణం లేదో, ఆ స్వప్నప్రపంచమంతా ఒక్క సారిగా ఎగిరిపోయింది. అది పోయింది గనుక – "అది లేనే లేదు – నేనొక్కణ్ణే వున్నాను" అంటున్నావు. ఇది స్వప్న ప్రపంచంయొక్క విధానం.

స్వప్న ప్రపంచ విధానమేమిటో కొంత అర్థమయింది. ఇక మాయాప్రపంచం సంగతి తెలుసుకోవాలి. ఏది మాయాప్రపంచం? ఏది సత్య ప్రపంచం?

ఏదన్నా ఒక వస్తువు పుట్టి కొంత కాలంలో పెరిగిందంటే అది సత్యమని నమ్మవచ్చు. అంతే గానీ రాతి నేల మీద గింజలు పారేసి, చూస్తుండగానే, చెట్టువచ్చేసి, చూస్తుండంగానే అవి పెరిగిపోయి, కాయలు కాచి, పళ్ళు కూడా పండిపోయాయి అని చెబితే, అది చాలా మోసం, గారడీ, అంతే తప్పితే సత్య వస్తువు కాదు.

ఓహో! చాలా గొప్పగా చెప్పావయ్యా. అనుకూలమైన కాలం ఒకటి, అనుకూలమైన ప్రదేశం ఒకటి, అనుకూలమైన విధానం ఒకటి, చెబుతున్నావు గదా, ఏమిటి అనుకూలం? ఎవరికి అనుకూలం? మీ తాతగారు మట్టి నేలలో పాతిపెట్టి, దాని మీద పేడ పడేస్తే నీకు అనుకూలమా? నేను ఇదేదీ లేకుండా బండ నేలమీద పండిస్తే నీకు అనుకూలం గాదా! ఏమైంది నీకు? అంత విరోధం నీకెందుకు?

విరోధం ఏమీ కాదయ్యా? ప్రతి వస్తువూ పుట్టటానికి లోకంలో అందరూ చూస్తున్న విధానం ఒకటి వుంటుంది. మామిడి చెట్టంటే నాలుగైదు సంవత్సరాలు పెరుగుతుంది. నిదానంగా ఆరేడు సంవత్సరాలకు పిందెలు వేయడం మొదలెడుతుంది. ఏ పదేళ్ళో పోతే గట్టిగా కాయలు కాస్తుంది. అలాంటి విధానం లేకుండా, 5 నిమిషాల్లోనే చెట్టయిపోయింది, పండయిపోయింది, అంటే అది కేవలం కనికట్టు, అది గారడీ, అంటారు ఎవరైనా. ఇది ఈ ప్రపంచంలో అంతా అంగీకరిస్తున్నదే. కనుక ఏదైనా

ఒక వస్తువు పుట్టిందంటే, దానికి కారణ సామగ్రి వుండాలి. అలా గాక యక్షిణీవిద్యచేత ఇక్కడ వున్న కుండలను వున్నట్టుండి అక్కడ పెట్టేసినట్లయితే, “ఇవన్నీ దొంగ కుండలు. వీటిని ముట్టుకుంటే దెయ్యాలు పట్టుకుంటాయేమో” నని భయపడతారు ప్రజలు. అలా కాకుండా బజారునుంచి కుండలు కొనుక్కొచ్చేసి, ఇక్కడ పెడితే, ఎక్కడివివి అంటే, ఫలానా మార్కెట్‌లో వున్నాయంటే ఎవరూ భయపడరు. ఎందుకని? దానిని తయారు చేసినవాడెవడు? దాని ముడిసరుకు ఎక్కడ్నుంచి వచ్చింది? ఇవన్నీ మనకు తెలుసు. ఏమీ తెలియకుండా వున్నట్టుండి వచ్చిపడితే, అది అసత్యమైపోతుంది. అంతే.

ఇపుడు ఈ మనసనేది కలలో సృష్టి చేస్తోంది. దేంతో సృష్టి చేస్తోంది? ఏ వస్తువులూ లేకుండా, మాయా మంత్రంగా, తూతూ మంత్రంగా, సృష్టిచేసి పారేస్తోంది. కనుక, ఇది సృష్టిచేసే వస్తువులకు ముడిసరుకులు ఎక్కడా దొరకడంలేదు. ఇటువంటి సృష్టిచేసే ఈ మనస్సుందే, అది అసత్యమైన సృష్టిచేయగలదే తప్పితే, సత్యమైన సృష్టి చేయజాలదు. నిద్రయొక్క సంసర్గంతో చెయ్యనీ, నిద్ర లేకుండా చెయ్యనీ, పగటి కలలు కనేవాడు, మేలుకునే వుండి ఆకాశంవైపు చూస్తూ ఏదయినా సృష్టి చేస్తే చేయనీ, ఏ రకంగా సృష్టి చేసినా సరే, మనస్సు చేసిన సృష్టి అంటే, అది అసత్యమే అవుతుంది గానీ సత్యమైన సృష్టి కాదు.

బాగుంది. సరే, స్వప్న సృష్టి అసత్యం అని ఒప్పుకొన్నాం. జాగ్రత్ సృష్టి మాటేమిటి?, అంటే – “జాగ్రత్ సృష్టి కూడా ఇంతే” అన్నాడు.

ఇది భలే వుందండీ. పిచ్చి తగ్గింది, రోకలి కాస్త తలకు చుట్టమన్నాడట. ఇందాకట్నుంచి మీరు చెప్పిందే చెప్పి, స్వప్నం అసత్యం అని చెబుతున్నారు. మేము ఒప్పుకొంటూనే వున్నాం కదా! ఇప్పుడీ కొత్త మెలిక యేమిటి? అని శిష్యుడు అడిగాడు.

గురువు ఏమంటున్నాడంటే – మెలిక కాదయ్యా! నువ్వేమన్నావు? ఏదైనా ఒక వస్తువు పుడితే దానికి సరైన కారణం వుండాలి. అటువంటి కారణం లేకపోతే అది సత్యవస్తువు కాదు అన్నావు. ఈ జాగ్రత్ప్రపంచం పుట్టడానికి కూడా సరైన కారణం లేదు. ఉదాహరణకు, ఈ మట్టి ముద్ద ఎక్కడ్నుంచి పుట్టింది?– అంటే, కృష్ణానదిలో లంకలో గుంటలున్నాయండీ, అక్కడ్నుంచి తీసుకువచ్చాను– అంటావా? ఈ కృష్ణలంక ఎక్కడ్నుంచి వచ్చిందయ్యా, అని అడుగుతాను. ఇంత లావు భూమి అనేది ఒకటి వుందండీ. దానిమీద కృష్ణలంక వుంది– అంటావా? ఈ భూమి ఎక్కడనుంచి వచ్చింది? ఈ మొత్తం భూమి కలిపితే ఒకమట్టి ముద్దే కదా. మట్టి ముద్ద ఇంతైనా, అంతైనా, ఎంతైనా, మట్టిముద్దే గదా. ఈ మొత్తం భూమి అనే మట్టి ముద్ద ఎక్కడ్నుంచి వచ్చింది?

మట్టిముద్ద ఆకాశంలోంచి వచ్చిందంటే ఎవరైనా ఒప్పుకుంటారా? ఒప్పుకొనేటట్లయితే, యీ చిన్ని మట్టిముద్ద దగ్గరా ఆ మాటే చెపుతాను. కానీ మీరొప్పుకోరు. అది గుంటలోంచే రావాలి. ఇంత పెద్ద భూమి అనే మట్టిముద్ద ఏ గుంటలోంచి వచ్చింది? అదీ మన ప్రశ్న ఇపుడు.

పోనీ ఇది నీళ్ళలోంచి రావడానికి వీలుందా? నీళ్ళలోంచి నీళ్ళు వచ్చాయి అంటే ఒప్పుకొంటాం గానీ, నీళ్ళలోంచి మట్టి వచ్చిందంటే ఒప్పుకోం. నిప్పులోంచి మట్టి వచ్చిందంటే ఒప్పుకోం. ఆకాశంలోంచి మట్టి వచ్చిందంటే ఒప్పుకోం. మరి దేంట్లోంచి ఈ భూమి వచ్చింది? మరి భూమికోసమే కదా మనం విచారణ చేసేది? కనుక నీవు జాగ్రత్ప్రపంచంలో ఈ కుండలూ మొదలైన వస్తువులన్నీ ఏ భూమిలోనుంచి వచ్చినాయని చెబుతున్నామో, ఆ భూమి ఎక్కడ్నుంచి వచ్చిందో సమాధానం దొరకట్లేదు. అంటే ఈ భూమికి సరి అయిన కారణం లేదు. కారణం లేకుండానే ఈ భూమి వచ్చేసింది. కారణం లేకుండా వచ్చిన వస్తువును అబద్ధం అని నువ్వు చెప్పావు. కారణం లేకుండా వచ్చిన భూమి అనే పెద్ద మట్టిముద్దలోంచి చిన్న మట్టిముద్ద వచ్చింది. ఆ చిన్న మట్టిముద్దలోంచి కుండలు వచ్చినాయి. కనుక ఈ మొత్తం కుండలన్నీ అసత్యమే అవుతాయి.

కనుక కారణాన్ని అన్వేషిస్తూ వెళ్ళేట్లయితే, కేవలం మట్టిముద్ద దగ్గర ఆగిపోకు. ఈ భూమి అనే పెద్ద మట్టిముద్ద ఎక్కడ్నుంచి వచ్చిందో ఆలోచించు. పరమేశ్వరుడు సృష్టి చేశాడు– వంటి మాటలు ఇక్కడ కుదరవు. ప్రస్తుతం మన చర్చలో పరమేశ్వరుడు అనేవాడు లేడు. ఒకవేళవున్నా, అతడు ఈ మట్టిముద్దను నీటిలోంచి గానీ, నిప్పులోంచి గానీ తీసుకువచ్చాడు, అంటే, మనం ఒప్పుకోలేం. ఒకవేళ అలా వచ్చినట్టు చూపించినప్పటికీ, అది ఏదో గారడీ చేసి చూపించినట్లే లెక్క తప్పితే, నిజంగా వచ్చినట్టుగాదు కనుక ఎన్ని రకాలుగా చూసుకున్నా కూడా, ఈ మొత్తం భూగోళం అనేది అసత్య గోళమే ఐపోతుంది. భూగోళమైతే, సూర్యగోళం ఆగుతుందా?

సూర్యగోళం అనేది మట్టిముద్ద కాదండీ, అది నిప్పుముద్ద అన్నారు కొందరు. చాలా సంతోషం. ఈ నిప్పుముద్దను ఏ పొయ్యిలోంచి తీసుకు వచ్చారు? ఏదో ఒక స్థానం చూపిస్తే దాన్ని ఎక్కడ్నుంచి తీసుకు వచ్చారు, అని మళ్ళీ ప్రశ్న. నిప్పును నీటిలోంచి తీసుకు వచ్చే అవకాశంలేదు. నిప్పును ఆకాశంలోంచి తీసుకువచ్చే అవకాశం లేదు. నిప్పును మట్టిలోంచి తీసుకు వచ్చే అవకాశం లేదు. గాలినుంచీ వచ్చే అవకాశం లేదు. గనుక, ఎక్కడనుంచీ గూడా సూర్యగోళమనే నిప్పుముద్ద వచ్చే అవకాశం లేదు.

గనుక, అది సరైన కారణం లేకనే వచ్చి మన కంటికి కనిపిస్తోంది అని చెప్పక తప్పదు. కనుక ఆ నిప్పుగోళం అనేటువంటి సూర్యబింబం కూడా అసత్యబింబమే.

సూర్యగోళమూ అసత్యగోళమే, చంద్రగోళమూ అసత్యగోళమే, భూగోళమూ అసత్యగోళమే అయితే, నువ్వేనా సత్యం?

ఇంతకూ చెప్పవచ్చిందేమంటే– నీవు ఏ కారణంచేత స్వప్న ప్రపంచాన్ని అబద్ధం అన్నావో, సరీగా అదే కారణంచేత, ఈ జాగ్రత్ప్రపంచం కూడా అసత్యం అని చెప్పాల్సి వస్తోందయ్యా! కనుక, స్వప్న ప్రపంచానికీ, జాగ్రత్ప్రపంచానికీ, రెంటికీ కూడా ఏ విధమైన భేదమూ లేదు– అని, అక్కడితో ఆగక ఇంకో మాట చెప్పారు.

**నిద్రయా దర్శితానర్థా న్న పశ్యతి యథోత్థితః।**
**సమ్యక్ జ్ఞానోదయాదూర్ధ్వం తథా విశ్వం న పశ్యతి॥**

మీరు చెప్పిందాన్ని కాదనటానికి వీలులేకుండా వుందండీ. మరి మనసు మాత్రం ఒప్పుకోవటం లేదు. మీరు చెప్పినది అనుభవానికి వ్యతిరేకంగా వుంది కాబట్టి, నమ్మబుద్ధి కావట్లేదు. ఎందుకయ్యా అంటే, స్వప్నం అబద్ధమని మీరు చెప్పలేదు. నా అంతట నేనే చెప్పా. జాగ్రత్తు అబద్ధమని ఇందాకటినుంచి చెప్పిందే చెపుతున్నారు. నిజంగా అబద్ధమైతే మీరు ఇంతగా నాకు చెప్పటం దేనికి? నేనే చెప్పేవాణ్ణిగా – అన్నాడు.

సరే బాగుందయ్యా! నువ్వు స్వప్నం అబద్ధమని ఎప్పుడు చెప్పావు? స్వప్నంలో వుండగా నా దగ్గరకు వచ్చి చెప్పావా? పోనీ, స్వప్నంలో కూర్చొని "ఏమండోయ్! నేను, ఇప్పుడు స్వప్నం చూస్తున్నాను. నేను చూసే స్వప్నం అబద్ధం" అని చెప్పావా? ఎప్పుడు చెప్పావు? స్వప్నంలోంచి బయటకు వచ్చేశాక, అప్పుడు నావంక చూసి, "నేను ఇందాక స్వప్నం చూశానండీ, నేను చూసినా కూడా అది అబద్ధమే" అన్నావు. అలాగే ఈ జాగ్రత్ప్రపంచం అబద్ధమని నీకు స్వయంగా జ్ఞానం రావాలంటే, స్వప్నంలోంచి బయటకు జాగ్రత్‌లోకి వచ్చినట్టుగా, ఈ జాగ్రత్‌లోనుంచీ బయటకు, ఇంక్కెక్కడికో, పోవాలి. అలా పోతే నీకు చెప్పే పని లేకుండా, నీ అంతట నీవే జాగ్రత్ అబద్ధం అని చెబుతావు. ఆ బయటకు పోయే స్థితి ఏమిటి? దానికి విధానం ఏమిటి? అంటే దాని పేరే జ్ఞానస్థితి లేక తురీయస్థితి. స్వప్నంలోంచి జాగ్రత్‌లోకి వచ్చి, స్వప్న విషయమైన ఒక అజ్ఞానాన్ని తొలగించుకొని, ఒక జ్ఞానంలోకి వచ్చి చెపుతున్నావు. ఏమని? స్వప్నంలో నేను నానా ఆకారాలుగా కనిపించాను, అన్ని ఆకారాలుగా కనిపించిందీ నేనే – అని. అట్లాగే ఇక్కడినుంచీ పరిశుద్ధజ్ఞానమనే,

స్థితిలోకి వెళ్ళినట్లయితే, జాగ్రత్‌లో కనిపిస్తున్న ఈ నానా రూపమైన ప్రపంచం ఏదైతే వుందో, అదంతా అసత్య ప్రపంచమే, ఈ పరిశుద్ధజ్ఞానంలో వున్నటువంటి నేనే పరిశుద్ధుణ్ణి, నేనే జ్ఞాన స్వరూపుణ్ణి, అని నీవు చెప్పగలుగుతావు. స్వప్నంలో వున్నప్పుడు స్వప్నం అసత్యమని ఎందుకు చెప్పలేక పోయావంటే, నిద్ర అనే దోషంయొక్క సంపర్కం చేత చెప్పలేకపోయావు. ఆ నిద్ర అనే దోషం పోయినపుడు, ఆ స్వప్నమంతా అసత్యమే అనే జ్ఞానం నీకు కలిగింది. అట్లాగే ఈ జాగ్రత్‌లో కూడా అజ్ఞానమనే దోషం నిన్ను ఆవరించివుంది. ఈ అజ్ఞానమనే దోషాన్ని తొలగించుకొని, నీవు పరిశుద్ధ జ్ఞాన స్థితిలోకి వెళ్ళగలిగినట్లయితే, అంటే ఇది ఎటువంటి మెలకువో అంతకంటే ఉత్తమమైన మెలకువ స్థితిలోకి నీవు వెళ్ళగలిగినట్లయితే, అప్పుడు అజ్ఞానమనే దోషం తొలగిపోతుంది. అప్పుడు ఈ జాగ్రత్ ప్రపంచమంతా కూడా అసత్యమని నీ అంతట నీవే దర్శించి, నువ్వే స్వయంగా చెప్పగలుగుతావు. నీకెవరూ చెప్పక్కర్లేదు. అప్పుడేం జరుగుతుంది?

**అనాది మాయయా సుప్తో యదా జీవః ప్రబుధ్యతే ।**
**అజన్మ నిద్ర మస్వప్నం అద్వైతం బుద్ధ్యతే తదా ॥**

స్వప్నంలోంచి బయటకు వచ్చినపుడు ఏం చెబుతున్నావంటే ఆ స్వప్నంలో కనిపించిన వస్తువులకి జన్మా లేదు, నాశనమూ లేదు, అని చెబుతున్నావు. స్వప్నంలో ఏనుగుల్ని, గుర్రాల్ని సృష్టిచేసింది నీ మనస్సే అయినప్పటికీ, ఆ మనస్సు నిద్రలోంచి బయటకు వచ్చాక, “ఇంతకు ముందు దాకా ఏనుగ్గా వున్నానండీ, మళ్ళీ మనిషిగా మారాను, ఇంక కాసేపు అయితే మళ్ళీ పందిగా మారుతాను, తరువాత మళ్ళీ మనిషిగా మారుతాను” అని చెప్పట్లేదు. ఏనుగూ లేదు, పందీ లేదు, అని కొట్టిపారేస్తోంది. నేను ఎప్పటికీ మనిషినే అంటోంది. అలాగే ఆ పరిశుద్ధ జ్ఞానమనేటువంటి స్థితికి వెళ్ళినట్లయితే, వాడు ఏం చెపుతాడంటే, “నాకు జన్మే లేదు. జన్మపరంపరలో పూర్వజన్మలో ఏం చేశాను, పై జన్మలో ఏం చేస్తాను అనే ప్రశ్నే లేదు. అసలు జన్మే లేదు. ఎప్పటినుంచి? సృష్ట్యాదిగా అసలు జన్మే లేదు. ఏ జన్మమూ ఇక వుండబోదు. నాకు ఏ రకమైన నిద్రా వుండదు. అంటే ఏ రకమైన అజ్ఞానస్పర్శా వుండదు. మెలకువా వుండదు. నిద్రా వుండదు” అని చెపుతాడు. ఆ స్థితికి వెళ్ళేందుకు నీవు కృషి చేసినట్లయితే, అప్పుడు నీకు ఈ ప్రశ్నలకు వేటికీ తావు లేకుండా, ఈ స్వప్న ప్రపంచం ఎటువంటిదో, ఈ జాగ్రత్‌ప్రపంచం కూడా అటువంటిదే, అని నీ అంతట నీవు స్వయంగా తెలుసుకో గలుగుతావు.

సరే కానీ, రోజూ వచ్చి పోయే నిద్రే ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో, తెలియదు. పుట్టిన దగ్గర్నుంచి ఒక్క సారి కూడా ఈ అజ్ఞానం నన్ను వదలి పోలేదు.

అటువంటి అజ్ఞానం ఎప్పుడు పోతుందో, ఎక్కడికి పోతుందో, నాకు తెలుసా? ఇది పోతే అది వస్తుంది అని చెబుతున్నారు. కనుక, ఆ అజ్ఞానం పోయేందుకు ఏదన్నా ఉపాయం ఉందా? అని అడిగితే ఇక చెపుతున్నారు–

అది పోయేందుకు ఉపాయం ఉంది. అది పోకుండా వుండటానికి కారణమేమిటి అంటే నీవు కృషి చెయ్యలేదు. ఏం కృషి చేస్తే పోతుందంటే–

**శ్రుత్యాచార్య ప్రసాదేన యోగాభ్యాస వశేన చ ।**
**ఈశ్వరానుగ్రహేణాపి స్వాత్మబోధో యదా భవేత్ ॥**

ఆ పరిశుద్ధ జ్ఞానమనే ఆత్మజ్ఞానం ఎప్పుడు కలుగుతుందయ్యా అంటే, మూడు షరతులు, చెప్పారు. వేదోక్తమైన తత్త్వజ్ఞానాన్ని ప్రసాదించే గురువుయొక్క అనుగ్రహం మొదట రావాలి. ఆ తరువాత "యోగాభ్యాస వశేన చ" ఆ గురువుగారియొక్క అనుగ్రహంచేత సిద్ధించిన జ్ఞానాన్ని నిరంతరమైన నిదిధ్యాస స్వరూపమైన యోగాభ్యాసంచేత స్థిరపరచుకోవాలి. గుర్వనుగ్రహము, యోగానుగ్రహము, ఈ రెండూ అయిన తరువాత ఈశ్వరానుగ్రహం వుండాలి. ఈ మూడు అనుగ్రహాలూ కలిసిన రోజున నీకు ఈ అజ్ఞానమనే నిద్ర తొలగిపోతుంది.

కనుక మెట్లు వరుసగా చెప్పారు. ముందరేం చెయ్యాలి? గురువుయొక్క అనుగ్రహం సంపాయించాలి. ఆ తర్వాత శ్రవణ మననాది రూపమైన సాధన చేయాలి. అని చెప్పగా ఇన్ని మెట్లు లేకుండా సులభోపాయమేదైనా చెప్పరాదా అని అడిగాడు.

గురువుగారు– అవన్నీ ఏమీ కుదరవు బాబూ. నువ్వు ఎన్ని సార్లు మా చుట్టు తిరిగినా, చివరికి మేం చెప్పింది చెయ్యవలసిందే అన్నారు.
సరే కదాని, ఎంతో కొంత సాధన చేసి,– "మీరు చెప్పారు, నేను చేశాను, ఏదీ, రాలేదే?" అంటే, "సాధన చెయ్యడం అంటే ఈశ్వరుడు సంతోషించే వరకు చెయ్యాలి"– అన్నారు.

కనుక, గుర్వనుగ్రహము, యోగాభ్యాసము, ఈశ్వరానుగ్రహము, అనే మూడు మెట్లు నువ్వు సాధించినట్లయితే, అప్పుడు ఈ అజ్ఞానమనే నిద్ర దానంతట అదే తొలగిపోతుంది.

అజ్ఞానం తొలగిపోవడానికి, అజ్ఞానం అజ్ఞానం అని గంతులు వేస్తే లాభం లేదు. కేవలం పొద్దున్నుంచి సాయంత్రం దాకా వేదాంతం పుస్తకాలు రుబ్బేసి, అవి తాగేసినా లాభం లేదు. లేదా వేదాంతం క్యాసెట్లు పొద్దున్నుంచి సాయంత్రం దాకా

పెట్టుకొని విన్నా రాదు. అలాగే మేము గురువుగారి దగ్గరకు వెళ్ళొచ్చేశామంటే వేదాంతం రాదు. విన్నదాన్ని మనం ఆచరణలో పెట్టాలి.

కొందరు శిష్యులు మేము మా గురువును నమ్ముకున్నాము కనుక మేము ఇక ఏమీ చేయక్కరలేదు అని వాదిస్తూ వుంటారు. నమ్మేశాను అనంగానే నిన్ను నమ్మేందుకు ఆయనేమీ తెలివి తక్కువవాడు కాదు. "నీవు నమ్ముకుంటే చాలు, ఇంకేమీ చెయ్యక్కర లేదు" అనే మాట వాస్తవమే. నీవు నిజంగా నమ్ముకున్నట్లయితే, నీకు రాబోయే లాభనష్టాల గురించి నిమిత్తం లేకుండా, చెప్పిన పనులన్నీ చెప్పినట్లు చెయ్యాలి. అలా చేస్తే దాని పేరు ప్రపత్తి. వైష్ణవాచార్యులు బోధించిన ప్రధానమైన మోక్షమార్గమిదే. నువ్వు నిజంగా ప్రపత్తి చేస్తే, అప్పుడు నాకు దుఃఖనివారణ చెయ్యి, నాకు సంపదలు కలిగించు- అని కోరేందుకు నీకు అవకాశం లేదు. ఆయన నీకు దుఃఖాలు ఇవ్వదలచుకొంటే దుఃఖాలు ఇస్తాడు. సుఖాలు ఇవ్వదలచుకొంటే సుఖాలు ఇస్తాడు. అంతా వారి చేతిలో ఉన్నది. కానీ ప్రతివాడూ "నేను నమ్మేశాను, నమ్మేశాను" అని ఎందుకు అంటాడంటే, ఈ చెప్పిన యోగసాధన ఎగ్గొట్టేందుకు వీలుగా వుంటుందని అంటాడు తప్పితే, నిజంగా కష్టాలు, సుఖాలు, సమర్పించేందుకోసం అనడు.

కనుక సంపూర్ణమైన శరణాగతి మార్గంలోకి వెళ్ళినా సరే, గుర్వనుగ్రహం, ఈశ్వరానుగ్రహం, వస్తుంది. లేదా యోగమార్గంలోకి వెళ్ళి చెప్పిన అనుష్ఠానం చేసినా సరే, వస్తుంది. ఈ రెండూ చెయ్యకుండా అది, తప్పించుకునేందుకు ఇది, ఇది తప్పించుకునేందుకు అది, అడ్డం బెట్టుకున్నట్లయితే, వారు చిద్విలాసంగా నవ్వుతూ ఊరుకుంటారు తప్పితే మనతో కుస్తీ పట్టరు. "నువ్వు ఇలాంటి తప్పు పనులు చేస్తున్నావు. అందుచేత నీకు సిద్ధి లభించటం లేదు" అని చెప్పరు. ఎందుకని ఆ మాట అనరంటే, వారి నోటితో "నీకు రాదు" అంటే, నిజంగా రాకుండా పోతుంది. కనుక ఆ అపశబ్దం నోటినుంచి ఉచ్చరించటం ఇష్టం లేక, ఆ మహాత్ములు మనలోని దోషాలను ఎంచి చూపించరు. వారు దోషాల్ని ఎత్తి చూపించ లేదు కనుక, మనకు కనిపిస్తున్నా సరే, అవి దోషాలు కావని మనం అనుకుంటూ వుంటాము.

"నిజంగా దోషమైతే ఆయన చెప్పరా ఏమిటి? నేను చాలా గొప్పవాడ్ణే.– లేకపోతే ఆయన నన్ను ఎందుకు దగ్గరకు రానిస్తారు?" అని మనకు మనమే చెప్పుకొని సంతోషపడుతూ వుంటాము.

ఎప్పటికైనా సరే, ఈ వేదాంత విద్య ఏదైతే మనం గురువుల ద్వారా వింటున్నామో, అప్పుడప్పుడూ మననం చేస్తున్నామో, అది ఫలించాలంటే గురువుయొక్క అనుగ్రహం సంపాదించటం మొట్టమొదటి మెట్టు. అక్కడితో ఆగకుండా, వారు ఏ రకమైన సాధన

విధానం మనకు అప్పచెప్పారో, దాన్ని ఆచరించటం రెండో మెట్టు. ఈశ్వరానుగ్రహం సంప్రాప్తించే దాకా సాధనను కొనసాగించడం అనేది మూడవ మెట్టు. ఈ మూడు మెట్లూ గనుక చేసినట్లయితే, నీకది లభిస్తుంది. అజ్ఞానమనే నిద్ర తొలగి, శుద్ధ జ్ఞానమనబడే లేదా ఆత్మజ్ఞానం అనబడే, నాలుగవ అవస్థలోకి నువ్వు చేరుతావు. అప్పుడు ఈ జాగ్రత్ప్రపంచం నీ అంతట నీకుగా, ఎవరి ఉపదేశాలు లేకుండా, స్వానుభవంతోనే, మిథ్యారూపంగా, అసత్య రూపంగా దర్శనమిస్తుంది. ఈ ప్రపంచంలో కనిపించే పర్వతాలు, నక్షత్రాలు, నదులు, సముద్రాలు, జంతువులు, మానవులు, దేవతలు, అందరూ కూడా నేనే అని నువ్వు చెప్పగలుగుతావు. ఈ మనుషులొక్కరే కాదు, ఈ కనిపించే భూప్రపంచం ఒక్కటే కాదు, మనకు కనిపించని సూక్ష్మలోకంలో ఉండే శివవిష్ణుబ్రహ్మాది దేవతలెవరైతే వున్నారో, అలాగే ఘోరమైన రాక్షసులు ఎవరైతే ఉన్నారో, ఎవరు పాపాత్ములున్నారో, ఎవరు పుణ్యాత్ములున్నారో, వారంతా కూడా నేనే అని నీ అంతట నీవే చెప్పగలుగుతావు.

"ఏమండీ, శివుడు విష్ణువు నేనంటే కొంతనయం. అంతే గానీ రాక్షసుడు నేనే, తేళ్ళు నేనే, పాములు నేనే అంటే ఎలా ఒప్పుకుంటాను? అదీగాక శివుడు, విష్ణువు, విడిగా కనిపిస్తుంటే, వారే నేనని ఎలా అంటాను?" అంటే చెప్పుతున్నారు. గురువుగారు శిష్యుడి చేతికి ఒక యాపిల్ పండిచ్చి ఇదేమిటి అన్నారు. శిష్యుడు అది యాపిల్ పండు అన్నాడు. గురువుగారు సరే దాన్ని తిను అన్నారు. తిన్నాక గురువుగారు ఒక అరటి పండిచ్చి ఇదేమిటి అన్నారు. శిష్యుడు ఇది అరటిపండండీ అన్నాడు, గురువుగారు దాన్ని కూడా తినమన్నారు. శిష్యుడు తిన్నాడు. "ఏమయ్యా! ఇప్పుడు నువ్వు ఏమన్నా మారావా? ఇందాకటి లాగానే వున్నావా"? అన్నాడు గురువు.

"నేనేనండి. ఎదురుగుండానే వున్నాగా! కనిపిస్తూనే వున్నాగా, మార్పేమిటి"? అన్నాడు శిష్యుడు.

"అదేమిటయ్యా! ఇందాకటినుంచి ఆపిల్ అన్నావు, అరటిపండు అన్నావు, అవన్నీ ఎటుపోయినయ్?" అన్నాడు గురువు.

"ఎటు పోయినాయ్? తినేశాగదా" అన్నాడు శిష్యుడు."అయితే నేనున్నాను, ఆపిల్ వున్నాను అరటి పండున్నాను అని చెప్పవేమి?"– అన్నాడు గురువు.

"ఎవడన్నా ఇలా చెబుతున్నాడా? మొత్తం నేనే అంటున్నాడంతే. ఇందాకేమన్నావు? అది వేరు. నేను వేరు అన్నావు. ఇప్పుడు ఏమంటున్నావు? నేనే, నేనే, అంటున్నావు. అది ఏమయిపోయింది ఇప్పుడు? అంటే, నాలో కలసిపోయింది అంటున్నావు. ఎక్కడ కలసిపోయింది? ఇక్కడే నీ కడుపులోనే వుందిగా.

కనుక నీవు ఏది పవిత్రం అనుకొంటున్నావో, ఏది అపవిత్రం అనుకొంటున్నావో, అది కూడా నీలోపల వున్నప్పుడు నువ్వే అయిపోతోంది. దానితో కలుపుకొని మొత్తం నేనే అంటున్నావు. అలాగే ఏది నీకంటే భిన్నమై, చాలా ఆకర్షకంగా, మధురంగా వుంది అనుకొంటున్నావో, అది నీలోకి చేరిపోయినప్పుడు, మొత్తమంతా కలిపి నేనే అంటున్నావు.

అలాగే నువ్వు ఎప్పుడైతే పరిపూర్ణమైన జ్ఞాన స్థితిలోకి వెళ్ళావో, అప్పుడు నువ్వు ఊర్ధ్వలోకాలు, అధో లోకాలు, దేవతలు, మానవులు, రాక్షసులు, అందరూ కూడా నీలో సంపూర్ణంగా ఐక్యమై పోతారు. కనుక, అప్పుడు మొత్తం నేనే" అంటావు. అటువంటి స్థితి వస్తుంది. ఎప్పుడు? ఆ మూడు రకాల మెట్లను మనం సాధించినట్లయితే. ఏవి? గుర్వనుగ్రహము, యోగసాధన, ఈశ్వరానుగ్రహము.

ఈ విషయాన్నే మరో రకంగా చెపుతున్నారు. ఏమంటే-

**యథా స్వప్నే నృపో భూత్వా భుక్త్వా భోగాన్ యథేప్సితాన్ ।**
**చతురంగ బలోపేతః శత్రుం జిత్వా రణాంగణే ॥**

**పశ్చాత్పరాజితో భూత్వా వనం ప్రాప్య తపశ్చరన్ ।**
**ముహూర్తమాత్ర మాత్మానం మన్యతే కల్పజీవినం ॥**

**తథైవ జాగ్రత్కాలేఽపి మనోరాజ్యం కరోత్యసౌ ।**
**కాలనద్యోఘ వేగేన క్షీణమాయుర్న పశ్యతి ॥**

ఇంత వరకు వస్తువుల గురించి ఒక రకంగా చెప్పుకున్నాం. ఇప్పుడు మరో రకమైన పరిశీలన చేద్దాం.

గంగానది అంటే ఏది అని ఒకడడిగాడు. ఈ నీటి చుక్క గంగానదా? ఆ ప్రవాహంలో ఏ నీటి చుక్కా కూడా గంగానది కాదు. మొత్తం ప్రవాహం కలిపితే గంగానది. అట్లాగే కాలం అనే ఒక మహాప్రవాహం వుంది. ఈ కాల మహా ప్రవాహం పంచభూతాలలో దేంట్లోంచీ గూడా పుట్టినట్టుగా మనకు కనిపించడం లేదు. అయితే ఈ కాలం అనేది కూడా సృష్టిలో వుంది కదా? ఇది ఎక్కడి నుంచీ వచ్చింది?- అని మనసులో సందేహం వున్నవారికి "కాలం అనేది వేరే వస్తువు కాదు. పంచభూతాల యొక్క సూక్ష్మాంశంలోనుంచి వచ్చిన వస్తువే" అని చెపితే నమ్మబుద్ధి కాదు.

ఆ మాట అట్లా వదిలి పెట్టండి. ఒకడు స్వప్నంలో తను ఒక మహారాజుగా పుట్టినట్టు, యుద్ధాలు చేసినట్టు, గెలిచినట్టు మళ్ళీ ఏవోయుద్ధాలు చేసినట్టు,

ఓడిపోయినట్టు, ఇలాంటి కథ ఇది వరకో సారి చెప్పుకొన్నాం గదా! ఇదంతా గూడా నిద్రాకాలంలో ఎంతసేపట్లో జరిగింది? మహా అయితే ఒక అరగంటలో చూసేస్తాం. అరగంట స్వప్నంలో చూసి వాడు ఏం చెపుతాడు? నేను 100 సంవత్సరాలు రాజ్యం చేశాను అని చెబుతాడు.

అక్కడా (స్వప్నంలోనూ) కాలాన్ని అనుభవిస్తున్నావు. ఇక్కడా (జాగ్రత్తులోనూ) కాలాన్ని అనుభవిస్తున్నావు. ఇక్కడ ఏ రకంగా కాలాన్ని అనుభవిస్తున్నావో, అక్కడ అదే,రకంగా కాలాన్ని అనుభవిస్తున్నావు. ఈ కాలానికీ ఆ కాలానికీ పొంతన ఏమీ లేదు. జాగ్రత్ కాలంలో దాని పేరు ముప్పై నిమిషాలు అంటున్నావు. స్వప్నకాలంలో దానిపేరు 100 సంవత్సరాలు అంటున్నావు. ఒక్కొక్కసారి జాగ్రత్ కాలంలో చాలా సేపు పడుకొన్న వాడికి స్వప్నకాలంలో కొంచెంలో లేచిపోయినట్టుగా అనుభవం కలుగుతూ వుంటుంది. కనుక పొంతన లేకుండా రెండు కాలాలు కనిపిస్తున్నాయి. పరస్పరం పొంతన లేనివి కనుక, వీటిల్లో ఏ ఒక్కటీ సత్యం కావటానికి వీలు లేదు. కనుక కాలం అనే భావనే అసత్య భావన అయ్యుండాలి తప్పితే, సత్యభావన అయ్యే అవకాశం ఎంత మాత్రమూ లేదు.

ఆ స్వప్నంలో ఒక రాజుగా వుంటాడు, తపస్విగా వుంటాడు, ఒక సామాన్యుడుగా వుంటాడు, ఇవన్నీ కూడా ఆ స్వప్నకాలాన్ని అనుసరించి నడుస్తూ వుంటాయి. ఇదంతా ఎందుకు జరుగుతోందంటే మనస్సు చేసే రాజ్యమిది. స్వప్నమనబడే మనో రాజ్యంలో అక్కడి కొండల్ని, గుట్టల్నీ, సృష్టి జేసినట్టుగానే, అక్కడి కాలాన్ని గూడా అదే సృష్టి జేసింది. ఎవరు? మనస్సే.

అలాగే ఈ జాగ్రత్ ప్రపంచమంతా గూడా మనస్సుయొక్క సృష్టే తప్పితే, మరొకటి కాదని ఇందాక పంచభూతాల విషయంలో ఎలా నిర్ణయం చేశామో, అదే ప్రకారంగా, అదే తర్కాన్ని కాలానికి అన్వయం చేస్తే, ఈ జాగ్రత్ ప్రపంచంలో కనిపించే కాలాన్ని గూడా మనస్సే సృష్టిచేస్తోంది తప్పితే, దానికి ముడిసరుకంటూ వేరే లేదు.

**మేఘచ్ఛన్నోంశుమాలీవ మాయయా మోహితోఽధికమ్ ।**
**కించిత్కర్తా చ కించిజ్ఞో లక్ష్యతే పరమేశ్వరః ॥**

ఇక విషయంలోకి వస్తున్నారు.

ఇంతవరకూ వారు నిరూపణచేసిన విషయమేమంటే, స్వప్న ప్రపంచం ఎటువంటిదో, జాగ్రత్ ప్రపంచం కూడా అటువంటిదే. స్వప్న ప్రపంచం మనస్సుయొక్క

సృష్టి. అలాగే జాగ్రత్ ప్రపంచం కూడా మనస్సుయొక్క సృష్టే– అని నిర్ణయించేశారు. దాంతో పాటు, ఈ జాగ్రత్ ప్రపంచమనే మనస్సృష్టిలోంచి మనం బయటపడాలంటే గుర్వనుగ్రహము, యోగాభ్యాసం, ఈశ్వరానుగ్రహము అనే మూడు మార్గాలను అనుసరించాలి. ఆ మూడు మెట్లు ఎక్కినట్లయితే ఈ అజ్ఞాన నిద్ర పోతుంది– అని కూడా చెప్పారు.

అయితే ఈ జాగ్రత్ ప్రపంచం చాలా విస్తారంగా కనిపిస్తోంది. మీరు చెప్పిన మూడు మెట్లూ కూడా ఈ జాగ్రత్ ప్రపంచంలోనే ఉండి సాధించాలి కనుక, జాగ్రత్ ప్రపంచం యొక్క సృష్టి ఎలా జరిగింది? అనే దాని విషయం ప్రస్తావన చేస్తున్నారు.

సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తూ వుంటే, కొంచెం మబ్బులు అడ్డం పడితే, ఈ సూర్యుడే ఓ చిన్న అద్దం బిళ్ళ లాగా కనిపిస్తాడు. ఆ మేఘాలు తొలగిపోగానే, ఆ సూర్యుడే చండప్రచండంగా ప్రకాశిస్తూ వుంటాడు. "ఇందాక చూశాను. ఆకాశంలో అద్దపు పెంకు ఒకటి కనిపించింది. లేచి చూసే సరికి అద్దం పెంకు పోయింది. అక్కడ అగ్నిగోళం ఒకటి ప్రకాశిస్తోంది. ఇదేమిటయ్యా? అంటే–

ఏమీ లేదయ్యా! వస్తువేం మారలేదు. ఇందాక గూడా అక్కడ అగ్నిగోళం ప్రకాశిస్తూనే వుంది. ఇప్పుడూ అగ్నిగోళం ప్రకాశిస్తూనే వుంది. ఇందాక నీకు మేఘాలు అనే ఆవరణ అడ్డుపడడంచేత అది అద్దం పెంకు లాగా కనిపించింది. పూర్తిగా ఆవరణ అయిపోతే ఏమీ కనిపించకుండా పోయేది. అలా గాక అది కొంచెం ఆవరణ అయింది. ఆ మబ్బుతునక కొంచెం పారదర్శకంగా వుండేసరికి, ఆ అగ్నిగోళం గాజు ముక్క లాగా కనిపించింది. అలాగే, అజ్ఞానం గనుక స్వల్పంగా ఆవరించి నట్లయితే అప్పుడు నేను ఈశ్వరుడ్ణి, జగత్సృష్టి కర్తను, అనే భావనలో నీవు వుంటావు. నువ్వే సమస్త ప్రంచాన్ని పరిపాలిస్తున్నావు. నువ్వే ఈ సమస్త ప్రపంచాన్ని లయంగూడా చేస్తున్నావు. నువ్వే భూమిగా కూడా వుంటున్నావు. ఏ దశలో ఇట్లా వుంటున్నావంటే, ఏ దశలో మబ్బులు పట్టినట్టుగా కొంత మాత్రమే ఆవరణ జరిగిందో, ఆ దశలో నువ్వు ఇలా వుంటున్నావు. ఏ దశలో అయితే మబ్బులు కాకుండా ఏకంగా మధ్యలో కొండలే అడ్డం వచ్చినట్లుగా పరిస్థితి ఉందో, ఆ దశలో నువ్వు సామాన్యజీవుడిగా ఉంటున్నావు.

నువ్వు చేయవలసిందల్లా ఏమిటయ్యా అంటే, కొండలు అడ్డం వచ్చినప్పుడు కొండలు తొలగించుకోవాలి, మబ్బులు అడ్డం వచ్చినప్పుడు మబ్బులు తొలగించుకోవాలి.

అంతే తప్పితే, నీయొక్క వస్తుస్థితిలో మార్పేమీ లేదు. కనుక నీవు ఈ మూడు సాధనాసోపానాలు ఆచరించినట్లయితే, కొండ అడ్డమున్న పరిస్థితి పోతుంది. అది పోగా మబ్బులు అడ్డముండే స్థితి వస్తుంది. ఆ మబ్బులు అడ్డముండే స్థితిలో మళ్ళీ సాధన చేసినట్లయితే, అవీ తొలగిపోతాయి. అప్పుడు నీయొక్క పరిశుద్ధమయిన స్వస్వరూపం నీకు దర్శనమిస్తుంది.

**శ్లో॥ యద్యత్ కరోతి జానాతి**
**తస్మిన్ తస్మిన్ పరేశ్వరః ।**
**రాజా విద్వాన్ స్వసామర్థ్యాత్**
**ఈశ్వరోయమితీర్యతే ॥**

మబ్బులు కమ్మినప్పుడు ఉన్న పరిస్థితి పేరు ఈశ్వరుడనీ, కొండలు కమ్మినప్పుడు ఉన్న పరిస్థితి పేరు జీవుడని చెప్పుకొన్నాం. అలా అయితే జీవుడికీ, ఈశ్వరుడికీ ఏమిటయ్యా తేడా అంటే, వస్తువులో ఏమీ లేదు, వాళ్లు ఆచరించే విధానాలల్లో తేడా ఉంది. ఈశ్వరుడూ పనులు చేస్తాడు. జీవుడూ పనులు చేస్తాడు. అపారమైన శక్తితో, తెలివితో, జ్ఞానంతో, ఎవడైతే స్వతంత్రంగా పనిచేస్తున్నాడో, వాడి పేరు ఈశ్వరుడు అంటారు. అంత అపారం కాకుండా స్వల్పంగా ఉండి, ఇతరుల మీద ఆధారపడుతూ, పరిమితమైన పనిచేస్తుంటే, వాడి పేరు జీవుడంటారు.

లోకంలో కూడా స్థితి ఇట్లాగే ఉంది. ఒక పెద్ద మహారాజుగారు యుద్ధానికి వెళ్ళాడు. కత్తి పుచ్చుకొని యుద్ధం చేస్తున్నాడు. ఆయన పక్కన భటులు కూడా యుద్ధం చేస్తున్నారు. యుద్ధం అంటే ఏమిటి? యుద్ధమంటే కత్తి తిప్పటం, తలలు నరకటం, ఇంతే కదా! రాజుగారూ ఇదే చేస్తున్నాడు. బంటుగారు ఇదే చేస్తున్నాడు మరి ఒకరిని రాజనడం దేనికి? మరొకరిని బంటనడం దేనికి? వీడూ అదే చేస్తున్నాడు కదా. వాడూ అదే చేస్తున్నాడు కదా– ఇద్దరూ అదే చేస్తున్నారు గాని, ఈ రాజుగారు కావాలనుకుంటే, తెల్లజెండా ఊపేసి "ఆపేసెయ్యండి, ఆపేసెయ్యండి" అనగలడు. ఈ బంటుగారు తెల్లజెండా ఎత్తేస్తే, వెనకాలనుంచి వీళ్ళవాడే ఇంకొకడొచ్చి తలకాయ నరికేస్తాడు. కనక రాజుగారికి స్వాతంత్ర్యం వుంది, బంటుగారికి స్వాతంత్ర్యం లేదు. ఇద్దరూ ఒకే పని చేస్తున్నా, స్వాతంత్ర్యంతో పనిచేసేవాడు రాజు. అస్వతంత్రుడై పరాధీనుడై, పనిచేసేవాడు బంటు.

అలాగే ఈశ్వరుడనేవాడు నీకుమల్లేనే ఏవో కొన్ని కార్యక్రమాలు చేస్తున్నాడు. నువ్వూ అటువంటి కార్యక్రమాలు చేస్తున్నావు. ఈశ్వరుడు భూమిని, నీళ్ళని, ఇటువంటివాటినన్నింటినీ సృష్టి చేస్తున్నాడు. నువ్వు చెమట, కన్నీళ్ళు ఇటువంటివి

సృష్టి చేస్తున్నావు. కానీ, ఈశ్వరుడు కావాలంటే, ఆ సృష్టి ఆపేయగలడు. నువ్వు నీ సృష్టి ఆపలేవు. అంటే ఆయన స్వతంత్రంగా చేయగలడు, పరిమితి లేకుండా అపారమైన పరిధిలో చేయగలడు. నువ్వు పరిమితంగానే చేస్తావు. దాన్ని మించి నువ్వు పరతంత్రుడవై, పరాధీనుడవై చేస్తావు. అదే మీ ఇద్దరిలో ఉన్న భేదం.

ఈ రకమైన భేదం దేనివల్ల వస్తుందంటే, అజ్ఞానంయొక్క సాంద్రతలో భేదం వల్ల! దట్టమైన అజ్ఞానం పట్టుకుంటే, వాడు స్వతంత్రత్వం కోల్పోయి కేవలం పరాధీనుడై ప్రవర్తిస్తాడు. అజ్ఞానం అంత తీవ్రం కాకుండా పల్చ పల్చగా ఉండేవాడు, క్రియా ప్రసక్తుడవుతాడు కానీ స్వతంత్రుడై జ్ఞానవంతుడై, క్రియా ప్రసక్తుడవుతాడు. అదీ ఇద్దరికీ భేదం. కనుక ఆ తారతమ్యం తప్పితే మీ ఇద్దరిలో వస్తుభేదం లేదు.

**జ్ఞానక్రియే శివేనైక్యాత్ సంక్రాంతే సర్వజంతుషు ।**
**ఈశ్వరత్వం చ జీవానాం సిద్ధం తచ్ఛక్తి సంగమాత్ ॥**

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ఈశ్వరుడు, జీవుడు, అనే వీరిలో జీవుడు పరిమిత శక్తిమంతుడు ఈశ్వరుడు అపారశక్తిమంతుడు కదా! జీవుడి దగ్గర ఉండినటువంటి స్వల్పమైన శక్తి వీడికి ఎక్కడి నుంచి వచ్చింది? – అని దానికి సమాధానంగా, జీవుడనేవాడు ఈశ్వరుడియొక్క అంశ గనుక, ఈశ్వరుడిలో గల శక్తిలో లేశభాగం జీవుడికి సంక్రమించిందంటున్నారు. అలాగే ఈశ్వరుడిలో గల జ్ఞానలేశం జీవుడికి సంక్రమించి, వీడిలో గూడా కొంత తెలివి కనిపిస్తోంది. ఈ జ్ఞానక్రియలు అంశమాత్రంగా సర్వజీవులలోనూ సంక్రమించి వుండబట్టి, ఈ జ్ఞానమనే గుర్తు ద్వారా జీవేశ్వరులు ఒకటేనని మనం గుర్తించవచ్చు–

కనుకనే–

**ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేదాద్విభాగినే।**
**వ్యోమవద్ వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః ॥**

ఈశ్వరుడు– గురువు– జీవాత్మ అనేవి మూడు రూపాలే తప్ప మూడు పదార్థాలు కావు. అసలైన పదార్థానికి విభాగాలు లేవు. అది ఆకాశం వలె అఖండవ్యాపకమైనది. అదే దక్షిణామూర్తి. ఆయనకు నమస్కారము.

**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం**

అని దక్షిణామూర్తి స్తోత్రంలోని మొదటిశ్లోకం యొక్క సారాన్ని శ్రీ సురేశ్వరాచార్యులవారి వార్తిక క్రమంలో సంగ్రహంగా మనం చెప్పుకోగలిగాము.

# శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమ్

## (శ్రీ మచ్ఛంకరాచార్య విరచితమ్)

విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా ।
యస్సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మానమేవాఽద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥1॥

బీజస్యాఽంతరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునర్
మాయాకల్పిత దేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతమ్ ।
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యస్స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥2॥

యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థకం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్ ।
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవాంభోనిధౌ
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥ 3 ॥

నానాఛిద్రఘటోదరస్థిత మహాదీప ప్రభా భాస్వరం
జ్ఞానం యస్య తు చక్షురాదికరణద్వారా బహిస్స్పందతే ।
జానామీతి తమేవ భాంతమనుభాత్యేతత్సమస్తం జగత్
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥4॥

దేహం ప్రాణమపీంద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యం విదుః
స్త్రీ బాలాంధ జడోపమాస్త్వహమితి భ్రాంతా భృశం వాదినః ।
మాయాశక్తి విలాస కల్పిత మహావ్యామోహ సంహారిణే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥5॥

రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయాసమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోపసంహరణతో యోఽభూత్సుషుప్తః పుమాన్ ।
ప్రాగస్వాప్సమితి ప్రబోధ సమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥6॥

బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వనువర్తమాన మహమిత్యం తస్ఫురంతం సదా ।
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో ముద్రయా భద్రయా
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥7॥

విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబంధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః ।
స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయాపరిభ్రామితః
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥8॥

భూరంభాంస్యనలోఽనిలోఽంబర మహర్నాథో హిమాంశుః పుమా
నిత్యాభాతి చరాచరాత్మకమిదం యస్యైవ మూర్త్యష్టకమ్ ।
నాన్యత్కించ న విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభోః
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥ ॥9॥

సర్వాత్మత్వమితి స్ఫుటీకృతమిదం యస్మాదముష్మిన్ స్తవే
తేనాఽస్య శ్రవణాత్తదర్థమననా ద్ధ్యానాచ్చ సంకీర్తనాత్ ।
సర్వాత్మత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వతః
సిద్ధ్యేత్తత్పునరష్టధా పరిణతం చైశ్వర్య మవ్యాహతమ్ ॥ ॥10॥

# అధికశ్లోకాః

వట విటపి సమీపే భూమిభాగే నిషణ్ణం
సకల మునిజనానాం జ్ఞాన దాతార మారాత్ ।
త్రిభువన గురు మీశం దక్షిణామూర్తి దేవం
జననమరణ దుఃఖచ్ఛే దదక్షం నమామి ॥ ॥11॥

చిత్రం వట తరోర్మూలే, వృద్ధాశ్శిష్యా గురుర్యువా ।
గురోస్తు మౌనం వ్యాఖ్యానం, శిష్యాస్తు చ్ఛిన్న సంశయాః ॥ ॥12॥

ఓం నమః ప్రణవార్థాయ, శుద్ధజ్ఞానైక మూర్తయే ।
నిర్మలాయ ప్రశాంతాయ, దక్షిణామూర్తయే నమః ॥ ॥13॥

గురవే సర్వలోకానాం, భిషజే భవరోగిణామ్ ।
నిధయే సర్వవిద్యానాం, దక్షిణామూర్తయే నమః ॥ ॥14॥

మౌనవ్యాఖ్యాప్రకటిత, పరబ్రహ్మతత్త్వం యువానం
వర్షిష్ఠాంతే వసదృషిగణైరావృతం బ్రహ్మనిష్ఠైః ।
ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్ర మానందమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే ॥ ॥15॥

ఇతి శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య వర్య
శ్రీమచ్ఛంకరాచార్య విరచితం శ్రీదక్షిణామూర్తి స్తోత్రమ్ ॥

# తోటకాష్టకమ్

**(శ్రీతోటకాచార్య కృతమ్)**

విదితాఖిలశాస్త్రసుధాజలధే మహితోపనిషత్ కథితార్థనిధే
హృదయే కలయే విమలం చరణం భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥1॥

కరుణావరుణాలయ పాలయ మాం భవసాగరదుఃఖవిదూనహృదమ్।
రచయాఖిలదర్శనతత్త్వవిదం భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥2॥

భవతా జనతా సుహితా భవితా నిజబోధవిచారణ చారుమతే ।
కలయేశ్వరజీవవివేకవిదం భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥3॥

భవ ఏవ భవానితి మే నితరాం సమజాయత చేతసి కౌతుకితా ।
మమ వారయ మోహమహాజలధిం భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥4॥

సుకృతేఽధికృతే బహుధా భవతో భవితా సమదర్శన లాలసతా ।
అతిదీనమిమం పరిపాలయ మాం భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥5॥

జగతీమవితుం కలితాకృతయో విచరంతి మహామహసశ్ఛలతః ।
అహిమాంశురివాత్ర విభాసి గురో భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥6॥

గురుపుంగవ పుంగవకేతన తే సమతామయతాం న హి కోఽపి సుధీః ।
శరణాగతవత్సల తత్త్వనిధే భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥7॥

విదితా న మయా విశదైకకలా న చ కించన కాంచనమస్తి గురో ।
ద్రుతమేవ విధేహి కృపాం సహజాం భవ శంకర దేశిక మే శరణమ్ ॥ ॥8॥